అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
బుధవారం 29-05-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 సంచిక : 149 Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar 16 పేజీలు వెల : 6.50

ఫోన్ ట్యాపింగ్ పై పోలీసులకు పూర్తి స్వేచ్ఛ

ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఈ అంశంపై రివ్యూ చేయలేదు

- బీఆర్ఎస్ ఎందుకు సీబీఐ దర్యాప్తునకు డిమాండ్ చేయట్లేదు?
- కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై నిపుణుల సూచనలతోనే ముందుకెళ్తాం
- తెలంగాణ పోరాటాలు, త్యాగాల గుర్తులతో రాష్ట్ర చిహ్నం, గీతం : ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఫోన్ ట్యాపింగ్ కేసులో పోలీసులకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చినట్టు రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తెలిపారు. మంచి ఆఫీసర్లుగా పేర్లున్న అధికారులు ఈ కేసు విచారిస్తున్నారని, ఇందులో తన ప్రమేయం అవసరం లేదని అభిప్రాయపడ్డారు. అయితే, ప్రస్తుతం ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఈ కేసు విషయంపై సీఎం హెూదాలో ఎలాంటి సమీక్షా సమావేశం నిర్వహించలేదన్నారు. ఒకవేళ ఫోన్ ట్యాపింగ్ విచారణ ...6లో

పొదుపు సొమ్ముతో జూదం



తమ అవసరాల కోసం భారత రిజర్వ్‌బ్యాంక్ (ఆర్బీఐ) నుంచి మోడీ ప్రభుత్వం డివిడెండ్ల రూపంలో వేలకోట్లు తరలించుకుపోతోంది. దీనికితోడు జనం దాచుకున్న పొదుపు పైసలతో జూదమాడుతోంది. స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధిరేటుకు సంబంధించిన సూక్ష్మ సమాచారాన్ని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఈ నెలాఖరుకు విడుదల చేయబోతోంది. జీడీపీ వృద్ధిరేటు 7.5-8 శాతం మధ్య ఉండవచ్చునని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. భారత ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం మూడు ప్రమాద ఘంటికలు మోగిస్తోంది.

స్టాక్ మార్కెట్‌లో పేదల పైసలు

- జల్సాల కోసం మితిమీరిన ఖర్చులు...తప్పని అప్పుల తిప్పలు
- లోన్ యాప్‌లు, వడ్డీ వ్యాపారుల వలలో ప్రజలు
- పడిపోతున్న ప్రయివేటు పెట్టుబడులు, ఎఫ్‌డీఐలు

న్యూఢిల్లీ : వ్యక్తిగత ఆదాయ స్థాయి, ప్రయివేటు పెట్టుబడులపై ఇప్పటికే ఆందోళన వ్యక్తమవుతుండగా ఇప్పుడది విదేశీ కంపెనీలు, వాటి పెట్టుబడి నిర్ణయాలకు కూడా వ్యాపించింది. వీటన్నింటినీ పరిశీలిస్తే పరిస్థితి ఆశాజనకంగా ఉన్నట్టు కన్పించడం లేదు. మోడీ ప్రభుత్వం సూక్ష్మ స్థాయిలో విడుదల చేసే సమాచారం తప్పుదోవ పట్టించే అవకాశం ఉంది. 2022 జనవరి-మార్చి త్రైమాసిక కాలం నుండి దేశంలో నిరుద్యోగం తగ్గుముఖం పట్టిందని ప్రభుత్వ పీరియాడిక్ లేబర్‌ఫోర్స్ సర్వే (పీఎల్ఎఫ్ఎస్) చెబుతోంది. అనేక మందికి ఉద్యోగాలు లభించాయని, వారంతా ఆదాయం పొందుతున్నారని దీని అర్థం. కానీ వాస్తవాలు అలా లేవు.

భారత ఆర్థిక వ్యవస్థలో ప్రమాద ఘంటికలు

జనం డబ్బుతో చెలగాటం

ఆర్థిక మంత్రిత్వ శాఖ అందించిన వివరాల ప్రకారం 2020-21లో భారతీయ కుటుంబాలు రూ.22.8 లక్షల కోట్ల మేర నికర ఆస్తులను సమకూర్చగా 2021-22లో సుమారు రూ.17 లక్షల కోట్లు, 2022-23లో రూ.13.8 లక్షల కోట్లు సమకూర్చాయి. అంటే ప్రజల్లో పొదుపు తగ్గిపోతోందని దీని అర్థం. పేద, మధ్య తరగతి ప్రజలు తాము కూడబెట్టుకున్న కొద్దిపాటి సొమ్మును సైతం స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి పెడుతున్న ధోరణి బాగా పెరిగిపోతోంది. పేదలు తమ పొదుపు సొమ్ముతో బెట్టింగ్, గ్యాంబ్లింగ్ చేస్తున్నారని దీనిని బట్టి అవగతమవుతోంది. పొదుపు సొమ్ము భద్రంగా ఉండాలని భావించే వారు దానిని బ్యాంకుల్లో దాచుకుంటారు. వడ్డీరేటు ఎక్కువగా ఉన్నప్పుడు బ్యాంకుల్లో డిపాజిట్లు ...15లో

మనుగడ కోసం అప్పులు

సురక్షితం కాని రుణాలపై కొరడా ఝుళిపించేందుకు రిజర్వ్‌బ్యాంక్ అనేక ఆంక్షలు విధిస్తోంది. హెచ్చరికలు జారీ చేస్తోంది. అయినప్పటికీ ఆ తరహా రుణాలు పెరుగుతూనే ఉన్నాయి. పోనీ నివాస గృహాలు, కార్లు, గృహోపకరణాలు కొనుగోలు చేసేందుకు ఈ రుణాలు తీసుకుంటున్నారా అంటే అదీ కాదు. విద్యాభ్యాసం కోసం తీసుకుంటున్న రుణాలు కూడా కావు. అవి... క్రెడిట్ కార్డులు ఉన్నాయి కదా అనే భరోసాతో విచ్చలవిడిగా చేస్తున్న ఖర్చులు. ఆదాయానికి మించి ఖర్చులు పెరిగిపోవడంతో దిక్కుతోచక తీసుకుంటున్న రుణాలు. వీటిని ఆర్‌బీఐ 'ఇతర వ్యక్తిగత రుణాలు'గా వర్గీకరించింది. వాస్తవానికి అవి మనుగడ కోసం తీసుకున్న అప్పులు.



ఇవన్నీ బ్యాంకులు, బ్యాంకింగ్ యేతర ఆర్థిక కంపెనీల నుంచి తీసుకున్న రుణాలు. రుణ యాప్‌ల ద్వారా, నియంత్రణ లేని వడ్డీ వ్యాపారుల నుండి కూడా రుణాలు తీసుకుంటున్నారు. ఈ తరహా రుణాలు తీసుకుంటే కొద్దిపాటి అప్పుకే అధిక వడ్డీ వసూలు చెల్లించాల్సి ఉంటుంది. ఇలాంటి రుణాలు ఆర్థిక వ్యవస్థకు ప్రమాదం కలిగిస్తాయని ఆర్‌బీఐ హెచ్చరిస్తోంది.

సాక్షులను బెదిరించారు... ఆధారాలూ చెరిపేశారు

లిక్కర్ స్కాం కేసులో కవితకు బెయిలివ్వొద్దు

- ఢిల్లీ హైకోర్టు ముందు దర్యాప్తు సంస్థల వాదనలు..తీర్పు రిజర్వ్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ లిక్కర్ స్కాం వ్యవహారంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత సాక్షులను బెదిరించారని, కీలక ఆధారాలను చెరిపేశారని ఢిల్లీ హైకోర్టు ముందు దర్యాప్తు సంస్థలు సీబీఐ, ఈడీలు తమ వాదనలు వినిపించాయి. అలాగే ఆమె ఈ కేసులో ప్రధాన లబ్ధిదారులుగా ఉన్నారని, పలువురితో కలిసి ఈ స్కాం చేశారని ఆరోపించాయి. ఆమెకు బెయిల్ ఇస్తే సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని, ఆధారాలను ధ్వంసం చేస్తుందని ఆరోపించాయి. అందువల్ల సెక్షన్ 439 ప్రకారం కవితకు బెయిల్ మంజూరు చేయకూడదని విజ్ఞప్తి చేశాయి. లిక్కర్ స్కాంలో ఈడీ, సీబీఐ కేసుల్లో బెయిల్


(ఫైల్)

మంజూరు, అలాగే కవిత అరెస్ట్‌కు ట్రయల్ కోర్టు సీబీఐకి అనుమతి, కస్టడీ ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ కవిత ఢిల్లీ హైకోర్టులో వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై సోమవారం ...15లో



విపక్షాలొస్తే రిజర్వేషన్లకు కోతే

- చొరబాట్లతో గిరిజన జనాభా తగ్గుతోంది : మోడీ

దుంకా (జార్ఖండ్) : నేను జీవించినంత వరకూ గిరిజనులు, దళితులు, బీసీలు, అత్యంత వెనుకబడిన వర్గాల వారి రిజర్వేషన్లను ఎవరూ తొలగించలేరని ప్రధాని మోడీ స్పష్టం ...15లో

రిజర్వేషన్లపై 50శాతం పరిమితి ఎత్తేస్తాం

- అదానీ, అంబానీల కోసమే మోడీని దేవుడు పంపాడా? : యూపీ ఎన్నికల సభలో రాహుల్ హామీ వివరాలు 3లో



కుల దురహంకార హత్య

మెదక్‌జిల్లా బడంపేటలో ఘటన

- అగ్రకుల అమ్మాయిని ప్రేమించి పెండ్లి చేసుకున్న రాకేష్
- తండ్రి నర్సింహపై పలువురి మూకుమ్మడి దాడి
- మెదడు చిట్లడంతో పరిస్థితి విషమించి మృతి
- దళితుని హత్య కేసు విచారణలో పోలీసుల అలసత్వం
- సాక్ష్యం లేదంటూ ఎస్ఐ నిర్లక్ష్యం.. పరారీలో పలువురు నిందితులు
- పెండ్లి చేసుకున్నందుకు రాకేష్‌ను జైల్లో పెట్టిన వైనం
- బేగరి నర్సింహ హత్యపై సమగ్ర విచారణ జరపాలి: కేవీపీఎస్


(ఫైల్)

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ఎన్ని చట్టాలు వచ్చినా.. దళితుల పట్ల అగ్రకుల ఆధిపత్య దురహంకారపు ఆగడాలు ఆగడం లేదు. ఎక్కడో ఒక చోట ఏదో ఒక సంఘటన జరుగుతూనే ఉంది. అగ్రకుల అమ్మాయిని దళిత యువకుడు ప్రేమించి పెండ్లి చేసుకోవడం నేరమైంది. అంతేకాదు, ఊర్లో అంబేద్కర్ విగ్రహం పెట్టడం, బుద్ధుడి పేర స్తూపం కట్టడాన్ని జీర్ణించుకోలేని అగ్రకుల పెత్తందార్లు అదును చూసి మాటు వేసి ప్రాణం తీశారు. సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని బడంపేటలో యువకుని తండ్రి బేగరి నర్సింహను దారుణంగా కొట్టి చంపారు. ఆ దాడికి పాల్పడిన అగ్రకులస్తులను పోలీసులు కాపాడుతూ కేసును నీరుగార్చుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కుటుంబసభ్యులు, గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం బడంపేట గ్రామంలో వంద దళిత కుటుంబాలున్నాయి. ఊర్లో బలిజ, రెడ్డి, గొల్ల, తెనుగ, ముదిరాజ్ కులాలతో పాటు సేవా కులాలైన చాకలి, మంగలి వాళ్లు సైతం ఉన్నారు. మూడు నాలుగు గ్రామాలకు కూడలిగా ఉన్న బడంపేటలో దళితులు విద్యావంతులై చైతన్యమవుతున్నారు. ఊరి సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహంతో పాటు బుద్ధుని స్తూపం కోసం గద్దెను ఏర్పాటు చేశారు. దళితులు పెట్టిన అంబేద్కర్ విగ్రహం ఊరి సెంటర్‌లో ఉండటాన్ని ఓర్వలేని పెత్తందార్లు ఆ విగ్రహం కనిపించకుండా భారీ శివాజీ విగ్రహాన్ని పెట్టారు. దీన్ని దళితులు ప్రశ్నించడంతో ఊర్లో దళితులు, అగ్రకుల పెత్తందార్ల మధ్య గొడవలయ్యాయి. ఆ తర్వాత ...6లో

ఆర్టీఏలో ఏసీబీ తనిఖీలు

రాష్ట్ర వ్యాప్తంగా ఏకకాలంలో దాడులు

- అధికారులు, సిబ్బంది, ఏజెంట్లను విచారిస్తున్న ఏసీబీ
- దస్తావేజులు, నగదు స్వాధీనం
- ఫిర్యాదుల నేపథ్యంలోనే సోదాలు

నవతెలంగాణ-సిటీబ్యూరో/మొఫసిల్ యంత్రాంగం

రవాణాశాఖలో అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) తనిఖీలు కలకలం రేపాయి. మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా ఏకకాలంలో దాడులు జరిగాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత దాదాపు పదేండ్ల కాలంలో ఇప్పటివరకు ఈ స్థాయిలో ఏసీబీ దాడులు జరగలేదు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఒకేసారి 22చోట్ల దాడులు జరగడం చర్చనీయాంశంగా మారింది. పలుచోట్ల దస్తావేజులు, నగదు స్వాధీనం చేసుకున్నారు. ఆర్టీఏ అధికారులు, సిబ్బంది, ఏజెంట్లను ఏసీబీ అధికారులు విచారిస్తున్నారు. రవాణా శాఖలో పైసలు ఇవ్వకుండా పనులు జరగడం లేదని పెద్దఎత్తున ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో ఈ దాడులు చేసినట్టు అధికారులు వెల్లడించారు.

గ్రేటర్ హైదరాబాద్‌లోని మొత్తం 11 కార్యాలయాలకుగాను.. మలక్‌పేట్, బండ్లగూడ, మెహిదీపట్నం, అత్తాపూర్, కూకట్‌పల్లి ఆఫీసుల్లో ఏసీబీ దాడులు జరిగాయి. ఈ దాడుల సందర్భంగా పలు ఆర్టీఏ ఆఫీసుల్లో ఏజెంట్ల చేతుల్లో పలు ఫైల్స్ ఉండటాన్ని అధికారులు చూశారు.



ఏజెంట్ల ద్వారా వచ్చే ఫైల్స్ మాత్రమే క్షణాల్లో పూర్తి..

ఆర్టీఏ ఆఫీసుల్లో ప్రతిరోజూ వివిధ రకాల సేవల కోసం వచ్చే ప్రజలు, వాహనదారులకు మెరుగైన సేవలు అందించడం కోసం రవాణాశాఖ ఆన్‌లైన్ సేవలకు శ్రీకారం చుట్టింది. గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలో మొత్తం 11 ఆర్టీఏ కార్యాలయాలున్నాయి. ఆయా ఆఫీసుల్లో లెర్నింగ్ లైసెన్స్ ...6లో


చిన్నారుల బూచోళ్లు..

- 16మంది చిన్నారులను రక్షించిన మేడిపల్లి పోలీసులు
- కూపీ లాగితే కదిలిన డొంక
- పిల్లలను విక్రయిస్తున్న అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్
- ఢిల్లీ, పూణే, ముంబయి నగరాల నుంచి అక్రమ రవాణా
- తెలుగు రాష్ట్రాల్లో విక్రయాలు
- మూడేండ్లలో 50 మందికిపైగా విక్రయించినట్టు గుర్తింపు వివరాలు 15లో



క్వారీ కూలి 17మంది మృతి

- మరో ఆరుగురు శిథిలాల కిందే
- మిజోరం వ్యాప్తంగా భారీ వర్షాలు, పలుచోట్ల విరిగిపడిన కొండచరియలు



ఐజ్వాల్ : మిజోరాంలోని ఐజ్వాల్ జిల్లాలో మంగళవారం ఉదయం క్వారీ కూలిపోవడంతో 17మంది మరణించగా, పలువురు గాయపడ్డారు. మరో ఆరుగురు ఇంకా శిథిలాల కింద చిక్కుకుపోయి వున్నారని డీజీపీ అనీల్ శుక్లా తెలిపారు. రెమాల్ తుపాను కారణంగా రాష్ట్రంలో కుండపోత ...15లో

విపక్షాలపై నిఘా పెట్టాం.. డబ్బులు సీజ్ చేశాం

- 300 వరకు ఫోన్లు ట్యాపింగ్ చేశాం
- ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే : వాంగ్మూల పత్రంలో అదనపు ఎస్పీ తిరుపతన్న

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి



రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్‌ట్యాపింగ్ కేసులో పలు ఆసక్తికరమైన నిజాలను పట్టుబడ్డ అధికారులు తమ వాంగ్మూల పత్రంలో వెల్లడించారు. ఇందులో అదనపు ఎస్పీ తిరుపతన్న దర్యాప్తు జరిపిన పంజాగుట్ట స్పెషల్ టీం అధికారులకు ఇచ్చిన వాంగ్మూలంలో తన తరఫున 300 వరకు ఫోన్లను ట్యాపింగ్ చేసినట్టు అంగీకరించాడు. ఇందులో విపక్షాలకు చెందిన నాయకులు, ముఖ్యకార్యకర్తలు, జర్నలిస్టులు, వ్యాపారులు మొదలైనవారున్నారని ఆయన తెలిపారు. ప్రధానంగా బుజంగరావు, డీఎస్పీ ప్రణీత్‌రావుతో పాటు మరో ప్రయివేటు వ్యక్తి ఇచ్చిన సమాచారంతో ఫోన్లను ట్యాపింగ్ చేసేవారమనీ, దాని ఆధారంగానే వారికి సంబంధించిన డబ్బులను సీజ్ చేసేవారమని తెలిపారు. ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు, 20 మందికి పైగా కానిస్టేబుళ్లతో ...6లో

జేబుల్లోంచి పెట్టలేక..జీతాలు రాక..

ఇబ్బందుల్లో పంచాయతీ కార్యదర్శులు, జీపీ కార్మికులు

- ప్రత్యేక పాలనలో జీపీల్లో నిధుల కొరత
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సహాయం అంతంతే
- సొంత ఆదాయాలు సరిపోక ఇబ్బందులు

పరిపాలన కోసం చేతుల్లోంచి సొంత డబ్బులు పెట్టలేక గ్రామపంచాయతీ కార్యదర్శులు...నెలల తరబడి పని చేసుకుంటు పోతున్నా వేతనాలు అందక పారిశుధ్యకార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకటి కాదు..రెండు కాదు..మూడు నెలలుగా ఇదే తంతు. గ్రామపంచాయతీల్లో నిధుల లేమే దీనికి ప్రధాన కారణం. ప్రత్యేక పాలనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి జీపీలకు అందుతున్న సహాయం కూడా అంతంతే. అటు పై నుంచి సహాయం అందక..ఇటు పంచాయతీకి వచ్చే సొంత ఆదాయాలు పెద్దగా లేక ఊర్లల్లో పాలన పడకేసే పరిస్థితి వచ్చింది.


(ఫైల్)

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన ఓ కార్యదర్శి (పేరు రాయొద్దు అన్న సూచన మేరకు) తన గ్రామంలో పనులు చేయడానికి ఇప్పటిదాకా రూ.50 వేలకు పైనే ఖర్చుపెట్టారు. ఇప్పటి వరకూ ఆ బిల్లులు క్లియర్ కాలేదు. 'అన్నా మాది చిన్న పంచాయతీ. ఇంటిపన్ను, ఇతర సోర్స్ ద్వారా వచ్చే ఆదాయం అంతంతే. మా కొచ్చే జీతం అంతంతే. దాంట్లో సగం ఊరి కోసమే వెచ్చించాల్సి వస్తున్నది. ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్తే మీ డబ్బులు మీకొస్తాయి కదా? పెట్టడానికి ఏమవుతున్నది? పెట్టండి. అన్ని బిల్లులు మెల్లమెల్లగా వస్తాయి అంటున్నారు. అవి వచ్చేదెన్నడో.సచ్చేదెన్నడో? ఇప్పుడైతే మేం ఇబ్బందులు పడుతున్నాం అన్నా' అంటూ సదరు కార్యదర్శి తన గోడును వెళ్లబోసుకున్నారు. నల్లగొండ జిల్లాలో 2500 ఓటింగ్ గల ఓ పంచాయతీ కార్యదర్శిని పలుకరిస్తే ఇదే వరుస. 'రెండు, మూడు నెలల నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నా. స్టేట్ ఫైనాన్స్ నిధులు కూడా సరిగా రావడం లేదు. 15వ ఆర్థిక సంఘం నిధులు రావట్లేదు. ఇంటిపన్నులు, ఇతరత్రా వస్తున్న ఆదాయం అంతంత మాత్రమే. చెత్తసేకరణకు ట్రాక్టర్‌లో డీజిల్ పోయించడానికి చేతుల్లోంచి డబ్బులు పెట్టుకోవాల్సి వస్తున్నది. మూడు నెలల నుంచి ఇదే తంతు. పంచాయతీ కార్మికులేమో మాకు ...6లో

ఏడో దశలో...199 మంది అభ్యర్థులు నేరచరితులే!

- 299 మంది కోటీశ్వరులు



న్యూఢిల్లీ : లోక్‌సభకు జూన్ 1వ తేదీన జరిగే ఏడవ, చివరి విడత ఎన్నికల్లో 904 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) నివేదిక ప్రకారం వీరిలో ...15లో

జార్ఖండ్‌లో సీపీఐ(ఎం) విస్తృత ప్రచారం



రాజ్‌మహల్ : జార్ఖండ్‌లో సీపీఐ(ఎం) అభ్యర్థి గోపిన్ సొరేన్‌కు మద్దతుగా ఆ పార్టీ విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తోంది. సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు రామచంద్రడోమ్, జార్ఖండ్ రాష్ట్ర కార్యదర్శి ప్రకాష్ విప్లవ్, రాంపరీ తదితరులు నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన బహిరంగ సభల్లోనూ, ర్యాలీల్లోనూ పాల్గొన్నారు.

ఉమర్ ఖలీద్‌కు బెయిల్ తిరస్కృతి

న్యూఢిల్లీ : జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీ (జెఎన్‌యు) మాజీ స్కాలర్ ఉమర్ ఖలీద్ బెయిల్ పిటిషన్‌ను ఢిల్లీ కోర్టు మంగళవారం తిరస్కరించింది. 2020లో ఈశాన్య ఢిల్లీలో జరిగిన అల్లర్లలో కుట్ర కేసులో ఖలీద్‌ను ఆ ఏడాది సెప్టెంబరులో అరెస్టు చేశారు. ఖలీద్ బెయిల్ పిటిషన్‌ను అదనపు సెషన్స్ న్యాయమూర్తి సమీర్ బాజ్‌పాయ్ తోసిపుచ్చారు. అయితే ఆ ఉత్తర్వుల వివరాలు ఇంకా అందాల్సి వుంది. 23చోట్ల నిరసనలకు ఖలీద్ కుట్ర పన్నాడని, ఫలితంగా అవన్నీ ఢిల్లీలో అల్లర్లకు దారి తీశాయని పేర్కొంటూ యుఎపిఎ కింద ఆయనను అరెస్టు చేశారు. తొలిసారిగా 2022 మార్చిలో మొదటిసారిగా ఖలీద్‌కు విచారణా కోర్టు బెయిల్ తిరస్కరించింది. దాంతో ఆయన ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. అక్కడా ఆయనకు ఉపశమనం లభించలేదు. తిరిగి 2023 మేలో బెయిల్ కోసం సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా, 14సార్లు వాయిదా పడింది. దాంతో ఖలీద్ తరపు న్యాయవాది కపిల్ సిబల్ తమ బెయిల్ పిటిషన్ ఉపసంహరించుకుంటున్నట్లు కోర్టుకు తెలియజేశారు. తిరిగి ఈ ఏడాది ఫిబ్రవరి 14న మరోసారి విచారణా కోర్టును నిందితుడు ఆశ్రయించారు. జాప్యం జరిగిన కారణంగా, ఈ కేసులో ఇతర నిందితులతో సమానంగా తనకు రెగ్యులర్ బెయిల్ ఇవ్వాలని ఆయన కోరారు. ఈ కేసులోని మిగిలిన నిందితులు ముగ్గురికీ గతంలోనే ఢిల్లీ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది.

పాట్నా యూనివర్సిటీలో మూక దాడి

- విద్యార్థి మృతి



ఫైల్

పాట్నా : బీహార్‌లోని పాట్నా యూనివర్సిటీ లా కాలేజీ ప్రాంగణంలో జరిగిన మూక దాడిలో ఒక విద్యార్థి ప్రాణాలు కోల్పోయాడు. సోమవారం మధ్యాహ్నం 1:30 గంటలకు 10 మందికిపైగా గుర్తుతెలియని వ్యక్తులు హాకీ స్టిక్‌లు, కర్రలు, ఇనుప రాడ్లు, ఇటుకలతో దాడి చేయడంతో విద్యార్థి అక్కడికక్కడే మరణించాడు. మృతుడ్ని బిఎన్ కాలేజీలో ఇంగ్లీష్ ఒకేషనల్ కోర్సు చదువుతున్న అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థి హర్ష్ రాజ్ (22)గా గుర్తించారు. ఇతడిది వైశాలి జిల్లా కాగా, పాట్నాలోని బోరింగ్ కెనాల్ రోడ్ ప్రాంతంలో అద్దె ఇంట్లో ఉండి చదువుకుంటున్నాడు. పరీక్షలు రాసి బయటకు వచ్చిన వెంటనే హర్ష్‌రాజ్‌పై లా కాలేజీ ప్రాంగణంలోని ఆడిటోరియం సమీపంలో ఈ మూక దాడి జరిగింది. తీవ్ర గాయాలపాలైన అతన్ని పాట్నా మెడికల్ కాలేజీ అండ్ హస్పటల్‌కు తీసుకెళ్లగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. ఈ ఏడాది చివరల్లో జరగనున్న పాట్నా యూనివర్సిటీ స్టూడెంట్స్ యూనియన్ ఎన్నికల్లో పోటీ చేయాలని హర్ష్‌రాజ్ నిర్ణయం తీసుకోవడమే, ఆయన హత్యకు కారణమని బంధువులు, స్నేహితులు వెల్లడించారు. సోషల్ మీడియాలో చురుగ్గా ఉండే హర్ష్‌రాజ్ కరోనా సమయంలో చాలా మందికి సహాయం చేశాడు. లోక్ నాయక్ యువ పరిషత్ అనే ఒక సంస్థను కూడా నడుపుతున్నాడు. జర్నలిస్టుగా పనిచేస్తున్న హర్ష్‌రాజ్ తండ్రి అజిత్‌కుమార్ ఫిర్యాదు మేరకు సుల్తాన్‌గంజ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సుమారు 12 మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

అన్ని పరీక్షలనూ రద్దు చేసిన విసి

మూకదాడిలో విద్యార్థి మృతి చెందడంపై పాట్నా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కెసి సిన్హా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధ్యులను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసుల్ని కోరారు. అలాగే, తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకూ ప్రస్తుతం జరుగుతున్న పరీక్షలన్నింటినీ రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ కేసులో ఇప్పటి వరకూ ఎవర్నీ అరెస్టు చేయలేదని, క్యాంపస్‌లోని సిసిటివి ఫుటేజీని పరిశీలించి నిందితుల్ని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నామని పోలీసులు తెలిపారు.

పెత్తందార్ల చేతిలో కీలుబొమ్మ

- ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై ఎమ్మెల్యే నాగరాజు ఆగ్రహం



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పెత్తందార్ల చేతిలో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కీలు బొమ్మగా మారారని వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏనుగు ఎక్కి ప్రగతిభవన్‌కు పోదామన్న మాటలు ఎక్కడికి పోయాయని ప్రశ్నించారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఆయన స్వేరోస్‌ను స్థాపించి దొంగలను పోషించారని ఆరోపించారు. ఆయన మోస పూరిత మాటలను దళితులు నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు. 'అంతర్జాతీయ స్థాయిలో కీరవాణి గొప్ప సంగీత దర్శకుడు. ఆయన్ను విమర్శించే స్థాయి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు లేదు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓట్లు చీల్చేందుకే ఆయన బీఎస్పీలో చేరాడు' అని విమర్శించారు.

రంగంలోకి రెడ్ వాలంటీర్లు


- రేమాల్‌తో బెంగాల్ అతలాకుతలం
- ముమ్మరంగా సహాయ కార్యక్రమాలు



కోల్‌కతా : రేమాల్‌తో అతలాకుతలమైన పశ్చిమ బెంగాల్‌లో రెడ్ వాలంటీర్లు రంగంలోకి దిగారు. సహాయక, పునరావాస కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. కోవిడ్ మహమ్మారి, లాక్‌డౌన్ సమయంలో సహాయక కార్యక్రమాల్లో పాల్గొన్న రెడ్ వాలంటీర్లు ప్రస్తుత తుపాను సమయంలోనూ తమదైన శైలిలో సేవలందిస్తున్నారు. ప్రజలను కాపాడుతున్నారు. తమ ట్రేడ్ మార్క్ రెడ్ టీ షర్టులు ధరించి బైక్‌లు, సైకిళ్లపై ప్రయాణిస్తూ సహాయక చర్యలు చేపట్టేందుకు ప్రభావిత ప్రాంతాలకు చేరుకుంటున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో ఎన్నికలు హోరాహోరీగా జరుగుతున్నప్పటికీ, రెడ్ వాలంటీర్లు తుపాను బాధితులను రక్షించడానికే ప్రాధాన్యత ఇస్తున్నారు. రెడ్ వాలంటీర్లల్లో ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో సిపిఎం నుంచి పోటీచేస్తున్న యువ అభ్యర్థులు కూడా ఉండటం విశేషం. డైమండ్ హార్బర్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న ప్రతికూర్ రెహ్మాన్, మధురాపూర్ స్థానం నుంచి పోటీ చేస్తున్న శరత్‌చంద్ర హల్దార్ తదితరులు సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. కోల్‌కతాలో మెటియాబురుజ్ ప్రాంతంలోని బాధితులను సహాయక కేంద్రాలకు తీసుకెళ్లడంలో రెడ్ వాలంటీర్లు కీలక పాత్ర పోషించారు. బషీర్‌హాత్ ప్రాంతంలో సిపిఎం అభ్యర్థి నిరపాద సర్దార్ రెడ్ వాలంటీర్ల బృందంతో కలిసి తాగునీటికి ఏర్పాట్లు చేస్తున్నారు. నీటిలో మునిగిపోయిన గొట్టపు బావులను బాగు చేయించే ప్రయత్నం చేస్తున్నారు. సుందర్‌బన్స్‌లోని రైడిఘి ప్రాంతంలో వామపక్ష నాయకులు కాంతి గంగూలీ సహాయక చర్యలకు నాయకత్వం వహిస్తున్నారు. తూర్పు మేదినీపూర్ జిల్లా, నందిగ్రామ్, ఇతర తీర ప్రాంతాల్లో సురక్షితమైన తాగునీటి కొరత సమస్య ఎక్కువగా ఉంది. దీనిని తీర్చడానికి రెడ్‌వాలంటీర్లు నడుం బిగిస్తున్నారు. కోవిడ్-19 కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహాయక, ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాలకు కొట్టుమిట్టాడుతున్న సమయంలో సుమారు ఎనిమిది వేల మంది వామపక్ష భావాలు గల విద్యార్థులు, యువతతో రెడ్ వాలంటీర్ల బృందం ఏర్పడింది.

బెంగాల్‌లో ఆరుగురు మృతి : 15 వేలకు పైగా ఇళ్ల ధ్వంసం


రేమాల్ తుపాను బెంగాల్‌లో అతలాకుతలం సృష్టించింది. ఆరుగురు మరణించగా, 15 వేలకు పైగా ఇళ్లు ధ్వంసమయ్యాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇందులో వెయ్యి ఇళ్లు పూర్తిగా ధ్వంసం కాగా, మిగిలిన ఇళ్లు పాక్షికంగా ధ్వంసమయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 2,400 చెట్లు నేలకూలాయి. దీంతో అనేక ప్రాంతాల్లో రోడ్డు రవాణా స్థంభించింది. దాదాపు 337 విద్యుత్ స్థంభాలు నేలమట్టం కావడంతో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. తుపానుకు కక్‌ద్వీప్, నమ్‌ఖానా సాగర్ దీవులు, డైమండ్ హార్బర్, ఫ్రేసర్‌గంజ్, బక్కహలి, హింగల్‌హంగ్, మందర్మోని బ్లాక్‌లు ఎక్కువగా ప్రభావితమయ్యాయి. సుందర్‌బన్స్‌లోని సుమారు 410 ప్రాంతాల్లో నది కట్టలు తెగిపోవడంతో జనావాస భూములు, పంట భూములు ముంపునకు గురయ్యాయి.



ఓట్లు రాల్చే రుణమాఫీ

- రాజకీయ లబ్ది పొందిన ప్రభుత్వాలు
- వీపీ సింగ్ హయాంలోనే శ్రీకారం
- రైతుకే నష్టం అంటున్న మోడీ
- ఎంఎస్‌పీలకు చట్టబద్ధత పైనా మౌనం
- ముందుచూపుతో హామీ ఇచ్చిన రాహుల్

న్యూఢిల్లీ : హిందీ రాష్ట్రాలైన హర్యానా, ఉత్తరప్రదేశ్‌లో అన్నదాతల సంఖ్య అధికంగా ఉంటుంది. దీనిని దృష్టిలో పెట్టుకొనే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వారికి అతి ముఖ్యమైన హామీ ఇచ్చారు. కేంద్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతుల రుణాలు మాఫీ చేస్తామని ఆయన ప్రకటించారు. దేశంలో చిట్టచివరిసారిగా 2008లో అప్పటి యూపీఏ ప్రభుత్వం రూ.60,000 కోట్ల ఆర్థిక ప్యాకేజీ రూపంలో రైతుల రుణాలు రద్దు చేసింది. ఆ తర్వాతి సంవత్సరమే దేశంలో సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. యూపీఏ మరోసారి భారీ మెజారిటీతో అధికారంలోకి వచ్చింది.



హర్యానాలో ఈ నెల 22న జరిగిన ఓ ఎన్నికల ప్రచార సభలో రాహుల్ ప్రసంగిస్తూ రైతు రుణాలు మాఫీ చేస్తామని, పంటల కనీస మద్దతు ధరలకు (ఎంఎస్‌పీ) చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చారు. రుణ మాఫీపై అధ్యయనం చేసి సిఫార్సులు అందజేసేందుకు వీలుగా కమిషన్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. దానితో పాటు తక్షణమే రుణ మాఫీ జరుగుతుందని కూడా తెలిపారు. రుణ మాఫీలు చేస్తే నష్టపోయేది రైతులేనని మోడీ చెబుతున్నారని గుర్తు చేశారు. రుణాలు రద్దు చేయాలని, ఎంఎస్‌పీలకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ అన్నదాతలు వివిధ రాష్ట్రాల్లో...ముఖ్యంగా రాజధాని ఢిల్లీ సరిహద్దుల్లో ఫిబ్రవరి నుండి ఆందోళనలు చేస్తూనే ఉన్నారు. 2022 నాటికి దేశంలోని రైతులపై రూ.18.5 లక్షల కోట్ల మేర రుణ భారం పడింది.

రుణాలు ఎందుకు ఇస్తారు?

వ్యవసాయం లేదా దాని అనుబంధ కార్యకలాపాల నిమిత్తం షెడ్యూల్డ్ బ్యాంకులు రైతులు, రైతు సమూహాలకు రుణాలు అందిస్తుంటాయి. ఖరీఫ్, రబీ సీజన్లలో పంటల కోసం స్వల్పకాలిక రుణాలు (18 నెలల వరకు) ఇస్తాయి. వ్యవసాయ యంత్ర పరికరాల కొనుగోలు, నీటిపారుదల-ఇతర అభివృద్ధి కార్యకలాపాల కోసం మధ్యకాలిక (18 నెలల నుండి ఐదు సంవత్సరాల వరకు), దీర్ఘకాలిక (ఐదు సంవత్సరాల పైబడి) రుణాలు అందిస్తాయి. పంట కోతకు ముందు, కోతల తర్వాత చేసే పనుల కోసం కూడా రుణాలు ఇస్తారు. ఈ రుణాలను చాలా వరకూ వాయిదాల పద్ధతిలో తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. రుణాల స్వభావం, రుణాలు ఇచ్చే బ్యాంకును బట్టి వడ్డీరేటులో వ్యత్యాసాలు ఉంటాయి.

రుణ మాఫీని ఎందుకు అడుగుతారు?

అప్పుల ఊబిలో కూరుకుపోవడం వల్లనే రైతులు రుణ మాఫీలు కోరతారని వ్యవసాయ నిపుణులు అభిప్రాయపడ్డారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు అనేకం. భూ వివాదాలు, భూగర్భ జలాలు అడుగంటిపోవడం, భూమిలో సారం తగ్గిపోవడం, పెట్టుబడి వ్యయం పెరగడం...ఇవన్నీ రైతును చుట్టుముడుతున్న సమస్యలే. పండించిన పంటకు తగిన గిట్టుబాటు ధర లభించకపోవడంతో రైతులపై రుణభారం పెరుగుతోంది. వ్యవసాయ ఖర్చులు పెరగడంతో అన్నదాత అప్పులు చేయక తప్పడం లేదు. అయితే ఈ రుణాలు బ్యాంకులు మాత్రమే ఇవ్వడం లేదు. చిన్నపాటి రైతులు బ్యాంకుల నుండి రుణాలు పొందలేక ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ఇలాంటి రుణాలపై అధిక వడ్డీ చెల్లించాల్సి వస్తోంది. అందుకే అన్నదాతలు రుణ మాఫీని కోరుకుంటారు.

మాఫీ అనివార్యమా?

అయితే రుణ మాఫీ అనేది అప్పుల భారానికి దీర్ఘకాలిక పరిష్కారం కాదు. వ్యవసాయ రంగంలో సంస్కరణలు చేపడితే రైతులకు ఈ తిప్పలు ఉండవు. కానీ రుణ మాఫీ అనేది అనివార్యమని కొందరు నిపుణుల వాదన. 'జ్వరం వస్తే పారాసిటమాల్ ఇవ్వక తప్పదు. కాకపోతే మరోసారి జ్వరం రాకుండా చూసుకోవాలి. రుణ మాఫీ కూడా అంతే. తరచుగా ఈ పరిస్థితి ఉత్పన్నం కాకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది' అని ఓ నిపుణుడు వ్యాఖ్యానించారు.

> **ప్రభుత్వాల జోక్యం ఎప్పుడు?**
>
> వాయిదాలు సకాలంలో చెల్లిస్తే అటు బ్యాంకులు, ఇటు రైతులు ప్రయోజనం పొందుతారు. అయితే రుతుపవనాలు అనుకూలించకపోవడం, ప్రకృతి విపత్తుల కారణంగా సకాలంలో రుణాలు చెల్లించడం సాధ్యంకాకపోవచ్చు. కాలం గడిచేకొద్దీ రుణభారం పెరుగుతూ ఉంటుంది.
>
> మధ్యలో పంట నష్టపోయినా, ఇతర రకాల సమస్యలు ఎదురైనా పరిస్థితి మరింత దుర్భరంగా ఉంటుంది. అలాంటి పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకుంటాయి. రుణాలను రీషెడ్యూల్ చేయడమో లేదా పూర్తిగా మాఫీ చేయడమో చేస్తాయి. బ్యాంకులకు చెల్లింపులు జరపాల్సిన బాధ్యత ప్రభుత్వాల పైనే పడుతుంది.
>
> మాఫీలు సాధారణంగా రుణాల స్వభావంపై ఆధారపడి ఉంటాయి. రుణం ఏ తరహాకు చెందినది (స్వల్పకాలిక, మధ్యకాలిక, దీర్ఘకాలిక), రైతులు ఏ తరగతికి చెందిన వారు, రుణ వనరు ఏమిటి వంటి అంశాలపై ప్రభుత్వ నిర్ణయం ఆధారపడి ఉంటుంది. కొత్త పథకాన్ని ప్రకటించడం, బడ్జెటరీ మద్దతు కల్పించడం వంటి చర్యల ద్వారా ప్రభుత్వాలు రుణ మాఫీ చేస్తాయి.

రాష్ట్రాల రుణ మాఫీలు

రైతులు పదే పదే డిమాండ్ చేస్తున్నప్పటికీ మోడీ ప్రభుత్వం మాత్రం రైతు రుణ మాఫీపై ఎలాంటి హామీ ఇవ్వడం లేదు. అది రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత అంటూ తప్పించుకుంటోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు 2014లో, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర 2017లో, కర్నాటక, పంజాబ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ 2018లో, చివరగా జార్ఖండ్, మహారాష్ట్ర (మరోసారి) 2020లో రైతు రుణ మాఫీలు అమలు చేశాయి. ఈ రాష్ట్రాలన్నీ కలిపి రూ.2.52 లక్షల కోట్ల మేర రుణాలు రద్దు చేశాయి. 2021 ఫిబ్రవరిలో తమిళనాడులో అన్నా డీఎంకే ప్రభుత్వం అతి పెద్ద రుణ మాఫీని ప్రకటించింది. ఆ ఏడాది ఏప్రిల్‌లో రాష్ట్ర శాసనసభకు ఎన్నికలు జరిగిన నేపథ్యంలో దానికి ముందు ప్రభుత్వం రూ.12,110 కోట్ల పథకాన్ని ప్రకటించింది. రైతుల స్వల్ప కాలిక రుణ బకాయిలన్నీ రద్దు చేస్తున్నామని నాటి ముఖ్యమంత్రి పళనిస్వామి చెప్పారు. 2016లో కూడా 12.02 లక్షల మంది రైతుల స్వల్పకాలిక, మధ్యకాలిక రుణాలను అన్నా డీఎంకే ప్రభుత్వం రద్దు చేసింది.

పాన్-ఇండియా మాఫీలు

దేశంలో తొలిసారిగా 1990-91 బడ్జెట్‌లో వీపీ సింగ్ నేతృత్వంలోని నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం పాన్-ఇండియా రుణ మాఫీ ప్రకటించింది. అందుకోసం వ్యవసాయ, గ్రామీణ రుణ సహాయ పథకాన్ని ప్రవేశపెట్టింది.

అయితే ఈ పథకం 1991 మార్చి 31న ముగిసింది. ఆ తర్వాత దానిని నవీకరించలేదు. 2008-09 బడ్జెట్ ప్రసంగంలో అప్పటి ఆర్థిక మంత్రి చిదంబరం పాన్-ఇండియా రుణ మాఫీని ప్రకటించారు. రుణ మాఫీ కారణంగా సింగ్ ప్రభుత్వంపై రూ.7,825 కోట్ల భారం పడగా 3.2 కోట్ల మంది రైతులు ప్రయోజనం పొందారు. మన్మోహన్ సింగ్ ప్రభుత్వంపై రూ.52,000 కోట్ల భారం పడగా 2.9 కోట్ల మంది అన్నదాతలు లబ్ది పొందారు.

ప్రత్యామ్నాయాలు అవసరం

2014-22 మధ్యకాలంలో రాష్ట్ర ప్రభుత్వాలు తొమ్మిది సార్లు రుణ మాఫీలు ప్రకటించాయి. అయితే కేవలం సగం మంది లబ్దిదారుల రుణాలు మాత్రమే రద్దయ్యాయి.

రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వాలు అట్టహాసంగా రైతు రుణ మాఫీలు ప్రకటించినప్పటికీ అవి ఆశించిన స్థాయిలో అన్నదాతలకు ఊరట కలిగించలేకపోయాయి. రుణ మాఫీకి ప్రత్యామ్నాయంగా వ్యవసాయ నిపుణులు పలు చర్యలను సూచిస్తున్నారు. వ్యవసాయ రంగంలో మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని, అన్నదాతలకు విద్యుత్, నీటిపారుదల, విత్తనాలు, ఎరువులు, పరిశోధనలు, విస్తరణ సేవలు వంటి పలు సౌకర్యాలు సమకూర్చాలని వారు కోరారు. వ్యవసాయ రంగంలో ప్రభుత్వ పెట్టుబడులు పెంచాలని, దీర్ఘకాలిక విధానాలు రూపొందించాలని సూచించారు.

ఎన్నికలకు ముందు ప్రకటనలు

1987 నుండి 2020 వరకూ ఎలాంటి అభివృద్ధి అజెండా, భావజాలం లేకుండానే రుణ మాఫీలు జరిగాయి. మాఫీలకు, కరువు తీవ్రతకు సంబంధం కూడా లేదు. 2016 వరకూ రాష్ట్ర ప్రభుత్వాలే రుణ మాఫీలు ప్రకటించాయి. ఆర్థిక భారాన్ని కూడా అవే భరించాయి.2016 తర్వాత రుణభారం అధికంగా ఉండడంతో అలంటి ప్రకటనలేవీ వెలువడలేదు. ఈ మధ్యకాలంలో ప్రకటనలు వెలువడిన సమయాలు కూడా కీలకంగా మారాయి.

ఈ తరహా ప్రకటనలన్నీ ఎన్నికలకు ముందు జరిగినవే. అవి అధికారంలో ఉన్న పార్టీలకు రాజకీయంగా ప్రయోజనం చేకూర్చాయి. ఎన్నికలకు ముందు రుణ మాఫీలు ప్రకటించిన 21 రాష్ట్ర ప్రభుత్వాల్లో కేవలం నాలుగు మాత్రమే ఓటమి పొందడం గమనార్హం.

గోరఖ్‌పూర్‌లో గెలుపెవరిది?

సీఎం యోగి ఇలాకలో బీజేపీకి గట్టి పోటీ

- సీటు నిలుపుకోవటం కోసం కాషాయపార్టీ తీవ్ర ప్రయత్నాలు
- 'ఇండియా' నుంచి ఎస్పీ అభ్యర్థి బరిలోకి





లక్నో : యూపీలోని గోరఖ్‌పూర్ లోక్‌సభ స్థానం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నది. బీజేపీ సిట్టింగ్ ఎంపీ సీటు అయిన ఈ స్థానాన్ని నిలుపుకోవాలని బీజేపీ చూస్తుండగా.. కాషాయపార్టీని ఓడించి గట్టి షాకివ్వాలని ఇండియా కూటమి భావిస్తున్నది. ఈ కూటమి తరపున ఎస్పీ అభ్యర్థి బరిలో ఉన్నారు. 2017లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత.. గోరఖ్‌పూర్ ఎంపీగా ఉన్న యోగి ఆదిత్యనాథ్.. సీఎం పదవిని చేపట్టటానికి తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ఆ తర్వాత జరిగిన గోరఖ్‌పూర్ ఉప ఎన్నికలో ఎస్పీ అభ్యర్థిగా నిలిచిన భోజ్‌పురీ నటుడు సంజయ్ నిషాద్ విజయం సాధించారు. దీంతో ఈ పరాజయం బీజేపీని ఆత్మరక్షణలో పడేసింది. సంజయ్ నిషాద్ భార్య కాజల్ నిషాద్ ఇప్పుడు ఎస్పీ అభ్యర్థిగా ఈ స్థానం నుంచి బరిలో ఉన్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో గోరఖ్‌పూర్ స్థానాన్ని తిరిగి బీజేపీ కైవసం చేసుకోగలిగింది. ఇక్కడ నుంచి భోజ్‌పురీ నటుడైన రవి కిషన్ విజయం సాధించారు. ఈ సారి ఎన్నికల్లోనూ ఆయన బీజేపీ నుంచి బరిలో ఉన్నారు. దీంతో బీజేపీ, ఎస్పీల మధ్య గట్టి పోటీ నెలకొన్నదనీ, ఈ సారి ఈ స్థానం నుంచి విజయం బీజేపీకి అంత సులువేమీ కాదని రాజకీయం విశ్లేషకులు చెప్తున్నారు.

ఇద్దరు భోజ్‌పురి నటులు, సిట్టింగ్ బీజేపీ ఎంపీ రవి కిషన్ వర్సెస్ లోక్‌సభ అభ్యర్థిగా బరిలోకి దిగిన కాజల్ నిషాద్ మధ్య ఆసక్తికరమైన పోటీ నెలకొన్నది. రామ మందిరం నినాదం గత ఎన్నికల్లో బీజేపీకి లాభాన్ని చేకూర్చింది. అయితే, రామ మందిర నిర్మాణం జరగటం, మరొక ఎజెండా బీజేపీకి లేకపోవటంతో అది కాషాయపార్టీకి గట్టి ఎదురుదెబ్బ అని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. "రాజ్యాంగాన్ని మార్చటం" "రిజర్వేషన్లను అంతం చేయడం" బీజేపీ అంతిమ లక్ష్యమని ఇండియా కూటమి ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లటంతో విజయం సాధించింది. ఇది ఆ కూటమికి లబ్దిని చేకూరుస్తుందని చెప్తున్నారు.


1998లో తొలిసారిగా గెలిచిన ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ ఇక్కడి నుంచి ఐదుసార్లు ఎంపీగా ఉన్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత, ముఖ్యంగా ఆయన మళ్లీ ఎన్నికైనప్పటి నుంచి గోరఖ్‌పూర్‌లో గతంలో ఎన్నడూ లేనంత సందడి ఇప్పుడు నెలకొన్నది. రాష్ట్ర రాజధాని లక్నో దాటి.. గోరఖ్‌పూర్ ఇప్పుడు అధికారాన్ని ప్రయోగించే ప్రత్యామ్నాయ స్థానంగా మారింది. భారత్‌లోని అతిపెద్ద రాష్ట్రంలో ప్రభుత్వాధినేతతో పాటు ఆదిత్యనాథ్‌కున్న 'మఠాదీష్' (ప్రధాన పూజారి) హోదా హిందూత్వ పరంగా కొంత ప్రభావాన్ని చూపొచ్చు.

కాగా, బీజేపీ కేంద్రంలో మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్ర ముఖ్యమంత్రిగా యోగిని తొలగిస్తారని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ వ్యాఖ్యలు చేయటం కూడా ఇక్కడ తీవ్ర చర్చ జరుగుతున్నది. ఇది కూడా ఇక్కడ బీజేపీ కార్యకర్తలు, సాంప్రదాయ ఓటర్లలో అపనమ్మకాన్ని తెచ్చిపెట్టిందనీ, మోడీ-షా ద్వయం యోగిని వేరు చేసి చూస్తున్నదని వారు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.

గోరఖ్‌పూర్‌లో సిట్టింగ్ ఎంపీ రవి కిషన్ గత ఎన్నికల్లో ఎస్పీ అభ్యర్థి రాంభూల్ నిషాద్‌ను 3,01,664 ఓట్లతో ఓడించాడు. కానీ ఈసారి ఆయన ఎస్పీ అభ్యర్థితో గట్టి పోటీని ఎదుర్కోక తప్పదని పరిశీలకులు చెప్తున్నారు. ఇక్కడ బీజేపీ కేవలం తన హిందూత్వ అజెండా, మైనారిటీ వర్గాలపై విషం చిమ్మటమే లక్ష్యంగా ప్రచారం సాగించింది. కానీ, ఎస్పీ అభ్యర్థి మాత్రం ఉద్యోగాలు, అభివృద్ధి, మోడీ సర్కారు వైఫల్యాలపై ప్రజలకు వివరిస్తూ ముందుకెళ్లింది. ఇక బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ)కి చెందిన జావేద్ సిమ్నాని ఇక్కడ నుంచి పోటీ చేస్తున్నారు.

దుష్ప్రచారం

- సినిమాల నుంచి ఎన్నికల వరకు ఇదే తీరు
- మోడీ పదేండ్ల పాలనలో సాగిన హిందూత్వ సంస్థల ఆటలు
- భావోద్వేగంతో కూడిన రాజకీయాలు : రాజకీయ పరిశీలకులు, మేధావులు



న్యూఢిల్లీ : మోడీ పదేండ్ల పాలనలో ప్రతిపక్ష నాయకులపై రాజకీయంగా తీవ్ర దుష్ప్రచారం జరిగింది. 2014లో కేంద్రంలో తొలిసారి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు వివిధ వేదికల ద్వారా విష ప్రచారం సాగించాయి బీజేపీ, దాని అనుబంధ హిందూ సంస్థలు. ఇందుకు సినిమాలను, కార్టున్ల ద్వారా తమ ప్రచారాన్ని సాగించాయి. కాశ్మీర్ ఫైల్స్, ఆర్టికల్ 370, స్వతంత్ర వీర్ సావర్కర్, కాంగ్రెస్‌తో పాటు ఇండియా కూటమి అగ్రనేతలను టార్గెట్ చేసుకుంటూ వస్తున్న ప్రకటనలో ఈ కోవలోనివేనని రాజకీయ పరిశీలకులు అంటున్నారు.మోడీ పదేండ్ల పాలనలో బీజేపీ అనుబంధ సంస్థలకు విపరీతమైన స్వేచ్ఛ లభించిందనీ, అధికారాన్ని చూసుకొని విపక్షాలపై విపరీతమైన దుష్ప్రచారం సాగించాయని వారు గుర్తు చేస్తున్నారు. మోడీ ప్రధానిగా ఎన్నికైనప్పటి నుంచి భారత్ దాని చరిత్రలో అపూర్వమైన దశను ఎదుర్కొంటున్నదనీ, దీనిలో హిందూ ఆధిపత్య వాదం అధికమైందని చెప్తున్నారు. ముఖ్యంగా, ఎక్కువ భావోద్వేగంతో కూడిన రాజకీ యాల భారత్‌లో కనిపించాయని అంటున్నారు. తర్కం, వాస్తవాలకు చోటు లేకుండా పోయిందని చెప్తున్నారు. "ముఖ్యంగా ఇతరుల పట్ల ద్వేషం కనిపించింది. కాంగ్రెస్ పార్టీతో పాటు, గాంధీ కుటుంబంపై రాజకీయంగా తీవ్ర దాడి జరిగింది. రాజకీయాల్లో విషపూరితం వ్యక్తిగత స్థాయిలో కూడా అధికమైంది" అని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి రాజకీయాలు ఇప్పుడున్నంత ద్వేషపూరితంగా లేవని రాజకీయ పరిశీలకులు చెప్తున్నారు. 2014 తర్వాత రాజకీయాలు పూర్తిగా మారాయనీ, నైతిక విలువలకు చోటు లేకుండా పోయిందని అంటున్నారు. ముఖ్యంగా, బీజేపీ పాలనలో ఫాసిస్ట్ రాజకీయాలు ఎక్కువయ్యాయని అంటున్నారు. మోడీ పాలనలో వ్యక్తిత్వ ఆరాధన అధికమైందనీ, మతపరమైన మైనారిటీలకు రక్షణ లేకుండా పోయిందని, నకిలీ వార్తల ప్రచారం తీవ్రమైందనీ, ఇక మతతత్వ రాజకీయాలు సైన్స్‌నే ప్రశ్నించే స్థాయికి వెళ్లాయని మేధావులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ద్వేషం, అవాస్తవాల నడుమ ఉదారవాదులు, ప్రజాస్వామికవాదులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారని అంటున్నారు. వాట్సప్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా నకిలీ, ద్వేషపూరిత ప్రచారాలు అధికమయ్యాయని వారు గుర్తు చేస్తున్నారు. కరోనావైరస్ వంటి ప్రాణాంతక మహమ్మారి వ్యాప్తి విషయంలో ముస్లింలపై చెడు ప్రచారాన్ని చేయటంలో ఇవి కీలక పాత్ర వహించాయనీ, అయినప్పటికీ మోడీ సర్కారు ఈ విషయంలో చూసీచూడనట్టుగా వ్యవహరించిందని అంటున్నారు. భారత రాజకీయాల్లో నైతిక విలువలు మోడీ పాలనలో పడిపోయాయని రాజకీయ పరిశీలకులు చెప్తున్నారు. ఇక మోడీ పాలనపై ప్రజలు తీవ్రంగా విసుగు చెందారనీ, లోక్‌సభ ఎన్నికల్లో ఇది వెల్లడైందని అంటున్నారు. జూన్ 4న వచ్చే ఫలితాలు ఇదే విషయాన్ని తెలియజేస్తాయని వారు చెప్తున్నారు.

రాజ్‌మహల్‌లో ఎవరిది పైచేయి?

- హేమంత్ అరెస్ట్.. కల్పన ర్యాలీలు
- సిట్టింగ్ సీటుపై పట్టుకోసం జేఎంఎం
- మోడీ పర్యటనలపై బీజేపీ ఆశలు
- ఎలాగైనా చేజిక్కించుకోవాలని వ్యూహాలు



రాంచీ : లోక్‌సభలో చివరిదైన ఏడో దశ ఎన్నికల్లో భాగంగా జార్ఖండ్‌లోని రాజ్‌మహల్‌తో పాటు దుమ్కా, గొడ్డా స్థానాలకు వచ్చే నెల 1న ఎన్నికలు జరగనున్నాయి. దీంతో ఈ మూడు స్థానాల్లో విజయం కోసం పార్టీలు తీవ్రంగా కష్టపడుతున్నాయి. రాజ్‌మహల్ సీటులో గెలుపెవరిదనేది రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠను రేపుతున్నది. రాజ్‌మహల్ లోక్‌సభ స్థానం పరిధిలోనే జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి నియోజకవర్గం ఉండటం దీనికి కారణమవుతున్నది.

జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) నాయకుడు, ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి హేమత్ సొరెన్ జైలులో ఉండటం, ఆయన భార్య కల్పనా.. పార్టీ ప్రచారాన్ని తన భుజస్కంధాలపై మోస్తున్నారు. పలు ర్యాలీలు నిర్వహిస్తూ ప్రచారాన్ని ఉధృతం చేస్తున్నారు. తన ప్రసంగాలతో ఫైర్‌బ్రాండ్ వక్తగా, రాజకీయ చతురత కలిగిన వ్యక్తిగా పేరు తెచ్చుకున్నారు. ఒక పరిణితి చెందిన రాజకీయ నాయకురాలిగా తన ప్రసంగాలను ఇస్తూ, విమర్శలనూ అదే స్థాయిలో చేస్తున్నారు. సంతాల్ పరగణాలోని ప్రముఖ జేఎంఎం నాయకుడు, పార్టీ ఎన్నికల వ్యూహకర్త అయిన స్టీఫెన్ మరాండి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని గిరిజనులు హేమంత్ సొరెన్ అరెస్టును బీజేపీ ఎత్తుగడగా చూస్తున్నారు. విశేషమేమిటంటే, మాజీ సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న బర్హైత్.. రాజ్‌మహల్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోకి వస్తుంది. "హేమంత్ సొరెన్ అరెస్టుతో గిరిజన సమాజం గాయపడింది. ప్రజలతో పార్టీ సమీకరణం బలంగా ఉన్నది. అది తమ స్థానాన్ని నిలుపుకుంటుంది" అని చెప్పారు.మరోవైపు, బీజేపీ కేవలం ప్రధాని మోడీ మీదే ఆధారపడింది. రాజ్‌మహల్ అసెంబ్లీ స్థానానికి చెందిన బీజేపీ ఎమ్మెల్యే అనంత్ కుమార్ ఓజా జేఎంఎం-కాంగ్రెస్ ఓట్ల కోసం బుజ్జగించే రాజకీయాలు చేస్తున్నాయని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో మోడీ జీ సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్ సందేశాన్ని అందిస్తున్నామన్నారు.

రాజమహల్ ఎందుకు ముఖ్యమైనది?

రాజ్‌మహల్ నియోజకవర్గంలో సంతాల్ పరగణాలోని మూడు జిల్లాలు ఉన్నాయి. అవి సాహిబ్‌గంజ్, గొడ్డ, దుమ్కా. ఈ ప్రాంతం పశ్చిమ బెంగాల్, బీహార్‌తో సరిహద్దులను పంచుకుంటుంది. గిరిజనులు మెజారిటీగా ఉన్న నియోజకవర్గంలో ఇతర వెనుకబడిన తరగతులు(ఓబీసీ), క్రైస్తవ, ముస్లిం ఓట్లు గణనీయమైన సంఖ్యలో ఉన్నాయి. రాజ్‌మహల్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఆరు అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. అవి.. రాజ్‌మహల్, బోరియో, బర్హైత్, లిటిపరా, పాకుర్, మహేశ్‌పూర్.బీజేపీకి రాజ్‌మహల్ ఒకటి ఉంది. మిగిలిన వాటిలో జేఎంఎంకు ప్రస్తుతం నాలుగు స్థానాలు (బోరియో, బర్హైత్, లిటిపరా, మహేశ్‌పూర్) ఉన్నాయి. కాంగ్రెస్ నాయకుడు ఆలం.. పాకుర్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2004 వరకు, పార్లమెంటరీ నియోజకవర్గంలో కాంగ్రెస్, జేఎంఎం రెండూ సమానంగా బలంగా ఉన్నాయి. ఆ స్థానంతో పాటు అవిభక్త బీహార్‌లో, 1957 నుంచి 1998 వరకు వారికి ప్రత్యామ్నాయంగా వెళ్లాయి. 1998లో బీజేపీ మొదటిసారిగా ఈ స్థానాన్ని గెలుచుకుంది. ఆ పార్టీ అభ్యర్థి సోమ్ మరాండి కేవలం తొమ్మిది ఓట్ల తేడాతో కాంగ్రెస్‌కు చెందిన థామస్ హన్స్‌దక్‌పై విజయం సాధించారు. గత రెండు దశాబ్దాలుగా ఇక్కడ కాంగ్రెస్ ఉనికి తగ్గిపోగా.. జేఎంఎం తన పట్టును బలపరుచుకున్నది. విశేషమేమిటంటే, 2009, 2014 మధ్య సంవత్సరాల మినహా (అది బీజెపికి వెళ్లినప్పుడు), రాజ్‌మహల్ సీటు ఎక్కువగా ఆ పార్టీకే వచ్చింది.జేఎంఎం ఓట్ షేర్ 2014లో 39.88 శాతం నుంచి 2019లో 48.47 శాతానికి పెరిగింది.2014లో దేశంలోని మోడీ వేవ్ రాష్ట్రంలోని 14 లోక్‌సభ స్థానాల్లో 12 సీట్లను బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి గెలుచుకున్నప్పుడు కూడా ఇక్కడ జేఎంఎం పట్టు సడలలేదు. ఆ పార్టీ నుంచి విజయ్ హన్స్‌డా రాజ్‌మహల్ ఎంపీగా గెలిచారు. దీంతో జేఎంఎం సీటును ఎలాగైనా చేజిక్కించుకోవాలని బీజేపీ చూస్తుంటే, మళ్లీ విజయంతో హ్యాట్రిక్ కొట్టాలని జేఎంఎం భావిస్తున్నది.

రిజర్వేషన్లపై 50శాతం పరిమితి ఎత్తివేస్తాం



బంగాసన్ (యూపీ) : ఇండియా బ్లాక్ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లపై 50శాతం పరిమితిని తొలగిస్తుందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చెప్పారు. తమ జీవితాలను ధారపోసైనా సరే భారత రాజ్యాంగాన్ని పరిరక్షిస్తామని హామీ ఇచ్చారు. సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్‌తో కలిసి ఉత్తరప్రదేశ్‌లోని బంగాసన్‌లో ఎన్నికల సభలో రాహుల్ పాల్గొన్నారు. ఇండియా బ్లాక్, రాజ్యాంగం ఒకవైపు వుంటే, మరోవైపు ఆ రాజ్యాంగాన్ని నాశనం చేయాలని భావిస్తున్నవారు వున్నారని రాహుల్ పేర్కొన్నారు. ఏది ఏమైనా తమ జీవితాలను ధారపోసైనా సరే ఇండియా బ్లాక్ రాజ్యాంగాన్ని కాపాడుకుంటుందని చెప్పారు. 50శాతం రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివేయడమే కాకుండా పెంచుతుందని చెప్పారు. ఇండియా బ్లాక్ అధికారంలోకి రాగానే అగ్నిపథ్ పథకాన్ని చించి చెత్తబుట్టలో వేస్తుందన్నారు. 'తనను దేవుడే పంపించాడు' అని ప్రధాని మోడీ చేసిన వ్యాఖ్యలను రాహుల్ ఎద్దేవా చేశారు. ఆదానీకి సాయం చేసేందుకే ఆ దేవుడు మోడీని పంపాడు కానీ పేదల కోసం కాదని వ్యాఖ్యానించారు. అధికారం చేపట్టగానే దేశ ఆర్థిక వ్యవస్థను మరింతగా మెరుగుపరచడంపై దృష్టి పెడతామని చెప్పారు.

సోరెన్ బెయిల్ పిటిషన్‌పై సమాధానం ఇవ్వండి

- ఈడీని ఆదేశించిన జార్ఖండ్ హైకోర్టు



రాంచి : జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ పెట్టుకున్న బెయిల్ పిటిషన్‌పై సమాధానం ఇవ్వాల్సిందిగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)ని జార్ఖండ్ హైకోర్టు మంగళవారం ఆదేశించింది. భూ కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో జనవరి 31న సోరెన్‌ను ఇడి అరెస్టు చేసింది. కాగా తన బెయిల్ పిటిషన్‌పై త్వరగా విచారణ జరపాలని కోరుతూ సోమవారం హైకోర్టులో సోరెన్ పిటిషన్ వేశారు. సోరెన్ తరపు వాదనలు వినిపిస్తూ సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్, రాజకీయ కుట్రకు జెఎంఎం నేత బలయ్యారని విమర్శించారు9. దీంతో సోరెన్ అభ్యర్ధనపై సమాధానం చెప్పాల్సిందిగా కోర్టు, ఇడిని ఆదేశించింది. తదుపరి విచారణా తేదీని జూన్ 10గా నిర్ణయించింది. 8.5ఎకరాల భూ కుంభకోణంలో ఏ పత్రాల్లోనూ తన పేరు ఎక్కడా లేదని, పైగా మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద కూడా నేరం నమోదు కాలేదని సోరెన్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఆ భూమి తనదంటూ కొందరు వ్యక్తులు చేసిన స్టేట్‌మెంట్‌ల ఆధారంగా ఈడీ ఈ చర్యలకు దిగిందని చెప్పారు. ఆ భూమి యజమాని రాజ్ కుమార్ పహాన్ తన భూమిని కొందరు వ్యక్తులు ఆక్రమించారని పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారని సోరెన్ పేర్కొంటున్నారు. కానీ పహాన్ తన పేరును ఎక్కడా ప్రస్తావించలేదని చెప్పారు. అయినా ఈడీ ఆ భూమి తన అధీనంలో వుందని పేర్కొంటూ కేసు నమోదు చేసిందని చెప్పారు.

ఆరవ దశలో 63.37శాతం పోలింగ్

- ఇప్పటివరకు ఓటు వేసిన వారు 57.77కోట్ల మంది
- వివరాలు వెల్లడించిన ఎన్నికల కమిషన్

న్యూఢిల్లీ : ఆరవ దశ పోలింగ్‌లో 63.37శాతం ఓటింగ్ నమోదైందని ఎన్నికల కమిషన్ మంగళవారం ప్రకటించింది. అర్హులైన 11.13 కోట్ల మందిలో 7.05కోట్ల మందికి పైగా ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని తెలిపింది. మే 25న జరిగిన ఆరవ దశలో ఎనిమిది రాష్ట్రాల్లోని 58 స్థానాలకు పోలింగ్ జరిగింది. ఇప్పటివరకు జరిగిన ఆరు దశల్లోనూ 87.54 కోట్ల మందిలో 57.77కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ప్రపంచంలో కెల్లా భారత్‌లో అత్యధికంగా 96.88కోట్ల మంది ఓటర్లు వున్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఆరవ దశలో 64.4 శాతం పోలింగ్ నమోదైంది. ఆనాడు 7 రాష్ట్రాల్లో 59సీట్లకు ఎన్నికలు జరిగాయి. మే 20న జరిగిన ఐదవ దశలో 62.2శాతం పోలింగ్ నమోదైందని ఎన్నికల కమిషన్ ప్రకటించింది. నాల్గవదశలో 69.16శాతం నమోదైంది. 2019 ఎన్నికలతో పోలిస్తే ఈసారి 3.65 పర్సంటేజ్ పాయింట్లు పెరిగాయి. మూడో దశలో 65.68శాతం పోలింగ్ జరగగా, గత ఎన్నికల్లో మూడో దశలో ఈ సంఖ్య 68.4 శాతంగా వుంది. ఇక రెండో దశలో 66.71 శాతం టర్నవుట్ రికార్డు కాగా, 2019 ఎన్నికల్లో 69.64శాతం నమోదైంది. మొదటి దశలో 66.14శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోగా, 2019లో 69.43శాతం మంది ఓటు వేశారు.

బడి భవిత..!

‘దేశ భవిత తరగతి గదుల్లో నిర్మితమవుతుంది’ అనేది సత్యం. కానీ ఆ గదులను సక్రమంగా నిర్మించడమే నేడు ప్రభుత్వాల ముందున్న సవాలు. కొద్ది రోజుల్లో నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానున్నది. సర్కారు జూన్ 1 నుండి బడిబాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ పాఠశాలల వైపుకు పిల్లలను, తల్లిదండ్రులను ఆకర్షించేం దుకు ప్రణాళిక ప్రకటించింది. దీన్ని ఆచరణలో పెట్టడమే ప్రభుత్వం ముందున్న తక్షణ కర్తవ్యం. ఇప్పటికే పాఠ్యపుస్తకాలు పాఠశాలలకు చేరేలా కృషి చేస్తోంది. ఇది హర్షించదగ్గ విషయం.

దేశంలోనే అత్యంత నాణ్యమైన విద్యను అందిస్తున్న రాష్ట్రంగా కూడా కేరళ మొదటి స్థానంలో ఉంది. కాబట్టి అక్కడి విద్యా వ్యవస్థను అధ్యయనం చేసి మన దగ్గర పాటిస్తే రాష్ట్రం మరింత పురోగతి సాధించడం తథ్యం. ఏది ఏమైనా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇది మొదటి విద్యా సంవత్సరం. కనుక ప్రభుత్వ విద్యా సంస్థలను పటిష్టపరచడంపై, మౌలిక సదుపాయాల కల్పనపై ఈ ప్రభుత్వమైనా ప్రత్యేక దృష్టి సారిస్తుందని విద్యావేత్తలు, మేధావులు, తల్లిదండ్రులు, విద్యార్థులు ఆశించడం సహజం. ఆ ఆశలు నిజం చేయడం ప్రభుత్వ కర్తవ్యం.

అయితే నిరుపయోగంగా ఉన్న మూత్రశాలలు, పెచ్చులూడుతున్న పైకప్పులు, కారుతున్న గోడలు, పాచి పట్టి అధ్వానంగా మారిన భవనాలు, వర్షం వస్తే బడికి సెలవు... ఇదీ చాలా వరకు మన రాష్ట్రంలో ప్రభుత్వ స్కూళ్ల దుస్థితి. అయినా ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో ఫీజుల భారం మోయలేక పేద తల్లిదండ్రులు తమ పిల్లలను ఇటీవల కాలంలో ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు కొంత మేరకు ఆసక్తి కనబరుస్తున్నారు. కోవిడ్ తెచ్చిన ఆర్థిక సంక్షోభం కూడా దీనికి తోడయ్యింది. కానీ ప్రభుత్వ స్కూళ్ల లో మౌలిక సదుపాయాల కొరత మాత్రం విద్యార్థులను పట్టి పీడిస్తోంది. ఇది అందరూ తప్పక అంగీకరించాల్సిన కఠిన వాస్తవం. అక్కడక్కడా దాతలు సహృదయంతో ముందుకొచ్చి బాగు చేసినవి తప్ప మిగిలిన ప్రభుత్వ బడులన్నీ పైన పటారం లోన లొటారంలా ఉన్నాయి.



రాష్ట్రంలోని బడులలో 99.99శాతం కనీస ప్రమాణాలకు నిలబడని స్థితి ఉంది. రాష్ట్రంలో 90శాతం మండలాల్లో విద్యా పర్యవేక్షణ, పరిరక్షణ అధికారులు లేరు. తరగతి గదులు చక్కగా లేవు. లైబ్రరీలు లేవు. కొన్ని పాఠశాలల్లో ఉన్న ఒక్క కంప్యూటర్ గది కూడా మూతపడ్డది. ఇప్పటికీ చెట్ల కింద పాఠాలు బోధిస్తున్న పాఠశాలలు రాష్ట్రంలో ఎన్నో. ఇలా సవాలక్ష సమస్యల్లో కునారిల్లుతున్న బడులకు ఏ తల్లిదండ్రులైనా తమ పిల్లలను ఏ ధైర్యంతో పంపిస్తారు? 2022 లెక్కల ప్రకారం రాష్ట్రంలో టాయిలెట్లు పని చేయని పాఠశాలలు 1,255 ఉన్నట్లు జలశక్తి శాఖ వెల్లడించింది. వీటిలో 192 స్కూళ్లు ఒక్క కొమరంభీం జిల్లాలోనే ఉన్నాయి. కనీసం హ్యాండ్‌వాష్‌కు నీరు లేని పాఠశాలలు 11,974 ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయి. ఆ విద్యార్థులు చేతిపంపు, బావులపై ఆధారపడుతున్నారు.

పాఠశాలల్లో పరిశుభ్రత పాటించడం అత్యంత ముఖ్యమైన విషయం. అయితే ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో రుతుస్రావం మొదలైన ఆడపిల్లలు స్కూళ్లకు వచ్చేందుకు అయిష్టత చూపుతున్నారు. దీనికి కారణం వారి అవసరాలకు తగిన పరిశుభ్రమైన మరుగుదొడ్లు లేకపోవడం. కానీ గత ప్రభుత్వం పరిశుభ్రత కోసం ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. పైగా ప్రభుత్వ బడుల్లో ఉన్న స్కావెంజర్లను కూడా ఊడబీకి ఆ బాధ్యత గ్రామపంచాయితీలకు అప్పగించింది. కేజీ టు పీజీ ఉచిత విద్య, ఇంగ్లీష్ మీడియంలో బోధన అంటూ మాటలకే పరిమితమయ్యింది. గురుకులాలపై దృష్టి పెట్టి మిగిలిన పాఠశాలను పూర్తిగా మర్చిపోయింది. కనీసం అవైనా సరిగ్గా ఉన్నాయా అంటే అదీ లేదు. గురుకులాలు కూడా కనీస సౌకర్యాలు, రక్షణ లేక ఎంతటి దౌర్భాగ్య స్థితిలో ఉన్నాయో అందరం చూస్తూనే ఉన్నాం.

గతంలో ఉపాధ్యాయ నియామకాలు కూడా భారీగా జరిగేవి. కానీ బీఆర్ఎస్ పాలనలో ఈ ఊసే ఎత్తలేదు. అధికారిక లెక్కల ప్రకారం రాష్ట్రంలోని 5,821 బడులు ఒకే టీచర్‌తో నడుస్తున్నాయి. 13,374 బడుల్లో 50 మందిలోపే పిల్లలున్నారు. 1213 జీరో బడులున్నాయి. గత ఏడాది దశాబ్ది ఉత్సవాలు ప్రారంభించే నాటికి ఆ తొమ్మిదేండ్లలో రాష్ట్రంలో 4వేల బడులు మూతపడ్డాయి. ఇది గ్రామీణ విద్యా వ్యవస్థకు ప్రమాదకర హెచ్చరికంటూ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బడిని బాగు చేసుకోవడం అంటే భవిష్యత్ తరాల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయడమే. అయితే గత రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయాలన్నీ పూర్తిగా విస్మరించింది. తమ అధికార దర్పాన్ని ప్రదర్శించడంలోనే పదేండ్లు గడిపేసింది.

ప్రస్తుత ప్రభుత్వానికి అది ఓ పాఠం కావాలి. బడిని బాగుచేయడం ఒక ప్రధాన బాధ్యత కావాలి.

సంపాదకీయం

ఈ బడిబాట అందుకో సాధనం కావాలి. రెండు రోజుల కిందట ముఖ్యమంత్రి ఓ సభలో మాట్లాడుతూ... మతోన్మాదులను తరిమికొట్టే విషయంలో కేరళను చూసి నేర్చుకుంటా అనడం మంచి విషయం. మతోన్మాదాన్ని వ్యతిరేకించే విషయంలోనే కాదు దేశంలోనే అత్యంత నాణ్యమైన విద్యను అందిస్తున్న రాష్ట్రంగా కూడా కేరళ మొదటి స్థానంలో ఉంది. కాబట్టి అక్కడి విద్యా వ్యవస్థను అధ్యయనం చేసి మన దగ్గర పాటిస్తే రాష్ట్రం మరింత పురోగతి సాధించడం తథ్యం. ఏది ఏమైనా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇది మొదటి విద్యా సంవత్సరం. కనుక ప్రభుత్వ విద్యా సంస్థలను పటిష్టపరచడంపై, మౌలిక సదుపాయాల కల్పనపై ఈ ప్రభుత్వమైనా ప్రత్యేక దృష్టి సారిస్తుందని విద్యావేత్తలు, మేధావులు, తల్లిదండ్రులు, విద్యార్థులు ఆశించడం సహజం. ఆ ఆశలు నిజం చేయడం ప్రభుత్వ కర్తవ్యం.

పారిస్ ఒలింపిక్స్‌లో చైనా వస్తువుల సందడి!



ఎం కోటేశ్వరరావు
8331013288

చైనా రియలెస్టేట్ రంగంలో తలెత్తిన కొన్ని సమస్యలను చూపి ఇంకేముంది అక్కడి ఆర్థిక వ్యవస్థ కుప్పకూలింది అంటూ కొంత మంది విశ్లేషణలు చేశారు, పండగ చేసుకున్నారు. కానీ అదే చైనా వస్తువులు ఈ ఏడాది జూలై 26 నుంచి ఆగస్టు 11వరకు జరిగే పారిస్ ఒలింపిక్స్‌లో పెద్ద మొత్తంలో దర్శనమివ్వనున్నాయి. క్రీడా పతకాలతో పాటు ప్రపంచ ఫ్యాక్టరీగా తన సత్తా ఏమిటో చూపనుంది. చైనా తూర్పున ఉన్న జెజియాంగ్ రాష్ట్రంలో ‘ఇవు’ అంతర్జాతీయ వాణిజ్య మార్కెట్ ఉంది. అది ఎంత పెద్దది అంటే నలభైలక్షల చదరపు మీటర్ల విస్తీర్ణం కలిగిన సముదాయం, 75వేల దుకాణాలు ఉన్నాయి. పారిస్‌లో జరిగే ఒలింపిక్స్ ఇతివృత్తంతో తయారు చేసిన వస్తువులను కొనుగోలు చేసేందుకు దిగుమతిదారులు పెద్ద సంఖ్యలో ఆ మార్కెట్‌ను సందర్శించి వస్తువులకు ఆర్డర్లు పెట్టారు. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి మాసాల నుంచి ఈ సందడి ప్రారంభమైంది. ఈ వాణిజ్య, పారిశ్రామిక కేంద్రం నుంచి ఒక్క పారిస్ ఒలింపిక్స్‌కే కాదు, అమెరికా, ఐరోపా దేశాల్లో జరిగే అని ప్రముఖ క్రీడలకూ అవసరమైన వస్తువులను ఇక్కడి నుంచే కొనుగోలు చేస్తున్నారు. జూన్ మాసం వరకు ఒలింపిక్ ఆర్డర్ల తయారీకి ఒప్పందాలు కుదిరాయి. జెర్సీలు, ట్రోఫీలు, మెడల్స్ ఒకటేమిటి అన్ని రకాల క్రీడా సామగ్రి ఇక్కడ నుంచి ఎగుమతి అవుతున్నాయి. టేబుల్ టెన్నిస్ బంతుల్లో తక్కువ రకం ధర 0.083 డాలర్లు (రు.6.90) ఉంది. పారిస్ ఒలింపిక్స్‌లో వాడే ఆరుబంతుల ధర.460గా ఉంది.

అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే మొత్తంగా ఫ్రాన్స్‌కు ఈ మార్కెట్ కేంద్రం నుంచి ఎగుమతులు 42శాతం పెరగ్గా వాటిలో క్రీడావస్తువుల పెరుగుదల 70శాతం ఉందంటే పారిస్ ఒలింపిక్సే కారణం. జెజియాంగ్ రాష్ట్ర జనాభా 5.75 కోట్లు. ఇక్కడ ప్రధానంగా వస్త్రాల వంటి వినిమయ వస్తువులు పెద్ద ఎత్తున ఉత్పత్తి చేస్తున్నారు. చైనా నుంచి వస్తువులను కొనుగోలు చేసేవారు వేరే దేశాలకు మరలుతున్నారని పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. శ్రమశక్తి ఎక్కువగా ఉండే వస్తుతయారీ నుంచి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఉత్పత్తుల మీద చైనా కేంద్రీకరించింది. దీనికి తోడు వేతనాల పెరుగుదల వంటి కారణాలతో కొన్ని సంస్థలు ఎక్కడ లాభసాటిగా ఉంటే అక్కడికి వెళ్లటం బహిరంగ రహస్యం. దీనికి తోడు వాణిజ్య ఆంక్షలు, సుంకాల విధింపు, ప్రపంచ రాజకీయాలూ పని చేస్తున్నాయి. ఇన్ని కారణాలున్నా ప్రపంచ సరఫరా గొలుసు నుంచి చైనాను తప్పించటం ఇప్పట్లో జరిగేది కాదన్నది పచ్చినిజం. శ్రమశక్తి ఎక్కువగా ఉండే వస్తువులు చైనా మొత్తం ఎగుమతుల్లో 2017లో 18శాతం ఉండగా 2023లో 17శాతానికి మాత్రమే తగ్గాయి. ఇదంతా అమెరికా ప్రారంభించిన వాణిజ్య యుద్ధం తరువాత జరిగిన పరిణామం.

చైనాలో మే ఒకటవ తేదీ నుంచి ఐదవ తేదీ వరకు మేడే సెలవలు ఇస్తారు. ఈ సందర్భంగా జరిగే వస్తు విక్రయాలు చైనా ఆర్థిక వ్యవస్థ, పౌరుల కొనుగోలు శక్తిని అంచనా వేసేందుకు ఒక కొలబద్దగా పరిగణిస్తారు. ఈ ఏడాది తొలి మూడు మాసాల్లో నమోదైన వివరాలు చైనా తిరిగి కోలుకోవటమే కాదు పెరగటాన్ని సూచించాయి. మే ఒకటవ తేదీన ప్రయివేటు, ప్రభుత్వ సంస్థల వద్ద నమోదైన వివరాల ప్రకారం 28 కోట్ల ప్రయాణాలు జరిగాయి. ఇవి కరోనాకు ముందున్న స్థాయిని దాటినట్టు పేర్కొన్నారు. జల, వాయు, భూ మార్గాల్లో జరిగే ఈ ప్రయాణాలతో రవాణా సంస్థలే కాదు, పర్యాటక రంగం, వస్తూత్పత్తి ఇతర సేవారంగాలు కూడా లబ్దిపొందుతాయి. అనేక దేశాలకు ఎలాంటి వీసాలతో నిమిత్తం లేకుండా చైనా పౌరులు విహార యాత్రలకు వెళ్లవచ్చు. దీంతో ఆయా దేశాలూ, చైనా కూడా లబ్దిపొందుతున్నది.



చైనాలో తలెత్తిన రియలెస్టేట్ సమస్యలకూ పారిశ్రామిక ఉత్పత్తులకు కొందరు ముడిపెడుతున్నారు. ఈ ఏడాది తొలి మూడు మాసాల్లో జీడీపీ వృద్ధి రేటు 5.3శాతం కాగా పారిశ్రామిక ఉత్పత్తి పెరుగుదల రేటు 6.1శాతం కాగా పెట్టుబడులు పదిశాతం వరకు పెరిగాయి. మొత్తం సంక్షోభంలో కూరుకుపోయిందని చెబుతున్నవారే అవసరాలకు మించి ఉత్పత్తి చేసి తమ దేశాల్లో కుమ్మరిస్తున్నట్టు గగ్గోలు పెడతారు. ఈ ఏడాది ప్రారంభంలో చైనా పారిశ్రామికరంగ వినియోగం 75శాతం ఉంది. తీసుకున్న ఆర్డర్లను వేగంగా సకాలంలో పూర్తి చేసి ఇవ్వటంలో చైనా తిరుగులేనిదిగా ఉంది. పారిస్ ఒలింపిక్స్ వస్తువుల విషయంలోనూ అదే నమ్మకం ఉన్నకారణంగా వ్యాపారులు ఎగబడ్డారు. తక్కువ ధరలకు అందించటంతో పాటు సకాలంలో సరఫరా ఇక్కడ ముఖ్యం. జెజియాంగ్ రాష్ట్రంలో 78 పారిశ్రామిక పార్కులుంటే వాటిలో నాలుగున్నరవేల చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఉన్నాయి. వాటికి స్థానిక సంస్థలు అన్ని రకాలుగా మద్దతు ఇస్తున్నాయి. పోటీ ఎక్కువగా ఉన్నందున ఆధునిక ప్రమాణాలతో కూడిన ఉత్పాదక పద్ధతులతో పాటు మార్కెటింగ్ సౌకర్యాలను కూడా ప్రభుత్వాలు కల్పిస్తున్నాయి.

మార్కెట్ ధోరణులను పసిగట్టి అందుకనుగుణంగా ఉత్పత్తుల్లో మార్పులు చేయటం చైనా ప్రత్యేకత అని చెప్పవచ్చు. ఈ కారణంగానే ప్రపంచంలో పెద్ద వాటిలో ఒకటైన షి ఇన్ ఫ్యాషన్ కంపెనీ వారానికి 50వేల కొత్త ఉత్పత్తులను అందుబాటులోకి తెస్తుండగా జారా అనే కంపెనీ ఏటా పాతికవేలను ఉంచుతున్నది. భారీ ఎత్తున ఉత్పత్తి చేస్తున్న కారణంగా చైనాలో ఖర్చు తగ్గుతుంది, దాంతో చౌక ధరలకు విక్రయించగలుగుతున్నది. తనకు ఎదురవుతున్న సవాళ్లను అధిగమించేందుకు అవసరమైన విధానాలను రూపొందిస్తున్నది. ఒక్క ముక్కలో చెప్పాలంటే చైనాకు ఇతర దేశాలు ఎంత అవసరమో, ప్రపంచానికి దాని అవసరమూ అంతే ఉంది. పరస్పర ఆధారాన్ని ఎవరు దెబ్బతీసినా రెండు పక్షాలూ నష్టపోతాయి.

చైనాలో మే ఒకటవ తేదీ నుంచి ఐదవ తేదీ వరకు మేడే సెలవలు ఇస్తారు. ఈ సందర్భంగా జరిగే వస్తు విక్రయాలు చైనా ఆర్థిక వ్యవస్థ, పౌరుల కొనుగోలు శక్తిని అంచనా వేసేందుకు ఒక కొలబద్దగా పరిగణిస్తారు. ఈ ఏడాది తొలి మూడు మాసాల్లో నమోదైన వివరాలు చైనా తిరిగి కోలుకోవటమే కాదు పెరగటాన్ని సూచించాయి. మే ఒకటవ తేదీన ప్రయివేటు, ప్రభుత్వ సంస్థల వద్ద నమోదైన వివరాల ప్రకారం 28 కోట్ల ప్రయాణాలు జరిగాయి. ఇవి కరోనాకు ముందున్న స్థాయిని దాటినట్టు పేర్కొన్నారు. జల, వాయు, భూ మార్గాల్లో జరిగే ఈ ప్రయాణాలతో రవాణా సంస్థలే కాదు, పర్యాటక రంగం, వస్తూత్పత్తి ఇతర సేవారంగాలు కూడా లబ్దిపొందుతాయి. అనేక దేశాలకు ఎలాంటి వీసాలతో నిమిత్తం లేకుండా చైనా పౌరులు విహార యాత్రలకు వెళ్లవచ్చు. దీంతో ఆయా దేశాలూ, చైనా కూడా లబ్దిపొందుతున్నది. ఐదు రోజుల మేడే సెలవుల్లో 5,800 విమానాలు 9.18లక్షల మంది ప్రయాణీకులను చేరవేస్తాయని అంచనా వేశారు. జపాన్, దక్షిణ కొరియాలకు ఎక్కువ మంది వెళతారు. ఈ సారి 2019తో పోలిస్తే ఈ ఏడాది 20శాతం ఎక్కువగా ఈ దేశాలకు టికెట్లను కొనుగోలు చేశారు.ఇతర దేశాలకూ ఇదే రద్దీ ఏర్పడింది.

ఆధునిక పరిజ్ఞానంలో గతంలో చైనా ఎంతో వెనుకబడి ఉండేది. ఇప్పుడు కొన్ని రంగాలలో పశ్చిమ దేశాలను సవాలు చేస్తోంది. ముఖ్యంగా ప్రస్తుతం జనం నోళ్లలో నానుతున్న కృత్రిమ మేధ(ఏఐ)లో చైనా పెరుగుదల ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ముందుకు వస్తుందేమో అన్న భయంతో అమెరికాకు నిదురబట్టటం లేదంటే అతిశయోక్తి కాదు. మేథోసంపత్తి హక్కులున్న నమూనాలకు బదులు అందరికీ అందుబాటులో(ఓపెన్ సోర్స్) ఉన్న వనరుల మీద చైనా కేంద్రీకరిస్తున్నది. ఇప్పటి వరకు అనేక బడా కంపెనీలు కొన్ని ఉత్పత్తులపై పేటెంట్ హక్కులను పొంది విపరీతంగా లాభాలు పొందుతున్న సంగతి తెలిసిందే. కృత్రిమ మేధ అలాంటి కంపెనీలను దెబ్బతీస్తుందని భావిస్తున్నారు. మేధో విజ్ఞానాన్ని మానవ కల్యాణానికి బదులు మారణాయుధాలు తయారు చేసేందుకు, తమకు లొంగని దేశాల వ్యవస్థలను దెబ్బతీసేందుకు వినియోగించిన చరిత్ర పశ్చిమదేశాలది. వివిధ భాషల్లో ఉన్న సమాచారాన్ని పెద్ద ఖర్చు లేకుండానే మన భాషలో తర్జుమా చేసుకొని చదువుకోవచ్చు. మనదేశంలో దుర్వినియోగం చేస్తూ జనాన్ని తప్పుడు సమాచారంతో పక్కదారి పట్టిస్తున్న తీరు ఇప్పటికే చూస్తున్నాము. ఈ రంగంలో చైనా పురోగతిని చూసి అది కూడా తమ మాదిరే వ్యవహరిస్తే అని ఊహించుకొని ఏఐతో చైనా ఇతర దేశాల ఎన్నికల్లో జోక్యం చేసుకుంటుందని, సైబర్‌దాడులు, జీవాయుధాల తయారీ వంటి వాటికి వినియోగించనుందంటూ తప్పుడు ప్రచారం మొదలు పెట్టారు.లైనక్స్, హ్యూమన్ జినోమ్, ఇమేజ్‌నెట్, పైటార్చ్ వంటి అందరికీ అందుబాటులో ఉన్న వనరులతో ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు శాస్త్ర, సాంకేతిక రంగాలలో ఎంతో లబ్దిపొందవచ్చు,విద్యార్థులు, పరిశోధకులకు ఇవి ఎంతో ఉపయోగం.చైనా కంపెనీల విజయానికి ఇదొక ప్రధాన కారణం.వారి నుంచి ఇతర దేశాలు ఎంతో నేర్చుకుంటున్నాయి. చైనాతో పోటీ పడాలని అమెరికాలోని అనేక మంది తమ ప్రభుత్వానికి సలహా ఇస్తున్నారు.

తెలివితేటలు కేవలం కొందరి సొంత అన్న భ్రమలు కలిగిన వారికి అవి పటాపంచలయ్యాయి. కృత్రిమ మేధతో ప్రయోజనాల కంటే ప్రమాదాలే ఎక్కువ అనే ఒక ప్రచారం పెద్ద ఎత్తున జరుగుతోంది. గూండాల చేతుల్లో పడితే చాకులు మారణాయుధాలుగా మారతాయి గనుక ఎక్కువ మందికి వినియోగపడే వాటిని తయారు చేయటం మానుకుంటామా ? అణుబాంబులు కలిగి ఉన్న చైనా, రష్యా కృత్రిమ మేధతో వాటిని మోహరించేందుకు నిర్ణయం తీసుకుంటే ప్రమాదమమని అమెరికా గుండెలు బాదుకుంటోంది. అవసరం లేకున్నా ప్రపంచాన్ని భయపెట్టేందుకు, తమకు లొంగనివారికి ఇదే గతి అని హెచ్చరించేందుకు రెండవ ప్రపంచ యుద్ధ చివరి రోజుల్లో జపాన్ మీద అణుబాంబులు వేసిన దుర్మార్గానికి అమెరికా పాల్పడిన సంగతి తెలిసిందే. అణుబాంబులు దాని వద్ద, మిత్రదేశాలుగా ఉన్న బ్రిటన్, ఫ్రాన్సు దగ్గర కూడా ఉన్నాయి. అవి దుర్వినియోగానికి పాల్పడవన్న హామీ ప్రపంచానికి లేదు. ఆధునిక పరిజ్ఞానాన్ని దుర్వినియోగం చేయవద్దంటూ తమ అధికారులు చైనాతో సంప్రదింపుల్లో చెప్పినట్లు అమెరికా అధ్యక్ష భవనం ఇటీవల ఒక ప్రకటనలో తెలిపింది. కృత్రిమ మేధను దుర్వినియోగం చేస్తున్నారన్న ప్రచారకొనసాగింపులో ఇదొక భాగం.చైనాతో వర్ధమాన సాంకేతిక పరిజ్ఞానంలో పోటీపడలేమని, దానితో ఏదో ఘర్షణ పడటం వలన ప్రయోజనం లేదని అమెరికాకు అవగతమైందంటున్నవారూ లేకపోలేదు.

గత రెండు దశాబ్దాల్లో చైనా సాధించిన ప్రగతిని చూసి అమెరికాలో తీవ్ర మథనం జరుగుతోంది.దాన్నింక ఏమాత్రం తక్కువ అంచనా వేయకూడదని అనేక మంది భావిస్తున్నారు. మార్చినెలలో అధ్యక్షుడు జో బైడెన్ తన పౌరులను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో “ చైనా పెరుగుతోంది, అమెరికా పడిపోతోందంటూ


అమెరికాలో 2023 జీడీపీ పెరుగుదల రేటు 6.3శాతం ఉన్నప్పటికీ ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకుంటే వాస్తవ వృద్ధిరేటు 2.5శాతమే. అదే చైనాను చూస్తే జీడీపీ వృద్ధి రేటు 4.6 శాతమైనప్పటికీ వాస్తవ వృద్ధి 5.2శాతం ఉందని ఆర్థికవేత్తలు చెబుతున్నారు. ఈ వైరుధ్యానికి కారణం చైనాలో ద్రవ్యోల్బణం రేటు తక్కువ, అమెరికాలో ఎక్కువగా ఉండటమే. అమెరికాలో వడ్డీరేటు 2022 మార్చినెల నుంచి 0.25 నుంచి 5.5శాతానికి పెంచగా చైనాలో 3.7 నుంచి 3.45శాతానికి తగ్గించారు. అమెరికాలో వడ్డీరేట్లను తగ్గిస్తే ఎలా ఉండేది రానున్న రోజుల్లో చూడాల్సి ఉంది.

గత కొద్ది సంవత్సరాలుగా నా రిపబ్లికన్ మరియు డెమొక్రాట్స్ స్నేహితుల నుంచి వింటున్నాను ” అని చెప్పాడు. కరోనా తరువాత ఇంక చైనా పని అయిపోయింది, పెరగాల్సిన మేరకు పెరిగింది, ఇంక అవకాశం లేదు అని చెప్పేవారు తయారయ్యారు.కొందరు త్వరలో అమెరికాను అధిగమిస్తుందని, మాంద్యంలో కూరుకు పోతుందని చెప్పినవారూ ఉన్నారు. చైనా వృద్ధి వేగం తగ్గిన మాట నిజం. 2021 నుంచి 2023 వరకు అమెరికా జీడీపీలో 76 నుంచి 67శాతానికి చైనాలో తగ్గిందని, అయినప్పటికీ 2019తో పోల్చితే 20శాతం పెద్దదని, కరోనా సమయంలో అమెరికా కేవలం ఎనిమిది శాతమే పెద్దదన్నది మరచిపోవద్దని అంకెలు చెబుతున్నాయి. అమెరికాలో 2023 జీడీపీ పెరుగుదల రేటు 6.3శాతం ఉన్నప్పటికీ ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకుంటే వాస్తవ వృద్ధిరేటు 2.5శాతమే. అదే చైనాను చూస్తే జీడీపీ వృద్ధి రేటు 4.6 శాతమైనప్పటికీ వాస్తవ వృద్ధి 5.2శాతం ఉందని ఆర్థికవేత్తలు చెబుతున్నారు.

ఈ వైరుధ్యానికి కారణం చైనాలో ద్రవ్యోల్బణం రేటు తక్కువ, అమెరికాలో ఎక్కువగా ఉండటమే.అమెరికాలో వడ్డీరేటు 2022 మార్చినెల నుంచి 0.25 నుంచి 5.5శాతానికి పెంచగా చైనాలో 3.7 నుంచి 3.45శాతానికి తగ్గించారు. అమెరికాలో వడ్డీరేట్లను తగ్గిస్తే ఎలా ఉండేది రానున్న రోజుల్లో చూడాల్సి ఉంది. ■

పొద్దుట తలుపు
తెర్చేసరికి గుమ్మం
దగ్గర మూలుగుతూ పడుంటావు
రాత్రంతా రుధిరాశ్రువుల్లో
తడిసి వస్తావు
గాయపడిన పావురంలా దీనంగా
ముడుచుకొని చూస్తుంటావు..
అణువణువు అంతుతేలని
గాయాలతో
సతమతమవుతుంటావు
పట్టుకుంటే చేతులంతా రక్తం!
హత్తుకొంటే మనసంతా
తీరని దు:ఖం!

అక్షర పావురం!



త్యాగధనులు తెచ్చిన
స్వేచ్ఛా గాలులు
కులమతాల కంపుతో
దుర్గంధం వెదజల్లుతోంటే
నువు ఏ పరిమళాలు పట్టుకొస్తావు
నరనరాన అవినీతి వ్యవస్థ
జవసత్వాలు తోడేస్తోంటే
నువు ఏ అభివృద్ధి
ఆనవాలై ఎగిరొస్తావు?
అబలల్ని బలిచేసి
అసహాయుల్ని
అణచేస్తోంటే రోదనలు
వేదనలు తప్ప
నువు ఏ నవ్వులు నగిషీలు
అద్దుకుంటావు
దబ్బై ఏడేళ్లుగా నమ్మిస్తోన్న రాజకీయం
గొత్తిల మందని
విందు చేసుకొని
పసందుగా పాలిస్తుంటే...
నువ్వు రోజుకో శవమై
వచ్చి పడక ఏం చేస్తావ్
ప్రతి ఉదయం తలుపు తీస్తూనే
చూస్తూంటాను
నీ కోసం!ఎప్పటికైనా..
అవినీతి అంటని ధవళ
కపోతమై
తళతళలాడే త్రివర్ణ పతాకంలో
పెళపెళలాడే
నవభారతాన్ని అందంగా
చుట్టి అపురూపంగా
మోసుకొస్తావని...!!

- భీమవరపు పురుషోత్తమ్
:9949800253

రైల్వే సమ్మెకు యాభై ఏండ్లు

ప్రపంచంలోకెల్లా అతి పెద్ద కార్మిక సమ్మెల్లో ఒకటైన అఖిల భారత రైల్వే సమ్మె మే 8న స్వర్ణోత్సవం జరుపుకున్నది. ఆ సమ్మెలో దాదాపు 20 లక్షల మంది ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు. ఆ సందర్భంలో దేశానికి జీవనాడి అయిన రైలు పట్టాలు 20 రోజుల పాటు నిశ్చలంగా ఉన్నాయి. 1974 మే 8 నుంచి 28 వరకు జరిగిన సమ్మె వర్గ పోరాట చరిత్రలో కొత్త పుటలను లిఖించింది. 15 లక్షల మంది ఉద్యోగులు, 5 లక్షల మంది క్యాజువల్ కార్మికులు చేసిన సమ్మె ప్రపంచం దృష్టిని ఆకర్షించింది.

బ్రిటీష్ పాలనలో రైల్వే ఉద్యోగులు నిరంతరం దోపిడీకి గురయ్యారు. దానికి వ్యతిరేకంగా సాగిన ఉజ్వల పోరాటాలు కూడా సామ్రాజ్యవాద వ్యతిరేకమైనవే. దుర్మార్గపు బ్రిటీష్ సామ్రాజ్యవాదం ఎప్పుడూ వీటిని అణచివేయడానికే ప్రయత్నించింది. 1946లో జరిగిన 31 రోజుల సుదీర్ఘ సమ్మెను అణిచివేసేందుకు శతవిధాలా ప్రయత్నించింది. తిరుచిరాపల్లిలోని గోల్డెన్ రాక్ రైల్వే వర్క్‌షాప్ దగ్గర సమ్మె చేస్తున్న కార్మికులపై పోలీసులు జరిపిన కాల్పుల్లో ఐదుగురు మరణించారు. మొదటి వేతన సంఘం సిఫారసులకు వ్యతిరేకంగా 1948లో దక్షిణ భారత రైల్వే లేబర్స్ యూనియన్ సమ్మెకు దిగింది. 1960, 1968, 1973 సంవత్సరాలలో కూడా సమ్మెలు జరిగాయి.

వలస రాజ్యాల వేతన విధానం ఏ మాత్రం మారలేదు. మొదటి, ద్వితీయ, తృతీయ వేతన కమిషన్ల వల్ల ఉద్యోగులకు న్యాయం జరగలేదు. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, యుద్ధ కాల పరిస్థితుల కారణంగా ఉపాధి హక్కుల తిరస్కరణ.. వీటికి తోడు దేశంలో తీవ్రమైన అసమానతలు.. కార్మికుల్లో అసంతృప్తికి ఆజ్యం పోశాయి. పైగా పని గంటలు అనిశ్చితంగా వుండేవి. ఇంతలో సీఐటీయూ ఏర్పాటు కార్మిక ఐక్యతను బలపరిచింది. దేశంలో ఆందోళనకర వాతావరణం నెలకొంది. సీఐటీయూ మద్దతుతో సదరన్ రైల్వే ఎంప్లాయీస్ యూనియన్



(డీఆర్ఈయూ) కార్మికుల సంక్షేమం కోసం చర్యలు చేపట్టింది. 1973 ఆగస్టులో ఆహార కొరత కారణంగా రైల్వే కార్మికులు మూడు రోజుల పాటు సమ్మెకు దిగారు.

ఈలోగా ‘ఆల్ ఇండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్’ (ఏఐఆర్ఎఫ్) అధ్యక్షుడిగా జార్జ్ ఫెర్నాండెజ్‌ను ఎన్నుకున్నారు. తదనంతరం, 1974 ఫిబ్రవరి 27న ఢిల్లీలో దాదాపు నూట ముప్పై రైల్వే కార్మిక, ఉద్యోగ సంఘాల సమావేశం జరిగింది. సమ్మె కమిటీ (రైల్వే మెన్స్ స్ట్రగుల్ నేషనల్ కో-ఆర్డినేషన్ కమిటీ-ఎన్‌సీసీఆర్ఎస్) ఏర్పాటు చేయబడింది. ఆ తర్వాత కార్మికుల హక్కుల కోసం 1974 మే 8 నుంచి సమ్మె చేయాలని నిర్ణయించారు. ఒకవైపు సమ్మె కమిటీతో రెండవ దశ చర్చలు జరగాల్సి వుంది. ఇంతలో జార్జ్ ఫెర్నాండెజ్‌తో సహా సమ్మె కమిటీ నాయకులను, కార్యకర్తలను, సమ్మెకు మద్దతిచ్చిన వారిని ‘మీసా’ కింద మే 2వ తేదీ ఉదయం, అరెస్టు చేయడం ద్వారా ఇందిరా గాంధీ ప్రభుత్వం దాడిని ప్రారంభించింది. సమ్మె చేస్తున్న వారిపైనే కాదు. వారి కుటుంబాలపైనా హింస జరిగింది. ఈ పోరాటంలో దేశవ్యాప్తంగా ఎంతో మంది అమరులయ్యారు. మదురై సీఐటీయూ కార్యకర్త ఒకరు రైలును ఆపే ప్రయత్నంలో మృతి చెందాడు. సమ్మెకు మద్దతుగా ఎర్నాకులం జంక్షన్ స్టేషన్‌లో ఎ.కె. గోపాలన్, సుశీలా గోపాలన్, ఎం.ఎం.లారెన్స్, కె.ఎన్.రవీంద్రనాథ్ తదితరుల ఆధ్వర్యంలో ప్రదర్శన జరిగింది. నాయకుల మూకుమ్మడి అరెస్టులు, ఆర్థిక ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని మే 28న సమ్మె విరమించాలని నిర్ణయించారు. సమ్మె తర్వాత పదోన్నతి లేకుండానే ఉద్యోగ విరమణ చేయాల్సిన వారికి (స్టేషన్ మాస్టర్ సహా) మూడు పదోన్నతులు లభించాయి. బోనస్ అందింది. క్యాజువల్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేశారు. వేతన విధానంలో గణనీయమైన మార్పు వచ్చింది. కుటుంబ, డిపెండెంట్ పెన్షన్ అందింది. రైల్వే ఉద్యోగులకు ఇప్పుడు అందుబాటులో ఉన్న అనేక అద్భుతమైన ప్రయోజనాలు 1974 సమ్మె తర్వాత అమలులోకి వచ్చినవే.

వలస రాజ్యాల వేతన విధానం ఏ మాత్రం మారలేదు. మొదటి, ద్వితీయ, తృతీయ వేతన కమిషన్ల వల్ల ఉద్యోగులకు న్యాయం జరగలేదు. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, యుద్ధ కాల పరిస్థితుల కారణంగా ఉపాధి హక్కుల తిరస్కరణ.. వీటికి తోడు దేశంలో తీవ్రమైన అసమానతలు.. కార్మికుల్లో అసంతృప్తికి ఆజ్యం పోశాయి. పైగా పని గంటలు అనిశ్చితంగా వుండేవి. ఇంతలో సీఐటీయూ ఏర్పాటు కార్మిక ఐక్యతను బలపరిచింది. దేశంలో ఆందోళనకర వాతావరణం నెలకొంది. సీఐటీయూ మద్దతుతో సదరన్ రైల్వే ఎంప్లాయీస్ యూనియన్ (డీఆర్ఈయూ) కార్మికుల సంక్షేమం కోసం చర్యలు చేపట్టింది. 1973 ఆగస్టులో ఆహార కొరత కారణంగా రైల్వే కార్మికులు మూడు రోజుల పాటు సమ్మెకు దిగారు.

నేడు నాలుగున్నర లక్షల ఖాళీలను భర్తీ చేయకుండా, పర్మినెంట్ ఉద్యోగాల ఊసెత్తకుండా, అప్రెంటిస్, కాంట్రాక్టు నియామకాలను ఉధృతం చేస్తూ దేశంలోకెల్లా అతి పెద్ద ప్రభుత్వ రంగ సంస్థ అయిన రైల్వేను సర్వనాశనం చేసే దిశగా మోడీ నాయకత్వం లోని బిజెపి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. 1974 రైల్వే సమ్మె స్ఫూర్తితో ఇటువంటి చర్యలకు వ్యతిరేకంగా పోరాటాన్ని బలోపేతం చేయాలి.

‘దేశాభిమాని’ సౌజన్యంతో
- ఆర్.జి. పిళ్లై

పాలస్తీనాను అధికారికంగా గుర్తించిన స్పెయిన్, ఐర్లాండ్, నార్వేలు

- క్యాబినెట్‌ల ఆమోద ముద్ర
- ఆచరణాత్మక చర్యలతో ప్రపంచ
- దేశాలకు కీలక సందేశమని వ్యాఖ్య
- గత 24 గంటల్లో 46మంది పాలస్తీనియన్ల మృతి



గాజా : మధ్య ప్రాచ్యంలో శాంతిని శాశ్వతంగా నెలకొల్పడానికి ఏకైక మార్గం పాలస్తీనా దేశాన్ని గుర్తించడమేనని స్పెయిన్ ప్రధాని పెడ్రో శాంచెజ్ వ్యాఖ్యానించారు. నార్వే, ఐర్లాండ్‌తో పాటూ స్పెయిన్ కూడా పాలస్తీనా దేశాన్ని గుర్తిస్తున్నట్లు ప్రకటించాయి. ఈ నిర్ణయానికి ఆమోద ముద్ర వేసేందుకై క్యాబినెట్ సమావేశం జరగడానికి ముందుగా మంగళవారం నాడు శాంచెజ్ మాట్లాడారు. నార్వే, ఐర్లాండ్‌లు తీసుకున్న నిర్ణయాలు ఇప్పటికే అమల్లోకి వచ్చాయి. శాంతిని సాధించే క్రమంలో పాలస్తీనియన్లకు, ఇజ్రాయిలీలకు సాయపడాలన్నదే తమ లక్ష్యమని స్పానిష్ ప్రభుత్వ ప్రతినిధి పిలార్ అల్జీరియా ప్రకటించారు. చారిత్రక న్యాయానికి సంబంధించిన అంశమిదని స్పానిష్ ప్రధాని వ్యాఖ్యానించారు. ఇజ్రాయిల్‌తో కలిసి మెలిసి సహ జీవనం సాగించడమే ఈ సమస్య పరిష్కారానికి గల ఏకైక మార్గమని అన్నారు. వెస్ట్ బ్యాంక్, గాజాలతో వున్న పాలస్తీనాకు తూర్పు జెరూసలేం రాజధానిగా వుండాలన్నారు. 1967కి ముందు నాటి సరిహద్దుల్లో మార్పులను స్పెయిన్ గుర్తించదని చెప్పారు. ఐర్లాండ్ క్యాబినెట్ కూడా పాలస్తీనా దేశాన్ని గుర్తిస్తూ ఆమోద ముద్ర వేసింది. డబ్లిన్‌లో పాలస్తీనా పతాకాన్ని ఎగురవేశారు. ఇదొక కీలకమైన ఘట్టమని, పాలస్తీనాను ఒక దేశంగా గుర్తిస్తూ ఆచరణాత్మకంగా తీసుకునే చర్యలు ప్రపంచ దేశాలకు ఒక సంకేతం పంపుతాయని, రెండు దేశాల ఏర్పాటు పరిష్కారం అమల్లోకి వస్తుందనే ఆశ నెలకొంటుందని ఐర్లాండ్ ప్రధాని సిమన్ హారిస్ వ్యాఖ్యానించారు. ప్రపంచం ఏం కోరుకుంటోందో ఒక్కసారి వినాలని నెతన్యాహును ఆయన కోరారు. పాలస్తీనా దేశాన్ని గుర్తించాలనే దేశాల్లో నార్వే కూడా వుందని, ఇప్పటికి 30ఏళ్లకు పైగా ఇదే వైఖరిని కొనసాగిస్తూ వచ్చామని విదేశాంగ మంత్రి ఎస్పెన్ బర్త్ చెప్పారు. నార్వే, పాలస్తీనా సంబంధాల్లో ఇదొక మైలురాయని వ్యాఖ్యానించారు. తక్షణమే కాకపోయినా తాము కూడా ఈ దిశగా చర్యలు తీసుకుంటామని మాల్టా, స్లొవేనియాలు పేర్కొన్నాయి. ఇప్పటివరకు పాలస్తీనాను 144 దేశాలు గుర్తించాయి. ఇయులో 27 దేశాలు వుండగా, ఇప్పటికి 8 దేశాలు గుర్తించాయి. తాము ఈ ప్రతిపాదనపై ఆలోచిస్తున్నామని బ్రిటన్, ఆస్ట్రేలియాలు తెలిపాయి. ఫ్రాన్స్ ఇది సరైన సమయం కాదని వ్యాఖ్యానించింది. కాగా ఈ దేశాల తాజా ప్రకటనలన్నీ ఇజ్రాయిల్ ఆగ్రహానికి కారణాలయ్యాయి. యూదుల ఊచకోతను రెచ్చగొట్టడానికి స్పానిష్ ప్రధాని శాంచెజ్ చేతులు కలుపుతున్నారని ఇజ్రాయిల్ విదేశాంగ మంత్రి ఇజ్రాయిల్ కట్జ్ ఆరోపించారు.

46మంది పాలస్తీనియన్ల మృతి

గత 24 గంటల్లో గాజావ్యాప్తంగా జరిగిన దాడుల్లో 46మంది పాలస్తీనియన్లు మరణించారు. 110మంది గాయపడ్డారు. ఇజ్రాయిల్ దాడుల కారణంగా రఫాలో మిగిలిన రెండు ఆస్పత్రుల్లో ఒకటైన కువైట్ ఆస్పత్రిని మూసివేశారు. ఇప్పటివరకు 36,096మంది పాలస్తీనియన్లు మరణించగా, 81,136మంది గాయపడ్డారు.

గాజాలో కీలకమైన మానవతా సాయం అందకపోవడం పట్ల జపాన్ తీవ్రంగా ఆందోళన చెందుతోందని ఆ దేశ విదేశాంగ మంత్రి యోకో కామికవా తెలిపారు. అంతర్జాతీయ న్యాయస్థానం జారీ చేసిన ఆందోళనలను తక్షణమే అమలు చేయాల్సిందిగా ఆయన కోరారు. సోమవారం ఇజ్రాయిల్ విదేశాంగ మంత్రితో ఫోన్‌లో మాట్లాడిన ఆయన జపాన్ వైఖరిని స్పష్టం చేశారు.

ఇజ్రాయిల్ దారుణాలను నిరసించండి

- ప్రజలకు సీపీఐ(ఎం) విజ్ఞప్తి

న్యూఢిల్లీ : రఫాలో నిర్వాసితులు నివసిస్తున్న తాత్కాలిక శిబిరంపై ఆదివారం రాత్రి ఇజ్రాయిల్ జరిపిన దాడిని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో తీవ్రంగా ఖండించింది. ఈ దాడిలో అమాయకులైన 45మంది మరణించారు. వీరిలో మహిళలు, పిల్లలు, వృద్ధులు వున్నారు. శిబిరంపై జరిగిన వైమానిక దాడితో ఆ శిబిరానికి నిప్పంటుకుంది. దాంతో లోపల వున్న 20మంది మహిళలు, చిన్నారులు సజీవ దహనమయ్యారు. రఫాపై దాడిని తక్షణమే ఆపాలంటూ అంతర్జాతీయ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసినా వాటిని పట్టించుకోకుండా ఇజ్రాయిల్ సాయుధ బలగాలు అత్యంత అమానుష రీతిలో దాడులు కొనసాగిస్తున్నాయని పొలిట్‌బ్యూరో పేర్కొంది. గత ఏడు మాసాలుగా సాగుతున్న ఈ యుద్ధంలో ఇప్పటివరకు 36వేల మందికి పైగా మరణించారు. ఇంకా వేలాదిమంది శిథిలాల కింద సమాధి అయిపోయారు. ఇజ్రాయిల్ దారుణాలను, అఘాయిత్యాలను నిరసిస్తూ తమ వాణిని వినిపించాల్సిందిగా, రఫాపై దాడులను తక్షణమే ఆపాల్సిందిగా, కాల్పుల విరమణను అమల్లోకి తేవాల్సిందిగా కోరాలంటూ సీపీఐ(ఎం) అన్ని ప్రజాస్వామ్య శక్తులకు, శాంతి కాముకులకు విజ్ఞప్తి చేసింది. ముందుగా ఇజ్రాయిల్ ఈ యుద్ధాన్ని ఆపాలని, కాల్పుల విరమణను అమలు చేసేందుకు అంగీకరించాలంటూ మోడీ ప్రభుత్వం డిమాండ్ చేయాలని పొలిట్‌బ్యూరో కోరింది. అన్ని ఆయుధాల ఎగుమతులను ప్రభుత్వం తక్షణమే ఆపాలని, అత్యంత ఆటవికంగా కొనసాగుతున్న ఈ యుద్ధంలో ఆ ఆయుధాలను ఉపయోగిస్తున్నారని పొలిట్‌బ్యూరో పేర్కొంది.

రఫాపై తాజా దాడి నేపథ్యంలో జనాగ్రహం

- ఇజ్రాయిల్‌పై వెల్లువెత్తుతున్న ఆగ్రహావేశాలు



జెరూసలేం : రఫా నగరంపై ఇజ్రాయిల్ మిలటరీ దాడులకు తెగబడుతున్న నేపథ్యంలో తాజాగా నిర్వాసితులు తలదాచుకున్న శిబిరాలకు నిప్పటించిన ఘటనలో 45మంది పాలస్తీనియన్లు సజీవ దహనమైన సంఘటనపై అంతర్జాతీయంగా ఇజ్రాయిల్‌పై తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ఖండనలు, విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గాజాపై గత ఏడు మాసాలుగా యుద్ధాన్ని కొనసాగిస్తున్న ఇజ్రాయిల్ రఫా నగరంపై దండయాత్రకు దిగడంతో మిత్రపక్షాలు కూడా తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. అయినా వాటన్నింటినీ బేఖాతరు చేసి నెతన్యాహు తాననుకున్న ఆలోచనలతో మూర్ఖంగా ముందుకు సాగుతున్నారు. హమాస్‌ను పూర్తిగా మట్టుబెట్టి కానీ యుద్ధాన్ని ఆపేది లేదని ఖరాకండీగా చెబుతున్నారు. అయితే తాజా ఘటనలో సామాన్యులు డజన్ల సంఖ్యలో మరణించిన ఘటనపై దృష్టి సారించినట్లు ఇజ్రాయిల్ పేర్కొంది. రఫాపై మిలటరీ ఆపరేషన్ మొదలైన తర్వాత తాజాగా ఆదివారం రాత్రి జరిగిన ఈ ఘటనపై పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ స్పందించింది. "సంఘటనా స్థలం నుండి ఏ మాత్రమూ గుర్తించడానికి వీల్లేని రీతిలో వున్న వారిని వెలికితీసాం. పిల్లల శరీరాలైతే ఛిద్రమై పోయాయి. ఎవరెవరో గుర్తించడానికి వీల్లేకుండా మాంసపు ముద్దలుగా వున్నారు. పిల్లలు, మహిళలు, వృద్ధులు ఇలా అందరూ బాధితుల్లో వున్నారు." అని పేర్కొంది. ఫ్రాన్స్ ఈ ఘటనపై తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. తక్షణమే ఈ కార్యకలాపాలు నిలిపివేయాలని కోరింది. రఫాలో ఇక ఎక్కడా పాలస్తీనియన్లకు సురక్షితమైన ప్రదేశం అంటూ లేకుండా పోయిందని అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మాక్రాన్ అన్నారు. అంతర్జాతీయ చట్టాన్ని గౌరవిస్తూ తక్షణమే కాల్పుల విరమణ అమలు చేయాలని కోరారు. ఇటలీ రక్షణ మంత్రి గైడో క్రాసెటో స్పందిస్తూ, ఇజ్రాయిల్ విద్వేషాన్ని వ్యాప్తి చేస్తోందన్నారు

ఫోన్ ట్యాపింగ్‌పై పోలీసులకు పూర్తి స్వేచ్ఛ

(మొదటిపేజీ తరువాయి)

తీరుపై తాను పట్టించుకుంటే, సీఎం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారనే విమర్శలతో బీఆర్ఎస్ పార్టీ ఆయుధంగా మలుచుకుంటుందని అన్నారు. అయితే, అన్నింటిపై సీబీఐ విచారణ కోరే కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులు, ఫోన్ ట్యాపింగ్‌పై సీబీఐతో విచారణ చేయాలని ఎందుకు డిమాండ్ చేయడం లేదని ప్రశ్నించారు. గత ప్రభుత్వం మాదిరిగా తమ ప్రభుత్వం చేయదని, కేవలం ప్రజా పాలన అందించే దిశలో తాము ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు. కేరళలో ఒక కార్యక్రమంలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి సోమవారం అర్ధరాత్రి తరువాత ఢిల్లీ చేరుకున్నారు. మంగళవారం ఉదయం తుగ్లక్ రోడ్ లోని సీఎం అధికారిక నివాసాన్ని మీడియా మిత్రులతో కలిసి పరిశీలించారు. అనంతరం అక్కడే తొలిసారి ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్ చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తాను సీఎంగా బాధ్యతలు చేపట్టాక డిసెంబరు నెలాఖరులో అధికారుల బదిలీలు చేపట్టినప్పుడు ఎస్ఐబీలో కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు అదృశ్యమైనట్టు ఆ శాఖ అధికారులు గుర్తించినట్లు చెప్పారు. అలా దొంగతనం పేరుతో నమోదైన కేసు కాస్తా, ఫోన్ ట్యాపింగ్ కేసుగా మారిందని వివరించారు. ఫోన్ ట్యాపింగ్‌కు తాను పాల్పడనని, ఐఎస్ఐ టెర్రరిస్టులు, దేశరక్షణకు ముప్పు కలిగించే వ్యక్తులపై ఫోన్ ట్యాపింగ్ జరుగుతూ ఉండవచ్చుని, ఆ విషయం తనకు తెలియ దని అన్నారు. హార్డ్ డిస్కులు, సర్వర్లు ధ్వంసం చేయడంతో తీవ్రవాదులకు సంబంధించిన విలువైన సమాచారం పోయినట్లు తాను విన్నానని చెప్పారు. అయితే... ఇంకా ఈ విషయంపై స్పష్టత రాలేదన్నారు. తెలంగాణలో పార్లమెంటు ఎన్నికలు నిష్పక్షపాతంగా జరిగాయని, ఏ ఒక్క సంఘటనా జరగలేదని అన్నారు. అలాగే కాంగ్రెస్ అధికారం చేపట్టాక రాష్ట్రంలో ఎలాంటి శాంతి భద్రతా సమస్యలు తలెత్తలేదని, ఇది తన పాలన తీరుకు నిదర్శనమని తెలిపారు. అయితే పక్క రాష్ట్రం ఏపీలో చాలామంది అధికారులను ఈసీ బదిలీ చేసిందని, తెలంగాణలో ఇలాంటి ఒక్క ఘటన కూడా నమోదు కాలేదని గుర్తుచేశారు. ఎన్నికల వ్యవహారంలో ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీ నేతలు కూడా ఆరోపణలు చేయలేదన్నారు. కానీ అదే పక్క రాష్ట్రంలో 100 మంది అధికారులపై గోడలకు ఏసీ కొట్టారని, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో ఆరోపణలకు కూడా అవకాశం ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో విద్యుత్ కోతలులేవన్నారు. గతంలో 100 యూనిట్లు వాడితే ఇప్పుడు 140 యూనిట్ల దాకా విద్యుత్ వినియోగం పెరిగిందని వివరించారు. ప్రకృతి వైపరీత్యాలతో చెట్లు వైర్లపై తెగిపడడం, వాడకం పెరగడం వల్ల ట్రాన్స్‌ఫార్మర్లపై భారం పెరగడం వంటి పలు కారణాల వల్ల అత్యవసర పరిస్థితుల్లో అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు.

తెలంగాణ అంటే పోరాటాలు.. త్యాగాలు

తెలంగాణ అంటే పోరాటాలు, త్యాగాలని, ఈ గుర్తులే ఇకపై తెలంగాణ చిహ్నం(రాజముద్ర)లో ఉంటాయని రేవంత్ రెడ్డి చెప్పారు. తెలంగాణ అంటే రాజులు, రాజరికాలు గుర్తు రావని, ఆ రాజులకు వ్యతిరేకంగా ఎల్లప్పుడూ కొట్లాడిన చరిత్ర తెలంగాణదని అన్నారు. అదే రాజరిక ఆనవాళ్లు చిహ్నంలో ఉంటే పాలకుల మనస్తత్వం కూడా అలాగే ఉంటుందని చెప్పారు. అందువల్ల కాకతీయ తోరణంతో సహా రాజరికానికి సంబంధించిన గుర్తులేవీ ఉండకపోవచ్చని అభిప్రాయపడ్డారు. పోరాటాలు, త్యాగాలను స్మరించుకునేలా, రాష్ట్రంలో సమ్మక్క-సారక్క, నాగోబా జాతర, పిల్లల మర్రి లాంటివి ఎన్నో చిహ్నాలు ఉన్నాయన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం జూన్ 2న ఆవిష్కరించబోయే అధికారిక రాష్ట్ర చిహ్నంలో ఈ పోరాటాలు, త్యాగాలే ఉంటాయని చెప్పారు. మనమేంటో కనిపించేలా రాజముద్ర ఉంటుందని, ఆ చిహ్నం రూపకల్పన బాధ్యతలు కళాకారులకే వదిలేశానన్నారు. తానేమీ 80 వేల పుస్తకాలు చదవలేదన్నారు. ఇక రాష్ట్ర గీతాన్ని రూపొందించే బాధ్యతలు కవి అందెశ్రీకి వదిలేశానని, మ్యూజిక్ కంపోజింగ్ ఎవరితో చేయించుకుంటారో ఆయనిష్టమని తేల్చిచెప్పారు. కీరవాణి విషయంలో విమర్శలు ఎదుర్కొం టారో, సమర్థించుకుంటారో అందెశ్రీ చూసుకుంటారన్నారు. జయ జయహే తెలంగాణ గీతాన్ని రాష్ట్ర గీతంగా ఆమోదించడమే తన కర్తవ్యమని చెప్పారు. జూన్ 2లోపు గీతాన్ని పూర్తి చేయమని చెప్పానని, ఆయనేలా చేయాలో కూడా తానే చెప్తే, అది కాళేశ్వరం స్టోరీగా మారుతుందన్నారు. తెలంగాణ తల్లి, లోగోను రూపొందించే బాధ్యతలు ఫైన్‌ఆర్ట్స్ కాలేజీకి చెందిన వ్యక్తి, నిజమాబాద్ బిడ్డకు అప్పగించానన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో ఆనాలోచితంగా కేసీఆర్ ఎందుకు వ్యవహరించారో లై డిటెక్టర్ పరీక్ష చేస్తే తప్ప అసలు విషయాలు బయటికి రావన్నారు. ఈ విషయంలో కేసీఆర్ ని విచారణ చేయాలేమో అని వ్యంగ్యాస్త్రాలు విసిరారు. ఈ ప్రాజెక్ట్ పై అసెంబ్లీకి వచ్చి చెబుతారేమో అనుకుంటే ఆయన రావట్లేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో జియో ఫిజికల్, జియో టెక్నికల్ సర్వేలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం ఆ సర్వేలు చేసే సామర్థ్యమున్న రెండు ఏజెన్సీలను సంప్రదించినట్లు చెప్పారు. మట్టి నాణ్యత పరీక్షలు కూడా వేరే దగ్గర చేసి ప్రాజెక్టు వేరే చోట కట్టారన్నారు. ఈ విషయాలేవీ రికార్డుల్లో లేవన్నారు. ఈఎన్సీ మురళీధర్ రావు పోతూపోతూ అన్ని పట్టుకెళ్లాడని విమర్శించారు. ఇంకేమైనా ఉంటే ఆయన మనషులతో తెప్పించుకుంటున్నారని, సంబంధిత ఫైళ్లను చింపివేయాలని చెబుతున్నాడన్నారు. తప్పు జరిగిందని చర్యలు తీసుకోబోతే, ఇంజనీరింగ్ శాఖలోని ఆఫీసర్లు ఒకరినొకరు కాపాడుకుంటున్నారని, ఎవరు ఏ విషయం చెప్పట్లేదన్నారు.

విరిగింది కేసీఆర్ పన్ను కాదు, కాళేశ్వరం వెన్నెముక

మేడిగడ్డ బ్యారేజీలో జరిగింది కేసీఆర్ 32 పళ్లలో ఒక పన్ను విరగడం కాదని, మొత్తం ప్రాజెక్ట్ వెన్నెముకనే విరిగిందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ విషయంలో నిపుణులు సూచనల మేరకే ముందుకెళ్తామని తేల్చి చెప్పారు. అయితే రాజకీయాలకు పోకుండా... నీళ్లను తాత్కాలికంగా లిఫ్ట్ చేసేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. అన్నారం, సుందిళ్ల, మేడిగడ్డ బ్యారేజీ. గేట్లన్నీ తెరిచిపెట్టాలని నేషనల్ డ్యాం సేఫ్టీ(ఎన్డీఎస్ఏ) అధికారులు చెబుతున్నారన్నారు. అలాకాకుండా గేట్లు క్లోజ్ చేస్తే బ్యారేజ్ మొత్తం



కూలిపోయే పరిస్థితులున్నాయని చెబుతున్నారన్నారు. మేడిగడ్డలో నీళ్లు ఎత్తి అన్నారంలో పోయాలని కేసీఆర్ అంటున్నారని, అన్నారంలో ఉన్న నీళ్లనే సముద్రంలోకే వదిలామని గుర్తు చేశారు. మేడిగడ్డ నుంచే నీళ్లు ఎత్తిపోస్తే అన్నారం గేట్లు ఎత్తినందున మళ్లీ మేడిగడ్డకే నీళ్లు వస్తాయి. కాళేశ్వరం ప్రాజెక్టులో నీళ్లు 30 రోజులు ఎత్తిపోశాక, 31వ రోజు వర్షం పడితే నీళ్లన్నీ సముద్రంలోకి వదలాల్సిన పరిస్థితి అని చెప్పారు. కేసీఆర్ ఈ లాజిక్ మిస్ అయ్యారని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయ్యాక ఇప్పటివరకు 52 టీఎంసీల నీళ్లు ఎత్తిపోశారని, వీటికి కట్టిన కరెంట్ బిల్లులు సముద్రంలోకి వదిలినట్లు అయిందన్నారు. జ్యుడీషియల్ విచారణ మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లకే పరిమితమన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల మరమ్మతులను తక్షణమే చేపట్టాలని తమ ప్రభుత్వం భావిస్తోందన్నారు. ప్రాజెక్టు నిర్మాణ అంచనాలను పెంచడంపై దష్టి పెడితే రాష్ట్రంలో ఏ ప్రాజెక్టు ముందుకు సాగదన్నారు. విచారణ చేపడితే పెండింగ్లో ఉన్న ప్రాజెక్టుల పనులు చేయించలేని, బిల్లులు చెల్లించలేని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు దగ్గర భూమిలో ఏముందో పరీక్షలు జరిపితే తప్ప ఏమీ చెప్పలేని పరిస్థితులున్నాయన్నారు. పన్నెండున్నర మీటర్లకు ఆరు మీటర్లు ఉంటే రెండున్నర మీటర్లు.. మేడిగడ్డ బ్యారేజీ ఇసుకమీద కట్టారన్నారు. బ్లాక్లు వేటికవే ఉండడంతో ఒక్కో బ్లాక్ మీద భారం పడిందన్నారు. నిశ్చితమైన అభిప్రాయం సలహాలను పాటిస్తానని తేల్చి చెప్పారు.

నకిలీ పత్రాలతో ఫేక్ రిజిస్ట్రేషన్

- గతంలో నలుగురి అరెస్టు
- తాజాగా రిజిస్ట్రార్‌తో సహా మరో ఐదుగురి అరెస్టు

నవతెలంగాణ-మనోహరాబాద్



కోట్ల రూపాయల విలువైన సుమారు వెయ్యి గజాల భూమికి సంబంధించి నకిలీ పత్రాలను సృష్టించి రిజిస్ట్రార్‌తో కుమ్మక్కై రిజిస్ట్రేషన్ చేసిన ఘటనలో ఇది వరకే నలుగురిని అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. తాజాగా సబ్ రిజిస్ట్రార్‌తో కలిసి మరో ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు మనోహరాబాద్ ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మండలంలోని కూచారం శివారులోని 225, 226సర్వే నంబర్‌లోని వెయ్యి గజాల స్థలంపై కన్నేసిన హైదరాబాద్‌కు చెందిన మల్లవరపు అరుణ్‌కుమార్.. మరో ఎనిమిది మందితో కలిసి ఆ స్థలంపై నకిలీ పత్రాలను సృష్టించారు. అనంతరం ఆ స్థలాన్ని హైదరాబాద్‌లోని మోతీనగర్‌కు చెందిన సురవజ్జుల సత్యనారాయణమూర్తి, స్వాతి దంపతులకు విక్రయించారు. కాగా, ఆ భూమి అసలు యజమాని దుర్గా అనే మహిళ పేరున రిజిస్ట్రేషన్ అయి ఉన్నది. దాంతో నిందితులు హైదరాబాద్‌లోని రాంనగర్‌కు చెందిన లక్ష్మి అనే మహిళకు డబ్బులు ఎరచూపి లక్ష్మి ఆధార్ కార్డును దుర్గగా మార్ఫింగ్ చేసి సత్యనారాయణ దంపతులకు లక్ష్మి చేత రిజిస్ట్రేషన్ చేయించారు. సత్యనారాయణమూర్తి లింక్ డాక్యుమెంట్ కోసం ఆరా తీయగా అమ్మిన వ్యక్తులు పొంతన లేని సమాధానాలు ఇవ్వడంతో తాను కొనుగోలు చేసిన ప్లాట్ దగ్గరకు వెళ్లగా ఆ స్థలంలో వేరే వ్యక్తుల పేరుతో బోర్డు ఉండటంతో అసలు విషయం బయటపడింది. దాంతో మోసపోయినట్టు గ్రహించిన సత్యనారాయణ గత నెలలో మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. విచారణ చేపట్టిన పోలీసులు గతంలోనే నలుగురిని అరెస్టు చేయగా మంగళవారం మరో ఐదుగురు నిందితులైన పిట్ల సాయికుమార్, వేముల ప్రభాకర్, నంగునూరి లక్ష్మి, డాక్యుమెంట్ రైటర్ కుమ్మరి బాలకృష్ణ, తూప్రాన్ సబ్ రిజిస్ట్రార్ సనత్ నగర్ రమణను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు మనోహరాబాద్ ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపారు.

జేబుల్లోంచి పెట్టలేక.. జీతాలు రాక..

(మొదటిపేజీ తరువాయి)

జీతాలిస్తలేరు? పూట ఎట్ల గడుస్తది? అని ప్రశ్నిస్తున్నారు. ఇటు ఉన్నతాధికారుల ఆదేశాలను కాదనలేక, క్షేత్రస్థాయిలో జీపీ సిబ్బందికి నచ్చజెప్పలేక, ఇటు కుటుంబ అవసరాలు తీర్చలేక మానసికంగా ఇబ్బందులు పడుతున్నాం' అంటూ తాను రోజువారీగా అనుభవిస్తున్న బాధలను చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో ఆయా జిల్లాలకు చెందిన పలువురు పంచాయతీ కార్యదర్శులను కదలిస్తే ఇంచుమించు పై ఇద్దరి మాదిరిగానే తమ సాధకబాధకాలను చెప్పుకొచ్చారు. చిన్న గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులు ఎక్కువ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెద్ద గ్రామపంచాయతీల్లో (మూడు నాలుగు వేల ఓటింగ్ ఉన్న) కొంత సొంత ఆదాయాలు వస్తుండటంతో రోజువారీ అవసరాలకు ఆ నిధులు కొంతమేరకు ఉపయోగపడుతున్నాయి. అయితే, ఆ పంచాయతీల్లోనూ ఎంతో కొంత కార్యదర్శులు తమ చేతుల్లోంచి పైసలు పెట్టుకోవాల్సిన దుస్థితే నెలకొంది.

నాలుగైదు నెలల జీతాల్వికపోతే.. బతికేదెట్లా?

వేలకు వేల జీతాలొచ్చే వారే జీతాలు రావడం అటూ ఇటూ అయితే లబోదిబోమని గుండెలు బాదుకోవడం మన చూస్తుంటాం. మరి రూ.8,500(పంచుకుంటే ఐదారు వేలు కూడా దక్కని పరిస్థితి) వచ్చే వారు ఎంత ఇబ్బందులు పడుతారో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. రాష్ట్రంలోని గ్రామపంచాయతీల్లో నాలుగైదు నెలలుగా పంచాయతీ కార్మికులకు వేతనాలు అందడం లేదు. ఆరేడు నెలల జీతాలు పెండింగ్‌లో ఉన్న పంచాయతీలు కూడా ఉండటం గమనార్హం. నిర్మల్ జిల్లా బైంసా మండలం అంజనీ తండాలో చెత్తసేకరణ ట్రాక్టర్ నడిపే పారిశుధ్య కార్మికుడు పంచాయతీ కార్యదర్శిని జీతం అడిగి అడిగి విసుగుచెంది ట్రాక్టర్‌ను తీసుకుపోయిన వీడియో రాష్ట్రమంతటా చర్చనీయాంశం అవుతున్న విషయం విదితమే. ఇప్పటికే వేతనాల కోసం సీఐటీయూ పోరాటం చేస్తున్నది. మండల కేంద్రాల్లో కార్మికులు రోడ్లెక్కి నిరసనలు చెబుతున్నారు. వేతనాలు ఇప్పించాలని మండల, జిల్లా అధికారులను వేడుకుంటున్నా కనికరించేవారు లేకుండా పోయారు. పైగా, జీతాలిచ్చినా ఇవ్వకపోయినా రోజువారీ పనులు చేయాల్సిందేననీ, లేకపోతే పల్లెలు కంపుకొడతాయని పంచాయతీ కార్యదర్శులతో ఒత్తిడి చేయిస్తున్నారు.

ఉన్నతాధికారులు మాట తప్పారు.. కోడ్ ముగియగానే మళ్లీ పోరుబాట : చాగంటి వెంకటయ్య, తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగులు, కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



పంచాయతీ కమిషనరేట్ ఎదుట ఆందోళన చేసిన సమయంలో పెండింగ్ వేతనాలు క్రమంగా క్లియర్ చేస్తున్నామనీ, నెలరోజుల్లో పెండింగ్ వేతనాల సమస్య ఉండకుండా చూస్తామని పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులు హామీ ఇచ్చి మాట తప్పారు. 3 నుంచి 7 నెలల వరకు వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. నిధుల్లేక ఇవ్వలేకపోతున్నామని జిల్లా, మండల అధికారులు చేతులెత్తేస్తున్నారు. ఇచ్చేదే అరకొర వేతనం. అదీ నెలల తరబడి పెండింగ్‌లో పెడితే ఎలా బతకాలో రాష్ట్ర ప్రభుత్వమే చెప్పాలి. ఎన్నికల కోడ్ ముగిసే వరకు వేచిచూస్తాం. జూన్ నెలలో దశలవారీగా ఆందోళనలు చేపడతాం. అప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ వేతనాల సమస్యను పరిష్కరించకపోతే పోరాటాన్ని తీవ్రతరం చేస్తాం.

ఆవిర్భావ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను ప్రభుత్వం అత్యంత ఘనంగా నిర్వహించనుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితోపాటు రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యే ఈ వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహించడానికి ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లను చేస్తున్నది. జూన్ 2న ఉదయం ముఖ్యమంత్రి గన్‌పార్కులో అమరవీరుల స్థూపానికి పూల మాలలు సమర్పించి నివాళులు అర్పిస్తారు. అనంతరం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో పలు కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి పాల్గొంటారు.

సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ

అదే రోజు సాయంత్రం ట్యాంక్ బండ్‌పై పలు సాంస్కృతిక కార్యక్రమాలు, కార్నివాల్, బాణ సంచా, లేజర్ షోతో పాటు, ఫుడ్, గేమింగ్ స్టాళ్లను నిర్వహించనున్నారు. ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలకు ముఖ్యమంత్రి, మంత్రులు, ఇతర ప్రముఖులు హాజరవుతారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన పలు సాంస్కృతిక కళా బృందాలచే కార్నివాల్ ప్రదర్శనలు ఉంటాయి. ప్రధాన స్టేజీపై పలు శాస్త్రీయ, జానపద, దక్కనీ సాంస్కృతిక కార్యక్రమాలు. 'జయ జయహే తెలంగాణ' పై జాతీయ జెండాలతో మార్చ్-ఫాస్ట్, మిరుమిట్లు గొలిపే ఫైర్ వర్క్స్ ప్రదర్శన, లేజర్ షోలను నిర్వహిస్తారు. ట్యాంక్ బండ్‌పై దాదాపు 80 స్టాళ్లను ఏర్పాటు చేయనున్నారు. ఈ స్టాళ్లలో రాష్ట్రంలోని హస్త కళలను, స్వయం సహాయక బృందాలు తయారు చేసే వస్తువులు, చేనేత ఉత్పత్తులు, నగరంలోని పలు ప్రముఖ హోటళ్ళతో స్టాళ్ళ ఏర్పాటు, చిన్న పిల్లలకు గేమింగ్ షోలను నిర్వహించనున్నారు.

కుల దురహంకార హత్య

(మొదటిపేజీ తరువాయి)

శివాజీ విగ్రహం పక్కనే బుద్ధుని కోసం స్థలం తీసి అక్కడ దిమ్మెను ఏర్పాటు చేశారు. దాన్ని అడ్డుకోవడం కోసం పెత్తందార్లు ప్రయత్నించడంతో బేగరి నర్సింహ అనే వ్యక్తి బుద్ధుని దిమ్మె కోసం గట్టిగా మాట్లాడాడు. ఆ కుట్రతో కొందరు అతనిపై తప్పుడు కేసులు పెట్టి పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించి విచక్షణారహితంగా రక్తం కారేటట్లు కొట్టించారు. ఇదంతా నాలుగేండ్ల క్రితం సంగతి. ఇంత చైతన్యవంతమైన పాత్ర పోషించిన బేగరి నర్సింహ(45) కొడుకైన బేగరి రాకేష్ ఇంటర్ చదువుకుని సంగారెడ్డిలో ఉంటూ పని చేసుకుంటున్నాడు. నర్సింహ ఊర్లో తనకున్న చిన్న ఇంటిని సోదరుడికి అమ్మేసి తనకున్న వ్యవసాయ భూమి వద్దనే గుడిసె వేసుకుని కాపురం ఉంటున్నాడు. నర్సింహ పొలం పక్కనే ఉన్న ఓ ఫామ్‌హౌస్‌లో తాండూరు ప్రాంతానికి చెందిన బుజ్జమ్మ, రాములు తన కూతురుతో వచ్చి పనిచేస్తూ అక్కడే ఉన్నారు. ఆ క్రమంలోనే రాకేష్, నందిని మధ్య పరిచయం ఏర్పడింది. క్రమంగా ప్రేమగా మారి ఇద్దరు కలిసి ఈ నెల 1వ తేదీన పెండ్లి చేసుకున్నారు. ఈ విషయం ఊర్లో వాళ్లందరికీ తెలియడంతో కొందరు అగ్రకుల పెద్దమనుషులు ఆ యువతిని తల్లిదండ్రుల్ని ప్రేరేపించి పోలీసలకు ఫిర్యాదు చేయించారు. పోలీసులు ఇద్దరికీ కౌన్సెలింగ్ ఇచ్చి ఎవరంతల వాళ్లు ఉండాలని చెప్పి పంపారు. మరుసటి రోజున కొందరు పెద్దమనుషులు పోలీసులపై ఒత్తిడి తెచ్చి రాకేష్‌పై మైనర్‌ను పెండ్లి చేసుకున్నాడనే నెపంతో కేసు పెట్టి చర్లపల్లి జైల్లో రిమాండ్ చేశారు.

కొడుకు దొరకలేదని తండ్రి హత్య

అగ్ర కులం పిల్లను దళితుడు పెండ్లి చేసుకోవడం ఏమిటనీ, వాడిని చంపేస్తే పీడ పోతదంటూ పలువురు నర్సింహని పట్టుకుని తిట్టారు. రెండు నెలల క్రితం ఊర్లో ఓ దళిత యువకుడు అగ్రకుల అమ్మాయిని ప్రేమించి పెండ్లి చేసుకుని ఊర్లోనే ఉంటున్నాడు. ఆ కక్షకు తోడు రాకేష్ కూడా అగ్రకుల అమ్మాయిని పెండ్లి చేసుకోవడంతో ఓర్వలేక రాకేష్ తండ్రి నర్సింహపై దాడికి పాల్పడ్డారు. ఈ నెల 18న సాయంత్రం పొలం నుంచి ఊర్లోకి వచ్చి సామాన్లు తీసుకుని వెళ్తుండగా 9 మంది నర్సింహపై మూకుమ్మడిగా దాడి చేశారు. ఊర్లో వీధి దీపాలు లేని రాచన్నస్వామి గుడి ప్రాంతంలో విచక్షణారహితంగా కొట్టారు. తలపై బలంగా కొట్టడంతో పాటు కడుపు, కిడ్నీలపై కొట్టారు. గొంతు నులిమి చంపేందుకు పూనుకున్నారు. తీవ్ర రక్తస్రావం అవడంతో నర్సింహులు స్పృహ తప్పి పడిపోయాడు. రాత్రంతా ఎవరూ చూడలేదు. తెల్లవారి చెత్తఎత్తే సిబ్బంది ఒకరు రక్తంతో పడి ఉన్న నర్సింహను చూసి ఆయన భార్య అంజమ్మకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. వెంటనే ఆమె అక్కడికి చేరుకుని అతన్ని కోహీర్ ఆస్పత్రికి తీసుకెళ్లింది. వైద్యులు చికిత్స కోసం సంగారెడ్డికి పంపగా అక్కడ పరీక్షలు చేసిన వైద్యులు ఉస్మానియాకు పంపారు. నర్సింహకు బ్రెయిన్, గొంతు, పొట్ట వద్ద తీవ్రమైన గాయాలయ్యాయని, కొన్ని ఆపరేషన్లు చేశారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఈ నెల 26న మృతి చెందాడు. దాంతో ఆగ్రహించిన దళితులు సోమవారం (27వతేదీ) రాత్రి దాడి చేసిన పట్లోళ్ల దయానంద్ ఇంటి ముందు శవం పెట్టి ఆందోళన చేశారు. పట్లోళ్ల సందీప్, పట్లోళ్ల రాహుల్, గొల్ల మల్లేశం, రాములు, శ్రీనివాస్, నాని, దయానంద్ ఇతరుల్ని అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేస్తూ వందలాది మంది దళితులు ఆందోళన చేశారు.

నర్సింహులు హత్యపై సమగ్ర విచారణ జరపాలి: కేవీపీఎస్

దళితుడైన బేగరి నర్సింహను అగ్రకుల పెత్తందార్లు దారుణంగా కొట్టి చంపిన సంఘటనపై సమగ్ర విచారణ జరపించాలని, నిందితుల్ని కఠినంగా శిక్షించి బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కేవీపీఎస్ డిమాండ్ చేసింది. మంగళవారం కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మాణిక్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, సహాయ కార్యదర్శి మహేష్, నాయకులు నరేష్, తుల్జారం, శ్రీనివాస్, నాగేందర్, జైపాల్ ప్రతినిధి బృందం మృతుడు నర్సింహ కుటుంబాన్ని పరామర్శించారు. సంఘటనకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాణిక్యం మాట్లాడుతూ.. కేసు విచారణలో పోలీసులు పక్షపాతంగా వ్యవహరిస్తున్నందున ఉన్నతాధికారి చేత సమగ్ర విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. దాడి చేసి పది రోజులైనా.. చనిపోయి మూడు రోజులవుతున్నా ఇప్పటి వరకు నిందితుల్ని అరెస్టు చేయకపోవడం దారుణమన్నారు. నర్సింహపై దాడి చేసిన 9 మందిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలన్నారు. ప్రభుత్వం నర్సింహ్మ కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా, మూడు ఎకరాల భూమి, ఇందిరమ్మ ఇల్లు, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ముగ్గురు నిందితులపై కేసు : క్రిష్ణయ్య, ఎస్ఐ, కోహీర్

మృతుడు నర్సింహ తండ్రి బేగరి రాచయ్య ఫిర్యాదు మేరకు ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేశాం. దాడిలో ఎవరెవరు ఉన్నారనేది తేల్చేందుకు విచారణ కొనసాగుతున్నది. నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, ఇతర కేసులు నమోదు చేశాం. కేసు విచారణలో ఎలాంటి నిర్లక్ష్యం లేదు. నిష్పక్షపాతంగా విచారణ జరుగుతున్నది.

విపక్షాలపై నిఘా పెట్టాం.. డబ్బులు సీజ్ చేశాం



(మొదటిపేజీ తరువాయి)

తాను టీంను ఏర్పాటు చేసుకొని ఈ ఆపరేషన్లకు పాల్పడినట్టు తిరుపతన్న వెల్లడించాడు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో.. ప్రస్తుత మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి చెందిన రాఘవేంద్ర కంపెనీ నుంచి రూ.10 కోట్లు, వివేక్ వెంకటస్వామికి చెందిన కార్యాలయం నుంచి రూ.50 లక్షలు, కామారెడ్డిలో అప్పటి బీజేపీ అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే వెంకటరమణరెడ్డి, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డి వద్ద నుంచి కూడా భారీ మొత్తంలో డబ్బులను సీజ్ చేసినట్టు తెలిపాడు. మహబూబ్‌నగర్‌లో ప్రస్తుత సీఎం రేవంత్‌కు చెందిన సన్నిహితుల నుంచి రూ.1.10 కోట్లతో పాటు పలువురు ప్రతిపక్ష నాయకులు, వ్యాపారుల వద్ద నుంచి భారీ మొత్తంలో డబ్బులను సీజ్ చేశామని ఆయన వాంగ్మూల పత్రంలో తెలిపారు.

అంతేగాక, పలువురు వ్యాపారుల మధ్య ఉన్న విభేదాలు, ఘర్షణలను కూడా ఫోన్‌ట్యాపింగ్‌ల ద్వారా కనిపెట్టి, తర్వాత వారి మధ్య సఖ్యతను కూడా కుదుర్చేవారమని చెప్పారు. మొత్తమ్మీద, అదనపు ఎస్పీ బుజంగరావు, మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు, డీఎస్పీ ప్రణీత్ రావుతో సమన్వయమవుతూ ఈ ఫోన్‌ట్యాపింగ్‌లకు పాల్పడటమేగాక వారి ద్వారా వచ్చిన సమాచారం ఆధారంగా వ్యూహాలను రూపొందించి విపక్షాలకు చెందినవారి డబ్బులను ఎన్నికల సమయంలో సీజ్ చేయటం జరిగిందనీ, ఇదంతా ఒక వ్యూహం ప్రకారమే జరిగేదని తిరుపతన్న తన వాంగ్మూల పత్రంలో అంగీకరించారు.

ప్రభాకర్‌రావుకు రెడ్‌కార్నర్ నోటీసుపై సీబీఐను సంప్రదించిన సీఐడీ

ఫోన్‌ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడైన రాష్ట్ర ఎస్ఐబీ మాజీ ఐజీ ప్రభాకర్‌రావు కోసం జారీ చేసిన రెడ్‌కార్నర్ నోటీసుకు సంబంధించి సీబీఐ అధికారులతో రాష్ట్ర సీఐడీ ఉన్నతాధికారులు మంగళవారం సంప్రదించినట్టు విశ్వసనీయ సమాచారం. ఈ రెడ్‌కార్నర్ నోటీసును అంతర్జాతీయంగా జారీ చేయటానికి ఇంటర్‌పోల్‌తో సీబీఐ అధికారులు సమన్వయం అవుతున్న విషయం తెలిసిందే. ఈ నోటీసు పురోగతికి సంబంధించి సీబీఐ అధికారులతో రాష్ట్ర సీఐడీ ఉన్నతాధికారులు మాట్లాడినట్టు సమాచారం. ఆ ప్రక్రియను తాము నియమ నిబంధనల ప్రకారం ఇంటర్‌పోల్ అధికారులతో సంప్రదిస్తూ కొనసాగిస్తున్నామని సీబీఐ అధికారులు సమాచారమిచ్చినట్టు తెలిసింది.

ఆర్టీఏలో ఏసీబీ తనిఖీలు

(మొదటిపేజీ తరువాయి)

డ్రైవింగ్ లైసెన్స్, వాహనాల రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్ సరిఫికెట్ల జారీతో పాటు మొత్తం 59 సేవలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయి. ఈ సేవల కోసం వినియోగదారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే సదుపాయం ఉంది. వీటిలో సగానిపైగా సేవలు ఇంటి నుంచే చేసుకునే వెసులుబాటు కల్పించింది. అయితే కొన్ని సేవలకు మాత్రం ఆర్టీఏ కార్యాలయాలకు రావాల్సి వస్తోంది. ఇందులో వెహికల్ రిజిస్ట్రేషన్, లెర్నింగ్ లైసెన్స్, వాహన ఫిట్‌నెస్‌తో పాటు మరో పది రకాల సేవలకు మాత్రం ఖచ్చితంగా ఆఫీసులకు రావాల్సిందే. ఇందుకోసం నేరుగా స్లాట్ బుక్ చేసుకొని.. తమకు కేటాయించిన తేదీల్లో సేవలు పొందొచ్చు. వాస్తవానికి ఆన్‌లైన్ సేవల పట్ల చాలామంది వాహనాదారుల్లో అవగాహన లేకపోవడంతో ఏజెంట్లను ఆశ్రయిస్తున్నారు. మరోవైపు డైరెక్ట్‌గా వచ్చే దరఖాస్తులను అధికారులు పక్కన పెడతారని, ఏజెంట్ల ద్వారా వచ్చే ఫైల్స్ క్షణాల్లో పూర్తి చేస్తారనేది ప్రధాన ఆరోపణ. దీంతో చాలామంది వాహనదారులు ఏజెంట్లు, మధ్యవర్తులను ఆశ్రయించి పనులు చక్కబెట్టుకుంటారు. అందుకు వారికి కొంతమొత్తంలో డబ్బులు చెల్లిస్తుంటారు.

వందల్లో ఫీజులు..వేలల్లో చెల్లింపులు..!

ప్రభుత్వానికి రాష్ట్రంలో నాలుగో అతిపెద్ద ఆదాయ వనరు రవాణాశాఖ. ఆర్టీఏ కేంద్రాల ద్వారా ప్రతిరోజూ వేల సంఖ్యలో వాహనదారులు వివిధ రకాల సేవలు పొందటం ద్వారా ఆ శాఖకు రోజుకు కోట్లల్లో ఆదాయం వస్తోంది. అలాగే గ్రేటర్‌లో రోజూ కొత్త వాహనాల రిజిస్ట్రేషన్‌లు సుమారు 1500కుపైగా అవుతాయి. అదే స్థాయిలో డ్రైవింగ్ లైసెన్స్‌లు కూడా జారీ అవుతుంటాయి. దీనికితోడు రవాణా శాఖ అందజేసే సేవల ఫీజులు కూడా చాలా వరకు రూ.500-1000లోపే ఉన్నాయి. కానీ వందల్లో చెల్లించాల్సిన ఫీజులకు బదులు వేల రూపాయిలు వెచ్చించాల్సి వస్తోందని వాహనదారుల నుంచి ఫిర్యాదులు ఉన్నాయి.

ఏజెంట్లు, నకిలీ పత్రాలపైనే ఏసీబీ దృష్టి..!

ఏసీబీ దాడుల్లో ప్రధానంగా ఏజెంట్లు, నకిలీ పత్రాలపైనే దృష్టి కేంద్రీకరించినట్టు తెలుస్తోంది. అధికారులు, ఏజెంట్లు మధ్య సత్సంబంధాలు, నకిలీ ఇన్సూరెన్స్‌లు, ఫేక్ అడ్రస్‌లతో ఆధార్ కార్డులు, గ్యాస్ బిల్లులు సృష్టించి వాహన రిజిస్ట్రేషన్లు, డ్రైవింగ్ లైసెన్సులు, ఇతర సేవలకు సంబంధించి జరుగుతున్న పనులతో పాటు ప్రతి పనికీ ఒక రేటు ఫిక్స్ చేసి వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులపైనే ఏసీబీ అధికారుల దాడులు జరిగాయని సమాచారం.

నల్లగొండ డీటీవో కార్యాలయంలో.. ఆరుగురు ఏజెంట్లను అదుపులోకి తీసుకున్న అధికారులు

నల్లగొండ జిల్లా రవాణా శాఖ (డీటీఓ) కార్యాలయంలోనూ ఏసీబీ తనిఖీలు జరిగాయి. మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు ఆకస్మికంగా ఏసీబీ డీఎస్పీ జగదీష్ చందర్, ఇన్‌స్పెక్టర్లు రామారావు, వెంకటేశ్వరరావు, మరో 9 మంది సిబ్బందితో ఆకస్మిక దాడులు చేశారు. ఆరుగురు ఏజెంట్లను అదుపులోకి తీసుకున్నారు. లైసెన్స్, ఆర్సి, రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన 60 దస్తావేజులను, రూ.12,500 స్వాధీనం చేసుకున్నారు. ఆర్టీవో కార్యాలయంలో అవకతవకలు జరుగుతున్నాయని, అనధికార ఏజెంట్ల ద్వారా అధికారులు, సిబ్బంది అవినీతికి పాల్పడుతున్నారని ఫిర్యాదులందినట్టు డీఎస్పీ మీడియాతో తెలిపారు. ఏసీబీ డీజీ ఆదేశానుసారం ఆకస్మిక తనిఖీ చేస్తున్నామన్నారు. ఏజెంట్లు కార్యాలయం లోపలికి రావడానికి లేదని, కానీ సిబ్బంది నిర్లక్ష్యం వల్లే ఏజెంట్లు లోపలికి వచ్చినట్టు తెలుస్తోందన్నారు. ఎంవిఐ, ఏఎంవీఐలు, ఇతర సిబ్బంది విధులకు సక్రమంగా హాజరు కాకపోవడాన్ని గుర్తించామన్నారు. ప్రభుత్వ అధికారులు, సిబ్బంది చేయాల్సిన పనులు చేయకుండా లంచం అడిగితే టోల్ ఫ్రీ నెంబర్ 1064 ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఆదిలాబాద్‌లో..

ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం బోరజ్ ఇంటిగ్రేటెడ్ చెకోపోస్టులో ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఏసీబీ కరీంనగర్ రేంజ్ ఇన్స్‌పెక్టర్ తిరుపతి ఆధ్వర్యంలో సోదాలు చేశారు. ఇందులో లెక్కకు రాని రూ.11630ను గుర్తించారు. ఎంవీఐ యశ్వంత్‌కుమార్, ఏఎంవీఐ అపర్ణను దాదాపు రెండు గంటల పాటు విచారించారు.

కరీంనగర్‌లో..

కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలో ఉన్న జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో ఏసీబీ అధికారులు దాడులు చేశారు. మధ్యాహ్నం 12.30గంటలకు ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి, సీఐ కృష్ణకుమార్ ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. వాహనదారులు, సేవాదారుల నుంచి స్లాట్ బుకింగ్ పత్రాలు, ఇతర పత్రాలను తీసుకుని పరిశీలించారు. ఏసీబీ డీజీ ఉత్తర్వుల మేరకు రాష్ట్రవ్యాప్తంగా రవాణా శాఖ కార్యాలయాల్లో తనిఖీలు నిర్వహించినట్టు ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి మీడియాకు తెలిపారు. కార్యాలయంలో అవకతవకలు గుర్తించినట్టు తెలిపారు. సేవల కోసం వచ్చే వాహనదారుల నుంచి తీసుకోవాల్సిన దానికంటే ఎక్కువ డబ్బులు తీసుకుంటున్నారని, వాహనదారుల నుంచి స్టేట్‌మెంట్లు తీసుకున్నట్టు చెప్పారు. వినియోగదారుల నుంచి ఏజెంట్లు అధిక నగదు తీసుకుని 'సీ' 'డీ' లాంటి కోడింగ్‌లతో స్లాట్ పత్రాలపై రాసినట్టు గుర్తించినట్టు చెప్పారు.

మానుకోట ఆర్టీఏలో..

మహబూబాబాద్ జిల్లా ఆర్టీఏ కార్యాలయంలో అనేక అవినీతి అక్రమాలు జరుగుతున్నాయని వచ్చిన ఫిర్యాదు మేరకు ఏసీబీ డైరెక్టర్ సీవీ ఆనంద్ ఆదేశాల మేరకు ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్టు ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపారు. వరంగల్ నుంచి వచ్చిన ఆరుగురు ఏసీబీ అధికారులు కార్యాలయాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం వరకు సోదాలు తనిఖీలు నిర్వహిస్తూనే ఉన్నారు. ఆరుగురు ఏజెంట్లను అదుపులోకి తీసుకుని.. వారి నుంచి రూ.45వేలు స్వాధీనం చేసుకున్నారు. అలాగే డిటిఓ గౌస్ పాషా వ్యక్తిగత వాహన డ్రైవర్ సుబ్బారావు వద్ద రూ.16,500తో పాటు డ్రైవింగ్ లైసెన్స్, ఫిట్‌నెస్‌లకు సంబంధించిన దరఖాస్తులు, కొన్ని కాగితాలను స్వాధీనం చేసుకున్నారు.

ప్రభాకర్‌రావుకు ప్రాణహాని



- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ ప్రభాకర్‌రావుకు ప్రాణహాని ఉందని కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. ఆయన అమెరికా నుంచి ఇండియాకు రాకుండా బీఆర్ఎస్ నాయకులే అడ్డుకున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభాకర్‌రావు ఇండియాకు వచ్చి ఫోన్ ట్యాపింగ్ వెనుక ఎవరి హస్తం ఉందో చెపితే ఆ కేసులో పురోగతి ఉంటుందన్నారు. విదేశాల నుంచి ఎక్విప్‌మెంట్ దిగుమతి చేసుకున్నారనీ, దీనికి బీఆర్ఎస్ ఎమ్మెల్సీలే పెట్టుబడి పెట్టారని ఆరోపించారు. కేసీఆర్ సొంత ఎమ్మెల్యేల ఫోన్లు ట్యాపింగ్ చేయించారని విమర్శించారు. యాభై ఏండ్లపాటు అధికారంలో ఉండాలనే లక్ష్యంతో ఫోన్ ట్యాపింగ్‌కు ఒడిగట్టారని ఆరోపించారు. నా ఫోన్ ట్యాపింగ్ చేసి తన హక్కులకు భంగం కలిగించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో డీజీపీకి తానే మొదటి ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

బిజినెస్

వైద్య బీమాలోకి ఎల్‌ఐసీ..!

- ప్రభుత్వ అనుమతుల కోసం నిరీక్షణ
- చైర్మన్ సిద్ధార్థ్ మోహంతి వెల్లడి

ముంబయి : ప్రభుత్వ రంగంలోని దిగ్గజ జీవిత బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ) వైద్య బీమా రంగంలోకి ప్రవేశించడానికి కసరత్తు చేస్తోంది. ప్రభుత్వ అనుమతుల కోసం ఎదురు చూస్తోంది. ప్రస్తుతం జీవిత బీమా కంపెనీలు వైద్య బీమా అందించడానికి వీలు లేదు. కాగా.. ఈ ఏడాది ఫిబ్రవరిలో పార్లమెంటరీ కమిటీ కొన్ని కీలక ప్రతిపాదనలు చేసింది. బీమా సంస్థలకు వైద్య బీమా అందించడానికి కాంపోజిట్ లైసెన్స్‌ను మంజూరు చేయాలని ప్రభుత్వానికి సూచించింది. దీని వల్ల ఆయా సంస్థలకు ఖర్చులు తగ్గడంతో పాటు ఆయా సంస్థలపై నియంత్రణపరమైన భారాలు తగ్గుతాయని సూచించింది. ఇందుకోసం బీమా చట్టానికి సవరణలు చేయాల్సి ఉంటుంది. అదే జరిగితేనే వైద్య బీమా రంగంలోకి ఎల్ఐసి ప్రవేశించడానికి వీలు అవుతుంది.



గడిచిన ఆర్థిక సంవత్సరం 2023-24 మార్చి త్రైమాసికం ఆర్థిక ఫలితాల సందర్భంగా ఎల్ఐసీ చైర్మన్ సిద్దార్థ్ మోహంతి టైమ్స్‌కు ఇచ్చిన ఇంటర్యూలో మాట్లాడుతూ... వైద్య బీమా రంగంలోకి ప్రవేశించడానికి ఎల్ఐసీ ఆసక్తిగా ఉందన్నారు. పార్లమెంటరీ కమిటీ ప్రతిపాదించిన కాంపోజిట్ లైసెన్స్‌ను అనుసరించి వైద్య బీమా రంగంలోనూ సేవలందించడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నామన్నారు. కొత్త ప్రభుత్వంలో కాంపోజిట్ లైసెన్స్ లభించే అవకాశం ఉందని మోహంతి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ రంగంలో తమకు అనుభవం లేనందున ఉన్న కంపెనీలను కొనుగోలు చేసే యోచనలో ఉన్నామన్నారు. ఒక వేళ ఎల్ఐసీ వైద్య బీమాలోకి వస్తే ఈ రంగంలో భారీ పెరుగుదల నమోదు కానుందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. జీవిత బీమా రంగంలో ఎల్ఐసీ 58.87 శాతం వాటాతో మార్కెట్ లీడర్‌గా ఉంది. 2023-24 నాలుగో త్రైమాసికం (క్యూ4)లో 4.5 శాతం వృద్ధితో రూ.13,782 కోట్ల నికర లాభాలు సాధించింది. చివరి డివిడెండ్ కింద ప్రతీ ఈక్విటీ షేర్‌పై రూ.6 చెల్లించడానికి సంస్థ బోర్డు ఆమోదం తెలిపింది. 2024 మార్చితో ముగిసిన ఏడాదిలో సంస్థ మొత్తం ప్రీమియం రూ.4,75,070 కోట్లుగా చోటు చేసుకుంది. 2024 మార్చి ముగింపు నాటికి ఎల్ఐసీ అసెట్స్ అండర్ మేనేజ్‌మెంట్ (ఏయూఎం) రూ.51,21,887 కోట్లకు చేరింది.

సెన్సెక్స్‌కు 220 పాయింట్ల నష్టం

ముంబయి : అమ్మకాల ఒత్తిడితో మంగళవారం దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు ఉన్నప్పటికీ రాణించలేకపోయాయి. సెన్సెక్స్ చివరికి 220 పాయింట్ల నష్టంతో 75,170కు జారింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 44.30 పాయింట్లు కోల్పోయి 22,888 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లో పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, టెక్ మహీంద్రా, భారతీ ఎయిర్‌టెల్, ఎన్‌టీపీసీ, టాటా మోటార్స్ షేర్లు అధికంగా నష్టపోయిన వాటిలో ముందు వరసలో ఉన్నాయి. ఏషియన్ పెయింట్స్, విప్రో, జెఎస్‌డబ్ల్యూ స్టీల్, హిందుస్థాన్ యూనిలీవర్, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లు అధికంగా లాభపడిన వాటిలో టాప్‌లో ఉన్నాయి.

ఐసీఐసీఐ బ్యాంక్‌కు భారీ జరిమానా

- యెస్ బ్యాంక్‌పైనా ఆర్‌బీఐ కొరడా

ముంబయి : ప్రయివేటు రంగంలోని ఐసీఐసీఐ బ్యాంక్, యెస్ బ్యాంక్‌లకు రిజర్వ్ బ్యాంక్ షాక్ ఇచ్చింది. ఆర్‌బీఐ మార్గదర్శకాలను పాటించడంలో విఫలమైన ఆ రెండు బ్యాంక్‌లకు భారీ జరిమానా విధిస్తూ చర్యలు తీసుకుంది. 2022 మార్చి 31 నుంచి బ్యాంకు ఆర్థిక పరిస్థితులపై ఆర్‌బీఐ తనిఖీలు నిర్వహించింది. ఇందులో ఆ బ్యాంక్‌లు పలు మార్గదర్శకాలు పాటించలేదని తేలింది. ప్రాజెక్టు రిపోర్టులు, ఆర్థిక పరిస్థితులను పరిశీలించకుండానే పలు సంస్థలకు టర్మ్‌లోన్‌లు ఇచ్చినట్లు గుర్తించింది. ఈ మేరకు బ్యాంకింగ్ రెగ్యులేషన్ చట్టం 1949లోని పలు నిబంధనల ప్రకారం ఐసీఐసీఐ బ్యాంకుపై చర్యలు తీసుకుంది. ఈ నేపథ్యంలో ఐసీఐసీఐ బ్యాంక్‌కు రూ.కోటి జరిమానా విధించింది. కస్టమర్ సర్వీస్, అంతర్గత, కార్యాలయ ఖాతాలకు సంబంధించిన మార్గదర్శకాలను ఉల్లంఘించిన కారణంగా యెస్ బ్యాంక్‌కు రూ.91 లక్షలు జరిమానా విధించింది.

సిగాచి ఇండస్ట్రీస్ రూ.104 కోట్ల అమ్మకాలు

హైదరాబాద్ : గడిచిన ఆర్థిక సంవత్సరం (2023 -24) మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో 43.78 శాతం వృద్ధితో రూ.104.13 కోట్ల నికర అమ్మకాలు సాధించినట్లు సిగాచి ఇండస్ట్రీస్ ప్రకటించింది. ఏపీఐ ఫార్మా ఉత్పత్తులను సరఫరా చేసే ఈ సంస్థ 2022-23 ఇదే త్రైమాసికంలో రూ.72.42 కోట్ల అమ్మకాలు నమోదు చేసింది. గడిచిన క్యూ4లో సంస్థ నికర లాభాలు 107 శాతం పెరిగి రూ.15.17 కోట్లుగా నమోదయ్యాయి. 2023-24లో మొత్తంగా కంపెనీ నికర లాభాలు రూ.57.2 కోట్లకు చేరాయి. 2022-23లో రూ.43.5 కోట్ల లాభాలు నమోదయ్యాయి. అంతర్జాతీయ విస్తరణ కోసం ఇటీవల ఐమాస్ ఇన్వెస్ట్‌మెంట్స్‌తో కలిసి సిగాచి ఇండస్ట్రీస్ ఒక సంయుక్త సంస్థను ఏర్పాటు చేసింది.

ఆర్థిక అక్షరాస్యతపై షార్ట్ ఫిల్మ్ పోటీలు

- ప్రథమ బహుమతి రూ.25వేలు



హైదరాబాద్ : ఆర్థిక అక్షరాస్యతపై షార్ట్ ఫిల్మ్ పోటీలు నిర్వహిస్తు న్నట్లు ఫార్చ్యూన్ అకాడమీ కో-ఫౌండర్ డాక్టర్ మణి పవిత్ర తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆమె మీడియాతో మాట్లాడుతూ.. దేశ జనాభాలో 77 శాతం అక్షరాస్యులు ఉన్నప్పటికీ.. దాదాపు మూడో వంతు ప్రజలు ఆర్థిక నిరక్షరాస్యులుగానే ఉన్నారని తెలిపారు. గ్లోబల్ ఫైనాన్షియల్ లిటరసీ సర్వే ప్రకారం.. కేవలం 24 శాతం కంటే తక్కువ మంది ఆర్థిక అక్షరాస్యులుగా ఉన్నారన్నారు. సైబర్ మోసాలకు గురైతున్న వారిలో కూడా ఎక్కువ మంది చదువుకున్న వాళ్లే ఉంటున్నారన్నారు. ఆర్థిక అక్షరాస్యత రేటుతో 144 దేశాలలో భారత్ 73వ స్థానంలో ఉందన్నారు. వ్యక్తిగత ఆర్థిక నిర్వహణ, బడ్జెటింగ్, పెట్టుబడి వంటి వివిధ ఆర్థిక నైపుణ్యాలను అర్థం చేసుకోవడం, సమర్థవంతంగా ఉపయోగించడంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో ఫార్చ్యూన్ అకాడమీ ఆర్థిక అక్షరాస్యతపై షార్ట్ ఫిల్మ్ కాంటెస్ట్‌ను నిర్వహిస్తోందన్నారు. ఇంగ్లీష్ లేదా తెలుగులో రెండు నిమిషాల కంటే తక్కువ వ్యవధిలో వీడియో ఉండాలన్నారు. తొలి ముగ్గురు విజేతలకు వరుసగా రూ.25వేలు, రూ.15 వేలు, రూ.10వేలు చొప్పున.. మరో ఐదుగురికి రూ.1000 చొప్పున కన్సోలేషన్ బహుమతులు ఇస్తామ న్నారు. జులై 31వరకు ఎంట్రీలను స్వీకరిస్తామని.. ఆసక్తి కలిగిన వారు తమ వీడియోలను fortuneacademyhub@gmail.comకు ఇ-మెయిల్ చేయాలని సూచించారు.

అమరరాజా లాభాల్లో 61 శాతం వృద్ధి

హైదరాబాద్ : ఆటోమోటివ్ బ్యాటరీ తయారీదారు అమరరాజా ఎనర్జీ 2024 మార్చితో ముగిసిన త్రైమాసికంలో 61.4 శాతం వృద్ధితో రూ.229.8 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.142 కోట్ల లాభాలు నమోదు చేసింది. 2023-24 మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో కంపెనీ రెవెన్యూ 19.5 శాతం పెరిగి రూ.2,908 కోట్లకు చేరింది. 2022-23 ఇదే క్యూ4లో రూ.2,433.2 కోట్ల రెవెన్యూ ఆర్జించింది. చివరి డివిడెండ్ కింద ప్రతీ రూ.1 ముఖ విలువ కలిగిన షేర్‌పై రూ.5.10 లేదా 510 శాతం డివిడెండ్ చెల్లించడానికి ఆ కంపెనీ బోర్డు ఆమోదం తెలిపింది. మంగళవారం బీఎస్ఇలో అమరరాజా ఎనర్జీ షేర్ 2.21 శాతం పెరిగి రూ.1,246.45 వద్ద ముగిసింది.

పాన్, ఆధార్ లింక్‌కు మే 31 గడువు

న్యూఢిల్లీ : ఇప్పటికీ పాన్, ఆధార్ కార్డ్‌ను అనుసంధానం చేసుకోని వారు 2024 మే 31లోపు ప్రక్రియ పూర్తి చేయాలని ఐటి శాఖ మరోమారు తెలిపింది. పాన్ కార్డు ఉన్న ప్రతి వ్యక్తి ఆదాయపు పన్ను చట్టం-1961 ప్రకారం ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలని సూచించింది. ఇప్పటికీ లింక్ చేయని వారి పాన్ నిరుపయోగంగా మారనున్నట్లు పేర్కొంది. రూ.1,000 అపరాధ రుసుముతో అనుసంధానం పూర్తి చేసుకోవచ్చని పేర్కొంది.

నాటుసారాపై ఉక్కుపాదం



- రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా దాడులు
- పది రోజుల్లో 598 కేసులు నమోదు
- 82,540 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం
- తయారీదారులకు కౌన్సిలింగ్
- మార్పు తెచ్చేందుకు చర్యలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఆబ్కారీ శాఖ కొరఢా ఝుళిపిస్తున్నది. నాటు సారా తయారీ, అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నది. ఆగస్టు 31 నాటికి తెలంగాణలో నాటుసారాను పూర్తిగా నిర్మూలించేందుకు జిల్లాల వారీగా ప్రణాళికలతో ముందుకెళ్తున్నది. గత పది రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా జరిపిన దాడుల్లో 598 కేసులు



నమోదు చేసి 383 మందిని అరెస్ట్ చేసింది. ఒక వైపు దాడులు నిర్వహిస్తూనే తయారీదారులకు కౌన్సిలింగ్ నిర్వహిస్తూ వారిలో మార్పు తెచ్చేందుకు చర్యలు చేపట్టింది.

నాటు సారాను పూర్తిగా అరికట్టాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా తెలంగాణ ఆబ్కారీ శాఖ చర్యలు చేపట్టింది. పది రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా నాటు సారా తయారీ కేంద్రాలపై ఆ శాఖ విస్తృతంగా దాడులు నిర్వహించింది 33 జిల్లాల్లో 350 మందితో ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలు నిరంతరం తనిఖీలు చేస్తున్నాయి. ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ యంత్రాంగం ఎక్కడికక్కడ నిఘా పెట్టి 2,659 లీటర్ల నాటు సారాతో పాటు దాని తయారికి ఉపయోగ పడే ముడి పదార్థాలను పట్టుకున్నది. 19,477 కిలోల బెల్లం, 1617 కిలోల స్పటికను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మార్కెట్లో వీటి విలువ రూ. 10 లక్షల వరకు ఉంటుందని భావిస్తున్నారు. ఈ దాడుల్లో 598 కేసులు నమోదు చేసి 383 మందిని అరెస్టు చేయడంతో పాటు 330 మందిని బైండోవర్ చేశారు. అలాగే 93 వాహనాలను సీజ్ చేసి, 82,540 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు.

పునరావాసం పై చర్చ

2016లో అప్పటి బీఆర్ఎస్ సర్కార్ నాటు సారాను అరికట్టేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా ఈ వృత్తిపై జీవించే 6,885 మందిని గుర్తించి పునరావాసం కల్పించింది. 80 వేల సబ్సిడీతో రూ.లక్ష బ్యాంక్ లోన్ అందించింది. 2016 నుంచి 2018 వరకు జరిగిన ఈ ప్రాజెక్ట్ తర్వాత రాష్ట్రంలో నాటు సారాను పూర్తిగా అరికట్టామని అధికారులు ప్రకటించారు. ఆ తర్వాత దాని గురించి పట్టించుకోక పోవడంతో నాలుగేండ్లుగా చాప కింద నీరులా మళ్లీ విజృంభించింది. ఈ నేపథ్యంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పునరావాసం దిశగా చర్యలు చేపడితే ఎలా ఉంటుందనే అంశంపై చర్చలు కొనసాగిస్తున్నది. సర్కార్ నిర్ణయాన్ని బట్టి తదుపరి చర్యలు చేపట్టాలని ఆబ్కారీ శాఖ భావిస్తున్నది.

తయారీ దారులకు కౌన్సిలింగ్

నాటు సారా తయారే వృత్తిగా ఎంచుకునే వారిలో మార్పు తెచ్చేందుకు ఆబ్కారీ శాఖ చర్యలు చేపట్టింది. ఒకటి కంటే ఎక్కువ సార్లు తయారీ, రవాణా చేస్తూ దొరికిన వారికి కేసులు, జరిమానాలతో పాటు కౌన్సిలింగ్ ఇస్తున్నారు. కుటుంబాలు విచ్ఛిన్నం కావడానికి కారణమైన మహమ్మారిని రాష్ట్రం నుంచి తరిమేయాలంటే దాడులు, శిక్షలు ఒక్కటే పరిష్కారం కావని భావించి సారా వల్ల కలిగే నష్టాలను వివరించి వారిలో పరివర్తన తెచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నారు.

ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలి

- సీఎం తన హామీని నిలబెట్టుకోవాలి : టీఎస్‌యూటీఎఫ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పార్లమెంట్ సార్వత్రిక, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉప ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో ఎన్నికల కమిషన్ అనుమతి తీసుకుని ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని టీఎస్‌యూటీఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.జంగయ్య, చావ రవి ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 15న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు యుఎస్పీసీ, జాక్టో ప్రతినిధులతో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం జరిపిన చర్చల్లో ఎన్నికల సంఘం అనుమతి తీసుకుని వెంటనే షెడ్యూల్ విడుదల చేస్తామని హామీనిచ్చారని గుర్తుచేశారు. ఇప్పటి వరకూ ఎన్నిక సంఘానికి లేఖ పంపకపోవడం విచారకరమని పేర్కొన్నారు.

తొమ్మిదేండ్లుగా పదోన్నతులు, ఆరేండ్లుగా బదిలీలు లేక ఉపాధ్యాయులకు తీరని నష్టం జరుగుతున్నదని వాపోయారు. ఉపాధ్యాయుల పదోన్నతులకు ఏర్పడిన న్యాయపర ఆటంకాలన్నీ తొలగిపోయినందున అక్టోబర్‌లో అర్థాంతరంగా నిలిపివేసిన బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే పున్ణప్రారంభించాలని కోరారు. గత అక్టోబర్‌లో బదిలీ అయిన స్కూల్ అసిస్టెంట్లందర్నీ రిలీవ్ చేసి నూతన పాఠశాలలకు పంపించాలని విన్నవించారు. గిరిజన సంక్షేమ పాఠశాలలు, గురుకులాల్లో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులను కూడా వేసవి సెలవుల్లోనే పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయులకు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు.

పిచ్చోడి చేతిలో రాయిలాగా తెలంగాణలో పరిపాలన : కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రముఖ కళాకారుడు అలె లక్ష్మణ్ తయారు చేసిన రాష్ట్ర రాజముద్రలో తెలంగాణ చరిత్రకి, సాంస్కృతిక వారసత్వానికి,గంగా-జమునా తెహజీబ్‌కి ప్రతీకలైన కాకతీయ తోరణం, చార్మినార్ ఉంటే అది రాచరిక పోకడ ...కానీ రాష్ట్ర గీతంలో మాత్రం అదే చార్మినార్ గురించి "గోల్కొండ నవాబుల గొప్ప వెలుగే చార్మినార్" అని పాడుకోవాలి... "కాకతీయ కళాప్రభల కాంతిరేఖ రామప్ప" అని అదే రాచరిక పరిపాలన గురించి ప్రస్తుతించాలి... అసలు ముఖ్యమంత్రికి గానీ, ఆయన మంత్రిమండలిలో ఒక్కరికైనా రాష్ట్రగీతంలో ఏమున్నదో తెలుసా ? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రకంగా రెండు నాల్కల ధోరణిని అవలంభిస్తున్నదని ఆయన విమర్శించారు. కాకతీయ కళాతోరణం, చార్మినార్ చిహ్నం అంటే ఎందుకంత కోపం? అని ప్రశ్నిం చారు. చార్మినార్ అంటే.. ఒక కట్టడం కాదు..విశ్వనగరంగా ఎదిగిన హైదరా బాద్‌కు ఐకాన్ అనీ, కాకతీయ కళాతోరణం అంటే.. ఒక నిర్మాణం కాదు ..సిరిసంపదలతో వెలుగొందిన ఈ నేలకు నిలువెత్తు సంతకం..అని కేటీఆర్ కొనియాడారు.

నిబంధనల ప్రకారమే బీర్ల కంపెనీకి అనుమతి

- అబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నిబంధలన మేరకే సోమ్ డిస్టిలరీ కంపెనీకి మద్యం సరఫరా చేసేందుకు అనుమతిచ్చామని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో హెూల్‌సేల్ మద్యం సరఫరా, కొత్త బ్రాండ్లకు అనుమతులు ఇచ్చే ప్రక్రియ తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ పరిధిలో ఉంటుందనీ, డిమాండ్, సప్లయ్‌నుబట్టి కొత్త కంపెనీలకు అనుమతులు మంజూరు చేస్తున్నదని పేర్కొన్నారు. రెండు దశాబ్దాలుగా సోమ్ డిస్టిలరీస్ తమ ఉత్పత్తులను విక్రయిస్తున్నదని చెప్పారు. ఇప్పటికే ఉన్న ఎక్సైజ్ పాలసీ ప్రకారమే బెవరేజ్ కార్పోరేషన్ సామ్ డిస్టిలరీస్‌తో పాటు ఇతర కంపనీలకు అనుమతులిచ్చారని తెలిపారు. ఎక్కడ కూడా నిబంధనల ఉల్లంఘన జరగలేదని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం సైతం మార్కెట్ అవసరాలకు అనుగుణంగా 2020 నుంచి వరుసగా అనేక కొత్త కంపెనీలకు అనుమతిచ్చిందని ఆయన గుర్తు చేశారు. బీఆర్ఎస్ నాయకులు రాజకీయం చేయడం విడ్డూరంగా ఉందనీ, ఇలాంటి అసంబద్ధమైన ప్రచారం చేయడం మానుకోవాలని కోరారు.

మూడు కేసుల్లోనూ పిన్నెల్లికి ముందస్తు బెయిల్



అమరావతి : మాచర్ల ఎమ్మెల్యే, వైసీపీ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై పోలీ సులు నమోదు చేసిన మూడు కేసుల్లో హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి మంగళవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. జూన్ ఆరో తేదీ వరకు పిన్నెల్లి విషయంలో కఠిన చర్యలు తీసుకోరాదని పోలీసులను ఆదేశించారు. తదుపరి విచారణను అదే తేదీకి వాయిదా వేశారు. ఈవీఎంలను ధ్వంసం చేసిన కేసులో పిన్నెల్లి పొందిన మధ్యంతర ఉత్తర్వుల్లో విధించిన షరతులన్నీ ఈ ఆదేశాల్లోనూ అమలు జరుగుతాయని స్పష్టం చేశారు. ఓట్ల లెక్కింపు అయ్యే వరకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని పిటిషనరు పిన్నెల్లి తరపున సీనియర్ న్యాయవాది టి నిరంజన్‌రెడ్డి చేసిన అభ్యర్థనను హైకోర్టు ఆమోదించింది.

గువ్వల బాలరాజు ప్రోద్బలంతోనే నా ఫోన్ ట్యాపింగ్

- అచ్చంపేట్ ఎమ్మెల్యే వంశీ కృష్ణ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బీఆర్ఎస్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ప్రోద్బలంతో నా ఫోన్ ట్యాపింగ్ జరిగిందని అచ్చంపేట్ ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆరోపించారు. ఈమేరకు మంగవారం ఇదే అంశంపై ఆయనపై చర్యలు తీసుకోవాలని డీజీపీ, ఐజీపీకి ఫిర్యాదు చేశారు. మాజీ సీఎం కేసీఆర్, కేటీఆర్ డైరెక్షన్‌లో ఫోన్ ట్యాపింగ్ జరిగిందని పేర్కొన్నారు. టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యుల ఫోన్లు కూడా ట్యాపింగ్ చేశారని ఆరోపించారు. యాంటీ సోషల్ ఎలిమెంట్స్‌కు వాడాల్సిన ట్యాపింగ్, సోషల్ ఎలిమెంట్స్‌కు వాడారని విమర్శించారు. వెంటనే విచారణ చేసి దోషులను శిక్షించాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరుతానన్నారు.

కేజ్రీవాల్ బెయిల్ పొడిగింపుపై అత్యవసర విచారణకు సుప్రీం నో



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ బెయిల్ పొడిగింపుపై అత్యవసర విచారణకు సుప్రీంకోర్టు నిరాకరించింది. తనకు మరో వారం రోజుల పాటు మధ్యంతర బెయిల్ గడువు పొడిగించాలని కేజ్రీవాల్ పెట్టుకున్న అత్యవసర పిటిషన్‌ను సుప్రీంకోర్టు వెకేషన్ బెంచ్ తోసిపుచ్చింది. అనారోగ్య పరిస్థితుల రీత్యా తన బెయిల్‌ను పొడిగించాలని కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను మంగళవారం జస్టిస్ జెకె మహేశ్వరి, జస్టిస్ కెవి విశ్వనాథన్‌తో కూడిన ధర్మాసనం విచారించింది. అయితే ఈ పిటిషన్‌పై తదుపరి ఆదేశాల కోసం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్‌కు పంపుతున్నట్లు వెకేషన్ బెంచ్ స్పష్టం చేసింది. మద్యం కుంభకోణం కేసులో మనీ లాండరింగ్ వ్యవహారంలో సీఎం కేజ్రీవాల్‌ను ఈ ఏడాది మే 21న ఈడీ అరెస్ట్ చేసింది. అనంతరం ఆయనను తీహార్ జైలుకు తరలించింది. అయితే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తన పార్టీ తరపున ప్రచారం నిర్వహించు కోవాలంటూ కేజ్రీవాల్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా మే 10న ఆయనకు ధర్మాసనం షరతులతో కూడిన మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది.

సర్వీసు రూల్స్ మార్పు తర్వాతే ప్రమోషన్లు

- గురుకుల జేఏసీ డిమాండ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సర్వీసు రూల్స్ మార్చిన తర్వాతనే ప్రమోషన్లు విడుదల చేయాలని గురుకుల జేఏసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు జేఏసీ నాయకులు మంగళవారం ఎస్సీ అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎం శ్రీధర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఎస్సీ గురుకుల సొసైటీకి సంబంధించిన ప్రమోషన్ల విషయంలో జరుగుతున్న అన్యాయాన్ని వివరించారు.

రాష్ట్రంలోని అన్ని గురుకుల యాజమాన్యాలు, విద్యా సంస్థలు ఒక సర్వీస్ రూల్స్ పాటిస్తుంటే... ఎస్సీ గురుకుల సొసైటీలో మాత్రం వాటికి భిన్నంగా వ్యవహరిస్తున్నదని తెలిపారు. ఉద్యోగులను మానసిక క్షోభకు గురిచేసే విధంగా సర్వీస్ రూల్స్ ఉన్నాయని వివరించారు. టీజీటీ, పీజీటీ, జేఎల్ ప్రమోషన్స్‌లో కూడా ఎస్‌సీ గురుకుల సొసైటీలో అన్యాయం జరుగుతున్నదనీ, వీటిని సవరించాలని వారు కోరారు.

మహ్మద్ సలావుద్దీన్ సస్పెన్షన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్ ఎస్.ఆర్.నగర్‌లోని స్టేట్ హెల్త్ ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న మహ్మద్ సలావుద్దీన్ సస్పెండ్ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ సంచాలకులు డాక్టర్ బి.రవీందర్ నాయక్ ప్రొసీడింగ్స్ జారీ చేశారు. సలావుద్దీన్ గతంలో ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ కార్యాలయంలో ఆఫీస్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సమయంలో ఆయనపై లైంగిక వేధింపులకు సంబంధించిన అభియోగాలు వచ్చాయి. నిజామాబాద్‌కు చెందిన ఒక స్టాఫ్ నర్సు ఆరోపణలు చేయగా, అంతకు ముందు సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఐపీసీ 306 కింద కేసు నమోదై ఉన్నది. ఈ నేపథ్యంలో ప్రజారోగ్య కార్యాలయంలో ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ (ప్రివెన్షన్, ప్రొహిబిషన్, రిడ్రెస్సల్ ఉమెన్ ఎట్ వర్కింగ్ ప్లేస్) అభియోగాలను పరిశీలించి, అతనిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని ప్రతిపాదించింది. ఆ మేరకు సలావుద్దీన్‌పై సస్పెన్షన్ వేటు పడింది.

ప్రభుత్వానికి ధన్యవాదాలు : కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్

మహ్మద్ సలావుద్దీన్‌పై వచ్చిన ఆరోపణలను తీవ్రంగా పరిగణించి విచారణ జరిపి సస్పెండ్ చేసినందుకు ప్రభుత్వానికి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ ధన్యవాదాలు తెలిపింది. ఈ మేరకు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు భరత్ సత్యనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ నెహ్రూ చంద్ నాయక్ ఒక ప్రకటన విడుదల చేశారు. సీఎం రేవంత్ రెడ్డికి, వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు, ఆ శాఖ కార్యదర్శి క్రిస్టీనా చొంగ్తూ, ఐసీసీ ప్రిసైడింగ్ ఆఫీసర్ పుష్పకు కృతజ్ఞతలు తెలిపారు.



ఎన్నికల హామీలు అమలు చేయాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు

నవతెలంగాణ-ఖమ్మం

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు అన్నారు. మంగళవారం ఖమ్మంలోని సుందరయ్య భవన్‌లో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు భూక్యా వీరభద్రం అధ్యక్షతన ఆ పార్టీ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పంట రుణాలమాఫీ హామీని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ సీజన్ ప్రారంభం కావడంతో పంటల సాగుకు అప్పుల కోసం రైతులు తిప్పలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తీసుకున్న అప్పులు తీర్చలేక ప్రభుత్వం రాయితీ చెల్లించకపోవడంతో బ్యాంకులు కొత్త రుణాలు ఇవ్వడం లేదన్నారు. దాంతో రైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారని తెలిపారు. విక్రయించిన పండిన పంటకు వచ్చిన డబ్బంతా వడ్డీలకే సరిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పంట సీజన్ ప్రారంభమైందని, వెంటనే నూతన రుణాలు మంజూరు చేయాలని కోరారు. అన్ని రకాల వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సకాలంలో రైతుబంధు, రైతు బీమా, పించన్లు, అన్నదాతలు పండించిన పంటలకు గిట్టుబాటు ధర వంటి అనేక పథకాలను అందుబాటులోకి తీసుకువచ్చి పూర్తిస్థాయిలో అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో సొంతింటి నిర్మాణం పథకాన్ని అటకెక్కించారని, తక్షణమే కాంగ్రెస్ ఇచ్చిన హామీలో భాగంగా రాష్ట్రమంతా అర్హులైన పేదలను గుర్తించి, అందరికీ ఇండ్ల స్థలాలు ఇవ్వాలని, స్థలమున్నవారికి ఇందిరమ్మ ఇంటి పథకం పేరుతో ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శవర్గ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, యర్రా శ్రీకాంత్, మాచర్ల భారతి, కళ్యాణం వెంకటేశ్వరరావు, వై.విక్రమ్, బొంతు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి సురవరం ప్రతాపరెడ్డి

- రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మెన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి



నవతెలంగాణ -మహబూబ్‌నగర్

తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి బహుముఖ ప్రజ్ఞాశాలి అని రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మెన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి అన్నారు. మంగళవారం తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి 128వ జయంతి సందర్భంగా పాలమూరు సాహితి ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కాళోజీ హాల్‌లో "బహుముఖ ప్రజ్ఞాశాలి సురవరం ప్రతాపరెడ్డి" గ్రంథావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ.. పాలమూరు జిల్లాలో పరిశోధన రంగంలో విశేష కృషి చేసిన సురవరం తెలుగు సాహిత్యంలో అగ్రగణ్యుడని కొనియాడారు. ఎంతో విలువైన సాహిత్యాన్ని సమాజానికి అందించిన గొప్ప వ్యక్తి అన్నారు. మొదటి సార్వత్రిక ఎన్నికలలో వనపర్తి జిల్లా నుంచి మొదటి ఎమ్మెల్యేగా ఎన్నికైన సురవరం పరిశోధనా రంగంలో ఎంతో కృషి చేశారన్నారు. ఆంధ్రుల సాంఘిక చరిత్ర ఆయనకు గొప్ప పేరు తీసుకొచ్చిందని చెప్పారు. ఆయన పరిశోధన నేటి తరానికి అత్యంత ఆవశ్యకమన్నారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. సురవరం సాహిత్యాన్ని అందరూ చదవాలని సూచించారు. స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ డాక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. సురవరం ఒకపక్క పరిశోధన రంగంలో కృషి చేస్తూనే మరోపక్క సృజనాత్మక రంగంలో అపూర్వమైన రచనలు చేశారన్నారు. ముఖ్యంగా మహిళా చైతన్యం గురించి అనేక రచనలు చేశారన్నారు. గోల్కొండ పత్రిక సంపాదకుడిగా సమాజాన్ని చైతన్యవంతం చేశారన్నారు. ప్రముఖ న్యాయవాది వి.మనోహర్ రెడ్డి, గ్రంథ సంపాదకులు డాక్టర్ గంటా జలంధర్ రెడ్డి, సంస్థ అధ్యక్షులు డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్, డాక్టర్ జి.చిన్నారెడ్డికి పాలమూరు కవులు, రచయితల పక్షాన ఒక వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సంగీత నాటక అకాడమి తొలి చైర్మెన్ బాద్మి శివకుమార్, రాష్ట్ర ప్రభుత్వ కాళోజీ అవార్డు గ్రహీత కోట్ల వెంకటేశ్వర రెడ్డి, కాంగ్రెస్ యువనేత ఏపి.మిథున్ రెడ్డి, లుంబిని పాఠశాల డైరెక్టర్ కె.లక్ష్మణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

నవతెలంగాణ-ఎల్కతుర్తి

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం గోపాలపూర్ గ్రామంలో మంగళవారం జరిగింది. స్థానికులు, ఎస్ఐ గోదరి రాజ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన పెండ్యాల నాగరాజు (37) రెండేండ్లుగా నాలుగున్నర ఎకరాల్లో పత్తి, వరి సాగు చేస్తున్నాడు. అయితే నాగరాజు తండ్రి పేరుపై పట్టా ఉండటంతో చేసేదేమీ లేక పంట సాగు కోసం రూ.5లక్షలు ప్రయివేటుగా అప్పు చేశాడు. పంట దిగుబడి రాకపోవడం, ఇద్దరు కూతుళ్ల చదువులకు ఏమీ చేయాలనే మనస్తాపంతో మంగళవారం ఉదయం వ్యవసాయ బావి వద్ద ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య కళ్యాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు.

ఫోన్ ట్యాపింగ్ దేశానికే మచ్చ : ఎన్వీ సుభాష్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీఆర్ఎస్ కుంభకోణాలు, నేరాల్లో అతిపెద్దది ఫోన్ ట్యాపింగ్ అనీ, ఇది దేశానికే మాయని మచ్చ అని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్ తెలిపారు. దేశ భద్రతకే ముప్పు కలిగించేలా, అనేక మంది వ్యక్తిగత స్వేచ్ఛను హరించేలా, కొందరి జీవితాలను రోడ్డున పడేసేలా చేసిన కేసీఆర్ అండ్ కో టీమ్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఫోన్‌ట్యాపింగ్ కేసులోని టీఆర్ఎస్ నేతలు, పోలీసు ఉన్నతాధికారులను కాంగ్రెస్ ప్రభుత్వం కాపాడే యత్నం చేస్తున్నదని ఆరోపించారు. ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో ఫోన్‌ట్యాపింగ్‌లు, సెటిల్‌మెంట్లు చేశామని ఈ కేసులో నిందితులుగా ఉన్న అధికారులే ఒప్పుకున్నా మాజీ సీఎం కేసీఆర్‌ను ఎందుకు అరెస్టు చేయడం లేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాం లో జరిగిన కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి, ధరణి కుంభకోణం, ఫోన్ ట్యాపింగ్ వంటి వ్యవహారాల్లో సూత్రధారులను కాపాడుతూ అధికారాన్ని కాపాడుకునే ప్రయత్నంలో కాంగ్రెస్ ఉన్నదని ఆరోపించారు.

దేశ వ్యాప్తంగా ఉచిత ఆరోగ్య బీమా

- 'ఇండియా' అధికారంలోకి రాగానే పేదల ఖాతాల్లో లక్ష జమ
- జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు ఇస్తాం దేశ సంపద ప్రజలకే చెందాలి
- పంజాబ్ ఎన్నికల ప్రచారంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఇండియా కూటమి అధికారంలోకి రాగానే దేశ వ్యాప్తంగా ఉచిత ఆరోగ్య బీమా పథకాన్ని అమలు చేస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. పేదల ఖాతాల్లో లక్ష రూపాయలు జమ చేస్తామని తెలిపారు. జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పిస్తామని వాగ్దానం చేశారు. దేశ సంపద ప్రజలకే చెందాలనే లక్ష్యంతో ఇండియా కూటమి ముందుకు పోతున్నదని చెప్పారు. మంగళవారం పంజాబ్ రాష్ట్రంలోని ఫరీద్‌కోట్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని కొట్కపుర అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో భట్టి మాట్లాడారు.

విత్తనాల కోసం బారులు

షాపుల ఎదుట దారి పొడవునా లైన్లు | స్వల్ప తోపులాట.. పోలీసుల బందోబస్తు



నవతెలంగాణ- ఆదిలాబాద్‌టౌన్/ మిరుదొడ్డి /మెట్‌పల్లి

ఆదిలాబాద్ జిల్లాలో ప్రధానంగా పత్తి పంటనే ఎక్కువగా వేస్తారు. అయితే, రాశీ-659 రకానికి ఇక్కడ డిమాండ్ ఎక్కువగా ఉంది. దాని కోసం రైతులు ఉదయం నుంచి విత్తన దుకాణాల ముందు క్యూ కడుతున్నారు. మంగళవారం ఆయా షాపుల ఎదుట రైతులు పెద్ద సంఖ్యలో లైన్లలో నిల్చోవడంతో కొంత తోపులాట జరిగింది. బందోబస్తులో ఉన్న పోలీసులు వారికి సర్దిచెప్పి ఎలాంటి ఘటనలూ జరగకుండా చర్యలు తీసుకున్నారు. ఒక్కో రైతుకు రెండు బ్యాగులే ఇవ్వడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న వ్యవసాయ శాఖ అధికారులు అక్కడి చేరుకొని వారిని సముదాయించి త్వరలోనే పూర్తి స్థాయిలో విత్తనాలు అందించేలా చూస్తామన్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో పత్తి పంటనే ఎక్కువ సాగు చేస్తారని తెలిపారు. కావాల్సిన విత్తనాలు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఉదయం 5 గంటల నుంచి క్యూలో నిల్చొని ఉంటే రెండు బ్యాగులు మాత్రమే ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఇబ్బందుల దృష్ట్యా డిమాండ్ ఉన్న రాశీ 659ను అందుబాటులో ఉంచాలని కోరారు.

అందుబాటులో విత్తనాలు.. ఆందోళన చెందొద్దు

ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పత్తి విత్తనాలు పూర్తిగా అందుబాటులో ఉన్నాయని.. రైతులెవరూ ఆందోళన చెందొద్దని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య అన్నారు. ఒకే రకాన్ని రైతులు అడగడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. పది లక్షల ప్యాకెట్లు అవసరమని అంచనా వేశామని, ప్రస్తుతం 8 లక్షల పత్తి విత్తనాల ప్యాకెట్లు జిల్లాకు వచ్చాయన్నారు. రాశీ రకం విత్తనాలు మంగళవారం 13 వేల ప్యాకెట్లు వచ్చాయన్నారు. రైతులందరికీ అందించాలన్న ఉద్దేశంతో 60 దుకాణాల్లో ఒక్కొక్క రైతుకు రెండు ప్యాకెట్ల చొప్పున ఇస్తున్నామని తెలిపారు. జూన్ మొదటి వారంలో మరిన్ని ప్యాకెట్లు తీసుకొస్తామన్నారు. రైతులు ఎవరూ అధైర్యపడొద్దని, అందరికీ విత్తనాలు పంపిణీ చేస్తామని చెప్పారు. అదే విధంగా, మార్కెట్లో 55 కంపెనీలకు సంబంధించి 125 రకాల పత్తి విత్తనాలు లభ్యమవుతున్నాయని, వాటిని కూడా కొనుగోలు చేయాలని సూచించారు.



> ఖరీఫ్ వర్షాలు ముందుగా మొదలవడంతో రైతులు సాగుకు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో విత్తనాల కోసం పట్టణాలకు పరిగెడుతున్నారు. పొద్దుపొద్దున్నే మండల కేంద్రాలకు చేరుకుని దుకాణాల ఎదుట లైన్ కడుతున్నారు. అయితే, కొన్ని రకాల విత్తనాలకు ఎక్కువ డిమాండ్ ఉండటం.. రైతులందరూ అవే కావాలంటున్నందున అందరికీ ఒకే రోజు విత్తనాలు అందకపోవడం తో ఆవేదన చెందుతున్నారు. మంగళవారం ఆదిలాబాద్, సిద్దిపేట జిల్లాల్లో పత్తి, జీలుగ విత్తనాల కోసం రైతులు దుకాణాల ఎదుట పెద్దఎత్తున బారులు తీరారు.

జీలుగ విత్తనాల కోసం రైతుల పడిగాపులు

జీలుగ విత్తనాల కోసం సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం వద్ద రైతులు పడిగాపులు కాచారు. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ఎండను సైతం లెక్కచేయకుండా వరుసలో బారులు తీరారు. కొందరు రైతులు మండే ఎండలో నిలబడలేక నానా ఇబ్బందులు పడ్డారు. ఈ కేంద్రం నుంచి ఒక్కో పాస్ పుస్తకానికి 30 కిలోల జీలుగ విత్తనాల బస్తాలను 80 మంది రైతులకు మాత్రమే విక్రయించారు. మిగిలిన 120 మంది నిరాశతో వెనుతిరిగారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి జీలుగ విత్తనాల కొరతను తీర్చాలని రైతులు కోరుతున్నారు.

మెట్‌పల్లి వ్యవసాయ కార్యాలయంలో సబ్సిడీపై జనుము, జీలుగ విత్తనాలను అందిస్తున్నారన్న సమాచారంతో రైతులు ఉదయమే భారీగా చేరుకున్నారు. విత్తనాల రసీదుల కోసం రైతుల మధ్య తోపులాట జరిగింది. విషయం తెలుసుకున్న పోలీసులు కార్యాలయం వద్దకు చేరుకుని రైతులను లైన్‌లో ఉంచారు. ఒక్కో రైతుకు బస్తా జీలుగ, జనుము మాత్రమే ఇవ్వడంతో అధికారులతో రైతులు వాగ్వాదానికి దిగారు. పది ఎకరాల భూమి ఉన్నా ఒకే బస్తా ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పట్టభద్రుల ఓటింగ్ @ 72.44 శాతం

- స్ట్రాంగ్ రూమ్‌కు బ్యాలెట్ బాక్సులు
- కొన్ని జిల్లాల్లో సాయంత్రం 7 గంటల వరకూ పోలింగ్



నవతెలంగాణ -నల్లగొండ కలెక్టరేట్

ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నికల్లో మొత్తం 72.44 శాతం పోలింగ్ నమోదైనట్టు ఎన్నికల సంఘం ప్రకటించింది. కాగా, బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. ఈనెల 27న పోలింగ్ అనంతరం అన్ని జిల్లాల నుంచి బ్యాలెట్ బాక్సులను భారీ భద్రత మధ్య నల్లగొండ సమీపంలోని అనిశెట్టి దుప్పలపల్లి వద్ద ఉన్న వ్యవసాయ గోడౌన్‌లోని స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. 4,63,839 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు వారి ఓటు హక్కు వినియోగించుకునేందుకు 605 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. కాగా, పోలింగ్ కొన్ని జిల్లాల్లో సాయంత్రం 7 గంటల వరకు కొనసాగింది. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 72.44 శాతం పోలింగ్ నమోదు కాగా, అత్యధికంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో 78.59 శాతం.. అత్యల్పంగా ఖమ్మం జిల్లాలో 67.20శాతం పోలింగ్ నమోదైంది.

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 12 జిల్లాల ఎన్నికల అధికారులు పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక సౌకర్యాలు కల్పించారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఓటు వేసే సమయంలో ఓటర్లు చేయాల్సిన పనులు, చేయకూడని పనులపై ఫ్లెక్సీలను ప్రదర్శించారు. యువత ప్రత్యేకించి మహిళలు పెద్దఎత్తున లైన్లలో నిలబడి ఓటు వేయడం విశేషం. పోలీసులు గట్టి బందోబస్తు చర్యలు తీసుకున్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద హెల్ప్ డెస్కులతోపాటు, ప్రథమ చికిత్స సౌకర్యాలు ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారితో ఉపఎన్నికల రిటర్నింగ్ అధికారి, నల్లగొండ జిల్లా కలెక్టర్ పోలింగ్ ప్రక్రియను వెబ్ క్యాస్టింగ్ ద్వారా పర్యవేక్షించారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడంలో సహకరించిన అభ్యర్థులు, రాజకీయ పార్టీలు, ఓటర్లు, ఎన్నికల అధికారులు, పోలీసు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది అందరికీ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కృతజ్ఞతలు తెలిపినట్టు ఉప ఎన్నికల రిటర్నింగ్ అధికారి హరిచందన దాసరి చెప్పారు.

జిల్లాల వారీగా పోలింగ్ శాతం వివరాలు..

యాదాద్రి భువనగిరి	78.59 శాతం
జనగామ	76.34 శాతం
సిద్దిపేట	76.13 శాతం
ములుగు	74.58 శాతం
జయశంకర్ భూపాలపల్లి	73.62 శాతం
నల్లగొండ	73.29 శాతం
సూర్యాపేట	73.15 శాతం
వరంగల్	72.68 శాతం
హనుమకొండ	72.45 శాతం
మహబూబాబాద్	72.15 శాతం
భద్రాద్రి కొత్తగూడెం	69.95 శాతం
ఖమ్మం	67.20 శాతం

ఇంజినీరింగ్ సీట్ల భర్తీలో అవకతవకలు జరుగనివ్వొద్దు

- డొనేషన్ల పేరుతో భారం మోపుతున్న కాలేజీలపై చర్యలు తీసుకోండి : ఉన్నత విద్యామండలి చైర్మెన్ ప్రొఫెసర్ లింబాద్రికి బీజేవైఎం వినతి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఇంజినీరింగ్ సీట్ల భర్తీలో అవకతవకలు జరుగకుండా చూడాలనీ, డొనేషన్ల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులపై భారాలు మోపుతున్న కాలేజీలపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు ఎస్.మహేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో బీజేవైఎం నేతలు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మెన్ ప్రొఫెసర్ లింబాద్రికి వినతిపత్రం అందజేశారు. స్పాట్ అడ్మిషన్లు, విద్యార్థులు స్లైడింగ్ పద్ధతిలో గ్రూపులు మార్చుకునే ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా చూడాలని కోరారు. విశ్వవిద్యాలయాల వీసీల నియామకం న్యాయబద్ధంగా, అర్హత కలిగే వారికి అందేలా చూడాలని విన్నవించారు. విద్యా వ్యవస్థపై నిర్లక్ష్యం వహిస్తే చూస్తూ ఊరుకోబోమనీ, సీఎం, మంత్రులను రోడ్లను అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో హెడ్ క్వార్టర్ ఇన్‌చార్జి ఉపాధ్యక్షులు నామాని మహేష్, యోగి, సంతోష్, సందీప్, చిత్తరంజన్, తరుణ్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్, ట్రైనింగ్ సెల్ ఇన్‌చార్జి సుధీంద్ర శర్మ అరవింద్, గోవర్ధన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభవన్‌కు బాంబు బెదిరింపు కాల్

- పోలీసుల విస్తృత తనిఖీలు
- ఫేక్ కాల్ అని నిర్ధారించిన పోలీసులు

నవతెలంగాణ - బంజారాహిల్స్



ప్రజాభవన్.. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కుటుంబం నివాసం ఉంటున్న ప్రజా భవన్‌కు బాంబు బెదిరింపు కాల్ రావడం కలకలం రేపింది. వివరాల్లోకెళ్తే.. మంగళవారం ఓ అజ్ఞాత వ్యక్తి 100కు డయల్ చేసి ప్రజాభవన్‌లో బాంబు ఉందని చెప్పాడు. దాంతో రాష్ట్ర పోలీస్ శాఖ వెంటనే అప్రమత్తమైంది. ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్, హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ వింగ్ పోలీస్ అధికారులను రంగంలోకి దింపింది. బాంబ్, డాగ్ స్క్వాడ్ బృందాలు ప్రజాభవన్‌కు చేరుకొని తనిఖీలు చేపట్టాయి. పంజాగుట్ట ఏసీపీ మనోహర్ కుమార్ కూడా వెంటనే సంఘటనా స్థలానికి తన సిబ్బందితో చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ప్రజాభవన్ ప్రవేశ ద్వారం నుంచి నివాసం లోపల ఉన్న అన్ని గదులనూ, బెడ్రూమ్స్, కిచెన్, డైనింగ్ హాల్, విజిటర్ హాల్స్, ఉప ముఖ్యమంత్రి ఛాంబర్, జిమ్, గార్డెన్, పరిసర ప్రాంతాలను అణువణువునా తనిఖీలు చేశారు. అదేవిధంగా భట్టి విక్రమార్క కాన్వాయ్, కుటుంబ సభ్యులు వాడుతున్న వాహనాలను కూడా పరిశీలించారు. ప్రజాభవన్‌లో ఉన్న అమ్మవారి ఆలయంలోనూ తనిఖీలు చేశారు.

అలాగే మంత్రి సీతక్క నివాసంలోని ప్రతి గదినీ క్షుణ్ణంగా పరిశీలించారు. ఎక్కడా ఏమీ కనిపించకపోవడంతో.. అది ఫేక్ కాల్ అని పోలీసులు భావిస్తున్నారు. బాంబు ఉన్నట్టు ఫోన్ చేసిన వ్యక్తిని సెల్‌ఫోన్ సిగ్నలింగ్ ఆధారంగా కనిపెట్టే పనిలో ఉన్నట్టు తెలుస్తున్నది. ఫోన్ చేసిన వ్యక్తి ఆకతాయా.. లేక ఉద్దేశపూర్వకంగానే చేశాడా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఏదేమైనప్పటికీ ప్రజాభవన్‌లో బాంబు ఉందని ఫోన్ రావడంతో రాష్ట్రవ్యాప్తంగా ఒక్కసారిగా కలకలం రేగింది.

మండీ బిర్యానీ తిని ఎనిమిది మందికి అస్వస్థత

- పెండ్లి రోజు సందర్భంగా రెస్టారెంట్‌కు వెళ్లిన కుటుంబసభ్యులు
- రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో ఆలస్యంగా వెలుగులోకి..
- కలుషితాహారం తినడం వల్లే ఫుడ్ పాయిజన్ : వైద్యులు
- సాయిబాబా ఫ్యామిలీ రెస్టారెంట్‌ను అధికారులు తనిఖీ
- బిర్యానీ శాంపిల్ సేకరణ

నవతెలంగాణ-షాద్‌నగర్

ఓ వ్యక్తి తన పెండ్లి రోజు కావడంతో కుటుంబ సభ్యులందరికీ విందు ఇవ్వాలను కున్నాడు. రోజూ ఇంట్లో చేసిన ఆహారమే కదా! బోర్ కొడుతుందని.. ఇష్టమైన ఆహారాన్ని రెస్టారెంట్‌కు వెళ్లి తింటే బాగుంటుందనుకున్నాడు. ఎనిమిది మంది కుటుంబ సభ్యులతో కలిసి స్థానికంగా ఉన్న రెస్టారెంట్‌కు వెళ్లాడు. అక్కడ వారందరికీ మండీ బిర్యానీ తినిపించి సంబురపడ్డాడు. అందరూ కలిసి ఇంటికి చేరుకోగానే ఒకరి తర్వాత ఒకరు అస్వస్థతకు గురయ్యారు. వాంతులు, విరోచనాలతో ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం వారందరూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది నందిగామ మండల పరిధిలోని అప్పరెడ్డిగూడ గ్రామానికి చెందిన కావాలి నరేందర్ తన పెండ్లి రోజు సందర్భంగా ఈ నెల 22వ తేదీన బుధవారం రోజు రాత్రి తొమ్మిది గంటల సమయంలో షాద్‌నగర్ పట్టణంలోని సాయిబాబా ఫ్యామిలీ రెస్టారెంట్‌లో తన కుటుంబ సభ్యులతో కలిసి మండీ బిర్యానీ తిన్నాడు. తర్వాత ఇంటికి చేరుకున్న క్రమంలో ఒకరి తర్వాత ఒకరికి వాంతులు, విరేచనాలు అయ్యాయి. దాంతో శంషా బాద్‌లోని ప్రయివేట్ ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యారు. అప్పటికే నరేందర్‌కు రక్తపు వాంతులు, విరేచనాలు కావడంతో ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. ఆయనతోపాటు ఆయన భార్య మంగమ్మ, కుటుంబ సభ్యులు దీక్షిత, తన్విక, అనిరుధ్, అభిలాష్, జోష్న, సాయి, శ్రీకర్, మొత్తం ఎనిమిది మంది అస్వస్థతకు గురయ్యారు. వీరంతా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కలుషిత ఆహారం తినడం వల్లనే ఫుడ్ పాయిజన్ అయిందని వైద్యులు నిర్ధారించారు.



రెస్టారెంట్‌లో అధికారుల తనిఖీలు

కాగా, సాయిబాబా ఫ్యామిలీ రెస్టారెంట్‌ను మంగళవారం రంగారెడ్డి జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి ఉదయ్ కుమార్ బృందం తనిఖీలు నిర్వహించింది. వంటగదిలో వంట సామగ్రి పరిశుభ్రంగా ఉందా లేదా అని పరిశీలించింది. అనంతరం అధికారులు బిర్యానీ శాంపిల్స్ సేకరించి స్వాధీనం చేసుకున్నారు. వంట గది పరిశుభ్రంగా లేకపోవడంతో కేసు నమోదు చేశారు.

రేమాల్ తుపానుతో అసోంలో ఒకరి మృతి

- అనేక మందికి గాయాలు

డిస్‌పూర్, గౌహతి : రేమాల్ తుపాను ప్రభావంతో అసోంలో మంగళవారం ఒక వ్యక్తి మృతి చెందగా, అనేక మంది గాయపడ్డారు. రాష్ట్రంలో మంగళవారం బలమైన గాలులతో కూడిన భారీ వర్షాలు కురిసాయి. మోరిగావ్ జిల్లాలో దిఘల్‌బోరి వద్ద రోడ్డుపై ప్రయాణిస్తున్న ఆటోపై చెట్టు పడిపోవడంతో కౌసిక్ బోర్డోలోయ్ అంఫీ అనే 17 ఏండ్ల ఒక కాలేజీ విద్యార్థి మృతిచెందాడు. ఆటలో ఉన్న మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. అలాగే సోనిత్‌పూర్ జిల్లాలో ధేకియాజులిలో ఒక స్కూల్ బస్సుపై చెట్టుపడిపోవడంతో అందులో ఉన్న 12 మంది చిన్నారులు గాయపడ్డారు. వీరిని చికిత్స కోసం స్థానిక ఆసుపత్రిలో చేర్చారు. రాజధాని డిస్‌పూర్, గౌహతి పట్టణాలతో సహా అసోం వ్యాప్తంగా పలు చోట్ల చెట్లు నేలకూలినట్లు అధికారులు తెలిపారు.

దిగువ అస్సాంలో విద్యుత్ స్థంభాలు పడిపోవడతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందని, వివిధ ప్రాంతాల్లో నీరు నిలిచిందని అధికారులు చెప్పారు. కామరూప్ (మెట్రో), ధుబ్రి, గోల్‌పరా, కామ్‌రూప్, మోరిగావ్, నాగావ్, సోనిత్‌పూర్, డిమా హసావో జిల్లాలు ఎక్కువగా ప్రభావితమయ్యాయని తెలిపారు. అనేక రోడ్డు మార్గాలను మూసివేశారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకూ మోరిగావ్, నాగావ్, డిమా హసావో జిల్లాల్లో పాఠశాలలు, ఇతర విద్యా సంస్థలు మూసివేశారు. ఫెర్రీ సర్వీసులు రద్దు చేయడంతో అనేక బోట్లు, ఫెర్రీలు బ్రహ్మపుత్ర నదీ ఒడ్డున నిలిచిపోయాయి. గౌహతి, జోర్హాట్, తేజ్‌పూర్, మోరిగావ్, ధుబ్రి, గోల్‌పరా, దక్షిణ సల్మారా, బార్‌పేట్, కాచర్, కరీంగంజ్ జిల్లాల్లో ఫెర్రీ సర్వీసులు నిలిచిపోయాయి. 'పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటకు రావొద్దు' అని ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ విజ్ఞప్తి చేశారు. పరిస్థితులను ఎదుర్కొవడానికి ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉన్నాయని అధికారులు తెలిపారు.

మూత్రపిండాల్లో రాళ్లను కరిగిస్తామని తప్పుడు ప్రకటనలు

- స్టోన్ క్రష్ సిరప్‌ను డ్రగ్ కంట్రోల్ అధికారులు స్వాధీనం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మూత్రపిండాల్లో రాళ్లను కరిగిస్తామంటూ తప్పుడు ప్రకటనలు చేస్తున్న వారిపై డ్రగ్ కంట్రోల్ అధికారులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు దాడులు చేసి నకిలీ మందులను స్వాధీనం చేసుకోగా, తాజాగా ఆయుర్వేద మందు స్టోన్ క్రష్ సిరప్‌ను సీజ్ చేశారు. డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమెడీస్ (ఆబ్జెక్షనబుల్ అడ్వర్టైజ్ మెంట్) యాక్ట్, 1954ను ఉల్లంఘిస్తూ ఇలాంటి ప్రకటనలతో లేబుల్స్ పెట్టకూడదని అధికారులు పదే పదే హెచ్చరిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా రంగారెడ్డి జిల్లా కొత్తూరు గ్రామంలో ఒక మెడికల్ షాపులో మూత్రపిండాలకు చికిత్స పేరుతో అమ్ముతున్న స్టోన్ క్రష్ సిరప్ నిల్వలను స్వాధీనం చేసుకున్నారు.

ఈ సిరప్‌ను మధ్యప్రదేశ్ రాష్ట్రం, ఇండోర్ గాంధీనగర్ పరసరాం మార్గ్‌కు చెందిన ఫార్మా రీసెర్చ్ ల్యాబ్ దీనిని తయారు చేస్తున్నది. దీనిపై పూర్తి స్థాయిలో విచారించి బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని డ్రగ్ కంట్రోల్ అథారిటీ డైరెక్టర్ జనరల్ వీ.బీ.కమలాసన్ రెడ్డి తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంత్రాలు

నవతెలంగాణ- బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపల్ పరిధిలోని పలు కాలనీలలో విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు పహాడి షరీఫ్ విద్యుత్ శాఖ ఏఈ ఎల్.వి.సత్యనారాయణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11:00 నుండి మధ్యాహ్నం 12:30 వరకు 11 KV వాది ముస్తాఫా ఫీడర్‌లో మరమ్మతులు, విద్యుత్ లైన్ల దగ్గర చెట్ల కొమ్మలను తొలగిస్తున్నట్టు పేర్కొన్నారు. వాది ముస్తఫా, వాది హదీస్, ముస్తఫా హిల్స్, అహ్మద్ అస్రఫ్ కాలనీ వరకు 11కి.వి. మదర్సా ఫీడర్‌లో మధ్యాహ్నం 2:30 నుండి సాయంత్రం 4:00 గంటల వరకు, ముస్తాఫా పాఠశాల మదీనా కాలనీ, మున్నేర్ మజీద్, ఖుబా కాలనీ, మదర్సా, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పాడుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని సత్యనారాయణ కోరారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

నవతెలంగాణ - మీర్ పేట్



మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పెద్ద చెరువులో గుర్తు తెలియని ఓ వృద్ధురాలి మృతదేహం లభ్యమైందని మీర్‌పేట్ ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్ తెలిపారు. ఇన్‌స్పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం మధ్యాహ్నం సమయంలో పెద్ద చెరువులో సుమారు 55 నుండి 60 వయసు గల వృద్ధురాలి మృతదేహం నీళ్లలో తేలుతుంటే చేపలు పట్టే వ్యక్తులు మీర్‌పేట్ పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనాస్థలానికి పోలీసులు చేరుకొని వృద్ధురాలి మృతదేహాన్ని బయటకు తీశారు. చెరువు ఒడ్డున చెప్పులు, కళ్ళజోడు, నడుము బెల్ట్ పెట్టి నీటిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమికంగా తెలుస్తుందన్నారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. వృద్ధురాలికి సంబంధించిన వారు మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ 8712662646 ఫోన్ నెంబర్‌కు ఫోన్ చేయాలని పోలీసులు సూచించారు.

హైదరాబాద్ ఫోటోగ్రాఫర్‌కు
బ్రిటన్ అత్యున్నత పురస్కారం



నవతెలంగాణ- నాగోల్

హైదరాబాద్ నగరానికి చెందిన సతీష్ లాల్ అందేకార్ అనే ఫోటో గ్రాఫర్‌కు ప్రపంచ ప్రఖ్యాత గాంచిన, 170 ఏండ్ల చరిత్ర కలిగిన ప్రతిష్టాత్మక రాయల్ ఫోటోగ్రఫీ సొసైటీ ఆఫ్ గ్రేట్ బ్రిటన్ వారు అసోసియేట్ హానర్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా నాగోలు డివిజన్‌లోని కో ఆపరేటివ్ బ్యాంక్ కాలనీ సంక్షేమ సంఘం భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సతీష్ లాల్ మాట్లాడారు. ప్రపంచంలో ఫోటోగ్రఫీ రంగంలో ఫోటోగ్రాఫర్లకు వారు అందిస్తున్న రెండోవ అత్యున్నత పురస్కారం మన దేశం నుంచి నాకు లభించడం ఎంతో గౌరవంగా భావిస్తున్నానని అన్నారు. పదేండ్లుగా ఒడిషా రాష్ట్రంలోని ఆలివ్ రిడ్లీ తాబేళ్లపై, వాటి జీవన విధానంపై, మానవ తప్పిదాలు వలన వాటికి జరుగుతున్న ముప్పుపై నేను చేసిన ఫోటో డాక్యుమెంటేషన్‌ను వారికి సమర్పించినందుకు నేను ఈ ఘనతను సాధించానని తెలిపారు. ప్రతి సంవత్సరం ఒడిస్సా తీర ప్రాంతానికి 10 రోజుల వ్యవధిలో 8 లక్షల నుంచి 10 లక్షల వరకు తాబేళ్లు వచ్చి గుడ్లు పెడతాయని, ఒక్కో తాబేలు 150 నుంచి 180 గుడ్లు పెడతాయని పేర్కొన్నారు. 45 రోజుల తరువాత ఆ గుడ్ల నుంచి కోట్లాది తాబేలు పిల్లలు వచ్చి అవి కూడా సముద్రంలోకి వెళ్ళి పోతాయని వివరించారు.

ఆలివ్ రిడ్లీ తాబేళ్లను అంతర్జాతీయ ప్రకృతి పరిరక్షణ సమితి అంతరించి పోయే జీవుల జాబితాలో చేర్చడం జరిగిందన్నారు. ప్రకృతి విపత్తులు, ఈ జీవుల స్మగ్లింగ్ వలన ఇవి అంతరించి పోయే ప్రమాదంలో ఉన్నాయని.. ఇలాంటి క్లిష్టమైన అంశంపై నేను తీసిన ఫోటో డాక్యుమెంటరీకి ఈ పురస్కారం లభించిందని వివరించారు. ఈ పుర స్కారం అందుకోవాలంటే ఎదైనా ఒక వైవిధ్య భరితమైన అంశంపై ఫోటో డాక్యుమెంటరీ చేయ వలసి వస్తుందన్నారు. దాంతో పాటు ఫోటోగ్రఫీపై ఎంతో నైపుణ్యం, వారు నియమించిన ఎన్నో కఠిన మైన నియమ నిబంధనలు పాటిస్తూ 15 ఫోటోలతో కూడిన ఒక డాక్యుమెంటేషన్ సపర్పించాల్సి ఉంటుందని చెప్పారు. ఆ తరువాత ఫోటోగ్రఫీలో నిష్ణాతులైన జడ్జిలతో కూడిన ఆరుగురి బృందం ప్రతి ఫోటోను క్షుణ్ణంగా పరిశీలించి.. అవన్నీ కూడా వాళ్ళ నియమ నిబంధనలకు అనుగుణంగా ఉంటే ఈ అవార్డును ప్రకటిస్తారని తెలిపారు.

నందమూరి తారక రామారావు 101వ జయంతి వేడుకలను వనస్థలిపురంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వనస్థలిపురంలోని పనామా (ఎన్టీఆర్ చౌరస్తా) వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి ఎల్బీనగర్ శాసన సభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డిలు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

నవతెలంగాణ వనస్థలిపురం



30న సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం

- సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కీసర నర్సిరెడ్డి



నవతెలంగాణ - వనస్థలిపురం

ఈ నెల 30న ఆటోనగర్‌లో ఉదయం 9 గంటలకు నిర్వహించనున్న సీఐటీయూ ఆవిర్భావ వేడుకలను జయప్రదం చేయాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కీసర నర్సిరెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ మతోన్మాద బీజేపీ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక హక్కులను కాలరాస్తూ.. కార్పొరేట్ శక్తులకు దాసోహం అంటూ వ్యవహరిస్తుందని మండిపడ్డారు. కార్మిక వ్యతిరేక విధాలను అవలంబిస్తున్న బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వాడవాడలా సీఐటీయూ జెండా ఎగురవేయాలన్నారు. ఆటోనగర్‌లోని టీసీఐ వద్ద జరిగే సదస్సును జయప్రదం చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ ఎల్బీనగర్ సర్కిల్ కన్వీనర్ ఆలేటి ఎల్లయ్య, సరూర్నగర్ సర్కిల్ కన్వీనర్ ఎం. వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వజీర్ ప్రకాష్ గౌడ్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ - సంతోష్ నగర్

టీపీసీసీ ప్రచార కమిటీ కో కన్వీనర్, మాజీ కార్పొరేటర్ వజీర్ ప్రకాష్ గౌడ్ జన్మదిన వేడుకలను ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట్ డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గోపాల్ ముదిరాజ్ ఆధ్వర్యంలో కొత్తపేట డివిజన్ పరిధిలోని తన స్వగృహంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వజీర్ ప్రకాష్ గౌడ్‌కు పలువురు పూల బొకేలు అందజేస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో చంపాపేట్ డివిజన్ సీనియర్ నాయకులు గోపాల్ ముదిరాజ్, తెలంగాణ గౌడ సంఘం నాయకులు బోనాగాని యాదగిరి గౌడ్, బీసీ సమైక్య అధ్యక్షులు ఎస్ దుర్గయ్య గౌడ్, డిసిసి అధికార ప్రతినిధి బొంగు వెంకటేష్ గౌడ్, అంతటి శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాలగోని రాములు గౌడ్, ముద్ద గోని రామ్మోహన్ గౌడ్, ఊరుపాక రవికుమార్, నరహరి గౌడ్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

'బీసీ గురుకులాల్లోని సమస్యలు పరిష్కరించాలి'

నవతెలంగాణ- నాగోల్

బీసీ గురుకులాలలో నెలకొన్న సమస్యలను గుర్తించి, వెంటనే పరిష్కరించాలని కోరుతూ బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు జి. ఆనంద్ గౌడ్ ఆధ్వర్యంలో బీసీ గురుకుల కార్యదర్శి బి. సైదులు ఐఎఫ్ఎస్ కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడు విద్యా సంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలు గడిచినా విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్ అందించలేదని గుర్తుచేశారు. మరో వారం రోజుల్లో 2024-25 విద్యా సంవత్సరం ప్రారంభం అవుతున్న నేపథ్యంలో విద్యార్థులకు అన్నింటినీ అందుబాటులోకి తీసుకొని రావాలని కోరారు. ప్రతి గురుకుల పాఠశాలలో భోజన ఏర్పాటు కోసం ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. వారానికి రెండుసార్లు మానసిక నిపుణుల చేత విద్యార్థులకు క్లాసులు నిర్వహించాలన్నారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ తప్పకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు సరిపడ టాయిలెట్లు, తాగునీటి సౌకర్యం తదితర సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఓబీసీ నాయకులు, ఓబీసీ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల సురేందర్ యాదవ్, జనరల్ సెక్రటరీ ఈశ్వర్ అప్ప, కోశాధికారి తట రవి, స్పోక్ పర్సన్ రాజు నాథ్, ఆఫీసు సెక్రటరీ శరత్ సింగ్, ఐటీ సెల్ వెంకటేష్, మహంకాళి జిల్లా ప్రెసిడెంట్ శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



- జిల్లాకు చేరిన 2.12లక్షల మీటర్ల వస్త్రం
- మహిళా సంఘాలకు కుట్టుపని బాధ్యతలు
- మొత్తం 1.05లక్షల మంది విద్యార్థులకు లబ్ధి
- మొదటి విడతలో ప్రతి విద్యార్థికీ ఒక్కో జత యూనిఫాం

డెడ్‌లైన్‌లోగా.. స్కూల్ యూనిఫాం..!



నవతెలంగాణ - సిటీబ్యూరో

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు యూనిఫామ్ చేరింది. ఇప్పటికే మండల పాయింట్లకు చేరిన వస్త్రం.. అక్కడి నుంచి స్కూల్ పాయింట్లకు చేరాయి. దీంతో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల పర్యవేక్షణలో బట్టలు కుట్టించి జూన్ 7లోగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించనున్నారు. జూన్ 12 నుంచి నూతన విద్యాసంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్స్ పంపిణీకి అవసరమైన చర్యలను సంబంధిత అధికారులు చేపట్టారు. దీనిపై ఇప్పటికే జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి విద్యాశాఖ, జీహెచ్ఎంసీ అధికారులతో సమావేశమై.. జూన్ 7వ తేదీలోపు ప్రతి విద్యార్థికీ ఒక్కో జత చొప్పున ఉచిత యూనిఫామ్ అందించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో సంబంధిత అధికారులు ఆ మేరకు చర్యలు తీసుకుంటున్నారు.

హైదరాబాద్ జిల్లాలో 16 మండలాల పరిధిలో మొత్తం 776 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలున్నాయి. వీటిలో 691 ప్రభుత్వ పాఠశాలలుండగా.. 85 ఎయిడెడ్ స్కూళ్లు ఉన్నాయి. వీటిలో మొత్తం 1,05,281 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులతో పాటు ఎయిడెడ్ పాఠశాలల్లో చదివే వారికి కూడా ప్రతి సంవత్సరం ప్రభుత్వం యూనిఫామ్స్‌ను సరఫరా చేస్తోంది. ప్రతి విద్యార్థికి సంవత్సరానికి రెండు జతల యూనిఫామ్స్‌ను ఉచితంగా సరఫరా చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటిలాగే ఈ సంవత్సరం కూడా విద్యార్థులకు స్కూల్ డ్రెస్సు అందించాలని నిర్ణయించి.. ఆ మేరకు మొత్తం 1.05లక్షల మందికి రెండు జతల చొప్పున సుమారు 4.24లక్షల మీటర్ల వస్త్రం అవసరముండగా.. మొదటి విడుతలో ప్రతి విద్యార్థికీ ఒక్క జత చొప్పున అందించేందుకు కావాల్సిన 2.12లక్షల మీటర్ల వస్త్రాన్ని జిల్లాకు సరఫరా చేసింది. ఇందులో 1-7 తరగతి వరకూ విద్యార్థులకు నిక్కరు, చొక్కా, 8-10 వరకూ ఫ్యాంటు, చొక్కా అందిస్తారు. విద్యార్థినులకు 8-10 వరకూ పంజాబీడ్రెస్ అందజేస్తారు. గతంలో హెచ్ఎంలు, ఎస్ఎంసీ సభ్యులు కుట్టించేవారు. స్టిచ్చింగ్ పనులు ఆలస్యం అవుతున్నాయనే ఆరోపణలకు తోడు.. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం స్కూల్ పిల్లల యూనిఫామ్స్ కుట్టే బాధ్యతను ప్రధానోపాధ్యాయులు, అమ్మ కమిటీల సభ్యులకు అప్పగించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. దీంతో ఇప్పటికే మండల పాయింట్లకు చేరిన దాదాపు 2,12,289 మీటర్ల క్లాత్ మెటీరియల్ జిల్లా విద్యాశాఖ అధికారులు మండలాల వారీగా విభజించి పంపిణీ చేశారు. ఇందుకు సంబంధించిన కుట్టు పనిని ఇప్పటికే ప్రారంభించిన అధికారులు జూన్ 7వ తేదీలోగా ప్రతి విద్యార్థికీ ఒక జత యూనిఫాం అందించేలా చర్యలను వేగిరం చేశారు. రెండవ విడుతలో మరో జత అందించనున్నారు.

రూ.75కు కుట్టు కూలీ పెంపు..?

సర్కారు విద్యార్థులకు ఉచితంగా అందించే యూనిఫామ్స్‌ను కుట్టే బాధ్యతను ఈసారి మహిళా సంఘాలకు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిన విషయం తెలిసిందే. దీంతో జిల్లా విద్యాశాఖ, జీహెచ్ఎంసీ అధికారులు.. నగరంలోని 16 సర్కిళ్ల పరిధిలోని ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు ఈ పనులు అప్పగించారు. ఒక్క జత యూనిఫామ్ కుట్టినందుకు రూ. 50చొప్పున రెండు జతలకు వంద రూపాయలు చెల్లించనున్నారు. ఒకటి నుంచి 7వ క్లాస్ వరకు విద్యార్థులకు నిక్కరు, చొక్కా, 8-10 వరకూ ఫ్యాంటు, చొక్కా కుట్టించగా.. విద్యార్థినులకు ఎనిమిది నుంచి పది వరకు పంజాబీడ్రెస్ కుట్టి ఇస్తారు. మెరూన్ కలర్ ప్యాంటు, స్కర్ట్‌తో పాటు మెరూన్, యాష్ కలర్ కలిసి ఉండే చెక్స్ షర్టుతో యూనిఫామ్ ఉంటుంది. ఇదిలావుంటే వాస్తవానికి ఏకరూప దుస్తులు కుట్టు కూలీలకు బయట టైలర్లు రూ.400-500 వరకూ వసూలు చేస్తారు. ఇందుకు నాణ్యమైన గుండీలు, దారం ఉపయోగించడం వలన కుట్టు మన్నికగా ఉంటుంది. ప్రభుత్వ పాఠశాలలకు అందించే దుస్తులకు కేవలం రూ.50 మాత్రమే ఇవ్వడంతో గతంలో టైలర్లు.. ఇప్పుడు మహిళా సంఘాలు సైతం ముందుకు రాని పరిస్థితి ఉండింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో జతకు ప్రస్తుతం చెల్లిస్తున్న కుట్టు కూలీ స్థానంలో మరో రూ.25 పెంచి మొత్తం 75 చెల్లించేందుకు ఒకే చెప్పినట్టుగా తెలుస్తోంది. దీంతో ఒక్కో జతకు రూ.75 చొప్పున రెండు జతలకు కలిపి రూ.150 చెల్లించనున్నట్టు సమాచారం. ప్రస్తుతం ఎన్నికల కోడ్ ఉండడంతో ఈ విషయాన్ని అధికారులు గోప్యంగా ఉంచారు. కోడ్ ముగిసిన వెంటనే పెంచిన ధరను ప్రకటించే అవకాశం ఉందని విద్యాశాఖ అధికారి ఒకరు తెలిపారు.



7వ తేదీ లోగా విద్యార్థులకు యూనిఫాం అందజేస్తాం..

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించే యూనిఫాం క్లాత్ జిల్లాకు రావడంతోనే..మండలాల వారీగా పంపిణీ చేశాం. జీహెచ్ఎంసీ ద్వారా మహిళా సంఘాలకు అందజేసి కుట్టించే ఏర్పాట్లు చేస్తున్నాం. కలెక్టర్ ఆదేశాల మేరకు యూనిఫాం స్టిచ్చింగ్ పనులు ప్రారంభించాం. జూన్ 7లోగా విద్యార్థులకు అందజేస్తాం.

ఆర్.రోహిణి, డీఈవో, హైదరాబాద్

ఓజోన్‌లో కార్డియో తొరాసిక్
ఆపరేషన్స్ థియేటర్ ప్రారంభం

నవతెలంగాణ - చైతన్యపురి



ఆర్కేపురంలోని ఓజోన్ ఆస్పత్రిలో కార్డియో తొరాసిక్ ఆపరేషన్స్ థియేటర్‌ను ఓజోన్ ఆస్పత్రి చైర్మన్ సత్యసాయి ప్రసాద్, మేనేజింగ్ డైరెక్టర్ మిస్ దీప్తిలు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో గుండె శస్త్ర చికిత్సలు చేసే సేవలు అందించే హాస్పటల్స్ చాలా తక్కువగా ఉన్నాయని అన్నారు. ఆరోగ్యశ్రీ పథకంలో ఈ శస్త్ర చికిత్స కేవలం ఓజోన్ ఆసుపత్రి నందు ప్రారంభిస్తున్నామని తెలిపారు. అందరికీ నాణ్యమైన వైద్యాన్ని అతి తక్కువకే అందించడమే ఓజోన్ ఆస్పత్రి లక్ష్యం అని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఇంద్రసేనారెడ్డి, డాక్టర్ పూజిత, డాక్టర్ సిహెచ్ శ్రీనివాసరావు, డా. మధుసూదన్ రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

ఇద్దరు అరెస్టు.. పరారీలో ఒకరు

నవతెలంగాణ- నాగోల్

రాచకొండ పోలీస్ కమిషనరేట్ నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నాగోలులోని సాయి నగర్‌లో నిర్వహిస్తున్న వ్యభిచార గృహంపై పోలీసులు దాడి చేశారు. నిర్వాహకురాలలో ఒక మహిళను ఒక విటుడ్ని పట్టుకున్నారు. మరో మహిళ పరారీలో ఉన్నట్లు నాగోల్ పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంకు చెందిన కర్రి కృష్ణవేణి, బాలాపూర్ వివేకా నగర్లో నివాసం ఉంటుంది. అదేవిధంగా బాలాపూర్‌కు చెందిన మరో మహిళ రాణితో కలిసి ఇద్దరు నాగోలు డివిజన్లోని సాయి నగర్ రోడ్డు నెంబర్ రెండులో ఐదో అంతస్తులో ఒక గదిని అద్దెకు తీసుకున్నారు. అక్రమంగా మహిళలను తరలించి వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. వెంటనే పోలీసులు ఆ గృహంపై దాడి చేశారు. నిర్వాహకురాలు రాణి అందుబాటులో లేదు. మరో నిర్వాహకురాలు కర్రి కృష్ణవేణి, విటుడు గుంటూరు గ్రామానికి చెందిన భాస్కర్ గౌడ్‌లను అదుపులోకి తీసుకున్నారు. ఆర్థిక ఇబ్బందులతో ఉన్న వారిని గుర్తించి.. వారికి డబ్బులు ఎర చూపి రాణి, కృష్ణవేణిలు వ్యాపారం చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారని పోలీసులు తెలిపారు. వ్యభిచార గృహంలో మూడు సెల్ ఫోన్లను, రెండు కండోమ్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. తర్వాత వారిని రిమాండ్‌కు తరలించినట్లు నాగోల్ పోలీసులు తెలిపారు.

ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్న సబితమ్మ

నవతెలంగాణ - చైతన్యపురి

ఆర్కేపురం డివిజన్ బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు లిక్కీ ఊర్మిళా రెడ్డి మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యేగా సబితా ఇంద్రారెడ్డి గెలిస్తే మొక్కులు చెల్లించుకుంటానని కోరుకున్నారు. ఈ మేరకు మంగళవారం మహేశ్వరం నియోజకవర్గంలోని తుక్కుగూడ మున్సిపాలిటీ రావిర్యాలలో వెలిసిన సూర్యగిరి ఎల్లమ్మ తల్లిని సబితా ఇంద్రారెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఊర్మిళా రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ, డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, సాజిద్, మహేందర్ రెడ్డి, మురళీధర్ రెడ్డి, రామిడి రామిరెడ్డి, భీమిడి జంగారెడ్డి, సంరెడ్డి వెంకట్ రెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.



బహుముఖ ప్రజ్ఞాశాలి సురవరం

- టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ ఉప్పల



నవతెలంగాణ- నాగోల్

పత్రికా సంపాదకుడిగా, పండితునిగా బహుముఖ ప్రజ్ఞాశాలి సురవరం ప్రతాపరెడ్డి అని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, తెలంగాణ రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త కొనియాడారు. నాగోల్‌లోని కో ఆపరేటివ్ బ్యాంక్ కాలనీలో ప్రముఖ సాంస్కృతిక సంస్థ ఆకృతి ఆధ్వర్యంలో సుప్రసిద్ధ సాహితీ వేత్త సురవరం ప్రతాపరెడ్డి 128వ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్త ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆనాటి నిజాం నిరంకుశ పాలనలో సామాన్య ప్రజల అణచివేతను వ్యతిరేకిస్తూ సురవరం ప్రజలను చైతన్య వంతులను చేశారన్నారు. తెలంగాణలో కవులే లేరనే నిందావ్యాఖ్యలను సవాలుగా తీసుకొని.. 'గోల్కొండ కవుల చరిత్ర' పేరిట పలు కవుల రచనల సంచిక గా వెలువరించారని కొనియాడారు. అన్యాయాలకు వ్యతిరేకంగా తన రచనా పటిమతో నిత్యం పోరాటం చేసిన కలం యోధుడు సురవరం అని అన్నారు. ప్రభుత్వ సిటీ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ కోయి కోటేశ్వర రావు మాట్లాడుతూ.. తెలంగాణ చైతన్యానికి సురవరం ప్రతాపరెడ్డి తల్లి వేరు లాంటి వారని అన్నారు. తెలుగుభాషా సాహిత్యాల వికాసానికి ఆయన చారిత్రాత్మకమైన కృషి చేశారని గుర్తుచేశారు. నివాళులర్పించిన వారిలో మదర్ థెరీసా ఫౌండేషన్ అధ్యక్షుడు చేపూరి శంకర్, సాహిత్యాభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం వైస్ చైర్‌పర్సన్‌కు సన్మానం

నవతెలంగాణ-తుర్కయంజాల్



ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ వైస్ చైర్ పర్సన్‌గా నూతనంగా ఎన్నికైన బర్ల మంగ జగదీశ్‌కు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నేతలు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు మంగళవారం ఇబ్రహీంపట్నంలోని ఆమె నివాసంలో టీయూఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కొంతం యాదిరెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారుడు, సీనియర్ నాయకులు మంగ జగదీశ్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి చందు, కౌన్సిలర్ జెర్కోని బాలరాజ్, టీయూఎఫ్ రంగారెడ్డి జిల్లా మహిళా అధ్యక్షురాలు దుగ్గాని శ్యామల, తుర్కయంజాల్ మున్సిపల్ ప్రధాన కార్యదర్శి అందేకార్ బాబూలాల్ తదితరులు పాల్గొన్నారు.

సంతోష్‌నగర్ ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక డ్రైవ్

నవతెలంగాణ - సంతోష్‌నగర్

సంతోష్ నగర్ డివిజన్ పరిధిలోని యాదగిరి థియేటర్ వద్ద సంతోష్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు మంగళవారం ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా సంతోష్ నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సీఐ నరసింహా నాయక్, ఎస్ఐ సత్యనారాయణలు మాట్లాడుతూ సౌత్ ఈస్ట్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ ఆదేశం మేరకు ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించినట్లు తెలిపారు. ఈ డ్రైవ్‌లో ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తున్న లోడ్ బండ్లు, గుడ్స్ ఆటోలపై కేసులు నమోదు చేసి, జరిమానా విధించినట్టు తెలిపారు. రోడ్డుకు ఇరువైపులా వాహనాలను నిలిపి ట్రాఫిక్ ఇబ్బందులను సష్టిస్తున్నారని, అదే విధంగా పండ్ల బండ్లతో ట్రాఫిక్ ఇబ్బందుల ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. దీనిపై కూడా ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహిస్తామని పేర్కొన్నారు. టూ వీలర్-20, త్రీ వీలర్-4, ఫోర్ వీలర్-12 లకు చలాన్లు విధించినట్టు తెలిపారు. ఉద్దేశపూర్వకంగా నెంబర్ ప్లేట్ కనిపించకుండా చేసినట్టయితే వాహన యజమానికి మోటర్ వెహికల్ యాక్ట్ 129 (2) రూ.2వేలు వరకు జరిమానా లేదా నెల రోజులు జైలు శిక్ష పడే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని సూచించారు. లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ డ్రైవ్‌లో ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నాగారం మున్సిపాలిటీలో ఫుడ్ సేఫ్టీపై తనిఖీలు



నవతెలంగాణ-కీసర

నాగారం మున్సిపాలిటీ పరిధిలోని హెూటల్స్, రెస్టారెంట్లను మున్సిపల్ కమిషనర్ జి.రాజేందర్ కుమార్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మున్సిపాలిటీలో కుళ్లిపోయి, క్వాలిటీ లోపించిన ఆహార పదార్థాలు వాడుతున్న హెూటళ్లకు, రెస్టారెంట్లకు రూ.45 వేల జరిమానా విధించారు. ఈ తనిఖీలో మున్సిపల్ మేనేజర్ కె. చంద్రశేఖర్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ రామ్‌రెడ్డి, లైసెన్స్ ఇన్‌స్పెక్టర్ ధర్మారెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలి

- కీసర మండల వ్యవసాయ అధికారి వందన



నవతెలంగాణ-కీసర

రైతులు నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేసుకోవాలని కీసర మండల వ్యవసాయ అధికారి వందన అన్నారు. మంగళవారం కీసర మండలంలోని యాద్గార్‌పల్లి, కీసర, దాయరా గ్రామ రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు కొనే విత్తనాలకు డీలర్ల నుంచి తప్పనిసరిగా బిల్లులు, రశీదులు తీసుకోవాలని తెలిపారు. ఈ రశీదులు పంట కాలం అయిపోయే వరకు భద్రపరుచుకోవాలని సూచించారు. రశీదు మీద విత్తన కంపెనీ పేరు, విత్తనం రకం, బ్యాచ్ నెంబర్, లార్డ్ నంబర్, రేటు తప్పనిసరిగా ఉండాలన్నారు. గ్రామాల్లో తక్కువ ధరకు, ఎక్కువ ధరకు అమ్మే వారి వివరాలు వెంటనే వ్యవసాయ అధికారికి తెలియజేయాలని సూచించారు. ఎవరైనా పక్క జిల్లా నుంచి, పక్క రాష్ట్రాల నుంచి నకిలీ విత్తనాలు తెచ్చి విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

విత్తనాల కొనుగోలుపై రైతులకు అవగాహన



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మండల పరిధిలోని మైసిరెడ్డిపల్లి, నూతనకల్, రైలాపూర్, రావల్ కోల్, సైదోనిగడ్డ తండా గ్రామాల్లో రైతులు వానాకాలం విత్తనాలు కొనే ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు నాలుగు అంశాలపై రైతులకు విపులంగా వివరించారు. ఇందులో భాగంగ లూజుగా ఉన్న సంచుల్లో ఉన్న విత్తనాలను కొనుగోలు చేయరాదని, విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా దుకాణాదారుడిని నంచి రశీదు తీసుకోవాలని సూచించారు. విత్తనాలకు సంబంధించిన ప్యాకెట్ బిల్లును పంట కాలం పూర్తయ్యే వరకు భద్రంగా దాచుకోవాలని చెప్పారు. వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన డీలర్ల దగ్గర మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారిని మేరీరేఖ, మండల వ్యవసాయ అధికారిని అర్చన, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు సుమిత, తేజస్విని, డబిల్ పూర్ సొసైటీ చైర్మెన్ సద్ది సురేష్‌రెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఉమాదేవి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వృధాగా..నీరు పట్టింపులేని అధికారులు



నవతెలంగాణ-కాప్రా

మల్లాపూర్ డివిజన్‌లోని ఓల్డ్ మల్లాపూర్‌లో ప్రతిరోజు తాగునీరు వృధాగా పారుతున్నా కాప్రా వాటర్ వర్క్స్, జీహెచ్ఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదు. వాటర్‌ను వదలగానే సీసీ రోడ్డుకు పడిన పగుళ్ల నుంచి నీరు గంటల తరబడి వృధాగా పారుతోంది. దీంతో రోడ్డుపై వెళ్లే స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికంగా ఉండే విజయ అనే మహిళ నవతెలంగాణతో తన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతీరోజు ఇదే పరిస్థితి ఉంటుందని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఎవరూ పట్టించుకోవడంలేదని, ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని కోరారు.

వైభవంగా రేణుక ఎల్లమ్మ కల్యాణోత్సవం



నవతెలంగాణ-శామీర్‌పేట

మూడుచింతలపల్లి మండల పరిధిలోని లక్ష్మాపూర్‌లో గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుక ఎల్లమ్మ కల్యాణం మంగళవారం కన్నుల పండుగగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో హెూమం, పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకోడానికి వచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం ప్రతినిధులు ఎల్లగొని చిత్తయ్య గౌడ్, చినలచ్చ రమేష్‌గౌడ్, రాములు గౌడ్, బాల్ నర్సయ్య గౌడ్, చిన్నలచ్చ శ్రీనివాస్ గౌడ్, రాజారాం రాజు గౌడ్, శ్రీనివాస్ గౌడ్, బాలేష్ గౌడ్, వై. కరుణాకర్ గౌడ్, టి. రవి గౌడ్, ఆర్ శంకర్ గౌడ్ , యువకులు , మహిళలు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు అరెస్టు

- రెండు కిలోల గంజాయి, బైక్, మొబైల్ స్వాధీనం




నవతెలంగాణ-కీసర

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీస్‌లు అరెస్ట్ చేసిన సంఘటన కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. కీసర సీఐ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం.. నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లి గ్రామం ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు వద్ద అక్రమంగా గంజాయి విక్రయిస్తున్నట్లు ముందస్తు సమాచారంతో ఎస్సై మధు, పోలీసులు అక్కడ సివిల్ డ్రెస్‌లో వేచి ఉన్నారు. ఇద్దరు వ్యక్తులు అనుమానస్పదంగా కన్పించడంతో వారిని ఎస్సై మధు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రెండు కిలోల గంజాయి, ఒక ద్విచక్ర వాహనం, మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నారు. మార్క అరుణ్ (25) బాదోచ్ గణేష్ (25)లు దూల్‌పేట్‌లో గుర్తు తెలియని వ్యాపారి నుంచి రూ. 20 వేలకు గంజాయి కొనుగోలు చేశారు. అట్టి గంజాయిని 25 గ్రాములు చొప్పున ప్లాస్టిక్ కవర్లలో ప్యాక్ చేసి బ్యాగులో ఉంచారు. ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు వద్ద వారిద్దరూ కస్టమర్ల కోసం వేచి ఉన్నారు. అనుమానంతో వారిని విచారించగా వారి వద్ద గంజాయి పట్టుబడింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మూర్ఛ వ్యాధితో బాధపడుతున్న వ్యక్తి అదృశ్యం



నవతెలంగాణ-జవహర్‌నగర్

మూర్ఛ వ్యాధితో బాధపడుతున్న వ్యక్తి ఇంటి నుంచి అదృశ్యమైన సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్ధార్థ నగర్ దమ్మాయిగూడలో నివాసముండే సుసాన్ స్టానిస్లాస్ (58) గత బుధవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. అతడికి మూర్ఛ వ్యాధి, మెదడు స్ట్రోక్‌తో లాంటి ఆరోగ్య సమస్యలు ఉన్నాయని తెలిపారు. అతడికి పని చేయాలనే కోరిక ఉందని, కుటుంబ సభ్యులు ఒప్పుకోకపోవడంతో ఇంటి నుంచి వెళ్లిపోయాడని అనుమానిస్తున్నారు. దీంతో అతడి కుమారుడు ప్రవీణ్ ఆంటోని మంగళవారం జవహర్ నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఊరెళ్లి వచ్చేసరికి ఇల్లు లూటీ..!

- 10 తులాల బంగారం, వెండి, నగదు అపహరణ



నవతెలంగాణ-జవహర్‌నగర్

ఊరేళ్లి వచ్చేసరికి గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లో ఉన్న నగదు, బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లిన సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మంగిలిపల్లి రవీందర్ అనే వ్యక్తి సాయి సిద్ధార్థనగర్, దమ్మాయిగూడలో నివాసం ఉంటున్నారు. రవీందర్ కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం సిద్దిపేటలో ఓ కార్యక్రమానికి హాజరై మంగళవారం ఉదయం ఇంటికి వచ్చి చూసేసరికి గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగుగొట్టి బీరువాలో ఉన్న బంగారు లాకెట్, గొలుసు, నెక్లెస్, కంకణాలు, వజ్రాలహారం, మొత్తం 10 తులాల బంగారం, వెండి వస్తువులు, నగదును ఎత్తుకెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కౌంటింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్
- వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్



నవతెలంగాణ-సిటీబ్యూరో

జూన్ 4వ తేదీన నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ అన్నారు. మంగళవారం ఆయన ఇతర రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో కలిసి ఎన్నికల కౌంటింగ్ నిర్వహణ ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్, అదనపు కలెక్టర్ విజేందర్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వికాస్ రాజ్ మాట్లాడుతూ కౌంటింగ్ సజావుగా నిర్వహించేందుకు కౌంటింగ్ కేంద్రాల వద్ద అవసరమైన సౌకర్యాలు కల్పించాలన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద పటిష్ట బందోబస్తు ఉండేలా చూసుకోవాలన్నారు. గుర్తింపు కార్డులు ఉన్నవారిని మాత్రమే కౌంటింగ్ కేంద్రాలకు అనుమతించాలన్నారు. ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్ వారీగా కౌంటింగ్ హాల్‌లో నిర్దేశిత రౌండ్ల వారీగా కౌంటింగ్‌ను కట్టుదిట్టంగా పూర్తి చేయాలన్నారు. ప్రతి రౌండ్ ముగిసిన తర్వాత సంబంధిత టేబుల్స్ కౌంటింగ్ వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. జూన్ 4వ తేదీన ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కౌంటింగ్ ప్రారంభమవుతుందనీ, అనంతరం ఈవీఎం యంత్రాల ఓట్ల లెక్కింపు ప్రారంభించాలన్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను పాటిస్తూ సకాలంలో కౌంటింగ్ ప్రక్రియ ముగిసేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలనీ, కౌంటింగ్ కేంద్రం వద్ద హై స్పీడ్‌తో కూడిన ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలన్నారు. కౌంటింగ్ సిబ్బంది, కౌంటింగ్ ఏజెంట్లు కౌంటింగ్ హాల్‌లోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురాకుండా ఉండేలా చూడాలన్నారు. ప్రతి కౌంటింగ్ కేంద్రం వద్ద ఫలితాలు ప్రకటించేందుకు ప్రత్యేకంగా మీడియా సెంటర్‌ను ఏర్పాటు చేయాలని తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల్లో సదుపాయాలను పరిశీలించి, కౌంటింగ్ నిర్వహణకు సన్నద్ధంగా ఉన్నట్టు ధృవీకరణ పత్రం సమర్పించాలని జిల్లా ఎన్నికల అధికారులకు, రిటర్నింగ్ అధికారులకు సూచించారు. ఎన్నికల ఫలితాలు ప్రకటించిన తర్వాత శాంతిభద్రతల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల ఫలితాల ప్రకటన అనంతరం ఈవీఎం యంత్రాలను గోడౌన్‌కు తరలించేందుకు అవసరమైన వాహనాలను సన్నద్ధం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో హరిప్రియ, సంబంధిత ఎన్నికల విభాగం అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

'చెరువు కాలువను పూడ్చి ప్లాట్లు ఏర్పాటు' కథనానికి స్పందన



- చెరువు కాలువను యధావిధిగా జేసీబీతో తీసిన అధికారులు



నవతెలంగాణ-కీసర

నవతెలంగాణ పత్రికలో మంగళవారం వచ్చిన 'చెరువు కాలువను పూడ్చి ప్లాట్లు ఏర్పాటు' అనే కథనానికి రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు స్పందించారు. చెరువు కాలువను యధావిధిగా జేసీబీతో తీయించారు. నాగారం మున్సిపాలిటీ ,రాంపల్లి గ్రామంలోని చెరువు కాలువ దారి శ్రీరామలింగేశ్వర కాలనీ సర్వే నంబర్ 380కు, సుచిత్ర కాలనీ సర్వే నంబర్ 342 ,344 ,374 ,375 ,376 ,377 రెండింటికీ అనుకుని ఉంది. ప్రస్తుతం చెరువు కాలువను కొందరు వ్యక్తులు పూడ్చి ప్లాట్‌లుగా మార్చారు. సుచిత్ర కాలనీ లేఔట్ చేసినప్పుడు లేఔట్‌లో 163 ప్లాట్‌లు ఉన్నప్పటికీ కొందరు వ్యక్తులు మరో లేఔట్ సృష్టించి ప్లాట్ నంబర్‌లు 164 ,165 ,166 ,167 ,168 ,169 ,170 ,171 ,172,173గా రాసి కడీలను పాతడంతో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కిషోర్, ఇరిగేషన్ అధికారి వాసు, మున్సిపల్ అధికారి బాలేష్‌లు చెరువు కాలువ ప్రాంతాన్ని పరిశీలించారు. చెరువు కాలువ రోడ్డులో ఏర్పాటు చేసిన రాళ్లను తొలగించి యధావిధిగా చెరువు కాలువను తీస్తుండగా రియల్టర్లు అధికారులతో వాగ్వాదం చేశారు. మీ దగ్గర ఏమైనా పత్రాలు ఉంటే చూపించండి..మా విధులకు ఆటంకం కలిగిస్తే బాగుండదు అంటూ అధికారులు మండిపడ్డారు. ఎవరైనా చెరువు కాలువలు, కుంటలను కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

జనాభా అనుగుణంగా ఎంఎంటీఎస్ నడపాలని వినతి



నవతెలంగాణ-అల్వాల్

నగరంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఎంఎంటీఎస్ రైలు నడపాలని సికింద్రాబాద్ డీఆర్ఎం భర్తేష్ కుమార్‌ను మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి కలిశారు. అల్వాల్‌లో ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్ మంజూరు చేయాలని మంగళవారం వినతి పత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చర్లపల్లి నుంచి లింగంపల్లి వెళ్లే మార్గంలో కిష్టమ్మ ఎన్‌క్లేవ్ రోడ్డు, మీనాక్షి ఎస్టేట్, అల్వాల్, సికింద్రాబాద్‌లో జనాభా పెరుగుతుండడంతో ట్రాఫిక్ రద్దీ పెరిగిందని పేర్కొన్నారు. ఈ ప్రాంత ప్రజలకు ఉపయోగపడే విధంగా అల్వాల్ లయోలా కాలేజ్ సమీపంలో ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్వాల్ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్ చింతల విజయశాంతి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు అనిల్ కిషోర్ గౌడ్, ఢిల్లీ పరమేశ్, ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్ లయోలాకాలేజ్ అల్వాల్ సాధన కమిటీ సభ్యులు రిటైర్డ్ రైల్వే ఆఫీసర్ నూర్ అహమ్మద్, సంపత్‌రెడ్డి, మురళీ కృష్ణ, బేన్ని, అర్జున్, శ్రీనివాస్‌తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ సీఎం ఎన్టీఆర్ జయంతి




- నివాళులర్పించిన పలువురు నేతలు
- పలు చోట్ల అన్నదానం కార్యక్రమాలు

నవతెలంగాణ-కాప్రా

దివంగత నాయకులు ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు 101వ జయంతి మంగళవారం ఘనంగా నిర్వహించారు. కాకతీయ సేవా సమితి ఆధ్వర్యంలో మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ ప్రధాన కూడలిలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ప్రభుదాస్ మాట్లాడుతూ.. ఎన్టీఆర్ తెలుగు ప్రజలకు చేసిన సేవలు మరువలేనివి అన్నారు. ప్రతి పేద కుటుంబంలో వెలుగులు నింపిన మహనీయుడని పేర్కొన్నారు. అనంతరం నందమూరి తారక రామారావు అన్నదాన ట్రస్టు ద్వారా 2500 మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, స్థానిక నాయకులు టీజీకే. మూర్తి, మన్నె సుబ్రమణ్యం, మాజీ ఎమ్మెల్యేలు బేతి సుభాష్‌రెడ్డి, ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, ఉమా మహేశ్వరరావు (చిన్నా) జలగం వెంకటేష్, వీరభద్రరావు అమర కుమార్, సురేందర్, నరసింహారావు, సురేష్, సాయి సుధీర్, బక్కని నర్సింహులు, అరవింద్ కుమార్ గౌడ్, నర్సిరెడ్డి, అశోక్ కుమార్ గౌడ్, పీపీ. ప్రసాద్, తాతినేని భాస్కర రావు, బండి వేంకటేశ్వర రావు, నాగ మల్లీశ్వరి, మల్లేష్‌గౌడ్, పూస రమేష్, చక్రవర్తి, బాలయ్య గౌడ్, శేఖర్ గౌడ్, నిస్సార్ అహ్మద్ ఘోరి, దండెం నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

చర్లపల్లి డివిజన్‌లో..

ఎన్టీఆర్ జయంతి సందర్భంగా చర్లపల్లి డివిజన్ పరిధిలోని కుషాయి గూడ బస్టాండ్‌లోని ఎన్టీర్ చిత్ర పటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు నందమూరి తారక రామారావు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు జి.రాములు యాదవ్, జిల్లా కార్యదర్శి రుద్రగోని రాంచందర్ గౌడ్, సత్యం యాదవ్, కే. ప్రేంకుమార్ గౌడ్, ఎన్. బాల కృష్ణాగౌడ్, కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.



ఏఎస్‌రావు నగర్ డివిజన్‌లో..

నందమూరి తారక రామారావు 101వ జయంతి సందర్భంగా ఏఎస్‌రావు నగర్ డివిజన్ పరిధిలోని హై టెన్షన్ రోడ్డులో గూడపాటి ఫౌండేషన్ చైర్మెన్ గూడపాటి శరత్ సహకారంతో తెలుగు యువత మల్కాజిగిరి పార్లమెంట్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జయంతి వేడుకలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి జ్యోత్స్న తిరునగరి, తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు టీజీకే మూర్తి, గూడపాటి ఫౌండేషన్ చైర్మెన్ గూడపాటి శరత్ హాజరయ్యారు.

జమ్మిగడ్డలో..



ఎన్టీఆర్ జయంతి సందర్భంగా కాప్రా పరిధిలోని జమ్మిగడ్డ ఎన్టీఆర్ కూడలి వద్ద టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నీరుకొండ సతీష్ బాబు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీడీపీ మాజీ అధ్యక్షులు బక్కని నర్సింహులు, ఆదిలాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు గుళ్లపల్లి ఆనంద్, మల్కాజిగిరి మేడ్చల్ జిల్లా పార్లమెంట్ అధ్యక్షులు కందికంటి అశోక్ కుమార్‌గౌడ్, మల్కాజిగిరి మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు గడ్డ మీది రాములు యాదవ్, పార్లమెంట్ కార్యనిర్వహణ కార్యదర్శి రాంచందర్ గౌడ్, ఎస్సీసెల్ రాష్ట్ర సెక్రటరీ శ్రీరాములు, నాయకులు ఉపేందర్, ఎస్‌వీ.రావు, రామ్మోహన్, మూర్తి, వెంకటేష్, రమేష్ , నవీన్, శ్రీనివాస్, వర్మ , పరందామయ్య, జనార్ధన్, కృష్ణ, సత్యం యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ మార్పిడి జరిగిన రోగి వృషణాల్లో అరుదైన కణితి

- 40 సెంటీమీటర్ల పొడవు, డంబెల్ ఆకారంలో కణితి
- సంక్లిష్టమైన శస్త్రచికిత్స చేసి తొలగించిన ఏఐఎన్‌యూ వైద్యులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

యువకుడి వృషణాల్లో అత్యంత అరుదైన, పెద్ద డంబెల్ ఆకారంలోని కణితిని బంజారా హిల్స్‌లోని ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ (ఏఐఎన్‌యూ) వైద్యులు విజయవంతంగా తొలగించారు. ఇప్పటికే ఈ రోగి కిడ్నీ మార్పిడి చేయించుకుని, ఇమ్యునోసప్రెసెంట్ మందులు ఎక్కువ మోతాదులో వాడుతుండటంతో శస్త్రచికిత్స బాగా సంక్లిష్టంగా మారింది. ఆంధ్రప్రదేశ్‌లోని కడప నగరానికి చెందిన 39 ఏండ్ల వ్యక్తికి ఏడాది క్రితం మూత్రపిండాలు పూర్తిగా విఫలం కావడంతో కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స చేశారు. అప్పటినుంచి అతడు శక్తిమంతమైన స్టెరాయిడ్లు, ఇమ్యునోసప్రెసెంట్లు వాడుతున్నాడు. ఇటీవల అతడికి ఎడమవైపు వృషణం వాపు వచ్చింది. ఈ వాపు క్రమంగా పెరిగిపోతుండటంతో స్థానిక వైద్యుల సూచన మేరకు ఏఐఎన్‌యూలో చూపించుకున్నాడు. ఎడమ వృషణం నుంచి బొడ్డు మీదుగా ఉదరభాగం వరకు పెద్ద కణితి ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. అతడి బీటా హెచ్‌సీజీ స్థాయి అసాధారణంగా పెరిగిపోయింది. రోగికి జనరల్ ఎనస్థీషియాలో ఒక సంక్లిష్టమైన శస్త్రచికిత్స చేశారు. కన్సల్టెంట్ యూరో-ఆంకాలజిస్టు డాక్టర్ రాజేష్ కుమార్ రెడ్డి అడపాల నేతృత్వంలో డాక్టర్ దినేష్ సహకారంతో శస్త్ర చికిత్స చేశారు. డాక్టర్ నిత్యానంద, డాక్టర్ షిఫా నేతృత్వంలో ఎనస్థీషియా బృందం సహకరించారు. అత్యంత జాగ్రత్తగా, విజయవంతంగా కణితిని తొలగించారు. దాదాపు 40 సెంటీమీటర్ల పొడవు, డంబెల్ ఆకారంలో ఉన్న ఈ కణితిని వీలైనంత తక్కువ రక్తస్రావంతో తొలగించడం విశేషం. రోగిని తొలుత ఐసీయూలోకి తరలించి, మూడోరోజు డిశ్చార్జి చేశారు. "వృషణాల్లో కణితులు యువకుల్లో సాధారణమే. కానీ అవి ఇంత పెద్ద పరిమాణంలో పెరిగి ఉదరభాగం వరకు వెళ్లడం మాత్రం చాలా అరుదు" అని డాక్టర్ అడపాల తెలిపారు. తమ బృందం సాధించిన ఈ అసాధారణ విజయం పట్ల ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సి.మల్లికార్జున, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ పీసీ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు.

మహిళా ఉద్యోగికి లైంగిక వేధింపులు

- భరించలేక శామీర్‌పేట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు
- నిందితుడిపై 354 (ఎ, డి,) 509 ఐపీసీ కింద కేసు
- నిందితుడు ఉప్పరిగూడకు చెందిన వ్యక్తి

నవతెలంగాణ-శామీర్‌పేట

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లోని బీసీ వెల్ఫేర్ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఓ మహిళా ఉద్యోగిని అదే కలెక్టరేట్‌లోని లేబర్ వెల్ఫేర్ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న అజయ్ కుమార్ అనే ఉద్యోగి లైంగిక వేధింపులకు గురిచేస్తుండడంతో వేధింపులు తాళలేక సదరు మహిళా ఉద్యోగి శామీర్ పేట పోలీసులు ఫిర్యాదు చేసింది. శామీర్‌పేట ఎస్ఐ అనిత తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 25న కలెక్టరేట్‌లో అజయ్ కుమార్ అనే ఉద్యోగి తనను వేధిస్తున్నాడని సదరు మహిళా ఉద్యోగిని చేసిన ఫిర్యాదు మేరకు అతడిపై కేసు నమోదు చేశారు. బాధితురాలు తన భర్త చనిపోవడంతో భర్త ఉద్యోగం (జూనియర్ అసిస్టెంట్) మహిళకు వచ్చింది. కాగా అజయ్ కుమార్ గత సంవత్సర కాలంగా ప్రేమిస్తున్నానంటూ వేధింపులకు పాల్పడుతున్నట్లు తెలిపారు. వేధింపులు ఎక్కువ కావడంతో మహిళా ఉద్యోగిని అతనిపై ఫిర్యాదు చేసింది. అజయ్ కుమార్ ఇబ్రహీంపట్నం పరిధిలోని ఉప్పరిగూడకు చెందిన వ్యక్తిగా తెలిపారు. అతడికి వివాహమై పిల్లలు కూడా ఉన్నారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిపై 354 (ఎ, డి,) 509 ఐపీసీ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చేస్తున్నట్లు చెప్పారు.

'చౌదరి చరణ్ సింగ్ జీవితం నేటి రాజకీయ నాయకులకు ఆదర్శం కావాలి'

నవతెలంగాణ-హిమాయత్ నగర్

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ప్రధాని, రైతు బాంధవుడు, లోక్ దళ్ పార్టీ వ్యవస్థాపకుడు చౌదరి చరణ్ సింగ్ జీవితం, స్ఫూర్తి నేటి తరం పాలకులు, రాజకీయ నాయకులకు ఆదర్శం కావాలని భారత లోక్ దళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పుల్లూరి వెంకట రాజేశ్వరరావు అన్నారు. చరణ్ సింగ్ తన జీవితాంతం రైతుల సంక్షేమం, అభివృద్ధి కోసం కృషి చేశారని, స్వాతంత్ర్య ఉద్యమంలో కీలకపాత్రను పోషించారని, సోషలిస్టు నాయకుడిగా పేద ప్రజల సంక్షేమం కోసం పాటుపడ్డారని ఆయన కొనియాడారు. మంగళవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన చరణ్ సింగ్ వర్ధంతి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, ప్రముఖ సినీ నటుడు నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా ఆయన మాట్లాడారు.అంతకు ముందు వారి చిత్రపటాలకు పుల్లూరి వెంకట రాజేశ్వరరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వెంకటస్వామి, రాజేష్, ఆనంద్, మల్లయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

నాయి బ్రాహ్మణ ఫెడరేషన్‌కు పాలకమండలి నియమించాలి

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



నాయి బ్రాహ్మణ ఫెడరేషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం పాలకమండలి నియమించాలని పలువురు నాయకులు అన్నారు. మంగళవారం దేవరకొండ నాగరాజు ఆధ్వర్యంలో హనుమాన్ టెక్డిలోని బీసీ సాధికారత భవన్ లో నాయి బ్రాహ్మణ 13 సంఘాల నాయకులు పాల్గొన్నారు. సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాయి బ్రాహ్మణ ఫెడరేషన్ మాత్రమే ఉండాలని, కార్పోరేషన్ అవసరం లేదని ఏకగ్రీవంగా తీర్మానించిందని తెలిపారు. నాయి బ్రాహ్మణ ఫెడరేషన్‌కు పాలకమండలిని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు నాగరాజు, చీకటి వెలుగు ఎడిటర్ కంది సూర్యనారాయణ, ప్రొఫెసర్ భాగయ్య , రిటైర్డ్ డిఆర్ఓ సూర్య నారాయణ, వ్యాపారవేత్త జాలిగామ ప్రభాకర్ రిటైర్డ్ ఎమ్మార్వో బాల్‌రాజ్ , కామారెడ్డి నర్సింహులు, ప్రముఖ కవి డాక్టర్ రాపోలు సుదర్శన్, ఏముల సుధాకర్, విధ్యాసాగార్, మానాల కిషన్, అడ్వకేట్ లక్ష్మణ్ రావు, కొట్టాల యాదగిరి, తదితరులు హజరైయ్యారు.

మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు

నవతెలంగాణ-సుల్తాన్ బజార్



ఆబిడ్స్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు ఉంటాయని అబిడ్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎల్.రవికుమార్ అన్నారు. మంగళవారం అబిడ్స్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడు తూ.. తమ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రతి రోజూ స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తూ ట్రాఫిక్ నిబంధనల విరుద్ధంగా వాహనాలు నడిపే వారిపై చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్పెషల్ డ్రైవ్ నిర్వ హించి వాహనాల పైన కేసులు నమోదు చేస్తున్నామన్నారు. వాహనదారులు తమ వాహనాలకు నంబర్ ప్లేట్స్ లేకుండా వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని ఇకనైనా తమ వాహనాలకు నంబర్ ప్లేట్స్ ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ఉండాలని లేని యెడల వారిపై చట్టరీత్యా చర్యలు ఉంటాయన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా తిరిగేవారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనల ప్రకారం నెంబర్ ప్లేట్ వాహనాలకు బిగించుకోవాలని సూచించారు. ప్రతి వాహనానికి నంబర్ స్పష్టంగా కనిపించే విధంగా నంబర్ ప్లేట్ ఏర్పాటు చేసుకోవాలని లేని మోటార్ వెహికల్ ఆక్ట్ ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మైనర్లు వాహనాలు నడిపితే ఎంవీ ఆక్ట్ రూల్స్ ప్రకారం తల్లిదండ్రుల పైన కూడా కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దని తల్లిదండ్రులకు సూచించారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ హైదరాబాద్ బ్రాంచ్ చైర్మెన్ మామిడి భీంరెడ్డి, క్యాంప్ కో -కన్వీనర్ కల్పన దత్తా ఆధ్వర్యంలో ఏసీ గార్డ్స్ ఏరియాలో 60 సంవత్సరాల పైబడిన వారి కోసం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయ భాస్కర్ గౌడ్, డాక్టర్. శ్రీజ రెడ్డి, మహమ్మద్ రియాజ్, సుజాత, నిత్య సత్యనారాయణ, సందీప్, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

కుటుంబరావు ఆశయాలను కొనసాగిస్తాం

- సీపీఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి సాధినేని వెంకటేశ్వరరావు



నవతెలంగాణ-ముషీరాబాద్

ఆంధ్రప్రదేశ్ ఆటో యూనియన్ నాయకులు కుటుంబరావు ఆశయాలను కొనసాగిస్తామని సీపీఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి సాధినేని వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం కుటుంబరావు రెండో వర్ధంతి సందర్భంగా విద్యానగర్ లోని చంద్ర పుల్లారెడ్డి భవన్‌లో కుటుంబరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. సీపీఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి సాదినేని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎల్‌వీ కుటుంబరావు తమ జీవితం మొత్తం పార్టీకి అంకితం చేసిన ఆంధ్రప్రదేశ్ ఆటో యూనియన్ నిర్మాణంలో కృషి చేసి ఆటో కార్మికుల హక్కుల కోసం పోరాటాలు నిర్వహించారని తెలిపారు. ఆయన ఆశయ సాధనకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కమిటీ సభ్యులు చిట్టి పాటి వెంకటేశ్వర్లు, సిఎస్ సాగర్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కే గోవర్ధన్, ఐఎఫ్‌టీయు రాష్ట్ర అధ్యక్షురాలు జి.అనురాధ,ఆటో యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు వేణు, పీడీఎస్‌యు గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి పొడపంగి నాగరాజు, సహాయ కార్యదర్శి బి. తిరుమల్ రెడ్డి, పి.ఓ.డబ్ల్యు జిల్లా కార్యదర్శి భారతి, పీడీఎస్‌యు సెంట్రల్ జోన్ ప్రధాన కార్యదర్శి తీగల శ్యామ్, పీడీఎస్‌యు ఓయూ మాజీ అధ్యక్షుడు లోకేష్, ప్రజాపంథా మేనేజర్ మల్లిక్, రేణుక, సర్వేశ్ తదితరులు పాల్గొన్నారు.

బడుగు బలహీన వర్గాలకు పెద్దపీట వేసిన ఎన్‌టీ రామారావు

నవతెలంగాణ-అంబర్‌పేట:



బడుగు బలహీన వర్గాలకు మహిళలకు అధిక ప్రాధాన్య ఇచ్చిన ఏకైక వ్యక్తి మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావు అని టీడీపీ నాయకులు ఎడెల్లి భాను ప్రకాష్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఎన్‌టీ రామారావు 101వ జయంతి సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీలకు ఆస్తిలో వాటా ఉండాలని చట్టం తెచ్చిన ఘనత ఎన్‌టీఆర్‌దే అని బలహీన వర్గాలకు లక్షలాదిగా ఇండ్లు కట్టించి ఒక గూడు కల్పించి అగ్రకుల పెత్తందార్లకు కొమ్ముకాసే పటేల్ పట్వారీ వ్యవస్థ లను రద్దు చేసిన ఘనత దక్కిందని తాలూకా, సమితి వంటి కాలం చెల్లిన వ్యవస్థలకు చరమగీతం పాడి మండల వ్యవస్థను ముందుకు తెచ్చారు. తద్వారా ప్రభుత్వాన్ని ప్రజలకు చేరువ చేశారు. దాంతో పాటే అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రభావవంతమైన అమలుకు నోచుకున్నాయి. యువత, బలహీన వర్గాలకు రాజకీయంగా పెద్ద పీట వేశారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకులు ఎడెల్లి సత్యనారాయణ, కిరణ్ కుమార్, ఓ.వెంకటేష్ చౌదరి, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



క్యాన్సర్ స్పెషలిస్ట్ డాక్టర్ చింతమడక సాయిరాంను ఎల్ఐసీ అఫీషియల్స్ పూలమాలతో సత్కరించారు. నవతెలంగాణ-సిటీబ్యూరో

రాజకీయాలలో యువతరం హవా

- వ్యూహకర్తలుగా రాణిస్తున్న యువ నాయకులు
- ప్రధాన పార్టీలను ముందుండి నడిపిస్తున్న వైనం

నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ నియోజకవర్గంలో గత అసెంబ్లీ ఎన్నికల నుంచి నిన్నటి పార్లమెంట్ ఎన్నికల వరకు రాజకీయాలలో యువత పెద్ద ఎత్తున పాల్గొని ఎన్నికల ప్రచారం నుంచి మొదలు తమ పార్టీ అభ్యర్థుల గెలుపునకు వ్యూహాలు రచించడంలో ముందున్నారు. ముఖ్యంగా అన్ని ప్రధాన పార్టీలు అయినటు వంటి కాంగ్రెస్, బీజేపీలలో యువతరం నాయకులు ముందుండి అన్నీ తామై ముందుండి నడిపిస్తున్నారు. వారి దూకుడుకు సీనియర్ నాయకులు, కార్యకర్తలు కూడా మెచ్చుకోక తప్పని పరిస్థితి వ్యూహకర్తలుగా రాణిస్తున్న ప్రధాన పార్టీ యువ నాయకులు బీఆర్‌ఎస్ పార్టీ నుంచి ముషీరాబాద్ ఎమ్మెల్యేగా ఉన్న ముఠా గోపాల్ తనయుడు ముఠా జయసింహ, కాంగ్రెస్ పార్టీ నుంచి మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ కుమారుడు అరవింద్ యాదవ్ (టిల్లు), బీజేపీ నుంచి యువ నాయకులు సుబ్రహ్మణ్య శర్మ ముందు వరుసలో ఉంటారు. తమ పార్టీ అభ్యర్థుల గెలుపునకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారు. ఎన్నికలు ఏవైనా తమదైన శైలిలో దూసుకెళ్తున్నారు.



బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జై సింహా..



ముందుగా యువ నాయకుడుగా పేరొందిన ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ తనయుడు ముఠా జైసింహ తండ్రికి తగ్గ తనయుడుగా రాజకీయాలలో దూసుకుపోతున్నాడు. దూకుడు స్వభావం రాజకీయ వ్యూహంలో జై సింహ దిట్ట తన రాజకీయ చతురతతో తన తండ్రిని రెండు పర్యాయాలు ముషీరాబాద్ ఎమ్మెల్యేగా గెలిపించుకోవడంలో కీలక పాత్ర పోషించారు. పార్టీ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటూ ఏ సమయంలో ఎటువంటి నిర్ణయాలు తీసుకోవడంలో కొన్ని కొన్ని సందర్భాల్లో తండ్రి తనయుడి సలహాలు అడగడం చూస్తుంటే జైసింహ ఏ విధంగా వ్యూహాలు రచిస్తారో తెలుస్తుంది. కొన్ని పరిస్థితులలో పార్టీ సీనియర్ నాయకులు ఉద్యమకారులను పట్టించుకోవడం లేదనే విమర్శ ఉన్న అందరినీ కలుపుకుని వెళ్లే స్వభావం కలవాడై తండ్రికి తగ్గ తనయుడుగా ముషీరాబాద్‌లో బీఆర్‌ఎస్ పార్టీని గెలిపిస్తూ సత్తా చాటుతున్నారు. ప్రస్తుత రాజకీయాలలో విమర్శలు సర్వసాధారణం తండ్రి తర్వాత ముషీరాబాద్ ఎమ్మెల్యే స్థానంపై గురిపెడుతూ ఆదిశగా వ్యూహాత్మకంగా అడుగులు వేస్తూ ప్రజలను ఆకర్షిస్తూ కాబోయే యువ ఎమ్మెల్యేగా రాణించాలన్నదే ముఠా జయసింహ ప్రస్తుత లక్ష్యంగా కనబడుతుంది.

కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు అరవింద్ కుమార్‌యాదవ్ (టిల్లు)



కాంగ్రెస్ పార్టీ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ చిన్న కుమారుడు అయినటు వంటి కాంగ్రెస్ యువ నాయకుడు అరవింద్ కుమార్ యాదవ్ (టిల్లు) ప్రస్తుత రాజకీయాలలో దూసుకుపోతున్నారు. ముఖ్యంగా తెరవెనక రాజకీయాలు చేయడంలో వ్యూహాత్మక అడుగులు వేయడంలో నేర్పరి.. తన అన్న అంజన్ కుమార్‌యాదవ్ పెద్ద కుమారుడు ప్రస్తుత రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ 2019లో ఎమ్మెల్యేగా పోటీ చేసినప్పుడు అన్న గెలుపునకు 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి ముషీరాబాద్ ఎమ్మెల్యేగా పోటీ చేసినటువంటి మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ ఈ ఇరువురి గెలుపునకు అరవింద్ యాదవ్ అలుపెరుగని కృషి చేశారన్నది జగమెరిగిన సత్యం. గెలుపోటములు సంగతి పక్కన పెడితే అరవింద్ యాదవ్ తనదైన శైలిలో ప్రతి ఒక్క సీనియర్ నాయకులను, కార్యకర్తలను సమన్వయం చేయడంలో ప్రచారంలో వ్యూహాలు పొందడంలో దిట్టగా తనకంటూ ప్రత్యేక శైలిని ఏర్పరచుకున్నారు. రాజకీయాలలో తండ్రి అన్నలకు తోడుగా ఉంటూ ప్రస్తుత రాజకీయాల్లో దూసుకుపోతున్న అరవింద్ అన్న రాజ్యసభకు వెళ్లడంతో ముషీరాబాద్‌లో తనకంటూ ప్రత్యేక క్యాడర్‌ను ఏర్పరచుకొని ప్రజా సమస్యలు పరిష్కారంలో ముందు ఉంటూ ప్రజలకు మరింత చేరువై రాబోయే ఎన్నికల్లో ముషీరాబాద్ కాంగ్రెస్ ఎమ్మెల్యే టికెట్‌కు సిద్ధంగా ఉన్నాననే సంకేతాలు ఇస్తున్నారని కార్యకర్తలు అనుకుంటున్నారు.

బీజేపీ యువ నాయకుడు (సూర్యనారాయణ శర్మ)



బీజేపీ ముషీరాబాద్‌లో కనుమరుగవుతున్న సమయంలో పార్టీ యువ నాయకుడుగా సూర్యనారాయణ శర్మ పార్టీ పూర్వ వైభవానికి కీలక పాత్ర పోషించారు. ముఖ్యంగా 2019 అసెంబ్లీ ఎన్నికల్లో మూడవ స్థానంలో ఉన్న బీజేపీ పార్టీని 2023 ఎన్నికల్లో పుంజుకునే విధంగా చేయడంలో కీలక పాత్ర పోషించారు. ఎప్పటికప్పుడు పార్టీ సీనియర్ నాయకులతో సమావేశాలు నిర్వహించి పార్టీ విధివిధానాలపై సమిష్టిగా కృషి చేసే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవడంలో సూర్యనారాయణ శర్మ విజయం సాధించారని తెలుస్తుంది. ఇటీవల పార్లమెంట్ ఎన్నికల్లో కిషన్ రెడ్డి గెలుపునకు తీవ్రంగా శ్రమించారని క్యాంపెనింగ్‌లు నిర్వహిస్తూ ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి హామీలు ఇస్తూ ప్రజల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. ప్రస్తుతం ముషీరాబాద్‌లో బీజేపీ గడ్డుకాలం అనుభవిస్తున్న తరుణంలో సూర్యనారాయణ అందరినీ కలుపకుంటూ పార్టీ పూర్వ వైభవానికి కష్టపడుతున్నారు. పార్టీ అధిష్టానం ఆదేశిస్తే ముషీరాబాద్ ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నారని తాను కష్టపడే విధానం ద్వారా తెలుస్తుంది.

ప్రస్తుతం అన్ని ప్రధాన పార్టీల నుంచి యువ నాయకులు దూసుకుపోవడం రాజకీయాలకు యువతరం రావాలనే నినాదానికి జీవం పోస్తున్నటు వంటి అంశం ప్రజల మన్ననలు పొందే నాయకుడే ప్రజల్లో చెరగని ముద్ర వేస్తారు. ఆ వైపుగా అడుగులు వేస్తారో లేదో కాలమే నిర్ణయిస్తుంది.

ఆటో, మోటారు రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

- తెలంగాణ ప్రొగ్రెసివ్ ఆటో, మోటార్ వర్కర్స్ యూనియన్ 8వ మహాసభలో పలువురు వక్తల డిమాండ్

నవతెలంగాణ-ముషీరాబాద్



ఆటో, మోటారు రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని పలువురు వక్తల డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రొగ్రెసివ్ ఆటో, మోటార్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయు అనుబంధం) ఆధ్వర్యంలో మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల 8వ మహాసభ, యూనియన్ అధ్యక్షులు వి. ప్రవీణ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభలో సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ లక్ష్మీ నారాయణ, ఐఎఫ్‌టీయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే సూర్యం, సీపీఐ (ఎం.ఎల్.) మాస్ లైన్ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి హన్మేష్, ఐఎల్డీయు, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల అధ్యక్షులు ఎస్‌ఎల్ పద్మ , యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ లింగం గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అన్ని విషయాలలో అభివృద్ధి అని చెప్పుకుంటున్న దేశంలో ఇంత అసమానతలు ఎందుకున్నాయని ప్రశ్నించారు. 1% కలిగిన సంపన్నులకు 40% సంపద చేకూరుతున్నది. 10 శాతం కలిగిన జనాభాకు 77 శాతం సంపద కైవసం చేసుకున్నదని ఆక్సాఫామ్ నివేదిక చెబుతున్నది. గతంలో ఆదాయానికి రూ.660 కోట్లు కలిగి ఉంటే 12 ఏండ్లలో రూ.23 లక్షల కోట్లు సంపాదించడం ఎలా సాధ్యం అయ్యిందన్నారు. ఆటో, మోటారు రంగ కార్మికులు చాలా హీనంగా బ్రతుకుతున్నారన్నారు. రెక్కలు తప్ప ఆస్తులు లేని ఆటో రంగ కార్మికులను ప్రభుత్వాలు ఆదుకోవడం లేదన్నారు. కార్మిక కుటుంబాలకు ఉచిత విద్య, వైద్యం లేదన్నారు. నాణ్యతలేని విద్య, వైద్యం వల్ల దుర్మార్గ పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. మోడీ ప్రభుత్వం విద్య, వైద్యాన్ని, ప్రభుత్వరంగాన్ని ప్రైవేటీకరిస్తున్నారన్నారు. దీనికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఐఎఫ్ఎయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.సూర్యం మాట్లాడుతూ రాష్ట్రంలో వున్న లక్ష మంది మోటార్ రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత బోర్డు ఏర్పాటు చేస్తామని చెప్పి కేసీఆర్ దిగిపోయాడు తప్ప బోర్డు ఇవ్వలేదన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో సంబంధం లేని బోర్డును ఎందుకు ఇవ్వలేదని అంటే ప్రభుత్వాలకు కార్మికుల పట్ల చిత్తశుద్ధి లేదన్నారు. సంపద పెరుగుతున్నా, జీడీపీ పెరిగినా ప్రజలు ఎందుకు ఆకలి, ఆత్మహత్యలకు గురువుతున్నారని ప్రశ్నించారు. ఎం. హనేశ్, ఎస్.ఎల్. పద్మ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం మత ఉన్మాదంతో, కార్పోరేట్ అనుకూలంగా పాలిస్తున్నదన్నారు. అనంతరం ఈ మహాసభలో కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. ప్రతినిధులు ఆ నివేదికను ఆమోదించారు. నూతన కార్యవర్గాన్ని 29 మందితో ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా లింగం గౌడ్, ప్రధాన కార్యదర్శిగా వి. ప్రవీణ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అఫ్జల్, ఉపాధ్యక్షులుగా ఎస్. రవీందర్, సి. కృష్ణ, సహాయ కార్యదర్శులుగా బి. ప్రభాకర్, నిస్సార్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బి. వెంకటేష్, ఖాజామియా, జె. వెంకటేష్, శ్రీను, కోశాధికారిగా టి. నారాయణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

శానిటరీ ఉత్పత్తుల తయారీలో పర్యావరణ వ్యవస్థను రూపొందించడంపై దృష్టి

- అమెజాన్ ఇండియా కమ్యూనిటీ ఎంగేజ్ మెంట్ లీడ్ మనీషా పాటిల్

నవతెలంగాణ-హిమాయత్ నగర్



మహిళా సాధికారత, రుతుక్రమ పరిశుభ్రతపై అవగాహన, పర్యావరణ అనుకూల శానిటరీ ఉత్పత్తుల తయారీలో పర్యావరణ వ్యవస్థను రూపొందించడంపై దృష్టి సారించినట్లు అమెజాన్ ఇండియా కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్ లీడ్ మనీషా పాటిల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటిని నిర్వహించే మహిళల విభిన్న అవసరాలను గుర్తిస్తూ హైదరాబాద్‌లోని శంషాబాద్ సమీపం లో ఉన్న అమెజాన్ మద్దతుతో గంటకు 1,200 ప్యాడ్‌లను తయారు చేయగల సామర్థ్యాన్ని కలిగి ఉన్న శానిటరీ నాప్‌కిన్ తయారీ యూనిట్ పార్ట్-టైమ్ ఉపాధి అవకాశాలను అందిస్తుందని వెల్లడించారు. పిల్లలను పని ప్రాంగణాలు వద్దకు తీసుకురావడానికి అవకాశాలను అందించటం ద్వారా వర్క్ ఫ్రమ్ హెూమ్ చేస్తున్నట్లు వాతావరణం కల్పిస్తుందని, దీని వల్ల మహిళలు తమ ఇంటి బాధ్యతల ను నిర్వర్తిస్తూనే తమ కుటుంబ సంక్షేమానికి సైతం తోడ్పడగలుగుతారన్నారు. హైదరాబాద్‌లోని ఈ శానిటరీ నాప్‌కిన్ తయారీ యూనిట్ దాదాపు 60 మంది మహిళలకు ఉపాధి కల్పిస్తుందని, అదనంగా వారు పరోక్షంగా మరో 200 మంది మహిళలకు ప్యాకేజింగ్, ప్రమోషన్, అమ్మకాల ద్వారా మద్దతునిస్తుందన్నారు. కేవలం ఉద్యోగాలను అందించడం మాత్రమే కాకుండా మహిళలు తమ ఆర్థిక భవిష్యత్తును నియంత్రించుకోవడానికి, స్థానిక ఆర్థిక వ్యవస్థలో చురుకుగా పాల్గొనేందుకు సాధికారత అందిస్తుందని ఆమె తెలిపారు.

జూన్ 15,16న కర్ణాటకలో దక్షిణ్ భారత ఉత్సవ్

నవతెలంగాణ-సుల్తాన్ బజార్



దక్షిణ్ భారత ఉత్సవ్ సన్నాహక సమావేశం నిర్వహించారు. మంగళవారం చాపెల్ రోడ్‌లోని రాయల్ టన్ హెూటల్ లో ఫెడరేషన్ ఆఫ్ కర్ణాటక చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ, తెలంగాణ టూరిజం సంయుక్త ఆధ్వర్యంలో వచ్చేనెల కర్ణాటక లో నిర్వహించనున్న దక్షిణ్ భారత్ ఉత్సవ్ సన్నాక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ టూరిజం ప్రతిని అంజిరెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో రామప్ప, ఆదిలాబాద్ ఫారెస్ట్, ఎటునాగారం ముత్యాల ధార (జలపాతం) నాగార్జునసాగర్ బుద్ధవనం, గోదావరి లాంటి టూరిజం ప్రదేశాలు ఉన్నాయన్నారు. టూరిజం అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం తోడ్పడు అందిస్తుందన్నారు. టూరిజం కర్ణాటక డైరెక్టర్ రామకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ.. టూరిజం, మెడికల్ టూరిజం, వివిధ రకాల టూరిజంలలో అనేక ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. టూరిజం అభివృద్ధి చెందితే దేశానికి కూడా మంచి పేరు వస్తుందన్నారు. కర్ణాటక టూరిజం ఆధ్వర్యంలో జూన్ 15 16వ తేదీన దక్షిణ్ భారత్ ఉత్సవ్ 2024 నిర్వహిస్తున్నామని అందులో తెలంగాణ టూరిజం, ఆంధ్రప్రదేశ్ టూరిజం, తమిళనాడు, పాదుచెర్రి, కేరళ తదితర రాష్ట్రాలు పాల్గొంటున్నారని తెలిపారు. కర్ణాటక ప్రభుత్వ పర్యాటకశాఖ, ఎంఎస్ఎం ఈ కోసం పర్యాటక రంగంలో పెట్టుబడులు ఆహ్వానిస్తుందన్నారు. టూరిజం పట్ల ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరు ఈ ఉత్సవంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. పెట్టుబడులు పెట్టవచ్చన్నారు. ఈ సందర్భంగా పలువుని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు ఉమారెడ్డి, తెలంగాణ హెూటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ రుతుక్రమ దినోత్సవం

- బాలికలకు ఉచితంగా కిట్‌ల పంపిణీ

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



ప్రపంచ రుతుక్రమ దినోత్సవాన్ని సీ- త్రీ ఇండియా సీనియర్ ప్రోగ్రామ్ ఆఫీసర్ అనురాధ ఆధ్వర్యంలో మంగళవారం చూడి బజార్ లోని కమిటీ హాల్ లో నిర్వహించారు . ఈ సందర్భంగా సీనియర్ ప్రోగ్రామ్ ఆఫీసర్ అనురాధ ఉచితంగా బాలికలకు నవ్య కిట్ బ్యాగులు, సానిటరీ ప్యాడ్‌లు, వాషింగ్ లిక్విడ్ లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కౌమార దశ యుక్త వయసులో శరీరంలో సంభవించే మార్పుల గురించి తెలియజేశారు. మహిళలకు ప్రతి నెలా పీరియడ్స్ వస్తాయి. కానీ చాలా మందికి దీనిపై అవగాహన లేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటారన్నారు. రుతుక్రమంలో పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పి హెచ్ ఎస్ శారద, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రయినేజీ సమస్యను పరిష్కరించాలి



- సీపీఐ(ఎం) నాయకుల నిరసన..

నవతెలంగాణ-ధూల్‌పేట్

గత కొన్ని రోజులుగా పొంగిపొర్లుతున్న డ్రయినేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని సీపీఐ(ఎం) సౌత్ జిల్లా నాయకులు అబ్దుల్ సత్తార్ అన్నారు. ఐయస్ సదన్, సంతోష్ నగర్ క్రీడా రోడ్డు చౌరస్తాలో పారుతున్న డ్రయినేజీ ముందు సమస్యను పరిష్కరించాలని సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంతో కాలంగా డ్రయినేజీ మురుగు నీరు పొంగుతూ దుర్గంధం వెదజల్లుతుంద న్నారు. దీంతో రాక పోకలు సాగించే వారికి దుర్గంధ దుర్వాసనతో ఇబ్బందులకు గురౌతున్నారన్నారు. అనేక సార్లు జీహెచ్ఎంసీ అధికారులను విన్నవించిన పరిష్కారించడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు తక్షణమే పరిష్కరించాలని లేనిచో ధర్నా చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు అబ్దుల్ సత్తార్, గులాం నసీర్, మహ్మద్ అన్వర్ ఖాన్, మహ్మద్ అత్హర్ తదితరులు పాల్గొన్నారు.

క్రెడిట్ కార్డు స్వీకరణపై 'కివీ' నివేదిక విడుదల

నవతెలంగాణ-సిటీబ్యూరో

భారతదేశం అగ్రగామి క్రెడిట్-ఆన్-యూపీఐ ప్లాట్ ఫారమ్ అయిన కివీ యూపీఐ ఇంటిగ్రేషన్ ద్వారా వర్చువల్ క్రెడిట్ కార్డ్ స్వీకరణలో దేశవ్యాప్త పెరుగుదలపై వివరాలను వెల్లడిస్తూ తన తాజా నివేదికను విడుదల చేసింది. 10 నెలల లోపు ప్లాట్‌ఫారమ్‌లో లక్షకు పైగా వర్చువల్ రూపే క్రెడిట్ కార్డ్‌లను ఆన్‌బోర్డ్ చేయడం ద్వారా కంపెనీ ఒక మైలురాయిని సాధించింది. యూపీఐ లావాదేవీలపై రూ.100 కోట్ల విలువైన క్రెడిట్ కార్డ్ నెలవారీ ప్రాతిపదికన కివీ ప్లాట్‌ఫారమ్‌లో జరుగుతోంది. ఇంకా, ఈ లావాదేవీలన్నింటిలో 75శాతం చిన్న వ్యాపారుల వద్ద జరుగుతాయి.

అక్రమంగా బెల్టు షాపులో మద్యం విక్రయిస్తున్న ఇద్దరు అరెస్ట్

నవతెలంగాణ - జూబ్లీహిల్స్

బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా బెల్ట్ షాపులు నిర్వహించి మద్యం విక్రయిస్తున్న ఇద్దరు మహిళలను అరెస్టు చేసి రిమాండర్ తరలించిన ఘటన చోటు చేసుకున్నది. బోరబండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బోరబండ డివిజన్ బంజారా నగర్‌కు చెందిన సరళ, ఆమె అనుచరురాలు పుష్ప ఇద్దరూ కలిసి ఇంట్లో మద్యం అమ్ముతుండగా పట్టుకున్నామని, వారిని 14 రోజులు రిమాండ్‌కు తరలించిన్నట్లు డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ భూపాల్ గౌడ్ తెలిపారు. ఎవరైనా బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో అనుమతి లేకుండా బెల్టు షాపులు నిర్వహిస్తే పోలీసులకు తెలిజేయాలని కోరారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

వ్యక్తిపై కత్తితో దాడి చేసిన నిందితుడు అరెస్ట్



నవతెలంగాణ - జూబ్లీహిల్స్

బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో శివకుమార్ అనే వ్యక్తిపై కత్తితో దాడి చేసిన నిందితుడిని మంగళవారం అరెస్టు చేసి రిమాండ్ కు తలించారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం ఏక్ మినార్ మజీద్, నేతాజీ నగర్, ఎర్రగడ్డ డివిజన్ హైదరాబాద్ పరిధిలో మహమ్మద్ హుస్సేన్ వయస్సు (24) పండ్ల వ్యాపారం చేసుకునే నిందితుడు, అకారణంగా శివకుమార్ అనే వ్యక్తిపై కత్తితో దాడి చేసి అక్కడ నివసిస్తున్న వారిని కత్తితో బెదిరించి భయభ్రాంతులకు గురి చేశాడు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బోరబండ పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి మంగళవారం రిమాండ్ కు తరలించారు.

ఇప్పటికీ ఆకలి చావులు బాధాకరమే



-గజరావు భూపాల్ ఐపీఎస్

నవతెలంగాణ-బంజారాహిల్స్

ఇప్పటికీ ఆకలి చావులు అంటూ వినడం బాధాకరమేనని ఐపీఎస్ అధికారి డీఐజీ గజరావు భూపాల్ అన్నారు. "వరల్డ్ హంగర్ డే" పురస్కరించుకొని సోమాజిగూడ లోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూంలో నిర్వహించిన కార్యక్రమనికి అతిథులుగా డీఐజీ గజరావు భూపాల్ (డైరెక్టర్ ఆఫ్ ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్), పి.ఎ. ప్రవీణ్, (హెడ్ ఆఫ్ రిటైల్ ఆపరేషన్, మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్), సిరాజ్ పీ.కే లు హాజరై "హంగర్ ఫ్రీ వరల్డ్" లోగోను ఆవిష్కరించి ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... ఐక్యరాజ్యసమితి సస్టైనబుల్ డెవలప్మెంట్ గోల్-2 జీరో హంగర్ ప్రోగ్రాంకు మద్దతుగా ప్రారంభించిన ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమం కింద ప్రస్తుతం 31 వేల ఆహార ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నట్టు వెల్లడించారు. ఇకపై ఈ సంఖ్యను పెంచుతూ 51 వేల పౌష్టికాహార ప్యాకెట్లు పంపిణీ చేయబోతునన్నట్టు వివరించారు. "థనల్ దయ రిహాబిలేషన్ ట్రస్ట్" సహాయంతో "హంగర్ ఫ్రీ వరల్డ్" ప్రోగ్రాం అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం ఈ కార్యక్రమం గల్ఫ్ దేశాల్లోని కొన్ని కేంద్రాలతో పాటు కేంద్ర పాలిత ప్రాంతాలతో సహా 16 రాష్ట్రాల్లో విస్తరించి ఉన్న 37 నగరాల్లో అమలు చేయబడుతుందని, 16 రాష్ట్రాల్లోని 70 నగరాల్లో అమలు చేయబోతున్నట్టు వారు తెలిపారు. ఇలాంటి సామాజిక సంక్షేమ కార్యక్రమాల కోసం ఇప్పటికే 246 కోట్ల రూపాయలను మలబార్ గ్రూప్ ఖర్చు చేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మలబార్ గోల్డ్ సిబ్బంది, పాల్గొన్నారు.

జూన్ 7న కేర్‌లో హృద్రోగ సమస్యలపై అవగాహన సదస్సు



-కేర్ ఆస్పత్రి యాజమాన్యం, వైద్యులు

నవతెలంగాణ-బంజారాహిల్స్

బంజారాహిల్స్‌లోని కేర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఇండో జపనీస్ సిటీఓ క్లబ్ సహకారంతో హృద్రోగ సమస్యలు,చికిత్స విధానాలపై జూన్ 7, 8,9 తేదీల్లో

అంతర్జాతీయ వైద్య సదస్సు నిర్వహించనున్నట్టు కేర్ ఆస్పత్రి మీడియా మేనేజర్ శివశంకర్ మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో ముఖ్యంగా కరోనరీ ఆర్టరీ డిసీజ్ (సీఏడీ) తో బాధపడే రోగులకు అందించే వైద్య చికిత్సలను చర్చించనున్నారు. సదస్సులో హృద్రోగులు పాల్గొని తమ ఆరోగ్య పరిస్థితి తెలుసుకోవడంతో పాటు వైద్య చికిత్స సైతం పొందవచ్చని ఆస్పత్రి క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ బి సూర్యప్రకాశ్రావు పేర్కొన్నారు. సీఏడీ ప్రజలకు తీవ్ర ఆరోగ్య సమస్యగా ఉందన్నారు.ఈ సమస్యతో దాదాపు 27 శాతం హృద్రోగులు మతి చెందుతున్నారని తెలిపారు. సీఏడీ రూపాలలో క్రానిక్ టోటల్ అక్లూజన్ (సీటీఓ) ఒకటి అన్నారు. సాధారణంగా సీటీఓకు బైపాస్ సర్జరీ ద్వారా చికిత్స అందిస్తారని, అయితే ఈ విధానం చిన్నారులు, వద్ధులకు సవాలుగా ఉందన్నారు. ఈ తరుణంలో సీటీఓకు జపనీస్ కుట్టులేని సాంకేతికత వైద్య విధానంలో చికిత్స అందించడం ద్వారా 90 శాతం శస్త్రచికిత్సలు విజయవంతం అయ్యాయన్నారు. గుండె వైఫల్యాన్ని ఎదుర్కొనే రోగులకు నూతనంగా అందుబాటులోకి వచ్చిన ఈ సాంకేతికత బాగుందని చెప్పారు. తాము ఇప్పటికే పలువురు రోగులకు ఈ విధానంలో విజయవంతంగా చికిత్సలు చేశామన్నారు. కేర్ సీవోవో సయ్యద్ క్మామాన్ హుస్సేన్ మాట్లాడుతూ క్రానిక్ టోటల్ అక్లూజన్ చికిత్స కోసం జపనీస్ కుట్టు లేని సాంకేతికత ఓ కీలకమైన పురోగతిని సాధించింది అన్నారు. నగరంలో జరగబోయే అంతర్జాతీయ వైద్య సదస్సులో కేర్ ఆస్పత్రికి చెందిన డాక్టర్ ప్రియన్ కాంతిలాల్ షా, డాక్టర్ కిరణ్ కుమార్, డాక్టర్ ఏ ఎస్ వి నారాయణరావు, డాక్టర్ సూర్యప్రకాశ్రావు విట్టల, డాక్టర్ పీఎల్ఎన్ కపర్ది, డాక్టర్ రేవనూరు విశ్వనాథ్ తదితరులు పాల్గొననున్నారు.

అంతర్జాతీయంగా మెడల్స్ సాధించడమే లక్ష్యం



నవతెలంగాణ-బంజారాహిల్స్

తమ అకాడమీ చిన్నారులు అంతర్జాతీయంగా మెడల్స్ సాధించడమే లక్ష్యమని, ఏకాగ్ర చెస్ అకాడమీలో చేరిన కొద్ది వారాలకే టోర్నమెంట్స్‌లో మెడల్స్ సాధించి చాంపియన్స్ గా నిలవడం ఆనందంగా ఉందని, ఇప్పటికే అకాడమీ చిన్నారులు వరల్డ్ టాపర్స్ గా ఉన్నారని. రానున్న రోజుల్లో ఇండియా తరపున ఖచ్చితంగా చెస్ క్రీడలో తమ ప్రతిభతో మెడల్స్ సాధించి దేశానికి ఖ్యాతి తీసుకువస్తారన్న నమ్మకం ఉందని ఏకాగ్ర చెస్ అకాడమీ సీఈఓ, కోచ్ సందీప్ నాయుడు, కోచ్ చైతన్య అన్నారు. మంగళవారం జూబ్లీహిల్స్ గాయత్రిహిల్స్ లోని ఏకాగ్ర చెస్ అకాడమీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో అకాడమీ చిన్నారులు సాధించిన విజయాలను వారు వెల్లడించారు. నగరంలో ఆదివారం ఐక్యూ అకాడమీ నిర్వహించిన అండర్-15 టోర్నమెంట్‌లో అండర్-11 క్యాటగిరిలో ఏడేండ్ల అన్య రంగినేని, అండర్-7 క్యాటగిరిలో అనయశర్మలు రన్నరప్ నిలిచారన్నారు. అంతే కాకుండా అండర్-7లో జాశ్నవ్ శాశ్వత్ జవార్ విన్నర్‌గా, అండర్-13లో కోమటి శరత్ రన్నరప్ గా, అండర్-15లో శశ్వంత్ జవార్ మూడవస్థానంలో నిలిచి టోర్నమెంట్ చాంపియన్స్ నిలిచారన్నారు. తక్కువ సమయం శిక్షణలోనే వీరు వారిలోని సజనాత్మకతతో ప్రతిభను చాటి విజయాలు సాధించడం సంతోషంగా ఉందన్నారు. అకాడమీలో చాలా మెళకువలు నేర్పారని, మరింత శిక్షణతో దేశానికి ఖ్యాతి తీసుకొచ్చేలా పోటీపడతామని చెస్ క్రీడాకారులు తెలిపారు. కార్యక్రమంలో కోచ్ షీతల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్టీఆర్ జయంతి







- నివాళులర్పించిన నాయకులు, అభిమానులు
- పలు చోట్ల అన్నదానం, పండ్లు పంపిణీ

నవతెలంగాణ-బంజారాహిల్స్

మాజీ సీఎం, నటుడు ఎన్టీఆర్ 101వ జయంతి సందర్భంగా ఫిల్మ్ నగర్ చౌరస్తాలో ఉన్న ఆయన విగ్రహానికి జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌తో కలిసి జూబ్లీహిల్స్ డివిజన్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ పూలమాలలు వేసి నివాళులర్పించి ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహనీయులను స్మరించుకోవడం వారి సేవలను గుర్తు చేసుకోవడం వారివలే ప్రజలకు మెరుగైన సేవలు అందించే అవకాశం లభించినందుకు సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో యూసఫ్ గూడ కార్పొరేటర్ రాజ్ కుమార్ పటేల్, వెంగళరావు నగర్ కార్పొరేటర్ దేదీప్యా రావు, నందమూరి కుటుంబ సభ్యులు,అతిథులుగా పాల్గొని ఎన్టీఆర్‌కు పుష్పాంజలి ఘటించి అన్నదాన కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.

ఓయూలో..

మాజీ సీఎం ఎన్టీఆర్ 101వ జయంతిని సితాఫల్మండి డివిజన్ అధ్యక్షుడు జి వి కష్ణ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వ హించారు. ముఖ్యఅతిథిగా సికింద్రాబాద్ ఇన్‌చార్జ్ వల్లారపు శ్రీనివాస్ విచ్చేసి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.అనంతరం సీతఫలమండిలోని కుట్టి వేలోడి ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వల్లారపు శ్రీనివాస్ మాట్లాడుతు. ఎన్టీఆర్ సినీ రంగానికే కాక ఎంతో ముందుచూపుతో ప్రజాసేవ చేశారన్నారు. అప్పట్లోనే ప్రజలకు అనేక సంక్షేమ కార్యక్రమలు ప్రవేశపెట్టిన ఘనత ఆయనదే అన్నారు. కేంద్రప్రభుత్వం ఆయనకు భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విజయ్ సర్, విక్రమ్, పుప్పాల విజయ్ కుమార్, మధు, నాయుడు, చందర్ ముదిరాజ్, రాహుల్, శ్రీనివాస్, రమేష్, నాగరాజు, మనోజ్ కుమార్, మల్లేష్, కోటేశ్వర్ రావు, గోపీనాథ్ పాల్గొన్నారు.

తార్నాకలో..

టీడీపీ తార్నాక డివిజన్ అధ్యక్షులు గండికోట విజయ్ కుమార్ అధ్వర్యంలో తార్నాక చౌరస్తాలో ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. తరతరాలు మరువలేని మహాపురుషుడు, తెలుగుజాతి కీర్తిని దశదిశలా చాటిన మహనీయుడు అని వక్తలు అన్నారు. పార్టీ డివిజన్ ప్రధాన కార్యదర్శి జీఎం రమేష్, టీడీపీ నగర తెలుగు అధ్యక్షులు శ్యామ్ కుమార్ , వెంకటస్వామి , గౌస్ , సురేష్ , శేఖర్ , పవన్ తదితరులు పాల్గొని ఎన్టీఆర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

బౌద్ధ నగర్‌లో..



బౌద్ధ నగర్ డివిజన్ వారసిగూడ చౌరస్తాలో బీసీ సెల్ నగర ఉపాధ్యక్షులు మంద వెంకటస్వామి డివిజన్ సెక్రెటరీ శ్రీనివాస్ యాదవ్ మహేందర్ యాదవ్ ఆధ్వర్యంలో, మెట్టుగూడ డివిజన్ లో, ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. టీడీపీ సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సీబీఎన్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో

ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాల్సిందే అని పలువురు అభిమానులు కోరారు. ఎన్టీఆర్ టీడీపీని స్థాపించి పేద బడుగు బలహీన వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యమిస్తూ, ప్రాంతీయ పార్టీలకు ప్రాణం పోసి... సంక్షేమ పథకాలు అమలు చేస్తూ పేదవాడి ఆకలి తీర్చిన గొప్ప మానవతావాది ఎన్టీఆర్ అని సీబీఎస్ ఫ్యాన్స్ అసోసియేషన్ అండ్ స్కూల్ ఆఫ్ సీబీఎన్ జాతీయ అధ్యక్షులు , ఓయూ పరిశోధన విద్యార్థి తలారి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట సీబీఎస్ ఫ్యాన్స్ అసోసియేషన్ అండ్ స్కూల్ ఆఫ్ సీబీఎస్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఓయూలో పనిచేస్తున్న పారిశుధ్య మహిళా కార్మికులకు చీరల పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఓయూ ఎన్‌జీఓ ఎస్ అధ్యక్షుడు బియ్యాని జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ. మహిళలకు కార్మికులకు లేదా బడుగు బలహీన వర్గాలకు రాజకీయ ,అవకాశాలు, చైతన్యాన్ని ప్రసాదించిన గొప్ప సంఘసంస్కర్త ఎన్టీఆర్ అన్నారు. అలాంటి వ్యక్తికి కేంద్ర ప్రభుత్వం వెంటనే భారతరత్న ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. తలారి శ్రీనివాసరావు మాట్లాడుతూ. ఎన్టీఆర్ స్థాపించిన పార్టీని దాని ఆశయాలని త్రికర్ణ శుద్ధితో అమలు చేస్తూ పార్టీకి ప్రాణం పోస్తూ పార్టీని ఇప్పటివరకు ముందుకు తీసుకెళుతున్న గొప్ప పరిపాల అధ్యక్షుడు మాజీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. మంద వెంకటయ్య, సతీష్ గౌడ్ , గణేష్ యాదవ్, విజయ్ కుమార్, గోపీ, రవి, రాము, నరేష్ , శంకరయ్య , మహేందర్ , నాగరాజు , మహేష్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



క్యాన్సర్ చికిత్సకు 'బసవతారకం'లో అందుబాటు ధర

- నందమూరి బాలకృష్ణ

నవతెలంగాణ-బంజారా హిల్స్



తన తల్లిదండ్రులు ఆశించినట్టు అందుబాటైన ధరలలో ప్రపంచ స్థాయి క్యాన్సర్ చికిత్స అందించడంలో దేశంలోనే బసవతారకం ఆస్పత్రి ముందంజలో ఉందని ఎమ్మెల్యే, సినీనటుడు బాల కృష్ణ అన్నారు. బంజారాహిల్స్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చి ఇన్స్టిట్యూట్‌లో మంగళవారం ఎన్టీఆర్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ యాజమాన్యం,సిబ్బందితో పాటు ట్రస్ట్ బోర్డు సభ్యులు జెఎస్ఆర్ ప్రసాద్,నామా నాగేశ్వరరావు,చైర్మె న్ నందమూరి బాలకష్ణలు బసవతారకం దంపతుల విగ్రహాలకు పుష్పాంజలి ఘటించారు. అనంతరం హాస్పిటల్ లో క్యాన్సర్ పై పోరాడుతూ చికిత్స పొందుతున్న చిన్నారులకు చైర్మెన్ బాలకష్ణ పండ్లు,బహుమతులు అందజే శారు. కొన్ని రోజులు కష్టాలు తప్పవని,నీ చిరు నవ్వుకు చిరకాలం గుర్తుండిపోయే బహుమతి ఇస్తానని చికిత్స పొందుతున్న వారికి ఆత్మీయ పలకరింపుతో చిరునవ్వులు చిందింపజేశారు. BIACH&RI నేడు ఎందరో పేదలకు క్యాన్సర్ పై పోరాటంలో బాసటగా నిలుస్తోందని అన్నారు. భవిష్యత్తులోనూ మరిన్ని సేవలను అందుబాటు లోనికి తీసుకొనివస్తామని ప్రకటిస్తూ ఆ పుణ్య దంపతుల కుమారుడిగా జన్మించడమే కాకుండా పేద ప్రజలకు సేవ చేసే భాగ్యం ఆజన్మాంత సుకతమైన అని తెలిపారు. ఈ కార్యక్రమాలలో మెడికల్ డైరెక్టర్ డా.టియస్ రావు, ఎమ్మెస్ డా.ఫణి కోటేశ్వర రావు,అసోసియేట్ డైరెక్టర్ డా. కల్పనా రఘునాథ్,పాటూ పలువురు వైద్యులు, వైద్యేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్సీసి వార్షిక శిక్షణ శిబిరం ప్రారంభించిన దానకిషోర్

నవతెలంగాణ-ఓయూ



సైఫాబాద్‌లోని ఓయూ యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్‌లో మంగళవారం నుంచి జూన్ 6 వరకు పది రోజుల పాటు జరిగే ఎన్‌సీసీ వార్షిక శిక్షణా శిబిరాన్ని 3వ తెలంగాణ బెటాలియన్ ఎన్సీసి కమాండింగ్ ఆఫీసరు లెఫ్టినెంట్ కల్నల్ శరత్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఇన్‌చార్జ్ వీసీ, ఐఏఎస్ దాన కిషోర్ ముఖ్య అతిథిగా హాజరై ఎన్‌సీసీ క్యాడేట్లు అందించిన గౌరవ వందనం స్వీకరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గౌరవ అతిథిగా ఓయు రిజిస్ట్రార్ ప్రొ. పి. లక్ష్మీనారాయణ, ప్రిన్సిపాల్ ప్రొ. లక్ష్మణ్ నాయక్ హాజరయ్యారు. ముఖ్య అతిథి దాన కిషోర్ మాట్లాడుతూ. హెచ్ఎండీఏ ఆవరణలో ఎన్సీసీ క్యాంపులు నిర్వహిస్తే వాటికి మౌళిక వసతులు కల్పించడంలో, అభివద్ధికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.ఎన్సీసి యూనిఫాం ధరించిన విద్యార్థులు భాధ్యత కల్గిన భావిభారత పౌరులుగా ఎదగాలన్నారు. కళాశాల అభివద్ధి కి సంబంధించి కాలేజ్ బాయ్స్ హాస్టల్లో ఓపెన్ జిమ్, పీజీ బ్లాక్ వద్ద గ్రీనరీని కేటాయిస్తామని హామీ ఇచ్చారు. లేడీస్ హాస్టల్, కాలేజీ క్యాంపస్‌లో డ్రయినేజీ బ్లాకేజీ సమస్యలపై నిధులు మంజూరు చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కళాశాలలోని ప్రయోగశాలలకు నిధులు మంజూరు చేసే దిశగా సహకరిస్తాన న్నారు. 3(టీ) బెటాలియన్ నిర్వహించే ఈ క్యాంపులో పాల్గొన్న క్యాడెట్లను అభినందించారు. ప్రొ. పి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ క్యాడెట్లను అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తున్న ప్రిన్సిపల్ ప్రొ. జె. లక్ష్మణ్ నాయక్‌ను ప్రశంసించారు. క్యాడెట్లకు ఇటువంటి అవకాశం కల్పించినందుకు, వసతి కల్పించినందుకు ఓయూ కి లెఫ్టినెంట్ కల్నల్ శరత్ కృతజ్ఞతలు తెలిపారు. క్యాంపునకు సంబం ధించిన ఏర్పాట్లు చేసిన ఎన్‌సీసీ అధికారి డాక్టర్ నరేష్‌ను అతిథులు, ప్రిన్సిపాల్ అభినందించారు.

ఎంజేఎస్ పోస్టర్లు విడుదల



నవతెలంగాణ-ఓయూ

మహా జ్ఞాన సమాజం ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో జూన్ 16న నిర్వహించే మహా జ్ఞాన సమ్మేళనం పోస్టర్‌ను మంగళవారం ఓయూ ఆర్ట్స్ కాలేజ్ వద్ద కార్యక్రమ నిర్వాహకులు గోవిఅంస విశ్వనాథ్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ప్రొఫెసర్ సి.హెచ్ వంశీధర్ , సామాజిక తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తాళ్ల అజయ్, ఓయూ ఎన్‌జీఓస్ ఉద్యోగ సంఘ అధ్యక్షుడు బియ్యానీ జ్ఞానేశ్వర్,ఈశ్వరయ్య, ఉద్యోగ సంఘ నాయకులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ బుద్ధుని ఆలోచనలతో జ్ఞానాన్ని విశ్వవ్యాప్తం చేస్తూ ఆధునిక కాలంలో అంబేద్కర్ ఆశయాలను సాధించడానికి నిర్వహిస్తున్న ఈ సమ్మేళానికి ఓయూ మేధావులు,విద్యార్థులు హాజరై విజయవంతం చేయాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు సమీ, మనోజ్,అనిల్ పాల్గొన్నారు.

వేదాంతు నుంచి ఆఫ్ లైన్ కోచింగ్



నవతెలంగాణ-బంజారాహిల్స్

విద్యార్థులకు ఇప్పటి వరకు ఆన్ లైన్‌లో విద్యనందిస్తున్న వేదాంతు సం స్థ ఆఫ్ లైన్ కోచింగ్‌ను ప్రారంభి స్తున్న ట్టు ఆ సంస్థ సీఈవో వంశీకష్ణ తెలిపా రు. సోమాజిగుడాలోని పార్క్ హెూట ల్లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు మరింత చేరువయ్యేందు కు తమ సంస్థ ఈ ఆఫ్‌లైన్ విద్య రంగంలోకి అడుగుపెడుతున్నదని చెప్పారు. ఇందుకోసం విజ్ఞాన్ సంస్థ తో ఒప్పందం కుదుర్చుకున్నట్టు చెప్పారు. రాబోయే రెండు నెలలు ఏపీ తెలంగాణలో పదికి పైగా ఆఫ్‌లైన్ కోచింగ్ సెంటర్లను అందుబాటులోకి తెస్తామని చెప్పారు.

ఏవియేషన్ విద్యను ప్రవేశపెట్టిన చెన్నైస్ అమిర్త



నవతెలంగాణ-బంజారాహిల్స్

ఈ విద్యా సంవత్సరం నుంచి "చెన్నైస్ అమిర్త " కళాశాలలో ఇంటర్నేషనల్ ఏవియేషన్ సర్టిఫికెట్, డిప్లమా, డిగ్రీ కోర్సులను భోధించనునట్టు ఆ సంస్థ చైర్మెన్ ఆర్.భూమి నాథన్ ప్రకటించారు. ఇందు కోసం మలేషియా కు చెందిన ప్రముఖ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఏవియేషన్ మేనేజమెంట్ తో ఇటీవల ఒప్పంద చేసుకున్నట్టు తెలిపారు. మంగళవారం గ్రీన్ పార్క్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఒప్పంద వివరాలను వెల్లడించారు. గత 14 ఏండ్లుగా వేలాది మంది విద్యార్థులకు నాణ్యమైన హెూటల్ మేనేజ్మెంట్, హాస్పిటాలిటీ కోర్సులను బోధిస్తున్నామన్నారు. వేగంగా సాంకేతిక మారుతున్న నేపథ్యంలో తమ విద్యార్థులకు సైతం నాణ్యమైన విద్య అందించే లక్ష్యంతో వైమానిక విద్యను ప్రవేశ పెట్టామన్నారు. ఇందుకోసం ఏవియేషన్ విద్యను అందించే సంస్థతో ఒప్పందం చేసుకోవడంతో పాటు మెరుగైన హెూటల్ మేనేజ్మెంట్ విద్యనందించేందుకు సింగపూర్‌కు చెందిన బిర్మింగ్ హెూం అకాడమీతో మరో ఒప్పందం చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ సమావేశం లో సంస్థ సీఈఓ కవితా నంద కుమార్, సీఏడీ లియో ప్రసాత్, డీన్ డా. టి.మిల్టన్, కళాశాల అడ్మినిస్ట్రేటర్ భానుమతి, హైదరాబాద్ క్యాంపస్ ప్రిన్సిపాల్ తామర కొలను చంద్ర మోహన్, తదితరులు పాల్గొన్నారు.

జపాన్ భారత్ దేశ సాంస్కృతిక సంబంధాలకు వైస్ మెన్స్ క్లబ్ కృషి

నవతెలంగాణ-కల్చరల్

జపాన్ భారత దేశ సాంస్కృతిక సంబంధాలకు వైస్ మెన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ కృషి విశేషమని రాష్ట్ర ట్రజరీస్ అండ్ అకౌంట్స్ డిప్యూటీ డైరెక్టర్ జీ.వసుంధర అన్నారు. వైస్ మెన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ కార్యాలయంలో జపాన్ దేశ వైస్ మెన్ క్లబ్ ప్రతినిధి కె .యేషినో ను సత్కరించి వసుంధర మాట్లాడారు. వైజ్ మెన్స్ క్లబ్బులు ప్రపంచ వ్యాప్తంగా విస్తరించి వున్నాయని సేవా సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రజలకు చేరువ అవుతున్నాయన్నారు. హైదరాబాద్ క్లబ్ అన్నిటిలో ముందజలో వుందని సభ్యులను అభినందించారు. యోషినో మాట్లాడుతూ భారతీయ సంస్కృతి వైవిద్యతతో వున్నప్పటికీ సమైక్యతకు ప్రతీకగా నిలుస్తుందన్నారు భారతీయ సంప్రదాయాలు కళలు తనను ఆకర్షించాయనీ జపాన్ సంస్కృతికి భారత్ సంస్కృతికి కొంత సారూప్యత వుందని వివరించారు. సంస్థ అధ్యక్షులు నిష్టల సుధా మాల స్వాగతం పలికారు. వైస్ మెన్స్ క్లబ్స్ ఉద్యమ కారుడు వేమరాజు విజయ కుమార్ అధ్యక్షత వహించిన కార్యక్రమానికి రజిత్ ఆకుల బీవీ నారాయణ రావు సమన్వయం చేశారు.

విత్తనాల కొనుగోలుపై అవగాహన

నవతెలంగాణ-శామీర్ పేట:



విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మూడు చింతల పల్లి మండల వ్యవసాయ అధికారి మద్ది క్రిష్ణవేణి రైతులకు సూచించారు. లక్ష్మాపూర్, మూడుచింతలపల్లి, లింగాపూర్ తండాలో మంగళవారం మూడు చింతలపల్లి మండల వ్యవసాయ అధికారి మద్ది కృష్ణవేణి వానాకాలం పంట సాగులో భాగంగా విత్తనాలు కొనుగోలుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భం గా రైతులకు పలు సూచనలు చేశారు. అదేవిధంగా రైతులు విత్తనాలు కొనుగోలు విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

నగరంలో ఘనంగా ఎన్టీఆర్ జయంతి

- ఎన్టీఆర్‌కు 'భారత రత్న' పురస్కారం ప్రకటించాలి

నవతెలంగాణ-సిటీబ్యూరో



తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు స్వర్గీయ ఎన్టీ రామారావు 100వ జయంతిని మంగళవారం నగరంలో ఘనంగా నిర్వహించారు. అశోక్ నగర్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో సికింద్రాబాద్ పార్లమెంటు టీడీపీ అధ్యక్షులు పి.సాయిబాబా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఎన్టీఆర్ ఘాట్ వద్ద జిల్లా నాయకులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పి.సాయిబాబా మాట్లాడారు. నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా ఎన్టీఆర్‌కు 'భారత రత్న పురస్కారం' ప్రధానం చేయడంలో కేంద్రప్రభుత్వం వివక్ష చూపుతుందని, వెంటనే ఎన్టీఆర్‌కు భారతరత్న పురస్కారం అందజేయాలని డిమాండ్ చేశారు. ప్రతి మండలంలో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేయడం కోసం పార్టీ కార్యకర్తలు నాయకులు తమ శాయశక్తులా కషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమాలలో ప్రధాన కార్యదర్శులు నల్లెల్ల కిషోర్, పీ.బాలరాజ్ గౌడ్, బుయ్యన శ్యామ్ సుందర్, పరుశురామ్, ప్రమీలతోపాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బండ్లగూడ ఆర్టీఏ ఆఫీసులో ఏసీబీ దాడులు



నవతెలంగాణ-చాంద్రాయణగుట్ట

బండ్లగూడ ఆర్టీఏ ఆఫీసులో మంగళవారం సాయంత్రం మూడు గంటల నుంచి ఏసీబీ అధికారులు ముమ్మరంగా దాడులు నిర్వహించారు. ఏసీబీ అధికారులకు అందిన సమాచారం ప్రకారం హైదరాబాద్, నల్గొండ పలు ప్రాంతాలలోని ఆర్‌టీఏ ఆఫీసులలో అవకతవకలు జరుగుతున్నాయని ఏసీబీ అధికారులకు అందిన సమాచారం ప్రకారం.. డీఎస్పీ శ్రీధర్ ఆధ్వర్యంలో బండ్లగూడ ఆఫీసులో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా కొంతమంది మధ్య వర్తులు అరెస్టు చేసి అనధికారింగా ఉన్న వాహనాల డాక్యుమెంటల్ స్వాధీనం చేసుకొని కొంత డబ్బు కూడా స్వాదీనం చేసుకున్నారు. డీఎస్పీ శ్రీధర్ మాట్లాడుతూ అన్ని ఆర్టీఏ ఆఫీసులలో తనిఖీలు నిర్వహిస్తున్నామని మా పై అధికారుల సమాచారం ప్రకారం ఆర్టీఏ ఆఫీసులలో తనిఖీలు నిర్వహించి రిపోర్టు పంపించాలని ఆఫీసులలో రిజిస్ట్రేషన్లకు సంబంధించి ఆర్‌సి బుక్కుల లైసెన్స్ రెన్యువల్ లాంటి విషయాలలో డబ్బులు వసూలు చేస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు మేము తనిఖీలు నిర్వహించారని తెలిపారు. సమగ్రమైన విచారణ జరిపి నివేదికను మా పై అధికారులకు పంపించడం జరుగుతుందన్నారు.

డ్రైవర్ కుటుంబానికి అండగా నిలిచిన తోటి స్నేహితులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

అనారోగ్యంతో(క్యాన్సర్ చివరి స్టేజి) బాధపడుతున్న తమ తోటి డ్రైవర్ కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలిచిన డ్రైవర్ మిత్రులు, వివిధ సంస్థలు.. నగరంలోని లంగర్ హౌస్ ప్రాంతానికి చెందిన వి. జగదీష్ యాదవ్ వృత్తిరీత్యా డ్రైవర్. జగదీష్ గత కొంతకాలంగా క్యాన్సరతో బాధ పడుతున్న విషయం తెలుసుకొని.. తోటి డ్రైవర్ మిత్రులు, వివిధ సంస్థలు ముందుకువచ్చి ఆయన కుటుంబానికి అండగా ఉండాలని ఉద్దేశంతో వారంతా కలిసి తమవంతు సహాయంగా రూ.86 వేల ఆర్థిక సహాయంతో పాటు బియ్యం, పప్పు, నూనె వంటి నిత్యావసర వస్తువులను ఆలేటి బాల్ రెడ్డి, కాటం సతీష్ యాదవ్, ముక్కిడి రజినీకాంత్, తిరుగుడు వెంకటేష్, గోరట్ల సాయిప్రకాష్, ధారబోయిన మహేష్ యాదవ్ చేతుల మీదుగా జగదీష్ యాదవ్ కుటుంబ సభ్యులకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా వారికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. తమకు ఆర్థిక సాయం చేసిన వారందరికీ ధన్యవాదాలు తెలుపుతూ... వారు చేసిన సహాయాన్ని ఎప్పటికీ మరువలేమని చెప్పారు.

'ది లెజెండ్ ఆఫ్ హనుమాన్' సీజన్-4

నవతెలంగాణ-సిటీబ్యూరో

డిస్నీ హాట్‌స్టార్‌లో ది లెజెండ్ ఆఫ్ హనుమాన్ సీజన్-4 త్వరలో ప్రారంభం కానుంది. గ్రాఫిక్ ఇండియా శరద్ దేవరాజన్, జీవన్ జే.కాంగ్ సజనాత్మ కతతో రూపొందిం చిన ఈ థ్రిల్లింగ్ కొత్త అధ్యాయం, శరద్ కేల్కర్ రావణుడిగా, దమన్ సింగ్ హనుమంతునిగా ఇతరులతో పాటు శక్తివంత మైన గాత్రాన్ని కలిగి ఉంది. ఎపిక్ సాగా డిస్నీ హాట్‌స్టార్ స్ట్రీమింగ్ జూన్ 5వ తేదీ నుంచి ప్రతి వారం కొత్త ఎపిసోడ్‌తో కొనసాగుతుంది.

నూతన కళాసంస్థ ఇందువదన ప్రారంభం

నవతెలంగాణ-కల్చరల్

జంట నగరాల్లో పలు సాంస్కృతిక సేవా సంస్థలు భిన్న కార్యక్రమాలతో నిత్యం ఏదో వేదిక పై సందడి చేస్తున్నాయి. ఇందుకు తోడుగా మరో సంస్థ ఇందువదన కళా సాంస్కృతిక సేవా సంస్థ శ్రీ వేంకటేశ్వర గాన సభ వేదిక పై ఆదివారం ఆరంభమైంది. తొలి కార్యక్రమమే పాటే ప్రాణం శీర్షికన పన్నెండు గంటల నిర్విరామ సినీ సంగీత ఝరి రస భరితంగా నిర్వహించారు. పలువురు గాయనీ గాయకులు పాల్గొని భిన్న పాటలతో శ్రోతలను రంజింప జేశారు. ప్రముఖ సంఖ్య శాస్త్రవేత్త దైవజ్ఞ శర్మ పాల్గొని మాట్లాడుతూ ఉన్నత విద్యాధికుడు ఇన శ్రీనివాస్ ఎందరో వర్ధమాన ప్రవర్ధమాన గాయకులకు వేదిక కల్పించే లక్ష్యంతో సంస్థ ను ఆరంభించారనీ వారి సహృదయంను అభినందించారు. ప్రముఖ న్యాయవాది వెంకట రావు తమ శుభాకాంక్షలు తెలిపారు. సంస్థ స్థాపకుడు ఇందువదన శ్రీనివాస్ మాట్లాడుతూ విఖ్యాత గాయకుడు బాలసుబ్రహ్మణ్యం సంస్మరణలో ప్రఖ్యాత గాయనీ జానకి జన్మ దిన సందర్భంలో కార్యక్రమం నిర్వహించామని తెలిపారు తనకు సహకరించిన శ్రీ రామ సంస్థ గొర్తి చంద్ర శేఖర్ గాయకులు వినోద్ బాబు సురేఖ తదితరులకు ధన్య వాదాలు తెలిపారు.

నగదు పోగొట్టుకున్న మహిళ..తిరిగి అప్పగించిన పోలీసులు

నవతెలంగాణ-చాంద్రాయణగుట్ట



చాంద్రాయణగుట్ట ఎక్స్ రోడ్డు వద్ద ఆఫ్రీన్ బేగం అనే మహిళ బైక్ పై వెళ్తూ రూ. 22 వేల నగదుతో పాటు ఎటిఎం కార్డులు ఉన్న బ్యాగును పోగొట్టుకుంది. దాంతో చాంద్రాయ ణగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఫిర్యాదు అందుకున్న క్రైం టీమ్ డెటెక్టీవ్ ఇన్‌స్పెక్టర్ కె. సత్య నారా యణ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు పరిశీలించి ఆటో డ్రైవర్‌ను గుర్తించారు. కొన్ని గంటల్లోనే నగదు, ఏటిఎం కార్డులు స్వాధీనం చేసుకుని ఆఫ్రీన్ బేగంకు అప్పగించారు. క్రైం సిబ్బందికి, చాంద్రాయణగుట్ట పోలీసులకు ఆఫ్రీన్ బేగం ధన్యవాదాలు తెలిపారు.

నకిలీ విత్తనాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలి



- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యవసాయాధికారి రేఖామేరీ

నవతెలంగాణ-సిటీబ్యూరో



నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యవసాయాధికారి రేఖామేరీ రైతులకు సూచించారు. విత్తనాల గురించి అవగాహనలో భాగంగా ఆమె మంగళ వారం మేడ్చల్ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రేఖామేరీ మాట్లాడుతూ విత్తనాల కొనుగోలు విషయంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. లూజు ఉన్న సంచులతో ఉన్న విత్తనాలను కొనుగోలు చేయరాదు అని సూచించారు. విత్తనాలు కొనుగోలు చేసిన దుకాణం నుంచి రసీదును తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. కొనుగోలు చేసిన విత్తన ప్యాకెట్, బిల్లును పంటకాలం పూర్తయ్యే వరకు భద్రంగా దాచుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన అధీకృత డీలర్ల దగ్గర మాత్రమే వితనాలు కొనుగోలు చేయాలని సూచించారు.

బదిలీల తర్వాతే పదోన్నతులు చేపట్టాలి

- డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ టీచింగ్ ఆస్పత్రి డాక్టర్స్ జేఏసీ విజ్ఞప్తి

నవతెలంగాణ-సుల్తాన్ బజార్



వైద్యుల సాధారణ బదిలీల ప్రక్రియ నిర్వహించిన తర్వాతే పదోన్నతులు చేపట్టాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ టీజింగ్ ఆస్పత్రి డాక్టర్స్ జేఏసీ డిమాండ్ చేశారు. మంగళవారం కోఠి మెడికల్ కాలేజీ ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో వివిధ జిల్లాల మెడికల్ కాలేజీల వైద్యులు పాల్గొని నూతనంగా డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ టీచింగ్ ఆస్పత్రి డాక్టర్స్ జేఏసీ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వైద్యుల సాధారణ బదిలీల ప్రక్రియలో వైద్య సంఘాల ఒత్తిళ్లకు తావులేకుండా పారదర్శకంగా జరిగేలా చేపట్టాలని రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల మెడికల్ కాలేజీల వైద్యుల బృందంతో కూడిన జేఏసీ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ సందర్భంగా డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ టీచింగ్ ఆస్పత్రి డాక్టర్స్ జేఏసీ చైర్మెన్ డాక్టర్ వి.శేఖర్, కన్వీనర్లు డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ నాగరాజు, డాక్టర్ సాంబశివారెడ్డి, డాక్టర్ జగతి, డాక్టర్ హేమలత, డాక్టర్ అమరావతి, కో కన్వీనర్లు డాక్టర్ సూర్యనారాయణ, డాక్టర్ బెంజ్మెన్, డాక్టర్ మనీష్ గుప్తా, డాక్టర్ అరుణ, డాక్టర్ నీలవేణి, డాక్ట ర్. శిరోమణిలు మీడియాతో మాట్లాడుతూ.. వైద్యుల సాధారణ బదిలీల ప్రక్రియలో వైద్య సంఘాల ఒత్తిళ్లు లేకుండా నిష్పక్షపాతంగా నిర్వహించేలా పటిష్టమైన చర్యలు చేపట్టాలని, సంఘాల ముసుగులో ఐదారేళ్లకు పైగా ఉస్మానియా, గాంధీ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న వైద్యులను వెంటనే బదిలీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో రెండేళ్లుగా పనిచేస్తున్న వైద్యులకు బదిలీల్లో అవకాశం కల్పించాలని కోరారు. సాధారణ బదిలీల్లో కావాల్సిన వైద్యులు అసోసియేషన్ల ముసుగు వేసుకుని, గత పదేండ్లుగా ఉస్మానియా, గాంధీ ఆస్పత్రుల నుండి బదిలీ కాకుండా ఒకే చోట పని చేస్తూ, గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న వైద్యులకు ఉస్మానియా, గాంధీ ఆసుపత్రుల్లో పని అవకాశం లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం వైద్యుల బదిలీల ప్రక్రియను వెంటనే చేపట్టేలా చర్యలు చేపట్టడంతో పాటు ప్రత్యేక కమిటీ నియమించి, బదిలీలకు సంబంధించిన గైడ్ లైన్స్‌ను రూపొందించి, బదిలీల ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని, ఎలాంటి ఒత్తిళ్ళ, పైరవీలకు అవకాశం లేకుండా బదిలీల ప్రక్రియ సాఫీగా జరిగేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో జేఏసీ నాయకులు డాక్టర్ మాధవ్, డాక్టర్ జితేంద్ర, డాక్టర్ అమరావతి, డాక్టర్ రమాదేవి, డాక్టర్ కవిత, డాక్టర్ నాగవేణి, డాక్టర్ మూసాఖాన్, డాక్టర్ గణేష్, డాక్టర్ గౌరి, డాక్టర్ శకుంతల, డాక్టర్ రవి మోహన్, డాక్టర్ విజయ్కుమార్, డాక్టర్ శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలంటే

ఉస్మానియా ఆస్పత్రి నూతన భవనం నిర్మించాలి

- తెలంగాణ జన సమితి అధినేత ప్రొఫెసర్ కోదండరామ్

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



అనారోగ్యంతో బాధపడుతూ చికిత్సల నిమిత్తం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి ఉస్మానియా ఆస్పత్రికు వచ్చే రోగులకు మెరుగైన నదుపాయాలు, నాణ్యమైన వైద్యం అందించాలంటే ఉస్మానియా ఆస్పత్రి నూతన భవనం నిర్మించాల్సిందేనని తెలంగాణ జన సమితి అధినేత ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. పాత భవనం కూల్చేసి, కొత్త భవనం నిర్మిస్తారా? లేదా చంచల్‌గూడ ప్రింటింగ్ ప్రెస్ లేక గోషామహల్ పోలీస్ స్టేడియంలో ఉస్మానియా నూతన భవనం నిర్మిస్తారా? అనే విషయాన్ని వైద్యులు తమభుజస్కంధాలపై వేసుకోకుండా ప్రభుత్వానికి వదిలేయాలని సూచించారు. ఇరుకు వార్డుల్లో ఇబ్బందులకు గురవుతూనే రోగులకు నాణ్యమైన వైద్యం అందిచేందుకు చేస్తున్న కృషి, అన్ని నదుపాయాలు గల ఆస్పత్రి ఉంటే రోగులకు మరింత మెరుగైన వైద్యం అందిచాలన్న వైద్యుల తాపత్రయం అభినందనీయమన్నారు. వైద్యులకు తామంతా అండగా ఉంటామని, ఉస్మానియా నూతన భవ న నిర్మాణం కోసం వైద్యులు చేస్తున్న కృషిలో భాగస్వాములం అవుతామన్నారు. ఈ మేరకు మంగళవారం ఉస్మానియా ఆనుపత్రి సూపరింటెండెంట్ కాన్ఫరెన్స్ హాల్‌లో తెలంగాణ ప్రభుత్వ వైద్యుల నంఘం, ఉస్మానియా అలూమినీ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఉస్మానియా నూతన భవన నిర్మాణంపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి తెలంగాణ జనసమితి అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరామ్, ప్రత్యేక ఆహ్వానితులుగా మాజీ ఎంపీ అజీజెషా, సియాసత్ దినపత్రిక సంపాదకులు అమీర్ అలీఖాన్లు పాల్గొన్నారు. ఉస్మానియా అలూమినీ ట్రస్ట్ చైర్మెన్ డాక్టర్ కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో టీఎస్‌ఎంఎస్ఐడీసీ చైర్మెన్ డాక్టర్ మహేష్ కుమార్, హెరిటేజ్ కమిటీ సభ్యులు అనురాధా రెడ్డి, జావీద్ ఇక్బాల్ తో పాటు తెలంగాణ వైద్యుల సంఘం ప్రతినిధులు, ఉస్మానియా ఆస్పత్రి వివిధ విభాగాధిపతులు, జూడాలు, నర్సింగ్, ఫారామెడికల్ సిబ్బంది పాల్గొని రౌండ్ టేబుల్ సమావేశంలో తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్యం అందించడంలో ఆసియా ఖండంలో 7వ స్థానంలో నిలిచిన ఉస్మానియా ఆస్పత్రిలోని పాత భవనం మూతపడటంతో రోగులకు నరిపడా పడకలు లేకున్నా వైద్యులు అనేక ఇబ్బందుల మధ్య వారికి వైద్య సేవలందించి రోగుల ప్రాణం పోస్తున్నారన్నారు. కొత్త భవనం నిర్మించాలని వైద్యులంతా ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త భవనం నిర్మిస్తామని ప్రకటించి, భవన నిర్మాణానికి అవసరమైన రూ.200 కోట్ల నిధులు కేటాయించినా, అనేక అభ్యంతరాల కారణంగా భవన నిర్మాణం నిలిచిపోయిందని తర్వాత అధికారం చేపట్టిన బీఆర్ఎస్ ప్రభుత్వం భవన నిర్మాణం కోసం కేటాయించిన రూ.200కోట్లు వినియోగించకుండా నిర్లక్ష్యం చేసి, బాధ్యత నుండి తప్పించుకుందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వంలా కాకుండా ఉస్మానియా నూతన భవనం నిర్మాణం వేగవంతంగా జరిగేలా చర్యలు చేపట్టాలని కోరారు. చరిత్ర గల ఉస్మానియా ఆనుపత్రికి కాపాడుకోవాల్సిన అవసరం మనందరిపై ఉందని, ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. మాజీ ఎంపీ జీజ్భెషా మాట్లాడుతూ ఉస్మానియా నూతన భవన నిర్మాణం వెంటనే చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సియాసాత్ నంపాదకులు అమీర్ అలీఖాన్ మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం వెంటనే నూతన భవన నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రతినిధులు డాక్టర్ బొంగు రమేష్, డాక్టర్ పల్లం ప్రవీణ్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సారథి ప్రొఫెసర్ కోదండరామ్ నేతృత్వంలో సకల జనుల సమ్మె, మిలియన్ మార్చ్ వంటి అనేక పోరాటాలు చేసి తెలంగాణ రాష్ట్రం సాధించామో అదేవిధంగా ఉస్మానియా కొత్త భవనాన్ని కూడా కోదండరామ్ నాయకత్వంలో నిర్మించి తీరుతామన్నారు. ఈ సమావేశంలో వివిధ విభాగాలకు చెందిన వైద్యు లు డాక్టర్ పాండునాయక్, బాక్టర్ కృష్ణమూర్తి, డాక్టర్ రమేష్ కుమార్, డాక్టర్ రంగా అజీరా, డాక్టర్ తపాడియా, డాక్టర్ జి.రమేష్, డాక్టర్ రాజేష్ నహాయ్, డాక్టర్ జి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఈశ్వర్ విల్లాస్ అధ్యక్షుడితో కోలను శ్రీనివాస్ రెడ్డి సమావేశం



నవతెలంగాణ-దుండిగల్

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఈశ్వర్ విల్లాస్ లో గల సిద్ధి గణపతి ఆలయాన్ని మంగళవారం కోలను శ్రీనివాస్ రెడ్డి సందర్శించి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఈశ్వర్ విల్లాస్ ప్రెసిడెంట్ పూర్ణచందర్ రావు , కే. ఎస్. ఆర్‌తో సమావేశమై కాలనీ లో ప్రధాన సమస్యగా డ్రయినేజీ పైపులైన్ ఏర్పాటు గురించి చర్చించారు. దానికి సానుకూలంగా స్పందించిన కే.ఎస్.ఆర్ పైపులైన్ ఏర్పాటు చెయించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈశ్వర్ విల్లాస్ సెక్రటరీ శివరామ్, మధుసూదన్ రెడ్డి, ప్రేమ్ కుమార్, మేకల క్రాంతి, మహిపాల్, రఘు, శంకర్, శ్రీశైలం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

- మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్‌ను మంగళవారం తన నివాసం వద్ద నియోజకవర్గానికి చెందిన పలు బస్తీల ప్రజలు, నాయకులు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి స్థానికంగా ఉన్న పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో ఆయన మాట్లాడి, వాటి పరిష్కారం కోసం కృషి చేయాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రభుత్వ ధ్యేయమని ... తాను ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

కామ్రేడ్ లింగాచారి మరణం బాధాకరం

- సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఈ.ఉమామహేష్



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

సీపీఐ సీనియర్ నాయకులు కామ్రేడ్ లింగాచారి ఆకస్మిక మరణం బాధాకరమని పార్టీ నియోజకవర్గ కార్యదర్శి ఈ. ఉమామహేష్ విచారం వ్యక్తం చేశారు. జగద్గిరిగుట్ట డివిజన్ అంజయ్యనగర్ నివాసి లింగచారి అనారోగ్యంతో సోమవారం సాయంత్రం ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి తుదిశ్వాస విడిచారు. ఈ మేరకు మంగళవారం లింగచారి నివాసానికి వెళ్లి మృతదేహానికి సీపీఐ శ్రేణులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. లింగాచారికి భార్య, కుమార్తెలు ఉన్నారు.నిరుపేద అయిన లింగాచారి చాలి చాలని వేతనాలతో బతుకుతున్నారని అలాంటి కామ్రేడ్ సీపీఐ మీద ఉన్న అభిమానం తో అనేక సమస్యలపైన పార్టీ జండా పట్టుకొని పోరాటం చేసిన మానవతావాది అని సేవలను గుర్తు చేసుకున్నారు. అలాంటి కామ్రేడ్ లింగాచారిని కోల్పోవడం వారి కుటుంబానికి,పార్టీకి తీరని లోటని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యవర్గ సభ్యుల వై.హరినాథ్ రావ్,శాఖ కార్యదర్శి వెంకటేష్,మున్సిపల్ అధ్యక్షుడు చర్లపల్లి రాములు,స్థానిక నాయకులు చంద్రయ్య,జర్నలిస్ట్ డప్పు రామస్వామి,ఆకుబత్తిని ప్రవీణ్ లు నివాళులర్పించారు.

మల్లంపేట్‌లో అక్రమ భవనాల కూల్చివేతలు



నవతెలంగాణ-దుండిగల్

దుండిగల్ మున్సిపాలిటీ పరిధి మల్లంపేట్‌లోని కెవీఆర్ కాలనీ లోగల నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన బహుళ అంతస్తుల భవనాన్ని, అలాగే సాయి బాలాజీ కాలనీలో గల 2 అక్రమ భవన నిర్మాణాలను దుండిగల్ మునిసిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి(టీపీఓ) సంజనా నేతత్వంలో కూల్చివేతలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మునిసిపల్ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు ఎవరు చేపట్టినా చర్యలు తప్పవని తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ సిబ్బంది సతీష్, తిరుపతి, వేణు తదితరులు పాల్గొన్నారు,

9 గంటలకే బడిగంట

- ప్రతినెలా నాలుగో శనివారం 'నో బ్యాగ్ డే'
- పాఠశాలల పనివేళల్లో మార్పుచేసిన విద్యాశాఖ
- జూన్ 12 నుంచి పాఠశాలలు పున : ప్రారంభం
- పాఠశాల విద్య అకాడమిక్ క్యాలెండర్ విడుదల



నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల పని వేళల్లో మార్పులు చేసింది. ప్రాథమిక, ప్రాథమికోన్నత బడుల పని వేళలను మళ్లీ మార్చింది. జూన్ 12వ తేదీ నుంచి పాఠశాలలు పునర్ ప్రారంభం కానున్న నేపథ్యంలో అధికారులు తాజాగా పాఠశాల విద్య అకాడమిఎక్ క్యాలెండర్‌ను ప్రకటించారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఉదయం 9 గంటలకే బడిగంట మోగనుంది. కాగా.. 2022-23 విద్యా సంవత్సరం వరకు ఈ పాఠశాలలు ఉదయం 9 గంటలకే తెరుచుకునేవి. కానీ గతేడాది 9:30 గంటలకు ప్రారంభమయ్యేలా షెడ్యూల్ మార్చారు. మళ్లీ ఇప్పుడు ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకుని 9 గంటలకే ప్రారంభించాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ఉన్నత పాఠశాలలు ఉదయం 9:30 గంటలకు ప్రారంభమై సాయంత్రం 4:45 గంటల వరకు కొనసాగుతాయి.

నూతన అకాడమిక్ క్యాలెండర్ విడుదల

విద్యాశాఖలో ఏటా బడులు ప్రారంభమైన రెండు నెలల తర్వాత అధికారులు నూతన అకాడమిక్ క్యాలెండర్ విడుదల చేసేవారు. కానీ ఈసారి బడుల ప్రారంభానికి 20 రోజుల ముందుగానే విడుదల చేశారు. దీని ప్రకారం ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు, ఉన్నత పాఠశాలలు ఉదయం 9:30 నుంచి సాయంత్రం 4:45 గంటల వరకు పని చేస్తాయి.

ప్రతి నాలుగో శనివారం 'నో బ్యాగ్ డే'

బడుల్లో ప్రాథమిక పాఠశాల విద్యార్థుల బరువు కంటే వారి పుస్తకాల బరువు ఎక్కువగా ఉంటుందన్న విమర్శలు ఉన్నాయి. దీంతో చిన్నారులకు వెన్నెముక సమస్యలు వస్తున్నాయని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల స్కూల్ బ్యాగ్స్‌పై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ విద్యా సంవత్సరం నుంచి కొత్త విధానం అమలు చేయనుంది విద్యాశాఖ. నెలలో ఓ రోజును 'నో బ్యాగ్ డే'గా ప్రకటించింది. ప్రతినెలా నాలుగో శనివారం విద్యార్థులు పాఠశాలకు పుస్తకాల్లేకుండానే రావాల్సి ఉంటుంది. ఆ రోజు బోధనకు సంబంధించి ఎస్సీఈఆర్టీ ప్రత్యేక ప్రణాళిక ప్రకటించనుంది. ఆటపాటలతో చదువు చెప్పే విధానానికి ప్రణాళికలు రూపొందిస్తోంది. ఈ విధానాన్ని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు తప్పనిసరిగా పాటించాలని రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. గత విద్యా సంవత్సరం కూడా అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఈ విధానాన్ని తీసుకురాగా జిల్లాలో సరిగా అమలైన దాఖలాల్లేవు. ఈ ఏడాదైనా అధికారులు పకడ్బందీగా అమలు చేస్తారా..? లేదా..? అనేది వేచి చూడాల్సి ఉంది.

12న పాఠశాలలు పునర్ ప్రారంభం

నూతన విద్యాసంవత్సరం జూన్ 12వ తేదీన ప్రారంభమై 2025 ఏప్రిల్ 23వ తేదీ వరకు కొనసాగుతుంది. ఈ మేరకు ఆకాడమిక్ క్యాలెండర్‌ను పాఠశాల విద్యాశాఖ ఇప్పటికే విడుదల చేసింది. మొత్తంగా పాఠశాలలకు 229 పని దినాలు ఉంటాయి. రోజూ 90 శాతానికి పైగా విద్యార్థుల హాజరు ఉండాలని అదేశాలు జారీ చేసింది. ప్రతిరోజూ 30 నిమిషాల పాటు పాఠ్య పుస్తకాలు, కథల పుస్తకాలు, దినపత్రికలు, మ్యాగజైన్లు చదివించాలి. టీవీ పాఠాలను యథావిధిగా ప్రసారం చేయాలి. విద్యార్థులతో 5 నిమిషాల పాటు యోగా, ధ్యానం చేయించాలి. ఏప్రిల్ 24వ తేదీ నుంచి వేసవి సెలవులు ఉంటాయి.

జిల్లాలోని పాఠశాలల వివరాలు ఇలా..

పాఠశాలలు	సంఖ్య
ప్రాథమిక	375
ప్రాథమికోన్నత	22
ఉన్నత	108
మొత్తం	505

జూన్ 1 నుంచి 'బడిబాట'

సర్కార్ బడుల్లో బడిబాట షెడ్యూల్‌ను విద్యాశాఖ ఖరారు చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలను పెంచేందుకు జూన్ 1 నుంచి 11వ తేదీ వరకు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఉపాధ్యాయులంతా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆదేశాలు జారీ చేశారు. ఈసారి విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఉపాధి హామీ పని స్థలాలకు, ఇంటింటికీ వెళ్లడం, గ్రామ సభలు నిర్వహించడం, తదితర యాక్టివిటీలు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. పాఠశాలల్లో ఉన్న మౌలిక సదుపాయాలు, ఉపాధ్యాయుల అనుభవం, ఉచిత పాఠ్యపుస్తకాలు, ఉచిత యూనిఫాం, మధ్యాహ్న భోజనం తదితర సౌకర్యాలపై తల్లిదండ్రులకు వివరిస్తారు.

సదుపాయాలు కల్పించాలి



ప్రభుత్వం ముందస్తుగా అకాడమిక్ ప్లానింగ్ ప్రకటించడం స్వాగతిస్తున్నాం. కొవిడ్ తర్వాత పిల్లల సంఖ్య తగ్గుతోంది. ఇక నుంచైనా పెంచాలి. చదువు తోపాటు బడుల్లో మౌలిక సదుపాయాలు కూడా మెరుగు పర్చాలి. పాత భవనాలకు సున్నాలు వేయాలి. మూతబడ్డ బడులను తెరిపించాలి. విద్యార్థులు, టీచర్లపై ఉన్నతాధి కారుల పర్యవేక్షణ ఉండాలి. నాణ్యమైన విద్యను అందించేం దుకు కృషి చేయాలి. పాఠశాలలకు కేటాయించిన బడ్జెట్‌ను ఖర్చు చేసి, ప్రభుత్వ స్కూల్స్ రూపురేఖలు మార్చాలి. టీచర్లు సమయ పాలన పాటించేలా చూడాలి. బడులు ప్రారంభమయ్యే నాటికి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం ఇవ్వాలి.

- రాథోడ్ సంతోష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా

ఘనంగా

సెయింట్ ఆంథోని గ్రూప్ విద్యాసంస్థల రజతోత్సవం

- ముఖ్య అతిథిగా హాజరైన మాజీ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జెట్టి కుసుమ కుమార్
- నూతనంగా నిర్మించిన సుందర్ ఎడ్యుకేషనల్ అకాడమీ భవనం ప్రారంభం





నవతెలంగాణ-దుండిగల్

కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోగల సెయింట్ ఆంథోనీ విద్యాసంస్థ రజతోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాజీ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జెట్టి కుసుమ కుమార్ తో పాటు నల్సార్ యూనివర్సిటీ మాజీ వీసీ డా. బాలకృష్ణారెడ్డి, వికారాబాద్ హార్టికల్చర్ ఆఫీసర్ చక్రపాణి, మెట్రో టీవీ ఎండీ జయప్రసాద్, స్థానిక కౌన్సిలర్లు రాజిరెడ్డి, మోహన్ రెడ్డి, అపర్ణ కాలనీ ప్రెసిడెంట్ సంగీత రెడ్డి హాజరయ్యారు. మొదట జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం అపర్ణ ఫామ్ గ్లోవ్‌లో సరిశెట్టి సరితా సుందర్ రాజు దంపతుల నేతృత్వంలో నూతనంగా నిర్మించిన సుందర్ ఎడ్యుకేషనల్ అకాడమీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జెట్టి కుసుమ కుమార్ మాట్లాడుతూ గత అనేక సంవత్సరాల కాలంగా సెయింట్ ఆంథోని విద్యాసంస్థ అనేకమంది విద్యార్థులను చదువుతోపాటు క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచి నేడు భవిష్యత్తులో విద్యార్థులను ఇంజినీరింగ్, ఐఐటి రంగాలలో ప్రతిభావంతులుగా తీర్చిదిద్దేందుకు సుందర్ ఎడ్యుకేషనల్ అకాడమీ నెలకొల్పిందని తెలిపారు. భవిష్యత్తులో ఈ అకాడమీ ద్వారా ఎంతో మంది విద్యార్థులను నైపుణ్యత కలిగిన తమ ఉపాధ్యాయులచే మరింత సేవలు అందించాలని, విద్యా సంస్థ మరింత అభివృద్ధి చెందాలని కోరారు.



అనంతరం సెయింట్ ఆంథోనీ గ్రూప్ చైర్మెన్ నరిశెట్టి సుందర రాజు మాట్లాడుతూ నాణ్యమైన విద్యను అందరికీ అందించాలన్న ఉద్దేశంతో సెయింట్ ఆంథోనీ గ్రూపు విద్యాసంస్థలు నెలకొల్పామని తెలిపారు. స్థాపించిన నాటి నుండి నేటి వరకు అనేకమంది విద్యార్థులను తీర్చిదిద్దామని, తమ పాఠశాల కళాశాలలో చదివిన విద్యార్థులు ప్రముఖ స్థానంలో స్థిరపడ్డారన్నారు, కార్పొరేట్‌కు ధీటుగా తమ విద్యాసంస్థలను తీర్చి దిద్దామని ,సాధారణ విద్యార్థులతో అసాధారణ ఫలితాలు సాధిస్తున్న తమ విద్యాసంస్థను ఈ విద్యా సంవత్సరం నుంచి ఐఐటీ, జేఈఈ ,నీట్, మెడికల్ ఇంజనీరింగ్ రంగాలలో తీర్చిదిద్దేందుకు ముందుకు వెళ్తున్నామని తెలిపారు తమ విద్యాసంస్థల్లో అపర విద్య అనుభవం కలిగిన ఉపాధ్యాయుల సహాయ సహకారాలతో ముందుకు వెళ్తరామన్నారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ మండల్ ప్రయివేటు పాఠశాలల అసోసియేషన్ అధ్యక్షులు శివయ్య, శ్రీనివాస్ గౌడ్, రాంబాబు, స్వరూప్ రెడ్డి, వరప్రసాద్, వివిధ పాఠశాలల కరస్పాం డెంట్లు, ఉపాధ్యాయులు పాఠశాల కళాశాల విద్యార్థులు వారి తల్లిదండ్రులు నరిశెట్టి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌ను తెలుగు జాతి ఎప్పటికీ మరవదు

- కాంగ్రెస్ కూకట్ పల్లి నియోజకవర్గం ఇన్‌చార్జ్ బండి రమేష్



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

తెలుగు జాతికి తెలుగు నేలకు గొప్ప గుర్తింపును సాధించిపెట్టిన ఎన్టీఆర్‌ను తెలుగు జాతి ఎప్పటికీ మర్చిపోదని కాంగ్రెస్ కూకట్ పల్లి నియోజకవర్గం ఇన్‌చార్జ్ బండి రమేష్ అన్నారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా వసంత నగర్ లోని ఎన్టీఆర్ విగ్రహానికి బండి రమేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగుజాతి వెలుగు తెలుగు జాతి కీర్తి పతాకం తెలుగు జాతి ఉన్నంతవరకు ఎన్టీఆర్ పేరు నిలిచి ఉంటుందన్నారు. దేవుడు ఇలాగా ఉంటాడు అని, తన నటన ద్వారా తెలుగు ప్రజలకు చూపించిన ఎన్టీఆర్ కీర్తి ఆచంద్ర తారార్కం అన్నారు. కేపీహెచ్‌బీ డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాస్, అసోసియేషన్ ప్రతినిధులు నాగేశ్వరరావు, శివరామకృష్ణ, మధు, శివ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ జయంతి వేడుకలు కేపీహెచ్‌బీ డివిజన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేపీహెచ్‌బీ డివిజన్ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో జేఎన్‌టీయూ సర్కిల్ లోని ఎన్‌టీఆర్ విగ్రహానికి ఎన్టీఆర్ అభిమానులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.



అనంతరం కేపీహెచ్ బి ఫేజ్-3 రమ్య గ్రౌండ్ టీడీపీ దిమ్మె వద్ద కేక్ కటింగ్ చేసి, స్వీట్లు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

చింతల్ చంద్రనగర్‌లో

జగద్గిరిగుట్ట : తెలుగు ఖ్యాతిని పెంచిన మహనీయుడు ఎన్టీఆర్ అని రంగారెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ గౌడ్ బి.విజయ శేఖర్ గౌడ్ అన్నారు. మంగళవారం చింతల్ చంద్రనగర్ లోని కార్పొరేటర్ కార్యాలయ ఆవరణలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రాజకీయంగా పేద ప్రజల గుండెల్లో,సినీరంగంలో మంచి నటుడుగా, విశ్వవిఖ్యాత నటసార్వభౌముడిగా చరిత్ర కారుడుగా తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహనీయుడు అని కొనియాడారు. ముఖ్యమంత్రిగా తెలుగు రాష్ట్రాలకు ఎన్నో విశిష్ట సేవలు అందించారన్నారు.ఈ కార్యక్ర మంలో ఎన్టీఆర్ అభిమానులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



గాజులరామారం డివిజన్‌లో..

దివంగత ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకొని డివిజన్ పరిధి ఉషోదయ మెయిన్ రోడ్డు చౌరస్తాలో గల ఎన్టీఆర్ విగ్రహా నికి బీజేపీ నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ జెకె.శేఖర్ యాదవ్, స్థానిక కార్పొరేటర్,స్టాండింగ్ కమిటీ సభ్యులు రావుల శేషగిరి తో కలిసి పూలమాలలు



వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్టీఆర్ రాజకీయ,సినీరంగంలో మకుటం లేని మహారాజుగా ఎదిగారని స్మరించుకున్నారు.ఎన్టీఆర్ ఆశయసా ధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ అభిమానులు, పార్టీల కార్యకర్తలు,స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు వడ్డేపల్లి రాజేశ్వర్ రావు నివాళ్లు

కూకట్‌పల్లి : ఎన్టీఆర్ 101వ జయంతి సందర్భంగా, వివేకానందనగర్ కాలనీ కమాన్ ఆవరణలో వివేకానందనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, ఎన్టీఆర్ అభిమానులు ఏర్పాటు చేసిన వేడుకలలో, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వర్ రావు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనంలో రాజకీయ చైతన్యం తెచ్చిన మహనీయుడు ఎన్టీఆర్ అని, సామాన్య ప్రజలకు ప్రశ్నించే తత్వాన్ని అందించిన గొప్ప వ్యక్తి అని అన్నారు. ఆయన ఆశయాలను నెరవేర్చే విధంగా మనమందరం పయనిం చాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, ఎన్టీఆర్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.





బీఆర్ఎస్ నాయకులు ప్రత్యేక పూజలు

నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశీర్వాదంతో కేపీ వివేకానంద 3వ సారి సార్వత్రిక ఎన్నికలలో గెలవాలని గత సంవత్సరం జూలై మాసంలో మలేషియాలోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయంలో బీఆర్ఎస్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ జీహెచ్ఎంసీ డివిజన్ అధ్యక్షులు, నాయకులు పూజ నిర్వహించారు. అయితే అసెంబ్లీ ఎన్నికలలో రాష్ట్రంలోనే అత్యధికంగా 85,570 ఓట్ల మెజారిటీతో వివేకానంద గెలుపొందగా మంగళవారం మలేషియాలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు దుదిమెట్ల సోమేష్ యాదవ్, జీహెచ్ఎంసీ డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, రుద్ర అశోక్, పోలే శ్రీకాంత్, సీనియర్ నాయకుడు ఎత్తరి మారయ్య వేణు యాదవ్ జనార్ధన్ తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి, కొబ్బరికాయలు కొట్టి స్వామివారి మొక్కులు తీర్చుకున్నారు.

ఛాయ్ ఫర్ సఫాయి ప్రోగ్రాం



నవతెలంగాణ -కూకట్ పల్లి

ప్రజలు చెత్త ఎక్కడ పడితే అక్కడ వేస్తున్నారని కూకట్ పల్లి మున్సిపల్ అధికారులు ఒక వినూత్న ఆలోచనకు తెరలేపారు. కూకట్ పల్లి జోన్ పరిధిలో ఛాయ్ ఫర్ సఫాయి ప్రోగ్రాంను నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. దీనబంధు కాలనిలోని వంతెన మీద కాలనీ వాసులు, అటు నుంచి వెళ్లే ప్రయాణికులు ఎక్కువగా చెత్త వేస్తున్నారని పి.ఓ ఇంద్రసేన ఆధ్వర్యంలో ఆ ప్రదేశాన్ని అందంగా అలంకరించి ఇక్కడ చెత్త వేయకూడదని ప్రజలకు అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా దీనబంధు కాలనీ అధ్యక్షుడు మహేందర్ నాయక్, సి.ఓ సుజాత, ఎస్.ఆర్.పి వినయ్ కాంత్ రెడ్డి, ఎస్.ఎఫ్.ఐ రవీంద్ర నాయక్, ఆర్.పి.ఎస్ ప్రమీల, సంగీత, కైలాష్, ఆర్కే పటేల్, ఎస్.హెచ్.జి సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన నార్లకంటి రామకృష్ణను హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ హాజీ షేక్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ మహానగర్ లీగల్ సెక్రటరీగా నియమించారు.

నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

'మలబార్'ను అభినందించిన కార్పొరేటర్



నవతెలంగాణ - కూకట్‌పల్లి

వివేకానంద నగర్ డివిజన్ ఏ.ఎస్ రాజు నగర్ కాలనీ మెయిన్ రోడ్ లోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ కూకట్‌పల్లి బ్రాంచ్‌లో వరల్డ్ హంగర్ డే కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. మలబార్ గోల్డ్ కూకట్‌పల్లి స్టోర్ హెడ్ కె.ఎస్.శ్రీనివాస్‌తో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్న కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఆకలి- రహిత ప్రచారం సాధన దిశగా మలబార్ గోల్డ్ సంస్థ చేపట్టిన ఆహార ప్యాకెట్ల పంపిణీ 31 వేల నుంచి 51వేల వరుకు పెంచి పంపిణీ చేయడం చాలా సంతోషకరమని,మన చుట్టూ చాలా మంది వ్యక్తులు ఆకలితో అలమటిస్తున్నారని, వారికి రోజు ఒక్క పూట భోజనం అందించి ఆకలి తీరుస్తున్న గోల్డ్ అండ్ డైమండ్ సంస్థ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ రావు నగర్ కాలనీ సభ్యులు రాజు , నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఈ ఆహారం అవసరం

మహిళలు తమ డైట్‌లో కచ్చి తంగా పోషకాలు ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. మహిళలు వయస్సు పెరిగే కొద్దీ అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటారు. రుతుస్రావం నుంచి ప్రెగెన్సీ, డెలివరీ, మెనోపాజ్ వరకూ ఇలా శరీరంలో అనేక మార్పులు చోటుచేసుకుంటాయి. రక్తహీనత, నీరసం, అలసట, తలనొప్పి, రోగ నిరోధకశక్తి తగ్గటం, ప్రెగెన్సీ సంబంధిత రుగ్మతలు, వంటి సమస్యలతో



ఎక్కువగా ఇబ్బందులు పడుతుంటారు. మగవారితో పోలిస్తే మహిళలకు ప్రత్యేకంగా కొన్ని విటమిన్లు అధిక మోతాదులో అవసరమవుతాయి. వాటి గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

విటమిన్-ఎ : మహిళల ఆరోగ్యానికి విటమిన్-ఏ కీలకమైంది. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఎముకలు, దంతాలు ఆరోగ్యంగా ఉండటానికి 'ఎ' విటమిన్ తీసుకోవటం అత్యంత అవసరం. దీనికోసం టమోటా, క్యారెట్, బొప్పాయి, గుమ్మడికాయ, పాలకూర, చేపలు, పాలు, గుడ్లు, పుచ్చకాయ వంటివి ప్రతిరోజూ తీసుకోవాలి.

విటమిన్-సి : రోగ నిరోధక శక్తికి పెంపొందించుకోవటానికి తప్పకుండా రోజువారీ డైట్‌లో తీసుకోవాలి. ఇది రొమ్ము క్యాన్సర్ వంటి వ్యాధులను నిరోధిస్తుంది. గర్భిణులు, పాలిచ్చే తల్లుల ఆరోగ్యానికి ఇది ఎంతో అవసరం. ఇది సిట్రస్ ఫ్రూట్స్, స్ట్రాబెర్రీస్, టమాటో, జామ, ఉసిరి వంటి వాటిలో లభిస్తుంది.

విటమిన్-బి3 : కణాల పనితీరు, పోషకాలను గ్రహించ టంలో, నాడీ వ్యవస్థ పనితీరులో 'బి3' విటమిన్ కీలకం. ఇది ట్యూనా చేపలు, వేరుశెనగలు, పుట్టగొడుగులు, గోధుమలు, పాలు, గుడ్లు, బీన్స్ వంటి వాటిలో ఉంటుంది.

విటమిన్-బి6 : హార్మోన్ల ఉత్పత్తి కి, మెదడు ఆరోగ్యానికి, రక్తహీనత వంటి సమస్యలను నివారించటానికి విటమిన్-బి6 అవసరం. దీనికోసం డ్రైఫ్రూట్స్, నట్స్, ఎగ్స్, ముడి ధాన్యాలు, బీన్స్, అరటిపండ్లు, మాంసం, ఓట్స్ వంటివి తీసుకోవాలి.

విటమిన్-బి12 : మహిళల్లో రక్తహీనత తగ్గటానికి విటమిన్-బి 12 తీసుకోవడం అవసరం. ఇది రక్త కణాలు ఏర్పడటానికి, మెటబాలిజం రేటును పెంచటానికి ఉపయోగపడు తుంది. ఇది చేపలు, పాలు, గుడ్డు, మాంసం, పెరుగు వంటి పదార్థాల్లో అధికం. ■

సాహిత్య శిరోమణి నీహారిణి

డా.కొండపల్లి నీహారిణి... నిరంతర సాహితీ పిపాసి. నిత్య చైతన్యశీలి. ఒక సామాన్య గృహిణిగా సంసార బాధ్యతలు మోస్తూ కూడా తెలుగు భాషాభిమానంతో, సాహిత్యాభినివేశంతో రచనలు చేయడం ప్రారంభించి తన జీవితానికి ఒక సార్థకతను ఏర్పరచుకున్నారు. అంతేనా తనలాంటి మరికొంత మంది మహిళల రచనలను ప్రపంచానికి పరిచయం చేయాలనే తపనతో మయూఖ పేరుతో ఓ అంతర్జాల పత్రికను విజయవంతంగా నడిపిస్తున్నారు. అందుకుగాను ఇటీవల అమృతలత అపూర్వ అవార్డును సైతం అందుకున్న ఆమె పరిచయం నేటి మానవిలో...





నీహారణి 1963, డిసెంబర్ 8న పుట్టారు. సొంతూరు చిన్న పెండ్యాల, జనగాం జిల్లా. తల్లి పెండ్యాల కౌసల్యాదేవి, స్త్రీల సాధికారత కోసం ఆనాడే మహిళా మండలిని నడిపి ఆదర్శ మహిళగా నిలిచారు. తండ్రి ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, వరంగల్ జిల్లా మొట్టమొదటి లోక్‌సభ సభ్యులు, కమ్యూనిస్టు నాయకులైన పెండ్యాల రాఘవరావు. ఇలాంటి తల్లిదండ్రుల పెంపకంలో పెరిగిన ఆమెకు ఎలాంటి బేధ భావం లేకుండా అందరినీ సమానంగా ఆదరించడం, ప్రేమించడం, ప్రోత్సహించడం వంటివి పుట్టుకతో వచ్చిన సద్గుణాలు. చిన్నతనం నుండి తల్లిదండ్రుల ప్రోత్సాహంతో క్లాసు పుస్తకాలతో పాటు సాహిత్యాన్ని కూడా విరివిగా చదివేవారు. ఇంటర్ తర్వాత తెలుగుపై ఉన్న ఆసక్తితో కాకతీయ యూనివర్సిటీలో బీఏ తెలుగు కోసం చేరారు.

మామయ్య ప్రోత్సాహంతో

డిగ్రీ రెండో ఏడాదిలో ఉండగా తండ్రి ప్రాణ స్నేహితుడైన కొండపల్లి శేషగిరిరావు కొడుకు వేణుగోపాలరావుతో నీహారిణి వివాహం జరిగింది. గొప్ప కుటుంబంలో పుట్టిన ఆమె, పెండ్లి తర్వాత కూడా అలాంటి మరో కుటుంబంలోకి అడుగుపెట్టారు. వీరికి కూతురు దీప్తి, కొడుకు భార్గవ్ ఉన్నారు. ప్రముఖ జాతీయ చిత్రకారులు, హంస అవార్డు గ్రహీత కొండపల్లి శేషగిరిరావు వీరి మామయ్య. పెండ్లి తర్వాత ఆయన ప్రోత్సాహంతో తన చదువును కొనసాగించారు. ఆయనే కోడలిని స్వయంగా హైదరాబాద్‌లోని రెడ్డి ఉమెన్స్ కాలేజీలో డిగ్రీ మూడో ఏడాదిలో చేర్పించారు. అయితే పరీక్షల సమయంలో గర్భవతిగా ఉన్న నీహారిణి ఫెయిల్ అయ్యారు. కానీ శేషగిరిరావు ఆమెకు ధైర్యం చెప్పి మళ్ళీ పరీక్షలు రాయించారు. 1991లో తెలుగు పండిత శిక్షణ చేసి ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చారు. తర్వాత ఉస్మానియా యూనివర్సిటీ నుండి తెలుగు ఎమ్మె కూడా పూర్తి చేశారు.

ఒద్దిరాజు సోదరుల జీవితం

కడవరకు చిత్రకళే తన జీవితంగా బతికిన తన మామయ్య జీవిత చరిత్రను 2009లో 'చిత్రకళా తపస్వి డాక్టర్ కొండపల్లి శేషగిరిరావు' పేరుతో రాశారు. ఆనాటి చరిత్ర, సాంఘిక సామాజిక పరిస్థితులకు అద్దం పడుతూ, ఆసాంతం చదివించే శైలిలో మనసుకు హత్తుకునేలా రచించిన ఈ పుస్తకాన్ని తెలుగు అకాడమీ వారు ప్రచురించారు. అలాగే మరింగంటి లక్ష్మణాచార్య ఈ పుస్తకాన్ని హిందీలోకి అను వదించారు. తర్వాత కాలంలో ఎలాగైనా పీహెచ్‌డీ చేయాలనే బలమైన కోరికతో 2016లో వివిధ రంగాల్లో నిష్ణాతులై, తమ ప్రతిభను లోకానికి చాటిన ఒద్దిరాజు సోదరుల సమగ్ర జీవితాన్ని ఏడు వందల పేజీల ఉద్గ్రంథంగా 'తెలంగాణ వేగు చుక్కలు - ఒద్దిరాజు సోదరులు' అనే పరిశోధనా గ్రంథాన్ని వెలువరించి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ పట్టా అందుకున్నారు.

సమాజ హితవును కోరుతూ

ఇరవై ఏండ్లు అనేక ప్రైవేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయవృత్తిలో కొనసాగిన ఆమె తర్వాత తన పూర్తి కాలాన్ని సాహిత్య సేవకు అంకితం చేశారు. స్త్రీవాద దృక్పథంతో, సామాజిక నేపథ్యంతో, మానవీయకోణంలో, ప్రకృతి విధ్వంసాలకు పాల్పడవద్దనే ఉద్దేశంతో రాసిన తన కవితలన్నింటినీ అగ్ర తలుపులు, నిర్నిద్ర గానం, ఎనిమిదో అడుగు, కాల ప్రభంజనం అనే నాలుగు కవితా సంపుటాలుగా వెలువరించారు. మానవ సంబంధాలు మెరుగుపడాలన్న ఆకాంక్ష, మంచితనం, మానవత్వం మరుగునపడిపోయే ప్రమాదాన్ని పసిగట్టాలనే ఆరాటం, స్త్రీల జీవితాలను ఉన్నతంగా చూడాలనే కోరికతో, సమాజాన్ని దగ్గరగా చూస్తూ అనేక సమస్యలపట్ల అవగాహనతో సమాజ హితవును కోరుతూ రాసిన కథలతో రాచిప్ప, ఘర్షణ అనే రెండు సంపుటాలు వెలువరించారు.

అమెరికాలో ఉంటూనే...

లోతైన విశ్లేషణ, విలువైన విషయాలను క్రోడీకరిస్తూ వీరు రచించిన వ్యాసాలు సృజన రంజని, వ్యాహారిక, అనివార్యం అనే మూడు విమర్శ వ్యాస సంపుటాలుగా వెలువడ్డాయి. ఇరవై ఏండ్ల ఆమె సాహితీ ప్రస్థానంలో చీఫ్ ఇంజనీర్‌గా ఉద్యోగం చేసి పదవీ విరమణ పొందిన భర్త వేణుగోపాలరావు ప్రోత్సాహం ఎంతో ఉంది. తన పిల్లలు విదేశాల్లో స్థిరపడిన తర్వాత కుటుంబ అవసరాల రీత్యా నీహారిణి నిత్యం విదేశాలకు వెళ్ళాల్సిన అవసరం అనివార్యమయింది. అమెరికాలో ఉంటూనే ఎన్నో సాహిత్య కార్యక్రమాల్లో పాల్గొని తెలుగు తేజాన్ని చాటుతున్నారు. అమెరికా - ఇండియా దేశాల జీవన విధానాన్ని సమవీక్షణ చేస్తూ బంధాలు, బాధ్యతల మధ్య వ్యత్యాసాలు, అవసరాల గురించి చెబుతూ 'అమెరికాలో ఆరు నెలలు' అనే ఓ యాత్రా చరిత్రను వెలువరించారు.

ఆమె రచించిన కాల ప్రభంజనం కవితా సంపుటిని ప్రముఖ కవి ఎలనాగ 'టెంపెస్ట్ ఆఫ్ టైమ్' పేరుతో ఇంగ్లీష్‌లోకి అనువదించారు. రచనలతో పాటు ఆమె ఎన్నో పుస్తకాలకు సంపాదకత్వం కూడా వహించారు. ముఖ్యంగా కరోనా సమయంలో ముంచుకొచ్చిన అంతర్జాల అవసరాలను గుర్తించి మయూఖ పేరుతో ద్వైమాసిక అంతర్జాల పత్రికను 2021లో ప్రారంభించారు. తర్వాత కాలంలో తరుణి యూట్యూబ్ ఛానల్‌ని కూడా ప్రారంభించారు.

- సలీమ

కృషికి దక్కిన గౌరవం

సాహిత్యానికి చేస్తున్న కృషికిగాను ఎన్నో పురస్కారాలు అందుకున్నారు. 2012లో షీ ఫౌండేషన్ వారి షీ అవార్డు అందుకున్నారు. 2014లో పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ నుండి 'కొండపల్లి శేషగిరిరావు జీవిత చరిత్రకు కీర్తి పురస్కారం, 2021లో ఉత్తమ రచయిత్రిగా ప్రతిభా పురస్కారం అందుకున్నారు. అమెరికన్ తెలుగు అసోసియేషన్ అంతర్జాతీయ సాహితీ సదస్సు వారి ఆత్మీయ పురస్కారం, వాషింగ్టన్ అమెరికా తెలుగు సంఘం వారి ఉత్తమ మహిళా అవార్డు, శ్రీమతి తిరుమల రాజ్యలక్ష్మీ స్మారక సాహితీ పురస్కారం, అమెరికా అకెల్లా ఫౌండేషన్ వారి ఉమెన్ ఐకాన్ అవార్డు, శ్రీ విజయ సారథి ధర్మనిధి పురస్కారం, ప్రమీలా శక్తిపీఠం వారి విశిష్ట సాహితీ పురస్కారం, సోమ సీతారాములు రాష్ట్ర స్థాయి పురస్కారం, ఎం.వి.నరసింహారెడ్డిచే కళాశ్రీ బిరుదు, లయన్స్ క్లబ్ వారిచే ఉత్తమ ఉపాధ్యాయుని అవార్డు, లక్కరాజు కమలమ్మ స్మారక పురస్కారం లాంటి ఎన్నో అవార్డులు అమెను వరించాయి. ఇంతటి ప్రతిభ ఉన్నా, ఎన్ని అవార్డులు వరించినా నిరాడంబరత, నిష్కల్మషత, పెదవులపై సదా చెరగని చిరునవ్వు ఆమెకు పెట్టని ఆభరణలు.

పొదుపు సొమ్ముతో జూదం

(మొదటిపేజీ తరువాయి)

పెరుగుతుంటాయి. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టడం అంటే జూదంతో సమానమే. సోషల్ మీడియా ద్వారా ప్రభావం చూపే సలహాదారుల మాటలు నమ్మి ఎక్కువ ఆదాయాన్ని పొందాలన్న కోరికతో పలువురు స్టాక్ మార్కెట్‌లో తమ పొదుపు సొమ్మును మదుపు చేస్తున్నారు. సెబీ అధిపతి హెచ్చరికలు జారీ చేస్తున్నప్పటికీ చిన్న, మధ్యతరహా షేర్లలో పెట్టుబడులు పెరుగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా తొలిసారి మదుపు చేసే వారు స్టాక్ మార్కెట్ వైపు ఆకర్షితులవుతున్నారు. రాత్రికి రాత్రే లాభాలు వస్తాయని, ఆదాయ అవకాశాలు అధికంగా ఉంటాయని మభ్యపెట్టి వీరితో పెట్టుబడి పెట్టిస్తారు. కానీ వాస్తవం మాత్రం అందుకు విరుద్ధంగా ఉంటుంది. నష్టాలు వచ్చినప్పటికీ ఆ ఊబిలో పడిన వారు పదేపదే పెట్టుబడి పెడుతూనే ఉంటారు.

ఇవి కూడా తగ్గుతున్నాయి

ప్రయివేటు రంగం నుండి పెట్టుబడులు లేకపోవడంతో ప్రజల ఆదాయ స్థాయి పడిపోతోంది. ప్రైవేటు పెట్టుబడులే కాదు...విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు కూడా తగ్గిపోవడం ఆందోళన కలిగించే విషయం. విదేశీ పెట్టుబడిదారులు ఇప్పుడు ఇతర దేశాలను ఎంచుకుంటున్నారు. పరిశ్రమల స్థాపనకు అవసరమైన భూమి లభించకపోవడం, కార్మికుల లభ్యత తగినంత లేకపోవడం దీనికి కారణం. జూన్‌లో కేంద్రంలో ఏర్పడబోయే నూతన ప్రభుత్వం ఈ అంశాలపై తక్షణమే దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

సాక్షులను బెదిరించారు... ఆధారాలూ చెరిపేశారు

(మొదటిపేజీ తరువాయి)

కవిత తరపు వాదనలు విన్న జస్టిస్ స్వర్ణకాంత శర్మ ఏక సభ్య ధర్మాసనం, మంగళవారం ఈడీ, సీబీఐ వాదనలను విన్నది. తొలుత ఈడీ తరపు సీనియర్ న్యాయవాది జోహెబ్ హుస్సేన్ వాదనలు వినిపించారు. 2022 నవంబర్ 11న కవితకు వ్యతిరేకంగా అరుణ్ పిళ్లై స్టేట్మెంట్ ఇచ్చారని కోర్టుకు తెలిపారు. అయితే స్టేట్మెంట్ ఇచ్చిన 118 రోజుల తరువాత కవిత ఒత్తిడితో పిళ్లై ఆ స్టేట్మెంట్‌ను వెనక్కి తీసుకున్నారని తెలిపారు. మనీలాండరింగ్ కేసులో సెక్షన్ 50 ప్రకారం కవితకు నోటీసులు ఇచ్చిన తరువాత ఈ కీలక పరిణామం జరిగిందన్నారు. కవిత ప్రాక్సీగా సౌత్ గ్రూప్‌నకు చెందిన ఇండో స్పిరిట్‌లో అరుణ్ పిళ్లైకి 33 శాతం వాటాలున్నాయ న్నారు. ఇలా పిళ్లై ద్వారా కవిత దాదాపు రూ. 35 కోట్లు లబ్ధి పొందే ప్రయత్నం చేశారని ఆమె మాజీ ఆడిటర్ బుచ్చిబాబు వాంగ్మూలం ఇచ్చారన్నారు. ఈ రూ.32 కోట్లు కవిత కోసం, మరో రూ. 4.75 కోట్లు ఇండియా ఎహెడ్ సంస్థకు మళ్లించినట్లు పేర్కొన్నారు. ఇండియా ఎహెడ్ కవితకు హెూనింగ్ కంపెనీగా ఉందన్నారు. ఇందుకు సంబంధించిన ఆధారాలు, వాట్సాప్ చాట్‌లు తమ వద్ద ఉన్నాయని, ఈ కంపెనీకి కవిత ఫండింగ్ చేస్తోన్న సమాచారాన్ని కోర్టుకు సమర్పించినట్లు తెలిపారు. ఇక పిటిషనర్ పేర్కొన్నట్లు, కవిత అరెస్ట్‌కు సంబంధించి సుప్రీంకోర్టులో ఎలాంటి అండర్ టేకింగ్ ఇవ్వలేదని కోర్టుకు తెలిపారు.

ఆమె పవర్ ఫుల్ లేడీ...: సీబీఐ

అనంతరం సీబీఐ వాదనలు కొనసాగించింది. కేసు ప్రారంభంలో సాక్షిగా ఉన్న కవిత, తరువాత నిందితురాలిగా పేర్కొనడానికి తమ వద్ద ఆధారాలున్నాయని సీబీఐ తరపు న్యాయవాదులు పేర్కొన్నారు. ఈ ఏడాది జనవరి నుంచి మార్చి మధ్యలో అప్రూవర్లు, సాక్షులుగా ఉన్న ముగ్గురిని సీబీఐ విచారించిం దన్నారు. కవితకు బెయిల్ ఇస్తే కేసు దర్యాప్తుపై ప్రభావం పడుతుందని, మహిళైనంత మాత్రాన బెయిల్ ఇవ్వాల్సిన అవసరం లేదని వారించారు. ఈ వాదనలకు కవిత న్యాయవాది నితేశ్ రాణా అభ్యంతరం తెలిపారు. అరెస్ట్‌కు గల కారణాలు చూపించకుండానే సీబీఐ కవితను అరెస్టు చేసిందన్నారు. కవిత ఎలాంటి ఆధారాలను ధ్వంసం చేయలేదని, ఈడీ కోరినట్లు కవిత ఫోన్లు సమర్పించిందని చెప్పారు. ఇరువైపు వాదనలు ముగించిన జస్టిస్ స్వర్ణకాంత శర్మ తీర్పును రిజర్వ్ చేశారు. కాగా, వేసవి సెలవులకు ముందే కవిత బెయిల్ పిటిషన్లపై తీర్పు వెలువరిస్తామని న్యాయమూర్తి తెలిపారు. దీంతో ఈనెల 30, 31 తేదీల్లో కవిత బెయిల్ పిటిషన్లపై ఢిల్లీ హైకోర్టు తీర్పు వెల్లడించే అవకాశం ఉంది.

చిన్నారుల బూచోళ్లు..

నవతెలంగాణ-సిటీబ్యూరో

శిశువు విక్రయాన్ని భగ్నం చేసిన పోలీసులు.. ఆ ఘటన ద్వారా లోతైన దర్యాప్తు జరిపితే చిన్నారుల అక్రమ రవాణా అంతర్రాష్ట్ర ముఠా గుట్టు బయటపడింది. మొత్తం 16 మంది పిల్లలను రక్షించారు. ఢిల్లీ, పూణే, ముంబయి నగరాల నుంచి చిన్నారులను అక్రమ రవాణా చేస్తూ రెండు తెలుగు రాష్ట్రాల్లో విక్రయిస్తున్నారు. ఈ ముఠాను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని మేడిపల్లి పోలీసులు అరెస్టు చేశారు. ఇటీవల పీర్జాదీగూడలో ఆర్‌ఎంపీ డాక్టర్ శోభారాణి ఓ శిశువును రూ.4.50 లక్షలకు విక్రయిస్తూ పోలీసులకు చిక్కిన విషయం తెలిసిందే. ఈ సంఘటనతో కూపీ లాగితే డొంక కదిలింది. ఈ రాకెట్‌తో సంబంధమున్న ఏజెంట్లు, సబ్ ఏజెంట్లు మొత్తం ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. హైదరాబాద్ నేరేడ్‌మెట్‌లోని రాచకొండ పోలీస్ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీ తరుణ్‌జోషి వివరాలు వెల్లడించారు.

పీర్జాదీగూడలో ఆర్‌ఎంపీ డాక్టర్‌గా చెలామణి అవుతున్న శోభారాణి, మేడిపల్లికి చెందిన హేమలత అలియాస్ స్వప్న, షేక్ సలీమాను పోలీసులు కొద్దిరోజుల కిందట అరెస్టు చేశారు. వారిని విచారిస్తే మరికొంత మంది పేర్లు వెలుగు చూశాయి. వీరిలో అనోజిగూడకు చెందిన బండారీ హరిహరా చేతన్, బండారీ పద్మ, విజయవాడకు చెందిన బాల్గం సరోజా, ముదావత్ శారద, ముదావత్ రాజు, పఠాన్ ముంతాజ్, జగన్నాథం అనురాధ, యాట మమత ఒక ముఠాగా ఏర్పడ్డారు. ముఖ్యంగా ఈ ముఠా సంతానం లేని వారిని, కొత్తగా పెండ్లయిన వారితోపాటు పిల్లలు కావాల్సిన వారిని టార్గెట్ చేస్తుంది. వారికి కావాల్సిన చిన్నారులను ముందుగానే ఎంచుకుని ఢిల్లీ, పూణే, ముంబయికి చెందిన కిరణ్, ప్రీతి, కన్నయ్య నుంచి ఈ ముఠా కొనుగోలు చేసి రైళ్లు, కార్లు, విమానాల్లో తరలిస్తున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో విక్రయిస్తున్నారు. ఒక్కో చిన్నారిని రూ.4 లక్షల నుంచి రూ.5.50లక్షల వరకు విక్రయిస్తున్నారు. మూడేండ్ల కాలంలో ఈ ముఠా ఇప్పటి వరకు దాదాపు 50మందికిపైగా చిన్నారులను విక్రయించినట్టు పోలీసులు గుర్తించారు. వారి నుంచి 16 మంది చిన్నారులను రక్షించి శిశుసంక్షేమ శాఖకు అప్పగించారు. అందులో 23 రోజుల పాపతో పాటు రెండు నెలల నుంచి రెండేండ్ల వయస్సు పిల్లలున్నారు. ఇంకా దర్యాప్తు కొనసాగుతోంది. ఈ ముఠాకు సంబంధమున్న కిరణ్, ప్రీతి, కన్నయ్యతోపాటు మరికొంత మందిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు ఇతర రాష్ట్రాల్లో గాలిస్తున్నాయి. చట్టం ప్రకారం చిన్నారులను దత్తత తీసుకోవాలి కానీ.. అక్రమంగా చిన్నారులను కొనుగోలు చేసిన దంపతులు, ఇతరులు సైతం ఇబ్బందుల్లో పడతారని సీపీ తెలిపారు. చిన్నారులను కొనుగోలు చేసిన వారిపై కూడా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ పివి.పద్మజా, ఏసీపీ చక్రపాణి, మేడిపల్లి ఎస్‌హెచ్‌వో ఆర్.కోవర్ధన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఏ.నర్సింగ రావు, ఎస్.అనిల్ కుమార్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

విపక్షాలొస్తే రిజర్వేషన్లకు కోతే

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. ఆదివాసీలు, దళితులు, ఓబీసీల కోటాను గుంజుకుని వాటిని ఓట్ జిహాద్‌కు పాల్పడే ముస్లింలకు అప్పగించడాన్ని తాను అనుమతించనని పేర్కొన్నారు. మంగళవారం ఆయన దుంకాలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. జార్ఖండ్‌లోని జేఎంఎం నేతృత్వంలోని ప్రభుత్వం చొరబాట్లను ప్రోత్సహిస్తుందని మోడీ అన్నారు. రాష్ట్రంలో ఆదివాసీల సంఖ్య తగ్గుముఖం పడుతూ చొరబాటుదారుల సంఖ్య పెరుగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. గిరిజనుల భూములను చొరబాటుదారులు గుంజుకుంటు న్నారా..లేదా..? అని మోడీ ప్రశ్నించారు.. చొరబాటుదారులు గిరిజనులు భూములను లాక్కొని, మహిళలపై అఘాత్యాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. చొరబాటుదారుల కారణంగా గిరిజనుల జీవితాలే ప్రమాదంలో పడుతున్నాయి' అని మోడీ విమర్శించారు. గతంలో జరిగిన రెండు ఘటనలను ప్రస్తావిస్తూ గిరిజన కుమార్తెలను టార్గెట్ చేస్తున్న వ్యక్తులు ఎవరు.? జేఎంఎం ప్రభుత్వం వారిని ప్రోత్సహిస్తోందా అని మోడీ ప్రశ్నించారు.

లవ్ జిహాద్ జార్ఖండ్ నుంచే ప్రారంభమైందని అన్నారు. జేఎంఎం ప్రభుత్వం మత రాజకీయాలకు పాల్పడుతోందని, దేశంలో బ్రిటీష్ కాలం నుంచి ఆదివారం సెలవుదినంగా పాటిస్తున్నా.. జార్ఖండ్‌లో ఒక జిల్లాలో దానిని శుక్రవారంగా మార్చారని మోడీ విమర్శించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అవినీతికి పాల్పడుతోందని, రాష్ట్రం 'నోట్ల గుట్టల'కు ప్రసిద్ధి చెందిందని ఆయన విమర్శించారు. జార్ఖండ్‌లోని జంతరా, దేవ్‌గర్, డుంకా, పాకూర్, గొడ్డ, సాహెబ్‌గంజ్ జిల్లాలను సంతాల్ పరగణాల డివిజన్‌గా పేర్కొన్నారు.

ఏడో దశలో...199 మంది అభ్యర్థులు నేరచరితులే !

(మొదటిపేజీ తరువాయి)

22 శాతం మంది...అంటే 199 మందికి నేర చరిత్ర ఉంది. ఏడు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలో జరిగే ఏడో విడత ఎన్నికల్లో బరిలో నిలిచిన అభ్యర్థుల అఫిడవిట్లను ఏడీఆర్, నేషనల్ ఎలక్షన్ వాచ్ విశ్లేషించాయి. తుది దశలో బీహార్, ఛత్తీస్‌గఢ్, హిమాచల్ ప్రదేశ్, జార్ఖండ్, ఒడిషా, పంజాబ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌లోని 57 స్థానాలకు ఎన్నికలు జరుగుతాయి.

కేసుల స్వభావం

తమపై తీవ్రమైన క్రిమినల్ కేసులు ఉన్నాయని 151 మంది (17 శాతం) అభ్యర్థులు తమ అఫిడవిట్లలో ప్రకటించారు. ఈ తరహా కేసుల్లో నేరం రుజువైతే ఐదు లేదా అంతకంటే ఎక్కువ సంవత్సరాల జైలుశిక్ష పడుతుంది. ఇవి నాన్ బెయిలబుల్ కేసులు. ఏడో దశలో పోటీ చేస్తున్న అభ్యర్థుల్లో 13 మందికి శిక్షలు పడ్డాయి. తమపై హత్య కేసులు నమోదై ఉన్నాయని నలుగురు తెలిపారు. 27 మందిపై హత్యాయత్నం కేసులు, 25 మందిపై విద్వేష ప్రసంగాల కేసులు ఉన్నాయి. మహిళలపై నేరాలకు సంబంధించి 13 మంది అభ్యర్థులపై కేసులు ఉన్నాయి. వీరిలో ఇద్దరిపై అత్యాచారానికి సంబంధించిన ఆరోపణలు ఉండడం గమనార్హం.

పార్టీల వారీగా...

పార్టీల విషయానికి వస్తే ఆమ్‌ఆద్మీ తరపున పోటీ చేస్తున్న 13 మందిలో ఐదుగురిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. వీరిలో నలుగురిపై తీవ్రమైన అభియోగాలు మోపారు. సమాజ్‌వాదీ పార్టీకి చెందిన తొమ్మిది మంది అభ్యర్థుల్లో ఏడుగురిపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. వారిలో ఆరుగురిపై తీవ్రమైన క్రిమినల్ కేసులు ఉన్నాయి. బీజేపీకి చెందిన 51 మంది అభ్యర్థుల్లో 23 మందిపై క్రిమినల్ అభియోగాలు ఉన్నాయి. వీరిలో 18 మందిపై మోపిన ఆరోపణలు తీవ్రమైనవి. తృణమూల్ కాంగ్రెస్ తరపున తొమ్మిది మంది పోటీ చేస్తుండగా వారిలో ఏడుగురిపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. వీరిలో ముగ్గురిపై తీవ్రమైన అభియోగాలు ఉన్నాయి.

సీపీఐ (ఎం)కు చెందిన ఎనిమిది మంది అభ్యర్థుల్లో ఐదుగురు, శిరోమణి అకాలీదళ్‌కు చెందిన 13 మందిలో ఎనిమిది మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. ఇక 31 మంది కాంగ్రెస్ అభ్యర్థుల్లో 12 మంది, సీపీఐకి చెందిన ఏడుగురిలో ఇద్దరు, బీఎస్పీకి చెందిన 56 మందిలో 13 మంది కూడా నేరచరితులే.

కోటీశ్వరులు వీరే

ఏడో దశలో పోటీ పడుతున్న 904 మంది అభ్యర్థుల్లో 299 మందికి కోటి, అంతకంటే ఎక్కువ విలువ కలిగిన ఆస్తులు ఉన్నాయి. శిరోమణి అకాలీదళ్‌కు చెందిన 13 మంది, ఆమ్‌ఆద్మీకి చెందిన 13 మంది, బీజేడీకి చెందిన ఆరుగురు, సమాజ్‌వాదీ పార్టీకి చెందిన 9 మంది, కాంగ్రెస్‌కు చెందిన 30 మంది, తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన ఎనిమిది మంది, బీజేపీకి చెందిన 44 మంది, సీపీఐ (ఎం)కు చెందిన నలుగురు, బీఎస్పీకి చెందిన 22 మంది అభ్యర్థులు కోటీశ్వరులే. వీరిలో అత్యంత ధనవంతుడైన శిరోమణి అకాలీదళ్ అభ్యర్థి హర్‌సిమ్రత్ కౌర్ బాదల్ ఆస్తుల విలువ రూ.198 కోట్లు. బీజేపీకి చెందిన వైజయంత్ పాండా రూ.148 కోట్లు, హిందూత్వ పార్టీకి చెందిన సంజయ్ టాండన్ రూ.111 కోట్లతో తర్వాతి స్థానాల్లో నిలిచారు. ఉత్కళ్ సమాజ్ పార్టీ అభ్యర్థి భానుమతి దాస్ తన ఆస్తుల విలువను కేవలం రూ.1,500గా చూపారు.

క్వారీ కూలి 17మంది మృతి

(మొదటిపేజీ తరువాయి)

వర్షాలు కురుస్తుండడంతో ఈ పరిస్థితి ఎదురైంది. ఐజ్వాల్‌కు దక్షిణ శివార్లలోని మెల్తమ్, హిలెమన్ ప్రాంతాల మధ్య ఉదయం 6గంటల సమయంలో ఈ సంఘటన చోటు చేసుకుందని పోలీసులు తెలిపారు. క్వారీ మృతుల్లో నాలుగేండ్ల బాలుగు, ఆరేండ్ల బాలిక వున్నారని పోలీసులు చెప్పారు. మరో ఇద్దరిని కాపాడారు. భారీ వర్షాల కారణంగా సహాయక చర్యలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని శుక్లా తెలిపారు. రాష్ట్రంలో పలు చోట్ల వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడ్డాయని, ఇద్దరు వ్యక్తులు కొట్టుకుపోయారని తెలిపారు. సలేమ్ వెంట్ ప్రాంతంలో కొండచరియ కూలడంతో ఒక భవనం మొత్తంగా నేలమట్టమైందని, ముగ్గురి ఆచూకీ గల్లంతైందని, వారికోసం గాలింపు జరుగుతోందని అధికారులు చెప్పారు. ఆరవ నెంబరు జాతీయ రహదారిపై కొండచరియ విరిగిపడడంతో రాష్ట్ర రాజధానికి మిగిలిన ప్రాంతాలతో సంబంధాలు తెగిపోయాయి. అంతర్రాష్ట్ర హైవేలు కూడా దెబ్బతిన్నాయి. ఐజ్వాల్‌కు 21కిలోమీటర్ల దూరంలో గ్రామం వరదలకు కొట్టుకు పోవడంతో 30కి పైగా కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

ముఖ్యమంత్రి అత్యవసర సమావేశం

పరిస్థితులను సమీక్షించేందుకు ముఖ్యమంత్రి లాల్‌డుహోమా హోం మంత్రి, చీఫ్ సెక్రెటరీ, ఇతర ఉన్నతాధికారులతో అత్యవసర సమావేశం జరిపారు. వర్షాలు, కొండచరియల కూలిన ఘటనల్లో మరణించినవారి కుటుంబాలకు రూ.4లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. వెంటనే రూ.2లక్షలకు చెక్కును అందచేశారు. మిగిలిన మొత్తం త్వరలో అందచేస్తామన్నారు.

నాసిరకం విత్తనాలు అమ్ముతున్న వారిపై చర్యలు తీసుకోవాలి

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నాసిరకం విత్తనాలను అమ్ముతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని మాజీ ఎమ్మెల్యే, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎలాంటి లైసెన్స్‌లు లేకుండా కొందరు ఏజెంట్లు, వ్యాపారులు బ్రాండెడ్ కంపెనీల పేరుతో నాణ్యత, గ్యారెంటీ లేని విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులను అంటగడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వాటిని వాడిన రైతులు విత్తనాలు మొలకెత్తక, సరైన పంట పండక అప్పుల పాలవుతున్నారని వాపోయారు. కల్తీ విత్తనాలను అరికడతామని ప్రతి ఏటా ప్రభుత్వం ఆర్భాటంగా చేస్తున్న ప్రకటనలు నీటిమీది రాతల్లానే మారిపోతున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. నాసిరకం విత్తనాలను అడ్డుకునేందుకు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని డిమాండ్ చేశారు. నాసిరకం విత్తనాలను నిరోధించేందుకు రైతు కమిటీల భాగస్వామ్యంతో వ్యవసాయ అధికారులు, పోలీసులు, టాస్క్‌ఫోర్స్ బృంద సభ్యులు దుకాణాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని కోరారు. పంటల దిగుబడి కోసం రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందించేందుకు తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. విత్తనాల కొనుగోలు విషయంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

రైతులపై దాడికి ప్రభుత్వం క్షమాపణ చెప్పాలి : కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అదిలాబాద్‌లో రైతన్నలపైన లాఠీచార్జీని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనపై ప్రభుత్వం వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అన్నదాతలపై దాడులు జరుగుతుంటే ముఖ్యమంత్రి ఇతర రాష్ట్రాల్లో ఎన్నికల ప్రచారం, ఢిల్లీ పర్యటనల్లో బిజీగా ఉండటం సిగ్గుచేటని విమర్శించారు. రాజకీయాలు పక్కన పెట్టి రైతన్నల సమస్యలను పట్టించుకోవాలని ఆయన సూచించారు. ఐదు నెలల్లోనే రాష్ట్రంలో వ్యవసాయ సంక్షోభంలో కూరుకుపోవడం ముమ్మాటికి ప్రభుత్వ పరిపాలన వైఫల్యమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతన్నల సమస్యల పై ముఖ్యమంత్రి వెంటనే ఒక ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశారు. లాఠీచార్జ్ చేసిన అధికారులపై కేసులు నమోదు చేసి, చర్యలు తీసుకోవాలని కేటీఆర్ కోరారు.

తక్కువ అంచనా వేయొద్దు

- టి20 ప్రపంచకప్‌లో భారత్ అత్యంత బలమైన జట్టు
- ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మోర్గాన్





లండన్: టీమిండియా ప్రస్తుతం దుర్భేధ్యఫామ్‌లో ఉందని, ఈసారి టి20 ప్రపంచకప్‌లో టీమిండియా సెమీస్‌కు చేరడం ఖాయమని ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ ఇయాన్ మోర్గాన్ అభిప్రాయపడ్డాడు. ఈ మెగా టోర్నీలో పాల్గొనే అన్ని జట్లలోకెల్లా టీమిండియానే బలంగా ఉందని, రోహిత్ శర్మ నాయకత్వంలో భారత్‌ను తక్కువగా అంచనా వేస్తే ఓటమి తప్పదని ప్రత్యర్థి జట్లను మోర్గాన్ హెచ్చరించాడు. "ఇప్పుడున్న అన్ని టీముల్లోనూ గాయాల బెడద ఉందని, కానీ, భారత జట్టు లోతైన బ్యాటింగ్, బౌలింగ్ విభాగాలతో ఆధిపత్యం ప్రదర్శించేందుకు అవకాశం ఉంటుంది. ఇప్పుడున్న జట్లను పోల్చి చెబుతున్నా. ఈ టోర్నీలో నా ఫేవరెట్ జట్టు భారత్. పేపర్ మీద నాణ్యమైన క్రికెటర్ల పేర్లను చూస్తున్నాం. మైదానంలోనూ అనుకున్న విధంగా ప్రణాళికలను అమలు చేస్తే వారిని అడ్డుకోవడం చాలా కష్టం. ఎవరినైనా ఓడించగల సత్తా ఉంది. 2007లో తొలిసారి ఛాంపియన్‌గా నిలిచింది. అప్పటి నుంచి ఒక్కసారి కూడా మళ్లీ విజేత కాలేకపోయింది. ఇది కూడా ఆ జట్టు ఆటతీరుపై ప్రభావం చూపుతుంది. ఈసారి మరింత దూకుడు ప్రదర్శిస్తుందని చెప్పగలను" అని మోర్గాన్ వెల్లడించాడు. జూన్ 2 నుంచి అమెరికా, వెస్టిండీస్ వేదికలుగా టి20 ప్రపంచ కప్ సంగ్రామం మొదలు కానుంది. ఈసారి 20జట్లు కప్ కోసం తలపడనున్నాయి. జూన్ 5న ఐర్లాండ్‌తో టీమిండియా తొలి మ్యాచ్ ఆడనుంది. టీమిండియా గ్రూప్-ఏలో ఉండగా.. ఇదే గ్రూప్‌లో భారత్‌తో పాటు పాకిస్తాన్, ఐర్లాండ్, కెనడా, అమెరికా జట్లు ఉన్నాయి. రోహిత్ శర్మ సారథ్యంలోని భారత జట్టు తన తొలి మ్యాచ్‌ను ఐర్లాండ్‌తో జూన్ 5వ తారీఖున ఆడనుంది. ఆ తర్వాత 9న దాయాది పాకిస్థాన్‌తో న్యూయార్క్‌లోనే తలపడనుంది. అనంతరం 12న అమెరికాతో (న్యూయార్క్), 15న కెనడాతో (ఫ్లోరిడా) తన తర్వాతి మ్యాచులు ఆడనుంది.

సెమీస్ పక్కా.. పాంటింగ్

టి20 ప్రపంచకప్‌లో టీమిండియా సెమీస్‌కు చేరడం ఖాయమని ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్లూ అభిప్రాయపడ్డారు. ఢిల్లీ క్యాపిటల్స్ కోచ్, ఆస్ట్రేలియా మాజీ ఆటగాడు రికీ పాంటింగ్‌తోపాటు టామ్ మూడీ, మాథ్యూ హేడెన్, ఆరోన్ ఫించ్ కూడా ఇదే అభిప్రాయాన్ని వెల్లడించారు. ఈసారి టీమిండియా సెమీస్ తప్పక చేరుతుందని చెప్పగలం. అలాగే భారత్‌తో పాటు ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్, వెస్టిండీస్, పాకిస్థాన్ జట్లు కూడా సెమీస్ అవకాశాలు అధికంగా ఉన్నాయి. ఈ ఎక్స్‌పర్ట్స్ తాలూకు అంచనాకు సంబంధించిన వీడియోను స్టార్ స్పోర్ట్స్ తన అధికారిక ఎక్స్ (ట్విట్టర్) ఖాతా ద్వారా అభిమానులతో పంచుకుంది. దీంతో ఈ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

భారత జట్టు: రోహిత్ శర్మ (కెప్టెన్), హార్దిక్ పాండ్యా (వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్, విరాట్ కోహ్లీ, సూర్యకుమార్ యాదవ్, రిషబ్ పంత్ (కీపర్), సంజు శాంసన్ (కీపర్), శివమ్ దూబే, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, యుజ్వేంద్ర చాహల్, అర్ష దీప్ సింగ్, జస్ప్రీత్ బుమ్రా, మొహమ్మద్ సిరాజ్.

రిజర్వ్ ప్లేయర్లు: శుభ్‌మన్ గిల్, రింకూ సింగ్, ఖలీల్ అహ్మద్, అవేశ్ ఖాన్

భారత షట్లర్లకు నిరాశ...

సింగపూర్ ఓపెన్



సింగపూర్: సింగపూర్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత షట్లర్లకు నిరాశ తప్పలేదు. మంగళవారం జరిగిన అన్ని గేమ్‌లలోనూ భారత షట్లర్లు పరాజయాన్ని చవిచూశారు. పురుషుల సింగిల్స్‌లో ప్రియాన్షు రాజ్‌వత్, మహిళల సింగిల్స్‌లో ఆకర్షి కశ్యప్‌తోపాటు భారత స్టార్ షట్లర్ల జోడీ చిరాగ్ శెట్టి-సాత్విక్ సాయిరాజ్ కూడా తొలిరౌండ్‌లోనే ఓటమిపాలయ్యారు. చిరాగ్-సాత్విక్ జంట 20-22, 18-21తో డెన్మార్క్ జోడీ వెస్టర్‌గార్డ్-లాడ్‌గార్డ్ చేతిలో వరుససెట్లలో పరాజయాన్ని చవిచూశారు. ఇక ఆకర్షి కశ్యప్ 18-21, 20-22తో ఛోకీవాంగ్(థాయ్‌లాండ్), ప్రియాన్షు 21-23, 19-21తో సింగపూర్‌కు చెందిన సి.వై.లీ చేతిలో పోరాడి ఓడాడు. ఇక మహిళల డబుల్స్‌లో ఆర్ పాండా-ఎస్ పాండా జంట 12-21, 21-12, 13-21తో చైనీస్ తైపీ జంట చేతిలో, మిక్స్‌డ్ డబుల్స్‌లో సూర్య-అమృత జంట 8-21, 17-21తో సింగపూర్ జంట చేతిలో వరుససెట్లలో ఓడారు. ఇక మహిళల సింగిల్స్‌లో భారత సంచలనం పివి సింధు బుధవారం తొలిరౌండ్‌లో కాజెఫీల్డ్(డెన్మార్క్)తో తలపడనుంది.

కిదాంబి శ్రీకాంత్, లక్ష్యసేన్, ప్రణయ్ రాయ్ కూడా నేడు తొలిరౌండ్ గేమ్‌లు ఆడనున్నారు.

బోర్డర్-గవాస్కర్ ట్రోఫీకి ముందు

ఆస్ట్రేలియా-ఎతో భారత్-ఎ ఢీ



మెల్‌బోర్న్: బోర్డర్-గవాస్కర్ ట్రోఫీకి ముందు ఆస్ట్రేలియా-ఎతో భారత-ఎ జట్టు తలపడనుంది. ఈమేరకు క్రికెట్ ఆస్ట్రేలియా(సిఎ) మంగళవారం ఓ ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించింది. ఇరుజట్ల మధ్య రెండు మ్యాచ్‌ల సిరీస్ జరగనున్నట్లు అక్టోబర్ 31 నుంచి నవంబర్ 3వరకు ఒక టెస్ట్, అలాగే నవంబర్ 7 నుంచి 10 వరకు రెండో టెస్ట్ జరగనున్నట్లు సిఎ ఆ ప్రకటనలో తెలిపింది. ఈ రెండు వార్మప్ మ్యాచ్‌లు గ్రేట్ బారీ రీఫ్ ఎరేనా మరియు ఎంసిజిలలో జరగనున్నాయి. ఇక నవంబర్ 17నుంచి వాకా గ్రౌండ్ వేదికగా మరో మూడు రోజుల ఇంట్రాస్కావడ్ మ్యాచ్ కూడా జరగనుంది. 2020-21 వరకు ఈ టోర్నమెంట్‌లో ఫేవరెట్‌గా ఉన్న ఆస్ట్రేలియాను భారత జట్టు ఆ తర్వాత రెండు పర్యటనల్లోనూ ఓడించి సిరీస్‌ను చేజిక్కించుకుంది. నవంబర్ 22నుంచి పెర్త్‌లోని ఆప్టస్ స్టేడియంలో తొలి టెస్ట్ జరగనుండగా.. ఈ పర్యటనలో భాగంగా భారత జట్టు మొత్తం ఐదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌లో తలపడనుంది. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో ఐదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్ జరగడం ఇదే ప్రథమం. ఈ సిరీస్ జరిగే సందర్భంలోనే భారత మహిళల క్రికెట్ జట్టు కూడా ఆస్ట్రేలియాలో రెండు వన్డే మ్యాచ్‌లు, రెండు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్ ఆడనుంది. డిసెంబర్ 8నుంచి ఆ సిరీస్ ప్రారంభం కానుంది. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీని భారతజట్టు 2020-21లో 2-1తో చేజిక్కించుకొంది.

కెనడా సంచలనం..

నేపాల్‌పై ఘన విజయం



న్యూయార్క్: తొలిసారి టీ20 వరల్డ్ కప్ పోటీలకు అర్హత సాధించిన కెనడా అదరగొట్టింది. వామప్ మ్యాచ్‌లో బలమైన నేపాల్‌ను చిత్తుగా ఓడించింది. నికోలస్ కిర్టన్(51) అర్ధ సెంచరీకి తోడు రవీందర్‌పాల్ సింగ్ 41 పరుగులతో రాణించాడు. దీంతో కెనడా నిర్ణీత 20ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 183పరుగులు చేసింది. అనంతరం పేసర్ డిల్లాన్ హెలిగర్స్ నాలుగు(4/20) వికెట్లతో రాణించడంతో నేపాల్ జట్టు 19.3ఓవర్లలో 120పరుగులకే ఆలౌటైంది. కుశాల్ మల్లా(37) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించాడు. కెనాడా బౌలర్ హైలీగర్‌కు నాలుగు, గోర్డన్, జాఫర్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. దాంతో, కెనడా 63 పరుగుల తేడాతో గెలుపొందింది. మరో వామప్ మ్యాచ్‌ల్లో ఒమన్, నమీబియాలు విజయం సాధించాయి. ఒమన్ పసికూన పపువా న్యూ గినియాపై మూడు వికెట్ల తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన పీఎన్‌జీ జట్టు 20 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 137పరుగులు చేయగా.. ఆ లక్ష్యాన్ని ఒమన్ జట్టు 19.1ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 141పరుగులు చేసి ఘన విజయం సాధించింది. ఒమన్ కెప్టెన్ అకీబ్ లియాస్ 3 వికెట్లతో ప్రత్యర్థి బ్యాటర్లకు కళ్లెం వేశాడు. ఉగాండాపై నమీబియాజట్టు 5వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఉగాండా 8వికెట్ల నష్టానికి 134పరుగులు చేయగా.. నమీబియా జట్టు 18.5 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 135పరుగులు చేసి లక్ష్యాన్ని ఛేదించింది. తొలుత రోజర్ ముకాస(51 నాటౌట్), రాబిన్సన్ ఒబుయా(38)లు దంచడంతో ఉగాండా పోరాడగలిగే స్కోర్ చేసింది. కానీ, నమీబియా బ్యాటర్లు నికో, జేజే స్మిత్(21 నాటౌట్)లు ధనాధన్ ఇన్నింగ్స్‌లతో జట్టుకు అద్భుత విజయాన్ని అందించారు.

రెండోరౌండ్‌కు రైబకినా

ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ



పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ మహిళల సింగిల్స్‌లో మాజీ వింబుల్డన్ ఛాంపియన్, కజకిస్తాన్‌కు చెందిన 4వ సీడ్ రైబకినా శుభారంభం చేసింది. మంగళవారం జరిగిన తొలిరౌండ్ పోటీలో రైబకినా 6-2, 6-3తో మిన్నెన్(జర్మనీ)ని చిత్తుచేసింది. ఈ మ్యాచ్ సుమారు 73నిమిషాలసేపు సాగింది. రెండోరౌండ్‌లో రైబకినా మూడు గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల విజేత కెర్బర్(జర్మనీ) తలపడనుంది. మరో పోటీలో 7వ సీడ్ జంగ్(చైనా) 6-2, 6-1తో కామెట్(ఫ్రాన్స్)ను ఓడించి రెండోరౌండ్‌లోకి దూసుకెళ్లింది.

మెద్వదెవ్, రూథ్ శుభారంభం

పురుషుల సింగిల్స్‌లో 7వ సీడ్ రూథ్(నార్వే), 5వ సీడ్ మెద్వదెవ్(రష్యా) శుభారంభం చేశారు. మంగళవారం జరిగిన తొలిరౌండ్ పోటీల్లో రూథ్ 6-3, 6-4, 6-3తో ఆల్వేస్(దక్షిణాఫ్రికా), మెద్వదెవ్ 6-3, 6-4, 5-7, 6-3తో కోఫర్(జర్మనీ)ని ఓడించారు. ఇక అమెరికా సంచలనం బెన్ షెల్టన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో తొలి విజయాన్ని నమోదు చేసుకున్నాడు. తొలిరౌండ్‌లో షెల్టన్ 3-6, 6-3, 6-4, 6-4తో స్థానిక ఆటగాడు హ్యూగో గాస్టన్‌ను ఓడించాడు. రెండోరౌండ్‌లో షెల్టన్ జపాన్‌కు చెందిన నిషికోరితో తలపడనున్నాడు. తొలిరౌండ్‌లో నిషికోరి 7-5, 7-6(7-3), 3-6, 1-6, 7-5తో గాబ్రియేల్‌ను ఓడించి రెండోరౌండ్‌కు చేరాడు.

ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటించాలి



కేంద్రంలో ఏర్పడే నూతన ప్రభుత్వం స్వర్గీయ నందమూరి తారక రామారావుకి భారత రత్న పురస్కారం అందించాలని మాజీ ఎమ్మెల్సీ, ఎన్టీఆర్ లిటరేచర్, సావనీర్ అండ్ వెబ్ సైట్ కమిటీ చైర్మన్ టి. డి. జనార్ధన్ డిమాండ్ చేస్తూ ఆమేరకు తమ కమిటీ తీర్మానం చేస్తోందని తెలిపారు.

ఎన్టీఆర్ 101వ జయంతి పురస్కరించుకొని ఫిల్మ్ నగర్ కల్చరర్ సెంటర్ (ఎఫ్ఎన్ సి సి)లో ఎన్టీఆర్ ఎన్టీఆర్ లిటరేచర్, సావనీర్ అండ్ వెబ్ సైట్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా ఎన్టీఆర్ జయంతి జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా ఎన్టీఆర్ కుమారుడు నందమూరి రామకృష్ణ, తెలుగు దేశం నాయకులు కనుమూరి రామకృష్ణం రాజు (ఆర్ ఆర్ ఆర్), మాజీ ఎంపీ యలమంచిలి శివాజీ, నిర్మాతలు శ్రీ కె.ఎస్.రామారావు, ఘట్టమనేని ఆదిశేషగిరిరావు, పుండరీ కాంక్షయ్య తనయులు అట్లూరి నాగేశ్వర రావు పాల్గొని ఎన్.టి. రామారావుగారితో తమకున్న అనుబంధాన్ని, సాన్నిహిత్యాన్ని, ఆయనలోని విశిష్ట లక్షణాలను గుర్తు చేశారు.

నందమూరి రామకృష్ణ మాట్లాడుతూ, 'నాన్న 101వ జయంతి కార్యక్రమానికి వచ్చిన సోదర సోదరీమణులందరికీ కృతజ్ఞతలు. ఈ కార్యక్రమం ఇంత ఘనంగా జరుపుకోవడం సంతోషంగా ఉంది. నాన్న సినిమాల్లో అన్ని రకాల పాత్రలు పోషించి అశేష ప్రేక్షకాభిమానం పొందారు. రాముడు, కృష్ణుడు అయనే అనేంత పేరు తెచ్చుకున్నారు. రాజకీయాల్లోకి వచ్చి ప్రజల ఆశీస్సులతో ముఖ్యమంత్రి అయ్యారు. కుల, మత, ప్రాంతాలకు అతీతంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేశారు. రైతులకు అండగా నిలబడ్డారు. కార్మిక, యువత, బీసీ వర్గాలకు చేయూతనిచ్చారు. తిరుమలలో ఉచిత అన్నదాన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. యుగ పురుషుడిగా తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు' అని తెలిపారు.

సంచలనాలకు స్ఫూర్తి ఎన్టీఆర్



విశ్వవిఖ్యాత నందమూరి తారక రామారావు 101వ జయంతి సందర్భంగా కుటుంబ సభ్యులు, తెలుగు సినీ ప్రముఖులతో ఫిలింనగర్‌లో ఎన్టీఆర్ విగ్రహం వద్ద జయంతి వేడుకలు చాలా ఘనంగా జరిగాయి. ప్రముఖులందరూ ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి జయంతి ఉత్సవాలను ఘనంగా జరిపారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నందమూరి మోహన్ కృష్ణ, నందమూరి మోహన్ రూప, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, తెలుగు ఫిలిం ప్రొడ్యూసర్ కౌన్సిల్ ప్రెసిడెంట్ కె. ఎల్. దామోదర్ ప్రసాద్, సెక్రటరీ ప్రసన్న కుమార్, ఫిలింనగర్ కల్చరల్ కమిటీ సెక్రటరీ మోహన్ ముళ్లపూడి, జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్, యూసఫ్ గూడా కార్పొరేటర్ బండారి రాజ్ కుమార్ పటేల్, బిజెపి కార్యదర్శి చంద్ర మధు తదితరులు హాజరయ్యారు.

కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలతో సత్కరించి జోహార్ ఎన్టీఆర్ నినాదాన్ని గట్టిగా వినిపించారు.

కార్యక్రమం అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసి నందమూరి తారక రామారావు 101వ జయంతి వేడుకలను వైభవంగా జరిపించారు.

ఈ సందర్భంగా నందమూరి మోహన్ కృష్ణ మాట్లాడుతూ, 'మా ఎన్టీఆర్ ఎందరికో స్ఫూర్తి దాయకుడు. ఎన్టీఆర్ అనే మూడు అక్షరాలు పలు సంచలనాలకు స్ఫూర్తి. అలాంటి స్ఫూర్తిదాయక వ్యక్తి 101వ జయంతి వేడుకలు జరుపుకోవడం చాలా ఆనందంగా ఉంది. ఇటు సినీ రంగంలోనూ అటు రాజకీయ రంగంలోనూ ఎన్నో పెను సంచలనాలు సృష్టించారు. సినీ ఇండస్ట్రీలో ఆయన వేయని పాత్ర అంటూ లేదు. ఆయన తెలుగువారి ఆత్మగౌరవం కాపాడాలని తెలుగుదేశం పార్టీని స్థాపించారు. రాజకీయంగా ప్రజలకు ఎంతో సేవ చేశారు. అలాంటి వ్యక్తి ఎప్పటికీ మన హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారు. ఆయన సంచలనాకు మారు పేరు అనేదాని కన్నా సంచలనాలకు స్ఫూర్తి అని గర్వంగా చెబుతాను' అని అన్నారు.

నవచిత్రం

పవర్‌ఫుల్ యాక్షన్ సినిమా



కళ్యాణ్‌రామ్

తన తాతగారు విశ్వ విఖ్యాత నట సార్వభౌమ నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా దర్శకుడు ప్రదీప్ చిలుకూరితో నందమూరి కళ్యాణ్ రామ్ చేస్తున్న తన 21వ చిత్ర గ్లింప్స్‌ని చిత్ర యూనిట్ రిలీజ్ చేసింది. ముప్పా వెంకయ్య చౌదరి సమర్పణలో అశోక్ క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ పతాకాలపై అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

ది ఫిస్ట్ ఆఫ్ ఫ్రేమ్ అనే గ్లింప్స్ కళ్యాణ్ రామ్‌ని యాక్షన్-ప్యాక్డ్‌గా సరికొత్త గెటప్‌లో ప్రజెంట్ చేసింది. వీడియోలో కళ్యాణ్ రామ్ తన పిడికిలిని చూపించడం తన క్యారెక్టర్ ఎంత పవర్‌ఫుల్‌గా ఉంటుందో తెలియజేసింది. వీడియోలో పవర్‌ఫుల్‌గా కనిపించారు కళ్యాణ్‌రామ్. ఈ హై-బడ్జెట్ ఎంటర్‌టైనర్ విజువల్స్ గ్రాండ్‌గా ఉన్నాయి. ఈ గ్లింప్స్ హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది.

ఈ చిత్రంలో ప్రముఖ నటీనటులు నటిస్తున్నారు. బ్లాక్‌బస్టర్ 'సరిలేరు నీకెవ్వరు' సినిమాలో నటించిన విజయశాంతి చాలా గ్యాప్ తర్వాత ఈ సినిమాకి సైన్ చేశారు. ఇది కర్తవ్యం పాత్ర తరహాలో పవర్ ఫుల్ డైనమిక్ పాత్ర కానుంది. ఈ చిత్రంలో సోహెల్ ఖాన్, సాయి మంజ్రేకర్, శ్రీకాంత్ ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు.

ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతోంది. టాప్ టెక్నీషియన్స్ ఈ సినిమాకి పని చేస్తున్నారు. రామ్ ప్రసాద్ డీవోపీగా పని చేస్తుండగా, అజనీష్ లోక్‌నాథ్ మ్యూజిక్ అందిస్తున్నారు. వారి శ్రీకాంత్ విస్సా స్క్రీన్ ప్లే అందిస్తున్న ఈ చిత్రానికి తమ్మిరాజు ఎడిటర్. సినిమాకు సంబంధించిన ఇతర వివరాలు మేకర్స్ త్వరలో తెలియజేయనున్నారు.

గుణశేఖర్ దర్శకత్వంలో యుఫోరియా



గుణశేఖర్

వైవిధ్యమైన సినిమాలు, భారీ చిత్రాలను తెరకెక్కించటంలో డైరెక్టర్ గుణశేఖర్‌కు ఓ ప్రత్యేక స్థానం ఉంది. ఆయన డైరెక్షన్‌లో 'యుఫోరియా' అనే యూత్‌ఫుల్ సోషల్ డ్రామా తెరకెక్కనుంది. గుణ హ్యాండ్‌మేడ్ ఫిలిమ్స్ బ్యానర్‌పై నీలిమ గుణ నిర్మాతగా ఈ చిత్రం రూపొందనుంది.

ఈ సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే సినిమా షూటింగ్ ప్రారంభం కానుంది. ఈ చిత్రాన్ని సైతం తన గత చిత్రాల మాదిరిగానే భారీ స్థాయిలో అదిరిపోయే లొకేషన్స్, విజువల్స్‌తో ఈచిత్రాన్ని తెరకెక్కించడానికి గుణశేఖర్ రంగం సిద్ధం చేసుకున్నారు.

సినిమాలో నటించబోయే నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణులకు సంబంధించిన వివరాలను త్వరలోనే తెలియజేస్తామని మేకర్స్ ప్రకటించారు.

ప్రేక్షకుల్ని బాగా ఎంగేజ్ చేస్తుంది



ప్రశాంత్ రెడ్డి

యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ బ్యానర్ పై కార్తికేయ గుమ్మకొండ హీరోగా నటిస్తున్న సినిమా 'భజే వాయు వేగం'. ఐశ్వర్య మీనన్ హీరోయిన్‌గా, హ్యాపీ డేస్ ఫేమ్ రాహుల్ టైసన్ కీలక పాత్రను పోషిస్తున్నారు. ఎమోషనల్ యాక్షన్ థ్రిల్లర్ కథతో దర్శకుడు ప్రశాంత్ రెడ్డి ఈ చిత్రాన్ని రూపొందించారు. అజయ్ కుమార్ రాజు.పి. కో ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ నెల 31న ఈ సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు వస్తోంది. ఈ సందర్భంగా దర్శకుడు ప్రశాంత్ రెడ్డి మీడియాతో ముచ్చటించారు.

- రన్ రాజా రన్ సినిమాకు డైరెక్షన్ డిపార్ట్‌మెంట్‌లో వర్క్ చేశాను. ఆ తర్వాత సాహో చిత్రానికి కంటిన్యూ అయ్యాను. కోవిడ్‌కు ముందు ఈ సబ్జెక్ట్ ఓకే అయ్యింది. కార్తికేయ అప్పుడు చావు కబురు చల్లగా, రాజా విక్రమార్క చేస్తున్నాడు. ఈ కథ ప్రకారం ఫస్టాఫ్‌కు ఒక పర్‌ఫార్మర్ కావాలి. సెకండాఫ్‌లో హీరోయిజం ఎలివేట్ కావాలి. అలా చూస్తే కార్తికేయ నాకు బెస్ట్ ఆప్షన్ అనిపించాడు. అతను పర్‌ఫార్మెన్స్ చేస్తాడు. హీరో పర్సనాలిటీ ఉంటుంది. కార్తికేయను ఎంచుకోవడానికి కారణమిదే. అలాగే హీరోయిన్ ఒక మిడిల్ క్లాస్ లొకాలిటీలో పెరిగే సంప్రదాయబద్ధమైన అమ్మాయి. ఐశ్వర్య మీనన్‌ని ఇందు క్యారెక్టర్‌కు కరెక్ట్ ఆప్షన్‌గా భావించా.
- ట్రైలర్‌లో ఫాదర్ సెంటిమెంట్ అనేది రివీల్ చేశాం. అయితే ఫాదర్ సెంటిమెంట్ అనే కాన్సెప్ట్ ఎప్పుడూ ఓల్డ్ కాదు. ట్రైలర్ చివరలో మీ నాన్న కాదు మా నాన్న అని రాహుల్ కార్తికేయతో చెప్పడం కూడా కథ తెలిసిపోయిందని కొందరు కామెంట్ చేశారు. కానీ మీకు ట్రైలర్ చూపించింది రేపు థియేటర్‌లో చూడబోయే కథకు చాలా వేరియేషన్స్ ఉంటాయి.
- కథలో హీరోకు బ్రదర్ క్యారెక్టర్ ఉంటుంది. ఇది చాలా కీ రోల్. హీరో తర్వాత హీరో లాంటి క్యారెక్టర్. ఈ పాత్ర కోసం ఎవర్ని తీసుకుందాం అని ఆలోచిస్తున్న టైమ్‌లో యూవీ వాళ్లు రాహుల్ టైసన్‌ను సజెస్ట్ చేశారు. సినిమా సెకండాఫ్‌లో ఛేజింగ్‌లా స్క్రీన్ ప్లే ఉంటుంది. సెకండాఫ్‌లో మీరు ఫోన్ వైపు చూడరనే నమ్మకం ఉంది. అంత గ్రిప్పింగ్‌గా ఉంటుంది. స్పీడ్ లాంటి టైటిల్ మా మూవీకి పెట్టుకోవచ్చు. అయితే ఇంగ్లీష్ టైటిల్ ఎందుకని భజే వాయు వేగం అని పెట్టాం.

జయహో రామానుజ



సాయి వెంకట్

నిర్మాత సాయి వెంకట్ నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న సినిమా 'జయహో రామానుజ'. ఈ చిత్రాన్ని సుదర్శనం ప్రొడక్షన్స్‌లో సాయిప్రసన్న, ప్రవళ్లిక నిర్మిస్తున్నారు. అమెరికా నటి జో శర్మ హీరోయిన్‌గా నటిస్తుండగా సుమన్, ప్రవళ్లిక ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. రెండు భాగాలుగా చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ సినిమా ఫస్ట్ పార్ట్ జూలై 12న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ, సంస్కృత భాషల్లో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ సినిమా ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని హైదరాబాద్‌లో నిర్వహించారు. శ్రీ కృష్ణమాచార్యులు, నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ, దర్శకుడు రేలంగి నరసింహారావు, బీసీ కమీషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణ మోహన్, టీడీపీ నాయకురాలు జ్యోత్స్న, నిర్మాత శోభారాణి, పొలిటికల్ లీడర్ వేణుగోపాలాచారి, నిర్మాత, నటుడు గురురాజ్ తదితరులు ఈ చిత్ర విజయాన్ని ఆకాంక్షించారు.

దర్శకుడు, హీరో డా.లయన్ సాయి వెంకట్ మాట్లాడుతూ, 'మహిళల్ని గౌరవించాలని, కుల మతాలకు అతీతంగా ఐకమత్యంతో మానవాళి ఉండాలని సందేశాన్ని ఇచ్చిన గొప్ప గురువు భగవత్ శ్రీ రామానుజాచార్యుల వారు. ఆయన గొప్పదనం ఈ తరం వారికి తెలియాలనే ఉద్దేశంతో ఈ చిత్రాన్ని రూపొందించాను' అని అన్నారు.

'భారీ స్థాయిలో అత్యున్నత సాంకేతిక విలువలతో ఈ చిత్రాన్ని నిర్మించాలనేది నాన్న కల. ఆ కలను సాకారం చేయడంలో భాగస్వామి అయినందుకు గర్వంగా ఉంది. జూన్ 12న ఆరు భాషల్లో ఈచిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నాం. ఈ సినిమా తప్పకుండా అందర్నీ అలరించడమే కాకుండా ఆలోచింపజేసేలా ఉంటుందని భావిస్తున్నాం' అని నిర్మాత ప్రవళ్లిక చెప్పారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.